

# మరుపురాని లోకసంచారి

## బాలగోపాల్‌పై నివాళి వ్యాసాలు

# మరుపురాని లోకసంచారి

బాలగోపాల్‌పై నివాళి వ్యాసాలు

సంపాదకుడు

**జూలూరు గౌరీశంకర్**

రామయ్య విద్యాపీఠం

# మరుపురాని లోకసంచారి

## బాలగోపాల్‌పై నివాళి వ్యాసాలు


ప్రచురణ కాలం : 2009

ప్రతులకు : రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తకాల షాపుల్లో

**జూలూరు గౌరీశంకర్**
జర్నలిస్ట్, సంపాదకుడు,
1-8-702/33/20ఎ
పద్మాకాలనీ, నల్లకుంట,
హైదరాబాద్-500 044

వెల : **రు.50/-**

ముఖచిత్రం : రమేష్

కంపోజింగ్ & లే అవుట్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-44
ఫోన్ : 27660000

ముద్రణ : విప్ల కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ అండ్ మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్-44
ఫోన్ : 27677078, 27676910

# ఒక లోక సంచారి సంతకం

**ఒక వ్యక్తి** దగ్గర కొన్ని మంచి లక్షణాలుండవచ్చును. కొందరిలో అపారమైన మేధస్సు ఉండవచ్చును. మరి కొందరిలో అద్భుతమైన వాగ్ధాటి ఉండవచ్చును. ఇంకొందరిలో ఎడతెరిపిలేని అధ్యయనం ఉండవచ్చును. కొందరిలో ప్రజల కోసం తిరగాలన్న తపన ఉండవచ్చును. కొందరిలో ప్రజలకు సేవ చేయాలన్న తత్త్వం ఉండవచ్చును. కొందరు నిగర్వులుగా ఉండవచ్చును. కానీ, ఇన్ని లక్షణాలు ఒక్కరిలో ఉండటం ఎంతో అరుదైన విషయం. ఇది ఒక రకంగా మానవ సమాజానికే గర్వకారణమైనది. ఇన్ని లక్షణాలు ఉన్న వ్యక్తి కోసం కాలమే చాలా కాలం ఎదురుచూసింది. కాలమే ఇన్ని లక్షణాలున్న బాలగోపాల్‌ని కన్నది.

కొందరు బాగా రాస్తారు. బాగా మాట్లాడలేరు. కొందరు మాట్లాడగలరు. అసలు రాయలేకపోవచ్చును. కొందరు మాటలు మాత్రమే చెపుతారు. చేతలంటే బారెడుదూరంలో ఉంటారు. కొందరు నిత్యం త్యాగాలే వల్లిస్తారు. కాని అడుగుతీసి అడుగేయరు. నిబద్ధత, నిమగ్నతలు కనుమరుగౌతున్న కాలంలో బాలగోపాల్‌లాంటి వ్యక్తులు ప్రజల మధ్యలో అతి తక్కువగా కనబడతారు. ఒకనాడు పౌరహక్కుల ఉద్యమంలో దేశమంతా తిరిగి ఆ ఉద్యమానికే వన్నెతెచ్చాడు. ఆ ఉద్యమం నుంచి కొన్ని విభేదాలతో బయటకు వచ్చిన తర్వాత చాలామంది ఇక బాలగోపాల్ వెనకపట్టు పట్టినట్లే భావించారు. కాని దశాబ్ద కాలం నిరంతరంగా పరిశ్రమించి రాష్ట్రంలో మానవహక్కుల వేదికను స్థాపించి ఆ ఉద్యమాన్ని జనంలోపలికి తీసుకువెళ్ళగలిగారు.

బాలగోపాల్ ప్రజలను ప్రేమించాడు. వారికోసం పరితపించాడు. వారి కోసం పోలీసులతో తన్నులు తిన్నాడు. జైలుకు వెళ్ళాడు. అధ్యాపక వృత్తిని వదిలిపెట్టాడు.

మానవ హక్కులను తన రెక్కలుగా చేసుకొని ఒక బుద్ధుడులాగా దేశమంతా తిరిగాడు. ఆయన తిరగని వూరు లేదు. ఆయన కాలుమోపని నిర్బంధ ప్రదేశము లేదు. ఎక్కడ ప్రజల కేక విన్పించినా ప్రతిస్పందించాడు. పోలీసుల బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండించడం వరకే పౌరహక్కులు అన్న నిర్వచనపు మూసల నుంచి ఆ హక్కుల ఉద్యమాన్ని మన వాకిళ్ల దాకా తీసుకొచ్చాడు. సింగరేణిలో కణకణా మండుతున్న బొగ్గు బాయి సమస్యలను తట్టాడు. నల్గొండ జిల్లాలో సిమెంటు ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న కాలుష్యం అక్కడి ప్రజల ఊపిరితిత్తులను ఎలా తూట్లు పొడుస్తుందో వివరించాడు. బెజవాడలో రౌడీ దర్బారుల దగ్గర నుంచి రాయలసీమ ఫ్యాక్షనిస్టు కోటల వరకు వెళ్ళి వాళ్ళ ఆధిపత్య అహంకారాన్ని దుమ్ముదులిపాడు. పాలకులు కొనసాగిస్తున్న దుర్నీతిని దునుమాడాడు. రాజ్యాంగమిచ్చిన హక్కులు అందరికీ అందాలని నడిబజార్లో ఒక్కడే అరుచుకుంటూ వెళ్ళాడు. జీవించే హక్కు కోసం 25 ఏళ్లుగా నిరంతరం పరితపించిన బాలగోపాల్‌లాంటి హక్కుల ఉద్యమ నాయకుడు దేశంలో మరొకరు లేరు.

అన్నీ ప్రజల గురించే అడిగాడు. అందుకోసమే కాకతీయలో పిల్లలకు పాఠం చెప్పాడు. రచనలు చేశాడు. న్యాయవాద వృత్తిని ధరించాడు. తనకోసం ఏమి అడగలేదు. మనందరి తరపున వకాల్తా పుచ్చుకొని మాట్లాడాడు. శరీర సౌందర్యంపై మక్కువ లేదు. ఆయన విలాసవంతమైన జీవితం దరిదాపుల్లోకి ఎప్పుడూ పోలేదు. 10 అడుగులు మాత్రమే ఉన్న ఇరుకు గదులలో కొన్ని సంవత్సరాలు గడిపాడు. అంత గొప్ప సాదా, సీదా జీవితాన్ని గడిపిన సంచార జీవి బాలగోపాల్.

మార్క్సిజాన్ని చూసి మోహించినవాడు, తన ఒంటినిండా ప్రజల కడగళ్లను రాసుకొని వాటిని ప్రపంచానికి చాటాడు. నక్సలైట్లపై పోలీసుల పాశవిక దమనకాండపై కళ్లెర్ర జేశాడు. అదేవిధంగా నక్సల్స్ చేస్తున్న హింసను కూడా ప్రశ్నించాడు. పౌరహక్కుల ఉద్యమంలో కొనసాగుతూ అన్ని వర్గాల ప్రజల మనస్సుల దగ్గరకు పోవడం అందరికీ సాధ్యం కాదు. బాలగోపాల్‌కు ఉద్యమ సంఘాలతో, పోరాట పార్టీలతో ఎన్ని సంబంధాలున్నాయో అలాగే సామాన్య మధ్య తరగతి ప్రజలతో కూడా ఎనలేని సంబంధాలున్నాయి.

కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు మానవ హక్కుల కోసం తిరిగిన నాయకుడు బాలగోపాల్ హఠాన్మరణం రాష్ట్రాన్ని, దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. బాలగోపాల్

లేని లోటును పూడ్చటం అసాధారణమైనది. బాలగోపాల్‌కు నిలువెత్తు విగ్రహాలు వేయకపోవచ్చును. ప్రభుత్వం వెంటనే ఆయన పేర ఓ మానవ హక్కుల స్మారక కేంద్రాన్ని నిర్మిస్తానని ప్రకటన చేయకపోవచ్చును. పాఠశాల విద్య, మాధ్యమిక విద్య, ఉన్నత విద్యా శాఖామంత్రులు మానవీయ బాలగోపాల్‌ను పాఠ్యాంశంగా ప్రకటిస్తామని చెప్పక పోవచ్చును. కానీ, మానవీయ హక్కుల్ని ఈ నేలంతా ఆయన విత్తనాలుగా చల్లిపోయారు. తెలంగాణ ఎర్రసెలకల్లో, రాయలసీమ రాళ్లల్లో, కోస్తాంధ్రలో ఎటు చూసినా కల్పించే కాల్వల్లో, శ్రీకాకుళం సిక్కోళ్ల దారుల్లో.... ఎక్కడ చూసినా బాలగోపాల్ పాదముద్రలు కన్పిస్తాయి. ప్రజల మనోభావాల పలకపై బాలగోపాల్ మానవ హక్కులను రాసి వెళ్ళిపోయాడు.

ఈ దేశపు నిజమైన పౌరుడు. ఆయన సాధారణ పౌరుడు. అసాధారణ మేధావి. ప్రజాస్వామ్య వ్యవస్థ తప్పుడు లెక్కలను సరిదిద్దినవాడు. మానవీయుడు... మాననీయుడు... సామాన్యుని ఆకాంక్షలకు ఆయన ఒక మానవ హక్కుల సంతకం.

ఆయన మనందరి తరఫున మాట్లాడి మాట్లాడి ఆగిపోయాడు. ఇప్పుడు మానవ హక్కుల ఉద్యమాన్ని మనచేతికందించి ఆయన వెళ్లిపోయాడు.

అలాంటి నిష్కామ కర్మయోగిపై వెంటనే పుస్తకం తేవాలనుకోవడం ఒక తొందరపాటు చర్యే. అయినా ఆయనంటే వున్న పిచ్చిప్రేమతో, ఆయన మనందరిమీద వేసిన చెరగని ముద్రతో ఈ సాహసానికి పూనుకున్నాం. ఇందులోని వ్యాసాలన్నీ బాలగోపాల్‌కు నివాళిగా అన్ని దినపత్రికల్లో వచ్చినవే. ఇందులోని రచయితలందరికీ, అన్ని దినపత్రికల సంపాదకులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు.

**- జూలూరు గౌరీశంకర్**

# విషయ సూచిక


హక్కుల ఉద్యమకారుడు .................................................. 9

గొంతులేని వారి గొంతు .................................................. 14

చనిపోకూడని మనిషి .................................................. 18

హక్కుల చుక్కాని .................................................. 21

ఎక్కుపెట్టిన హక్కుల విలుకాడు! .................................................. 24

మహోన్నత మానవతావాది .................................................. 27

మరపురాని బాటసారి .................................................. 31

అధ్యాపకులకు ఆదర్శప్రాయుడు .................................................. 34

అరుదైన మనిషి .................................................. 37

ఆయన సత్యాన్వేషి .................................................. 43

మానవ హక్కుల ప్రస్థానం .................................................. 47

అ'సామాన్యుడు' .................................................. 51

హృదయంలో దీపం పెట్టకు .................................................. 53

నిష్కామ కర్మయోగి-బాలగోపాల్ .................................................. 56

సాహిత్యంపై ఎంతో అనురక్తి .................................................. 59

ఉద్యమ పరిధిని విస్తరించాడు .................................................. 61

సిద్ధాంతాలు గంతలు కాలేదు .................................................. 63

పల్లె పల్లెన రైతన్నకు అండ .................................................. 64

అక్షరాలా తీరని లోటు ........................................................ 67
బాలగోపాల్ ప్రజాజీవిత ప్రారంభం - వరంగల్లు (1979-95) ........ 72
మనకాలపు పరిపూర్ణ మానవుడు .............................................. 79
నిగర్వి...మహా మనీషి - హక్కుల ఉద్యమానికి మారు పేరు............. 82
నువ్వు లేకపోయాక... ........................................................... 86
నల్లమల చెంచులపట్ల బాలగోపాల్ తపన .................................. 89
చరిత్రలో చెరగని కృషి చేసినవాడు ........................................... 91
ఆ 'బాలగోపాల' ఆత్మీయ హక్కు ............................................. 96
హక్కుల భాష బాలగోపాల్ ................................................... 100
జీవితమే ఒక ప్రయోగం ...................................................... 102
చివరి మనీషి! ..................................................................... 107
మౌలిక ఆలోచనాపరుడు ...................................................... 110
ఉద్యమాలకు విలువలుండాలన్నవాడు ...................................... 115
భారత విప్లవ శక్తులు బాల్‌గోపాల్ సంధాన కృషిని ప్రజాస్వామిక
స్ఫూర్తిని గౌరవిస్తూ సాగాలి ..................................................... 119
ఖాళీలను పూరించడమే సాహిత్యం పని ....................................... 123
విమర్శకుడిగా బాలగోపాల్ ................................................... 132
'గురజాడ'లో రాజ్యం చీకటి జాడ ............................................ 137
రావిశాస్త్రి రచనల్లో రాజ్యాంగ యంత్రము .................................. 141

# హక్కుల ఉద్యమకారుడు

**ఆంధ్రప్రదేశ్‌లో** మానవ హక్కుల ఉద్యమానికి మరోపేరైన బాల్‌గోపాల్ అక్టోబరు 8 రాత్రి పదిగంటలకు అల్సర్‌తో హఠాత్తుగా మరణించారు. 57 ఏళ్ల వయస్సులో జరిగిన ఆయన మరణం మానవ హక్కుల ఉద్యమంతో, ప్రజాతంత్ర ఉద్యమాలతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన లేరనే వాస్తవాన్ని జీర్ణించుకోవడం హక్కుల కార్యకర్తలకు ఉద్యమాభిమానులకు సాధ్యం కావడం లేదు.

ఆయన మరణించిన రెండు రోజులలో ఆయన జీవితం గురించి, ఆయన మూడు దశాబ్దాల హక్కుల కార్యాచరణ గురించి, వాటి స్వరూప స్వభావాల గురించి సమగ్రంగా అంచనా వేయడం అసాధ్యం. ఇది ఆయన గురించి ఒక చిన్న ప్రయత్నం మాత్రమే. బాలగోపాల్ కందాళ పార్థనాధశర్మ, నాగమణి దంపతుల 5వ సంతానం. తండ్రి ఉద్యోగరీత్యా శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు ఎన్నో ప్రాంతాలకు బదిలీ కావడంతో ఎన్నో ఊళ్ళలో ఆయన విద్యాభ్యాసం సాగింది. కావలిలో పి.యు.సి., తిరుపతిలో బియస్సీ చదివారు. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో గణిత శాస్త్రంలో ఎమ్మెస్సీ, డాక్టరేట్ పూర్తిచేసి, 1980లో ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పరిశోధనకై చేరారు. అక్కడి జీవితంతో అసంతృప్తి చెందిన ఆయన, ప్రజా ఉద్యమాలకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో వరంగల్ తిరిగి వచ్చి ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో సభ్యులైనారు. 1981లో కాకతీయ విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చాక హక్కుల ఉద్యమంలో మరింత క్రియాశీలకంగా పాల్గొనడం ప్రారంభించారు.

బాలగోపాల్ విద్యార్థి దశలోనే అసమాన ప్రతిభావంతుడు. ఎన్నో గోల్డ్ మెడల్స్ వచ్చాయి. వెంకటేశ్వరా విశ్వవిద్యాలయం క్రికెట్ టీమ్‌లో ఆయన ఓపెనింగ్ బ్యాట్స్‌మాన్, పి.హెచ్‌డి. చేస్తున్న రోజులలోనే, ప్రపంచ వ్యాప్తంగా గణిత శాస్త్రంలో జరిగే పరిశోధనలను ప్రచురించే ప్రామాణిక జర్నల్‌కు ఆయన సంపాదక వర్గ సభ్యుడు. కఠినమైన గణితశాస్త్ర పరిశోధనల్ని సమీక్షించి, సులభశైలిలో పాఠకులకు వివరించడం బాలగోపాల్ అందులో నిర్వర్తించిన కర్తవ్యం.

1983లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘానికి (ఎపిసిఎల్‌సి) ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై, 15 ఏళ్ళు ఆ బాధ్యత నిర్వర్తించారు. నక్సలైటు ఉద్యమంపై నిర్బంధం ప్రారంభమైన రోజులలో సంస్థ నాయకత్వాన్ని చేపట్టారు. ప్రతి బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఎండగట్టే పనిలో రాష్ట్రం నలుమూలలా పర్యటించారు. కొన్ని చోట్ల మాత్రమే ఉన్న హక్కుల సంఘాన్ని చిన్న పట్టణాలకు సైతం విస్తరించారు. స్ఫూర్తిదాయకమైన కార్యాచరణ ద్వారా సంస్థకు ఎందరో కార్యకర్తలను సంపాదించారు. ప్రతి జిల్లాకు సంబంధించిన ప్రత్యేకమైన సమస్యలను గుర్తించి తద్వారా స్థానిక ప్రజలల్లో హక్కుల అవగాహన పెంపొందించారు. వారికి కార్యాచరణ నేర్పి, హక్కుల ఉల్లంఘన ఎక్కడ జరిగినా నిర్భయంగా గొంతెత్తే విధంగా సంస్థ నిర్మాణాన్ని తీర్చిదిద్దారు. సంస్థ నాయకులు గోపి రాజన్న, డా. రామనాథం, జాపా లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర్ రెడ్డి హత్యలకు గురైనా తన కృషిలో వెనుకంజ వేయలేదు. కార్యకర్తలలో ధైర్యాన్ని ప్రోది చేయడానికి ప్రయత్నం చేశారు. తాను స్వయంగా నిర్బంధానికి గురైనా చలించలేదు. అంతే కాదు తన మీద జరిగిన దాడులకు ఆయన స్పందించిన తీరు ఆయన ప్రజాతంత్ర స్వభావానికి నిదర్శనం. 1984లో జగిత్యాలలో ఏబివిపి కార్యకర్తల దాడికి గురైనా, 1989లో ఖమ్మం పోలీసుల చేత కిడ్నాప్‌కు గురైనా, 1992లో కొత్తగూడెంలో ప్రాణాంతక దాడికి గురైనా, 1993లో సాక్షాత్తు జాతీయ మానవ హక్కుల కమిషన్ ముందు దౌర్జన్యానికి గురైనా తన పనిని ఒక్కనాడు ఆపలేదు. 1985లో టాడా చట్టం కింద అరెస్టయి మూడు నెలలు వరంగల్ జైలులో గడిపిన ఆయన ఉద్యమకారులు జైలు నిర్బంధానికి గురికావడం చాలా సహజమైన, అనివార్యమైన పరిణామంగా భావించారు. తను కిడ్నాప్‌కు గురై విడుదలైన సందర్భంగా తన నిర్బంధం కన్నా, గ్రామీణ ప్రాంతాలలో దాడులకు, ఎన్‌కౌంటర్లకు గురౌతున్న గ్రామీణ ప్రాంత యువకుల హక్కులపై మీడియా స్పందించాలని భావించారు.

నక్సలైట్ల పేరు మీద ప్రభుత్వం అమలుచేసిన అణచివేతకు వ్యతిరేకంగా, రాష్ట్ర ప్రజానీకానికి అండగా పౌరహక్కుల సంఘాన్ని నిలపడంలో బాలగోపాల్ సఫలమయ్యారు. దేశంలోనే రాజ్యహింసను ఎదిరించి పోరాడే చురుకైన సంస్థగా దాన్ని ఏర్పరచడంలో బాలగోపాల్ కృషి అసమానమైనది. పట్టణ ప్రాంత మేధావులకు పరిమితమైన హక్కుల చర్చను, కార్యాచరణను విశాల ప్రాతిపదికన విస్తరించడానికి నిర్విరామ కృషి చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన తొలినాళ్ళలో దళితుల మీద జరిగిన దాడులకు వ్యతిరేకంగా నినదించిన మొదటి గొంతుక బాలగోపాల్‌ది. వెనుకబడిన కులాల రిజర్వేషన్లకు మద్దతుగా హక్కుల దృక్పథం నుండి మొదటి విశ్లేషణాత్మక వ్యాసాన్ని రాసి వర్గదృక్పథానికి పరిమితమైన ఉద్యమాల అవగాహనను విస్తృతం చేశారు.

బాలగోపాల్ నాయకత్వంలో హక్కుల ఉద్యమ ఆచరణ, అవగాహన పరస్పరాధారితాలై బలోపేతమయ్యాయి. ఆచరణ ప్రాతిపదికన అవగాహనను, ఉద్యమ ప్రాధాన్యతలను సవరించుకోడానికి, అవగాహన ప్రాతిపదికగా ఆచరణ మెరుగు పరచుకోడానికి ఆయన ఎన్నడూ వెనకాడలేదు. ఈ క్రమంలోనే హక్కుల లేమికి వర్గ ఆధిపత్యమే కాక అన్ని రకాల ఆధిపత్యాలు, వాటి ఆధారిత అణచివేతలు కారణమని గుర్తించారు. అన్ని వ్యవస్థీకృత ఆధిపత్యాలు హక్కుల అనుభవానికి వ్యతిరేకమని, కాబట్టి ఏ ఒక్క ఆధిపత్యం నుండో పుట్టిన అణచివేతను మాత్రమే హక్కుల రంగం తన ప్రధాన కార్యరంగంగా ఎంచుకోజాలదని స్పష్టం చేశారు. అంతే కాదు, పోరాటం పేరుతో ఉద్యమాలు చేసే ప్రతి చర్యనూ హక్కుల ఉద్యమం సమర్థించాల్సిన పని లేదని, ఉద్యమాలు చేసే అప్రజాస్వామిక చర్యలను సైతం విమర్శించాలని చర్చ పెట్టారు.

వివిధ ఆధిపత్య రూపాలకు వ్యతిరేకంగా వచ్చే ప్రతి ఉద్యమం నుండి హక్కుల దృక్పథం స్వీకరించాల్సింది ఎంతో ఉందని, ఆయా ఉద్యమాలు వ్యక్తీకరించే ఆకాంక్షలకు డిమాండ్లకు హక్కుల పరిభాషలో నిర్వచించి వాటికి సార్వజనీనమైన విలువను కల్పించాల్సిన కర్తవ్యం హక్కుల ఉద్యమం మీద ఉందని భావించారు. ఇప్పటికే ఉన్న హక్కుల వ్యవస్థీకరణకు కృషి చేయడం, లేని హక్కుల గురించి పోరాడడం, చట్టాలలో, పరిపాలనలో, ఆలోచనా రీతులలో ప్రజాతంత్ర విలువల సంస్కృతికై కృషి చేయడం హక్కుల ఉద్యమం కర్తవ్యంగా ముందుకు తెచ్చారు.

స్వతంత్రమైన, విశాలమైన హక్కుల ఉద్యమం అంతిమంగా ప్రజలకు మాత్రమే జవాబుదారీగా ఉండాలని ప్రతిపాదించారు. ఆ క్రమంలో ఏర్పడిన అభిప్రాయభేదాల కారణంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం నుండి బయటకు వచ్చి 1998లో భావసారూప్యం గల సహచరులతో కలిసి మానవ హక్కుల వేదికను ఏర్పరిచారు. 32 మందితో ప్రారంభమైన సంస్థను పదేళ్ళలో 300 మంది చురుకైన సభ్యులతో కూడిన ప్రభావవంతమైన సంస్థగా మలచడంలో బాలగోపాల్ అలుపెరగని కృషి ఉంది. హక్కుల సిద్ధాంతాన్ని ఆచరణను సృజనాత్మకంగా అన్వయించడంలో, సామాన్యులలో సామాజిక కర్తవ్యం పట్ల నిబద్ధతను, ప్రజాతంత్ర విలువల పట్ల విశ్వాసాన్ని పెంపొందించడంలో ఆయన దార్శనికత కనిపిస్తాయి.

హక్కుల ఉద్యమంలో చేరిన నాటి నుండి తెలుగు సమాజంలో జరిగిన ప్రతి సామాజిక రాజకీయ పరిణామం మీద బాలగోపాల్ విశ్లేషణాత్మక రచనలు చేశారు. గత పదేళ్ళలో మానవ హక్కుల వేదిక ప్రచురించిన పది బులెటిన్‌లలో పేరు లేకుండా వచ్చిన వ్యాసాలన్నీ ఆయన రాసినవే. చరిత్ర రచనలో కొత్తపుంతలు తొక్కిన డి.డి. కోశాంబి చరిత్ర రచనా పద్ధతిని రాష్ట్ర ప్రజలకు పరిచయం చేసే గ్రంథాన్ని రాశారు. తెలుగు మాధ్యమంలో చరిత్ర చదివే విద్యార్థులకు ఈనాటికీ అది ప్రామాణిక గ్రంథం. బయటి రాష్ట్రాలలోని మేధావులకు ఈ రాష్ట్రంలో జరిగే పరిణామాలపై బాలగోపాల్ ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో రాసే వ్యాసాలే ఆధారం. కేంబ్రిడ్జ్ యూనివర్శిటి ప్రెస్ ప్రచురించిన ఆర్థిక శాస్త్ర గ్రంథాలను బాలగోపాల్ సమీక్షించిన తీరును ఆ తరం ఆర్థికవేత్తలు తరచూ గుర్తుచేసుకుంటారు. విశాఖ జిల్లా చింతపల్లిలో వందలాది ఆదివాసుల ఇళ్ళను పోలీసులు దహనం చేసిన సంఘటనపై ఆయన రాసిన వ్యాసానికి జాతీయ స్థాయిలో "పియుసిఎల్ జర్నలిజం అవార్డు" వచ్చింది. దేశ వ్యాప్తంగా జరిగే మానవ హక్కుల ఉల్లంఘన సంఘటనలపై బహిరంగ విచారణ జరిపించడానికి నందితా హక్సర్, సెబాస్టియన్‌లతో కలిసి, ఇండియన్ పీపుల్స్ హ్యూమన్‌రైట్స్ కమీషను ఏర్పాటు చేశారు. ఒక రకంగా చెప్పాలంటే జాతీయ మానవ హక్కుల కమీషన్‌కు అదే మూలం. మన రాష్ట్రంలోనే కాక మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగే కాశ్మీర్, మణిపూర్, ఛత్తీస్‌గడ్, తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలలోను బాలగోపాల్ సుపరిచితుడు. అనేక పర్యాయాలు ఆ రాష్ట్రాల పౌరహక్కుల సంఘాలతో కలిసి పర్యటించి హక్కుల ఉల్లంఘనలపై చాలా నివేదికలు తీసుకొచ్చారు.

బాలగోపాల్ మానవ హక్కుల ఉద్యమాలలో ఎంత ఎత్తుకు ఎదిగినా అతి సామాన్యంగా ఉండగలిగిన నిగర్వి. అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. తాను నమ్మిన విశ్వాసాలను నిత్య జీవితంలో ఆచరించి చూపారు. హక్కుల కార్యాచరణే ఊపిరిగా జీవించారు. ఉద్యమం వెలుపల ఆయనకు మరొక జీవితం లేనేలేదు. ఆయన శక్తినంతటిని 1981 నుండి చివరి శ్వాస వరకు అనుక్షణం పేదలకు న్యాయాన్ని అందించడానికి, వారి హక్కులను కాపాడడానికి ఉపయోగించారు. హక్కుల పరిభాషను గ్రామీణ ప్రజలు ఆయన పేరుతోనే గుర్తించారు. బుద్ధిజీవులు సామాజిక రాజకీయ పరిణామాల ప్రజాస్వామిక స్వభావాన్ని అంచనా వేయడానికి ఒక హక్కుల ప్రమాణాన్ని ప్రతిపాదించిన వ్యక్తిగా అతన్ని భావిస్తారు. విలువలు పతనమౌతున్న న్యాయవాద వృత్తిలో అత్యంత నిబద్ధత కలిగిన న్యాయవాదిగా రాణించారు. ప్రజా జీవితంలో నైతిక వర్తనకు దిక్సూచిగా ఉండటమే కాక ప్రజా ప్రయోజనాలకు రాబోయే ముప్పు గురించి హెచ్చరించే కర్తవ్యాన్ని కూడా సమర్థవంతంగా నిర్వర్తించారు.

రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి మరణానంతర రాజకీయ పరిణామాలపై బుద్ధిజీవుల అవకాశవాద తీరు పట్ల బాలగోపాల్ తీవ్ర ఆవేదన చెందారు. అక్టోబర్ 2, 3 తేదీలో జరిగిన మానవ హక్కుల వేదిక మూడవ మహాసభల సందర్భంగా కార్యకర్తలకు ఆయన చేసిన హెచ్చరిక ఈ రాష్ట్ర బుద్ధిజీవులకూ వర్తిస్తుంది. "ఇది (మానవ హక్కుల వేదిక) మన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక కొత్త ప్రయోగం. దీనిని నిలబెట్టలేకపోతే మన ప్రయత్నానికే కాక విలువలు మనుషుల్ని ఒక దగ్గరకు తీసుకురాగలవన్న ప్రజాతంత్ర విశ్వాసానికి కూడా నష్టం చేసిన వారమౌతాం. నిలబెట్టడమే కాక విజయవంతంగా ముందుకు తీసుకుపోయినట్టయితే ప్రజాస్వామ్య భావనకు బలం చేకూర్చిన వాళ్ళమౌతాం."

ఈ ఏడాది జూలైలో మరణించిన హక్కుల కార్యకర్త నరేంద్రనాథ్ గురించి ఆయనే చెప్పినట్టు "ప్రజలకు సమస్యలున్నతకాలం విశ్రమించకూడదని" నమ్మినవారు బాలగోపాల్. వారి స్ఫూర్తితో ప్రజాతంత్ర కృషికి కలిసి రమ్మని పిలుపునిస్తూ..

**మానవ హక్కుల వేదిక**

*10 అక్టోబర్ 2009*

# గొంతులేని వారి గొంతు

**ప్రముఖ** మానవహక్కుల ఉద్యమకారుడు బాలగోపాల్ ఆకస్మిక మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. పౌరహక్కుల ఉద్యమకారునిగా ఎక్కువగా పరిచితమైనప్పటికీ ఆయన చింతన, కృషి, వ్యక్తిత్వమూ బహుముఖీయమైనవి. గణితంలో పరిశోధన అనంతరం తొలుత అధ్యాపక వృత్తిని చేపట్టినా ఆ తరువాత ఉద్యమ జీవితంలో సాహిత్యం, సమాజం, చరిత్ర, రాజనీతి, న్యాయశాస్త్రం తదితర రంగాలలో అధ్యయనం, రచనలు చేశారు. మహిళలు, దళితులు, ఆదివాసీల, నిర్వాసితుల వంటి భిన్న సామాజిక వర్గాల ఉద్యమాలతో మమేకం అయ్యారు. బాలగోపాల్ వంటి అసాధారణ ప్రజ్ఞ, కార్యశీలత కలబోసిన వ్యక్తిత్వం గల వారు బహు అరుదుగా ఉంటారు. రాజ్యం అణచివేతకు, హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా ఆయన అనుక్షణం అవిశ్రాంత పోరాటం సాగించారు.

ఉద్యమ బాలలు ఊయలలూగిన కాకతీయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా పనిచేస్తున్న బాలగోపాల్ 1885లో ఉద్యోగానికి రాజీనామా చేసి పౌరహక్కుల పరిరక్షణకు పూర్తిస్థాయిలో అంకితమయ్యారు. స్థూలంగా ప్రజాస్వామ్య హక్కుల పట్ల అవగాహన ఉన్నప్పటికీ, పౌరహక్కుల చైతన్యం ఇంకా తగినంతగా విస్తరించని రోజులలో బాలగోపాల్ ఉద్యమం ప్రారంభమైంది. రాజ్యమే ఒక పక్షం వహించి ఇతర పక్షాలపై పౌరహక్కుల ఉల్లంఘనకు పాల్పడినప్పుడు, దానిని ఎదుర్కొనే యంత్రాంగం, వ్యవస్థలు లేవనిఆ లోటును పౌరహక్కుల ఉద్యమాల ద్వారా పూడ్చాలంటూ తమ కార్యక్రమ ఆవశ్యకతను విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రజలకు

హక్కుల పట్ల స్పృహను పెంచారు. సంక్షుభిత తెలంగాణలో ఎన్‌కౌంటర్లు నిత్యకృత్యమైనప్పుడు, ప్రశ్నించడమే మహా నేరంగా మారిన భయానక వాతావరణంలో ఘటనాస్థలికి వెళ్ళడం, ఆ ఉద్రిక్త పరిస్థితుల మధ్య వివరాలు సేకరించి పోలీసుల కృత్యాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం, ఉద్యమం నడపడం అసాధారణం. అప్పటికే జాతీయ స్థాయిలో మానవ హక్కుల ఉద్యమ ప్రముఖులున్నప్పటికీ, జీవితమే ఉద్యమంగా, క్షేత్రస్థాయిలో సామాన్య కార్యకర్త మాదిరిగా పనిచేయటం బాలగోపాల్ విశిష్టత. బాలగోపాల్ ఎంచుకున్న దారే ముళ్ళబాట. ఉద్యమ జీవితమంతా బెదిరింపులు, దాడుల మధ్య రాజీ లేకుండా సాగించారు. బాలగోపాల్ కిడ్నాప్ దేశవ్యాప్తంగా కలవరం సృష్టించింది. పోలీసు యంత్రాంగం ప్రేరణతో జరిగినట్లు భావించిన ఆ ఉదంతంలో ఆయన మూడు రోజుల పాటు కిడ్నాపర్ల చెరలో గడిపారు. మరణం అంచులదాకా వెళ్లి వచ్చిన తరువాత కూడా బాలగోపాల్ నిబ్బరం, నిబద్ధత అణువంత సడలలేదు.

పౌరహక్కుల పరిరక్షణ కోసం అహరహం శ్రమిస్తూనే బాలగోపాల్ క్రమంగా దాన్ని మానవ హక్కుల ఉద్యమంగా విస్తరించారు. పౌరహక్కుల పరిరక్షణ కేవలం విప్లవోద్యమాలకు సంబంధించిన సమస్య మాత్రమే కాదనీ, సాధారణ రాజకీయ నాయకులతో సహా అందరూ హక్కుల పరిరక్షణకు నడుం బిగించాలని ఆకాంక్షించా రాయన. ప్రభుత్వం, పాలకపక్షం, రాజ్యం నేరుగాప్రయోగించే హింసలను, హక్కుల ఉల్లంఘులను మాత్రమే కాక – ప్రాబల్య వర్గాల ప్రోత్సాహం వల్లకానీ, అలక్ష్యం వల్ల కానీ, విధానపరమైన అన్యాయాల వల్ల కానీ జరిగే హక్కుల ఉల్లంఘనలను కూడాహక్కుల ఉద్యమం పట్టించుకోవాలని ఆయన విశ్వసించారు. విభిన్న వర్గాలు, భిన్న ప్రయోజనాలు కలిగిన సమాజంలో ఒక్కొక్కసారి ప్రజాశ్రేణులు నిర్వహించే ఉద్యమాలు కూడా తక్కిన వారి హక్కులను హరిస్తాయని ఆయన గుర్తించారు. సంఘాలు, పార్టీలు వంటి సంఘటిత వ్యవస్థలు సైతం వ్యక్తుల, బలహీన సమూహాల హక్కులను హరించినప్పుడు – భాధితులు నిస్సహాయులవుతారని ఆయన భావించారు. ఈ అవగాహనకు పౌరహక్కుల సంఘంలో వ్యతిరేకత వ్యక్తం కావడంతో, ఆయన అందులో నుంచి బయటకు వచ్చి మానవహక్కుల వేదికను స్థాపించారు. బాలగోపాల్ మునుపటివలె ఉధృతంగా పని చేయబోరని, క్రమంగా సాధారణ జీవితంలోకి మరలివెడతారని ఆశించినవారికి ఆశాభంగం ఎదురైంది. మానవ హక్కుల వేదిక

కార్యకర్తగా, నేతగాఆయన మరింత దీక్షతో, మరింత విస్తృత పరిధిలో పనిచేయనారంభించారు.

రాయలసీమలో ఏనుగుల బీభత్సానికి సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్న ప్రాంతాలు తిరిగి అక్కడి పరిస్థితిని చాటారు. కాశ్మీరులోని సరిహద్దు ప్రాంతానికి వెళ్ళి మందు పాతరల మధ్య దినదినగండంగా బతుకుతున్న ప్రజల పరిస్థితినీ వివరించారు. ఛత్తీస్‌గఢ్ వెళ్ళి సల్వాజుడుం పేర సాగుతున్న ఘోరాన్నీ కళ్ళకు కట్టారు. మైనారిటీలపై ఉగ్రవాద అభియోగాలు మోపినప్పుడు – నిందితులకు న్యాయ సహాయం అందించారు. కొత్త ఆర్థిక విధానాల ఫలితంగా ఏర్పడిన అగచాట్లు ఆయనకు ఊపిరి సలవని వని కల్పించాయనవచ్చు. సెజ్ బారినపడిన ప్రజల బాధలనూ పట్టించుకున్నారు. నిర్వాసితుల కోసం ఉద్యమించారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్ బాధితులకు తోడుగా నిలిచారు. రాయలసీమ ఫ్యాక్షన్ సంస్కృతినీ వ్యతిరేకించారు. ఉద్యమకార్యకర్తగానే కాదు, న్యాయవాదిగా కూడా అనేక ఎన్‌కౌంటర్ కేసులు చేపట్టారు. ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు, పోలీసులను నిందితులుగా గుర్తించి దర్యాప్తు సాగించాలని వాదించారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది.

బాలగోపాల్ నిరంతర అధ్యయనశీలి. భారత చరిత్ర పరిశోధనా రీతిని మలుపు తిప్పిన డి.డి.కోశాంబి రచనను తెలుగు పాఠకులకు పరిచయం చేసి కొత్త దృక్కోణాన్ని అందించారు. అదే రీతిలో సామాజిక సమూహాలను, గ్రామ దేవతల గుళ్ళను పరిశీలించేవారు. ఆయన నిరాడంబరజీవి. ముక్తసరిగా మాట్లాడే మనస్తత్వమైనా లోతైన విషయాలను స్పష్టంగా వివరించే వారు. పసితనపు నిష్కల్మషత్వమూ, విషయ పరిజ్ఞానమూ ఆయనలో తొణకిసలాడేవి. సున్నిత మనస్కుడిగా గుర్తింపు పొందినా, వివాదాస్పద అంశాలపైనా నిర్మొహమాటంగా, సూటిగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసేవారు. విమర్శలో ఘాటైన వ్యంగ్యమూ చోటు చేసుకునేది.

అలుపెరగని ఉద్యమ జీవితంలోనూ ఆయన వెసులుబాటు చేసుకుని వ్యాసాలు రాసేవారు. ఈవ్యాసాల ద్వారా శ్రీలంకలో తమిళుల పరిస్థితినీ వివరించారు. కేంద్రీయ విద్యాసంస్థలలో వెనకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పిస్తే అగ్రవర్ణాల విద్యార్థులకు సీట్లుపెరిగిన వైనాన్ని, ప్రభుత్వ న్యాయస్థానాల పాత్రను వివరించారు. ఎప్పటికప్పుడు సామాజికఅవసరాలకు అనుగుణంగానే బాలగోపాల్ అధ్యయనం, కార్యాచరణ

సాగాయి. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రతి రెండు వారాలకు ఒకసారి ఆయన వరుసగా రాస్తూ వస్తున్న వ్యాసాలు వర్తమాన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను బాధితుల పక్షం నుంచి వ్యాఖ్యానించేవి. ఆయన చివరి వ్యాసం (అక్టోబర్ 7, 2009 – దొడ్డిదారిన మరో విపత్తు) మనదేశం 30 దేశాలతో చేసుకున్న ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పర్యవసానంగా వ్యవసాయరంగంలో ఎదురుకానున్న ప్రమాదాల గురించి రాసినది.

దాదాపు మూడు దశాబ్దాల ఉద్యమ జీవితంలో సాధారణ ప్రజల్లో అసాధారణ స్థాయిలో మానవ హక్కుల స్పృహ కల్పించడమే కాదు. మధ్య తరగతి మేధావి వర్గాన్నీ ఈ ఉద్యమంలో భాగస్వాములను చేయగలగడం బాలగోపాల్ ఘనత.

*శనివారం, 10, అక్టోబరు 2009 ఆంధ్రజ్యోతి సంపాదకత్వం*

# చనిపోకూడని మనిషి

**పౌరహక్కుల** ఉద్యమకారుడు కె. బాలగోపాల్ మరణానికి సంతాప సూచకంగా ఈదేశపు జాతీయ పతాకను ఎవరూ అవనతం చేసే అవకాశం లేదు. ఆయన ఈ దేశం నిజమైన అర్థంలో ఎవరిదో ఆ అశేష జన బాహుళ్యం కోసం శ్రమించాడు. కాని తమకై నిలిచిన వారికోసం జండానుసగం మేర ఎగరవేసే అధికారం వారికిలేదు. లేనిపక్షంలో పౌరహక్కులనే మాట ఒకటి ఉందని,అది రాజ్యాంగం తమకిచ్చినా అదే రాజ్యాంగం పేరిట ఈ దేశాన్ని పాలిస్తున్నవారు తమకివ్వదలచు కోలేదని, అందుకోసం ఉద్యమించి సాధించుకోవాలని బాలగోపాల్ ద్వారా తెలుసుకున్న అశేష జనావళి, ఈ శుక్రవారం నాడు తమ దేశ పతాకను తప్పక అవనతం చేసి ఉండేవారే.

వర్ధమాన సమాజాలలో ఎప్పుడూ చనిపోకూడని మనుషులలో బాలగోపాల్ ఒకరు. ఆ మాటకు వస్తే అభివృద్ధి చెందిన సమాజాలలోనూ ఆర్థికాభివృద్ధి చెందలేదు. పేదలు, అల్పసంఖ్యాక వర్గాలవారు, వలసలు వచ్చి స్థిరపడినవారు, పాలకుల రంగుకు, జాతికి చెందని వారు హక్కులరీత్యా అక్కడ ద్వితీయశ్రేణి పౌరులే. పాలకులకు ఇబ్బందిగా తోచినపుడల్లా సాగించగల అణచివేతలు తమకోసం పొంచి ఉన్నవారే. ఆవిధంగా బాలగోపాల్ వంటివారిఅవసరంలేని సమాజాలు ప్రపంచంలోనే లేవు. ప్రజలు, ప్రజాస్వామ్యం, దేశం, సమాజం, ప్రజల హక్కులు అనే మాటలకు ఎనలేని అర్థం, గొప్పతనం ఉన్నాయి. హక్కుల పరిధిని కనుగొనేందుకు రాజ్యాంగాన్ని, చట్టాలను చూడాలి. వాటి విలువను, లోతును గ్రహించాలంటే మాత్రం బాలగోపాల్ వంటివ్యక్తుల

పనితో పరిచయం ఉండాలి. ఒక దేశపాలకులు తమదిప్రజాస్వామ్యమని చెప్పుకుని ఎటువంటి రాజ్యాంగాలు, చట్టాలైనా తయారు చేయవచ్చుగాక. కాని, ప్రజలు పౌరహక్కులకోసం ఉద్యమించవలసిన అవసరం ఉన్నంతకాలం ఆ దేశాన్ని పనిపూర్ణమైన ప్రజాస్వామ్యంగా పరిగణించలేము. అటువంటి పరిస్థితులలోనే పౌరహక్కుల ఉద్యమాలకు, బాలగోపాల్‌వంటి ఉద్యమకారులకు ప్రాముఖ్యత పెరుగుతుంది. ఆయన గత పాతికేళ్ళ ఉద్యమశీలతను, కార్యకలాపాలను ఈ నేపథ్యంలో పరిశీలించవలసి ఉంటుంది.

మనదేశంలో పౌరహక్కుల ఉద్యమాలన్నవి పేదలు, మధ్య తరగతి వారు పాలనా వైఫల్యాలతో అసంతృప్తికి, అశాంతికి లోనుకావటంతో మొదలయ్యాయి. ప్రజల అసంతృప్తి, అశాంతి 1960ల నుంచి మొదలుకొని పలు రూపాలలోక వెల్లడవుతుండటం తెలిసిందే. ఆ రూపాలలో నక్సలిజం ఒకటి. వ్యవస్థను సంస్కరించాలనే తక్కిన రూపాల కన్నా దానినిమార్చివేయాలనే నక్సలిజం రూపం పాలకులకు అసలు సవాలు గనుక, వారు ప్రధానంగా దానిపై దృష్టి కేంద్రీకరించి అణచివేయబూనుకొన్నారు. అది ఆచరణలో పేదలు, రైతులు, కార్మికులు, కూలీలు, వృత్తిదారులు, యువజనులఅణచివేతగా మారటంతో, అందులోని అతికివ్యతిరేకంగా పౌరహక్కుల ఉద్యమాలు పుట్టుకువచ్చాయి. తొలిదశలో జాతీయ స్థాయిలో పియుసిఎల్, పియుడిఆర్,ఇక్కడ ఎపిసిఎల్‌సి, ఒపిడిఆర్‌వంటి సంస్థలు పనిచేశాయి. అవి బలహీనపడిన తర్వాత రెండవదశలోనూ హక్కుల ఉద్యమాన్ని అంతేబలంగా కొనసాగించిన వ్యక్తి బాలగోపాల్. రాష్ట్రంలోనే గాక మొత్తం దేశస్థాయిలో కూడా తనను ప్రత్యేకంగా, విశిష్టంగా నిలబెట్టింది ఇదే. తను నాయకత్వం వహించినడిపిన ఈ రెండవదశలో మొదటి దశలోని హక్కుల అజెండాతోపాటు ఇతర పౌరహక్కుల సమస్యలు కూడా వచ్చి చేరాయి. ఈ పరివర్తనా క్రమంలో తనకు విప్లవోద్యమాలతో కొంత భిన్నత్వం ఏర్పడింది గాని అది వైరుధ్యంగా మారలేదు.

బాలగోపాల్ విశిష్టతలు మరి రెండున్నాయి. తను ఎంతటి గొప్ప మేధావి, రచనాదక్షుడో అందుకు తీసిపోని అవిశ్రాంత బేర్‌ఫుట్ హక్కుల కార్యకర్త. ఇది ఒకటి కాగా, రెండవది తన అవగాహనలు. మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు గల విషయాలపై, వాటి భిన్నకోణాలపై, పరస్పర సంబంధాలపై, అదే

విధంగా మారుమూలగల వ్యక్తుల నుంచి మొదలుకొని అంతర్జాతీయ స్థాయి వరకు గల వ్యక్తుల సమూహాలపై, వారి పరస్పర ప్రభావాలపై బాలగోపాల్ అవగాహనలు నిరుపమానమైనవి. ఈవిధమైన బహుముఖ విశిష్టలతో రెండున్నర దశాబ్దాలపాటు నిర్భయంగా పౌరహక్కులకోసం పాటుపడిన మరొక వ్యక్తి భారతదేశ చరిత్రలోనే మరొకరులేరు. మానవాభివృద్ధితో నిమిత్తంలేని ఆర్థికాభివృద్ధిని మరింత విజృంభించి సాగించేందుకు ఆర్థిక సంస్కరణల పేరిట సాగుతున్న కార్యకలాపాలు అణగారిన వర్గాల పౌరహక్కులకు సరికొత్త విఘాతాలు కల్పిస్తున్న ప్రమాదకర దశలో బాలగోపాల్ వంటివారు లేకపోతుండటంఇంకా ఆందోళనకరమనాలి.

*వార్త సంపాదకత్వం, 10 అక్టోబరు 2009*

# హక్కుల చుక్కాని

**రాష్ట్రంలో** 'పౌరహక్కులు' అనే మాట చెవినపడగానే గుర్తుకొచ్చే వ్యక్తి ఆయనే. హక్కుల ఉద్యమానికి తన జీవితాన్నే ఆయన చిరునామాగా చేసుకున్నారు. ఎక్కడ అసహాయుల హక్కులు బలవంతుల ఉక్కు పాదాల కింద అణగారిపోతున్నట్టు తెలిసినా అక్కడ వాలడం ఆయన తనకు తాను విధించుకున్న ప్రథమ కర్తవ్యం. నిజానిజాలు శోధించడం, హక్కుల హననానికి ఆనవాళ్లు కనిపించగానే ఆ సంగతి లోకానికి చాటింపు వేయడం, వీలైన ప్రతిమార్గంలో దానిపై పోరాటం చేయడం...ఇదే గత మూడు దశాబ్దాలుగా ఆయన ప్రధాన కార్యక్షేత్రం. ఆయనే డా॥ కె. బాలగోపాల్.

ఆరు పదుల వయసు కూడా నిండకుండానే బాలగోపాల్ హఠాన్మరణం చెందడం ఎవరూ ఊహించని, ఎవరికీ నమ్మశక్యంకాని దుర్వార్త. ఉద్యమంలో భాగంగా కాలికి బలపం కట్టుకుని ఆయన తిరగని ఊరులేదంటారు. హక్కులకు అండగా తను ఎలుగెత్తని చోటు లేదంటారు. అవిరామశ్రమకు, అవిశ్రాంత పోరుకు ఆయన ఇచ్చిన ప్రాముఖ్యం ఆరోగ్యానికి ఇచ్చినట్టు లేదు. బహుశా అందుకే ఈ బాధాకర అకాలమరణం. ఆయన మృతితో రాష్ట్రంలో హక్కుల ఉద్యమం పెద్దదిక్కు కోల్పోయింది.

పోరాటవాదేకాక అనవరత అధ్యయన శీలి కూడా అయిన బాలగోపాల్ తెలుగునాట గుర్తింపు పొందిన అగ్రశేణి మేధావులలో ఒకరు. ఎంత సంక్లిష్టమైన అంశాన్ని అయినా సూటిగా, తేటగా వివరించి చెప్పగల రచయిత ఆయన. అలాగే లోతుల్ని తరచి చూసి మరుగుపడిన వాస్తవాలను వెలికిలాగి కొత్త కోణాలను, అన్వయాలను ఆవిష్కరించిన కలం ఆయనది. చివరివరకూ పత్రికలకు వ్యాసాలు

రాస్తూనే ఉన్న బాలగోపాల్ తాను మంచిదని నమ్మిన ప్రతి అభిప్రాయాన్ని కుండ బద్దలుకొట్టినట్లు వెల్లడించడానికి ఎన్నడూ వెనుకాడని వ్యక్తి. తన అభిప్రాయాలకూ, తనతో భావసారూప్యమూ, మైత్రీ ఉన్న సంస్థలు, వ్యక్తుల అభిప్రాయాలకూ మధ్య తీవ్ర వైరుధ్యం తలెత్తిన అనుభవాలూ ఆయన ఎదుర్కొన్నారు. ఆ సందర్భాల్లో తాను ఏకాకి కాగల అవకాశమున్నా సరే, భావప్రకటనా స్వేచ్ఛను కాపాడుకోవడం వైపే మొగ్గు చూపించిన మేధో నిజాయితీ ఆయనది. హక్కుల నేతగా తనపై భౌతికంగా జరిగిన దాడులను ఎదుర్కొనడంలోనూ ఆయన అనితరమైన ధైర్యాన్ని ప్రదర్శించారు.

1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంస్థలో చేరి ఆ తర్వాత దానికి ప్రధాన కార్యదర్శిగా 1998 వరకు పనిచేసి హక్కుల ఉద్యమాన్ని ప్రాచుర్యంలోకి తేవడంలో ప్రధాన భూమిక పోషించిన బాలగోపాల్, ఎన్‌కౌంటర్లను ప్రశ్నిస్తూనే పోలీసులు–సాయుధ తీవ్రవాదుల ఘర్షణలో సామాన్య ప్రజల ప్రజాస్వామిక హక్కులకు కలుగుతున్న భంగాన్నీ ప్రశ్నించారు. ప్రజల జీవన హక్కుపై వేటు ఏ వైపు నుంచి పడినా ప్రశ్నించవలసిందేనన్న వైఖరి తీవ్ర అభిప్రాయభేదాలకు దారితీయించడంతో ఆయన పౌరహక్కుల సంఘాన్ని వీడి 'మానవ హక్కుల వేదిక'ను ఏర్పాటు చేశారు.

సాయుధ పోరాటమార్గాన్ని ఎంచుకున్నవారు ప్రజల మధ్య జీవిస్తున్నప్పుడు యుద్ధాన్ని ఆహ్వానించే పనులు చేయకూడదని, మావోయిస్టులైనా రేపు అధికారానికి వస్తే రాజ్య సార్వభౌమత్వాన్ని సవాలు చేస్తే ఇంతకంటె భిన్నంగా వడచుకోరని–పోలీసులు, నక్సల్స్‌కు మధ్య వర్తమాన సంకుల సమరం నేపథ్యంలో–నిన్నటికి నిన్న స్పష్టం చేయడానికి ఆయన సందేహించలేదు. ఆదివాసీలు, రైతుల హక్కుల పక్షాన నిలబడిన బాలగోపాల్ ప్రభుత్వాల పారిశ్రామిక అభివృద్ధి నమూనాలనే మూలమట్టంగా వ్యతిరేకించడం, దోపిడీకి, దౌర్జన్యానికీ ప్రతిరూపంగానే దానిని పరిగణించడం ఉద్యమ వాదుల్లో సహజంగా ఉండే అతివాద ధోరణికి కొంత అద్దంపడుతూ ఉండవచ్చు. కానీ, నోరులేని నిరుపేదల హక్కుల పరిరక్షణపట్ల ఆయన నిబద్ధత, నిమగ్నత ప్రశ్నించరానివి.

వేలు, వందల సంవత్సరాలు రాచరికపు చండశాసనాల కింద, భూస్వామ్యపు పడగనీడ కింద సాగిన మానవ చరిత్రలో మానవహక్కులు, పౌరహక్కుల భావనలు ఇప్పటి రూపంలో వికసించినది ఇటీవల. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, రెండవ

ప్రపంచ యుద్ధం తర్వాత, మానవహక్కులంటే మనిషిని మనిషిగా చూడడం, అతని అస్తిత్వానికి సంబంధించిన అన్ని హక్కులనూ గౌరవించడమే. ప్రజాస్వామిక సమాజాల్లో కూడా సర్వం తానేనని రాజ్యం విర్రవీగి పౌరుల హక్కులను చెరబట్టబోయిన సందర్భాలు ఉంటూనే ఉంటాయి. దానిని నివారించే కాపలాదారు పాత్రను పోషించడానికే హక్కుల ఉద్యమాలు, భారతదేశంలో మానవహక్కులు, పౌరహక్కుల స్పృహ విస్తరిస్తూ వాటి పరిరక్షణ సంస్థాగత రూపం తీసుకుంటున్న దశలో రాష్ట్రంలో హక్కుల చుక్కానిగా బాలగోపాల్ నిర్వహించిన పాత్ర అసామాన్యం. ప్రత్యేకించి పేదల హక్కుల పోరాట చరిత్రలో ఆయన కృషి ఒక కీలకాధ్యాయం. ఆయనకు 'సాక్షి' అశ్రునివాళి.

*సాక్షి దినపత్రికలో సంపాదకీయం, శనివారం అక్టోబరు 10, 2009*

# ఎక్కుపెట్టిన హక్కుల విలుకాడు!

**"సర్! నేనెంతో** సంపాదించాను. అన్నీ కోల్పోయాను. అందర్నీ కోల్పోయాను. నాకీ జీవితమంటేనే విరక్తి కలుగుతోంది" అని ఒక కుర్రాడు వెళ్లి ఆవేదనగా చెబితే, ఆత్మీయంగా పలకరిస్తూనే బాలగోపాల్ వేసిన ప్రశ్న ఏమిటో తెలుసా? "ఎంతో సంపాదించావంటే సంపాదించగల శక్తి ఏదో నీ దగ్గర ఉందన్నమాటే కదా! అలాంటి శక్తి ఉన్నప్పుడు మళ్లీ సంపాదించుకోవచ్చు. అయినా కోల్పోయే దాన్ని ఎందుకు సంపాదిస్తావు?" దీనికి వెంటనే ఆయన పరిష్కారం కూడా చూపారు. "వస్తువు, కోరిక కోసం పాకులాటలో భాగంగా మనిషి ఎంతో ప్రయాణం చేస్తున్నాడు. అది దక్కక పోయినా, దక్కి కోల్పోయినా కుంగిపోతాడు. కానీ అదే ఆ పాకులాటను మానవ సేవలో అంతర్భాగంగా చూపిస్తే పోవడమన్నదే ఉండదు కదా! ఒకసారి ఆ సేవలోని ఆనందాన్ని ఆస్వాదించడం మొదలుపెడితే, అది హిమాలయాల్లో తపస్సు చేసి పొందిన ఆనందం కన్నా ఎక్కువగా ఉంటుంది" అని ఆయన హితబోధ చేశారు. మానవ సేవకు, మానవ హక్కులకు అంకితమై పోయిన బాలగోపాల్ జీవితమంతా దీన్నే ఆస్వాదించారు. అందుకే సమకాలికుల్లో ఎందరో పౌర హక్కుల కార్యకర్తలున్నా ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచారు. "తోటి మనిషికి సహాయ పడడమనేది మనిషిలో స్వతహాగా ఉండాల్సిన లక్షణం. అయితే అది లోపిస్తోంది. అందువల్లే ఈ సమస్యలు, హింసలు, ప్రతి హింసలు!" అని ఆయన నిర్వచించారు. అధ్యాపకుడు, మేధావి, మంచి వక్త, మార్క్సిస్టు విశ్లేషకుడు, గొప్ప న్యాయవాది, రచయిత... ఇలా ఎన్నో కోణాలున్నప్పటికీ బాలగోపాల్ మానవ హక్కుల ఉద్యమారుడిగానే చరిత్రలో ఎక్కువగా

నిలిచిపోతారు. ఎందుకంటే రాష్ట్రంలో మానవ హక్కుల ఉద్యమానికి ఆయన చేసిన సేవ అలాంటిది!

## మానవ హక్కుల్లో మేలి మలుపులు

అనేక కోణాల్లో మానవ హక్కుల ఉద్యమానికి బాలగోపాల్ ఆద్యుడిగా నిలిచారు. ఆయనకు ముందు రాష్ట్రంలో హక్కుల ఉద్యమానికి రాజకీయ అనుబంధాలే ఎక్కువ. హక్కుల ఉద్యమ వేదికలో వివిధ ఎంఎల్ పార్టీలకు కోటాలవారీగా పదవులు దక్కేవి. కొన్నిసార్లు హక్కుల ఉద్యమంతో సంబంధం లేనవారూ ఆ పదవుల్లోకి వచ్చేవారు. కానీ బాలగోపాల్ కృషి కారణంగా ఏ పార్టీకి చెందని స్వతంత్ర మేధావులు పౌర హక్కుల ఉద్యమంలోకి వచ్చారు. దీంతో ఉద్యమానికి ఒకరకమైన నిష్పాక్షికత, సార్వజనీనత చేకూరాయి. అంతేకాదు, దీనివల్ల ఆంధ్రప్రదేశ్ మానవ హక్కుల ఉద్యమం దేశంలోనే శక్తిమంతమైనదిగా మారింది. దానికి ఒక నిబద్ధత అబ్బింది. ఈ క్రమంలోనే రాష్ట్ర మానవ హక్కుల ఉద్యమాన్ని, బాలగోపాల్ అఖిల భారత స్థాయికి చేర్చారు. రజనీ కొఠారి తదితరులను ఇక్కడికి తీసుకురావడమే కాదు. ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల ఉల్లంఘనను జాతీయ స్థాయిలో ప్రచారం చేశారు. ఈ మేరకు కర్నాటక, నాగపూర్, ఢిల్లీలో సదస్సులు నిర్వహించారు. మానవ హక్కుల ఉద్యమంలో ఫుల్‌టైమర్ విధానాన్ని మొట్టమొదట తెచ్చింది కూడా ఆయనే! ఆయన స్వయంగా దీన్ని ఆచరించి చూపడంతో, ఆయన తర్వాత మరొకొందరు అదే బాటలో నడిచారు. పబ్లిక్ హియరింగ్ (బహిరంగ విచారణ) అనే విధానాన్ని కూడా ఆయనే ప్రవేశపెట్టారు. "రిటైర్డ్ జడ్జీలను, ఇతర ప్రముఖుల్ని పిలిచి వివిధ సమస్యలపై జనామోదాన్ని తెలుసుకోవడం, నిష్పాక్షిక అంచనాకు రావడం అనే విధానాన్ని బాలగోపాలే ప్రవేశపెట్టారు. తర్వాతి కాలంలో ఇది ఎంతో ప్రజాదరణ పొందింది. ఇప్పుడు అనేక స్వచ్ఛంద సంస్థలు దీన్ని అనుసరిస్తున్నాయి" అని బాలగోపాల్‌తో దశాబ్దాల అనుబంధమున్న సుబ్రహ్మణ్యం వివరించారు. ఏపీసీఎల్సీకి రెండుసార్లు జాయింట్ సెక్రటరీగా పనిచేసిన సుబ్రహ్మణ్యానికి 15 ఏళ్ల పాటు బాలగోపాల్‌ను రోజూ కలిసిన సాన్నిహిత్యముంది. రాజ్య హింసతో పాటు, ప్రైవేటు హింసను కూడా మానవ హక్కుల ఉల్లంఘన కిందే లెక్కవేయాలన్న బాలగోపాల్ వాదన, కొన్ని వర్గాలకు ఆయన్ను దూరం చేసినప్పటికీ, మానవ హక్కుల ఉద్యమానికి మాత్రం ఆమోదనీయతను పెంచింది. పార్టీ రహిత

ప్రజా సంఘాన్ని ఈ స్థాయిలో నిర్మించడమంటే అది బాలగోపాల్‌కు మాత్రమే సాధ్యమైంది. నమ్మిన దాన్ని గట్టిగా ఆచరించడం, వ్యక్తిగతంగా విలువలకు పూర్తిగా కట్టుబడడం వల్ల బాలగోపాల్‌కు, ఆయన ఉద్యమానికి ఎంతో విశ్వసనీయత చేకూరింది. ఎంత అంటే చివరికి పోలీసులు కూడా ఆయన మాటను నమ్మేంత! ఎన్‌కౌంటర్ల వంటివి జరిగినపుడు మృతి చెందిన నక్సలైట్ల వద్ద డబ్బు లభించిన సందర్భాల్లో పోలీసులు ఒక లెక్క చెప్పేవారు. తర్వాత అదే ఎన్‌కౌంటర్‌పై బాలగోపాల్ బృందం నిజ నిర్ధారణ జరిపినపుడు, అందులో పోయిన సొమ్ము గురించి కూడా పేర్కొనేవారు. దీని ఆధారంగా పోలీసు ఉన్నతాధికారులు..."మరణించిన నక్సల్ వద్ద చాలా సొమ్ము ఉన్నట్టు బాలగోపాల్ తన నివేదికలో చెప్పారు. మీరేమో తక్కువ చూపిస్తున్నారు ఎందుకు? మిగతాదీ పట్టుకురండి" అని అడిగిన సందర్భాలూ ఉన్నట్టు పోలీసు వర్గాలు తెలిపాయి.

## ఎవరినీ లెక్కచేయని సాహసి

"బాలగోపాల్ ఇంట్లో చాలా సరదాగా ఉండేవారు. జోకులు వేసేవారు. పాటలు పాడేవారు. కానీ ఇంట్లో ఉండే బాలగోపాల్ వేరు. బయట కనిపించే బాలగోపాల్ వేరు" అని వివరించారు హెచ్ఎం టీవీ సీఈవో రామచంద్రమూర్తి. "బయట ఆయన సీరియస్ మనిషి, కొంతవరకు అంతర్ముఖుడు కూడా. చాలా నిష్కర్షగా మాట్లాడేవారు. పౌర హక్కుల ఉద్యమకారుల్లో మిగిలిన ఎవరికీ లేని ధైర్యం ఆయన సొంతం. మాట అనాల్సిన పరిస్థితే వస్తే ఎదుట ఎవరున్నారన్నదాంతో సంబంధం లేకుండా, ఏమాత్రం సంకోచించకుండా అనగలిగేవారు. ఎదుటి వ్యక్తిది ఏ పొజిషన్ అన్నది చూడకుండా, బాణం లాగా, తూటా లాగా, కుండబద్దాలు కొట్టినట్టు మాట వదిలేవారు" అని అనేక ఏళ్లపాటు ఆయన్ను ఎంతో సన్నిహితంగా గమనించిన రామచంద్రమూర్తి వివరించారు. "ఆయన చాలా ధైర్యవంతుడు. ఆయన ధైర్యం నుంచే మేం స్ఫూర్తి పొందాం. అంత కల్లోలిత వాతావరణంలోనూ ఆయన హనుమకొండ సెంటర్‌లో ఒక ఇంట్లో కింద ఒక రూమ్‌లో ఒంటరిగా కిరాయికి ఉండేవారు. అది చూసి మాకే భయమయ్యేది" అని సుబ్రహ్మణ్యం వివరించారు. "అది కారంచేడు అయినా, జగిత్యాల అయినా, పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉన్నా బాలగోపాల్ అక్కడ వాలిపోయేవారు. పోలీసులను నేరుగా నిలదీసేవారు" అని తెలిపారు.

# మహోన్నత మానవతావాది

**బాలగోపాల్** ఇక లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నాను. ప్రభుత్వం, మావోయిస్టుల మధ్య శాంతి చర్చలకు చొరవ తీసుకొనేందుకు నిర్వహించిన ఒక సమావేశంలో ప్రసంగించేందుకు గత నెలలోనే ఆయన ఢిల్లీ వచ్చారు. ఆయన మరణంతో భారతదేశంలోని ప్రజాస్వామ్య హక్కుల కార్యకర్తలు ఒక గొప్ప మార్గదర్శిని కోల్పోయారు. భారతదేశపు ప్రగతిశీల ప్రజాస్వామ్య ఆలోచనా స్రవంతిని సమున్నతం చేసిన ఒక అరుదైన మేధావిని భారతీయులు కోల్పోయారు.

మానవహక్కుల ఉద్యమంలో పనిచేస్తోన్న నాలాంటి ఎంతో మందికి బాలగోపాల్ ఒక స్ఫూర్తిదాయక మార్గదర్శి. కణ్ణబీరన్, హరగోపాల్‌లతో కలిసి ఆయన ఉదార వాదుల, మార్క్సిస్టుల ప్రధాన స్రవంతి భావాలను సవాల్ చేస్తూ మానవ హక్కుల అర్థాన్ని నిర్వహించారు. పౌర స్వేచ్ఛ అంటే అన్నిటికీ మించి చట్టబద్ధమైన పాలన కనుక భద్రతా దళాలు చేసే బూటకపు ఎన్‌కౌంటర్లను చట్ట విరుద్ధమైనవిగా పరిగణించాలని బాలగోపాల్ డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఉన్న హక్కుల సంఘాలు ఈ అంశానికి ఇచ్చిన ప్రాధాన్యం వల్లే నేడు బూటకపు ఎన్‌కౌంటర్‌లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం పటిష్టమయింది. ఇప్పటికీ ఆ బూటకపు ఎన్‌కౌంటర్లు ఆగిపోలేదు. అయితే భద్రతా దళాలు గతంలో మాదిరిగా నిర్భయంగా వాటికి పాల్పడడం లేదు. పాల్పడితే ప్రజలు నిలదీస్తారనే భయం వారిని వెంటాడుతోంది. బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని ప్రోదిచేయడానికి, పౌరహక్కులను పటిష్టం చేయడానికి బాలగోపాల్ చేసిన కృషిని దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో పనిచేస్తున్నప్పుడు గానీ, మానవ హక్కుల వేదికలో పనిచేస్తున్నప్పుడు గానీ, బాలగోపాల్ పౌరహక్కులను ఒక సంకుచితార్థంలో పరిగణనలోకి తీసుకోలేదు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక స్వాతంత్ర్యాలకు సామాన్య మానవులకు గల హక్కులే పౌరహక్కులు అని ఆయన నిండుగా విశ్వసించారు. పౌరహక్కుల ఉద్యమంలో భాగంగానే దళితులు, మహిళలు, మైనారిటీలపై జరిగిన దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగాఎన్నో కేసులలో ఆయన వాదించారు. పౌరహక్కుల ఉద్యమాల మూలంగా గత మూడు దశాబ్దాలలో ఆంధ్రప్రదేశ్ సమాజంలో గొప్ప సృజనాత్మక పరివర్తనలు సంభవించాయి. ఈ పరిణామాలకు బాలగోపాల్ చేసిన దోహదం చాలా విశిష్టమైనది. ఆయన నిశిత మేధాశక్తి, నిష్పాక్షిక, నిస్వార్థ నాయకత్వం నుంచి విశాల భారతదేశపు పౌర, మానవహక్కుల ఉద్యమాలు ఇతోధికంగా లబ్ధి పొందాయి.

బాలగోపాల్ గురించిన ఎన్నో జ్ఞాపకాలు నన్ను ఇప్పుడు ముప్పిరి గొంటున్నాయి. ఒక అనుభవాన్ని వివరిస్తాను. 1985లో ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో జరిగిన ఒక స్మారక సభలో పాల్గొనడానికి వెళ్ళిన బృందంలో నేనూ ఒక సభ్యుడిని (బాలగోపాల్ అప్పుడు ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు). పోలీసులు మావాహనాన్ని ఆపి మమ్ములను అరెస్ట్ చేశారు. రెండు రాత్రులు మేము లాకప్‌లోనే ఉన్నాము. మొదటి రాత్రి నేను నా జోకులతో అందరినీ నవ్వించడానికి ప్రయత్నించాను. అయితే బాలగోపాల్ నా జోకులకు పెద్దగా ప్రతిస్పందించలేదు. నవ్వు వచ్చినా బలవంతంగా ఆపుకున్నారు. మర్నాడు ఉదయం నేను షేవింగ్ చేసుకున్నా ఆయన చేసుకోలేదు. ఎందుకు చేసుకోవడం లేదని ఆడగగా అణచివేతలో ఉండగా షేవింగ్ చేసుకోవడం ఇష్టం లేదని ఆయన సమాధానమిచ్చారు. ఆ రోజు రాత్రి మమ్ములను అడవి గుండా ఒక పట్టణానికి తీసుకెళ్ళారు. ఆ మరునాడు ఉదయం మమ్ములను మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచవలసి వుంది. అర్ధరాత్రి దాటిన తరువాత దట్టమైన అడవిలో గుండా వెళుతుండగా నేను ఆయన చెవిలో మెల్లిగా ఇలా అన్నాను : 'మనలను ఏ క్షణంలోనైనా ఎన్‌కౌంటర్ చేయవచ్చునేమో. ఏమైనా ఈ అంతిమ క్షణాల్లో మీతో పాటు ఉన్నందుకు

నేను గర్తిస్తున్నాను'. బాలగోపాల్ పెద్దగా నవ్వి ఇలా అన్నారు: 'మీకు ఆశాభంగం కలుగుతుంది. ఎందుకంటే మనల్ని తీసుకెళుతున్న పోలీసులు శాంతిభద్రతల పోలీసులు కారు, కోర్టు పోలీసులు. కాసేపు వేచి చూడండి. వారు మనకు టీ ఇస్తారు'. నిజంగానే ఒక అరగంట తరువాత మమ్ములను తీసుకెళుతున్న వాహనాన్ని ఒక దాబా వద్ద ఆపి, మాకు మసాలా టీ ఇప్పించారు. మరునాడు మాకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మేధావులు చేసిన ఒత్తిడి వల్ల ఆ తరువాత ఎన్.టి.రామారావు ప్రభుత్వం మా పై కేసును ఉపసంహరించుకొంది. అణచివేతను ఎదుర్కోవడంలోను, మానవ హక్కులను పరిరక్షించడంలోను బాలగోపాల్‌తో పాటు ఇటువంటి అనుభవాలు పొందినవారు ఎంతోమంది ఉన్నారు.

మాన హక్కుల ఉద్యమంమానవవిలువలను పరిరక్షించే స్వతంత్ర రాజకీయ శక్తిగా ఉండాలనే విషయమై బాలగోపాల్ ఎపిసిఎల్‌సి నుంచి వైదొలగి 'మానవహక్కుల వేదిక'ను ఏర్పాటు చేశారు. రాజ్యాంగం, చట్టాలకు కట్టుబడి తమ చట్టబద్ధమైన విధులన్నిటినీ కచ్చితంగా నిర్వర్తించేలా రాజ్యాంగ సంస్థలన్నింటిపై మానవహక్కుల ఉద్యమం ఒత్తిడి తీసుకునావాలని ఆయన విశ్వసించారు. జమ్మూ-కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సా మొదలైన రాష్ట్రాలో సైనిక దళాలు, పోలీసుల చట్ట విరుద్ధ చర్యలను బహిర్గతం చేయడానికి ఆయన నిరంతరం శ్రమించారు. అలాగే మావోయిస్టులు అమాయకులను ఊచకోత కోసిన సంఘటనలను కూడా ఆయన తీవ్రంగా ఖండించారు. ఇది మావోయిస్టులకు కోపకారణమయినప్పటికీ పలు సందర్భాలలో వారు తమ తప్పును బహిరంగంగా ఒప్పుకోవడం జరిగింది. కొద్ది రోజుల క్రితం జార్ఖండ్‌లో ఒక పోలీసు అధికారి తలను నరికివేసిన ఘటన కూడా ఇటువంటిదేనని చెప్పవచ్చు. పౌరహక్కుల సంఘాలన్నీ మావోయిస్టుల ఆ చర్యను తీవ్రంగా ఖండించాలి.

అణచివేతకు గురవుతోన్న ప్రజలే ఆ అణచివేత వాస్తవాలను అంగీకరిస్తుండగా మానవహక్కుల పరిరక్షణ పేరిటచేస్తున్న కృషి అమూర్త మానవ విలువలను రక్షించడమే కాదా అని మాలో చాలా మందిమి బాలగోపాల్‌తో వాదించడం జరిగింది. అయితే

ఆయన ఈ అభిప్రాయంతో ఏకీభవించలేదు. రాజకీయ, ఆర్థిక పరిస్థితులను నిశితంగా విశ్లేషించి, నాగరికతల చరిత్రను లోతైన తాత్విక దృక్పథంతో సమీక్షిస్తూ ప్రతి ఒక్కరూ మానవ హుందాతో కూడిన జీవితాన్ని పొందేందుకు మానవాళి చేసిన కృషిని మాకు ఉత్తేజకరంగా వివరించారు. మానవ విలువలకు మన నిబద్ధతే మానవ హక్కులను పరిరక్షించడంలో మన కృషి తీరుతెన్నులను ప్రతి స్థాయిలోనూ నిర్ణయిస్తుందని బాలగోపాల్ విశ్వసించారు. ప్రజాస్వామిక హక్కులకోసం నిరంతర పోరాటం చేసిన ఈ మహోన్నత మానవతావాది వారసత్వం ఆ నిండు విశ్వాసమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**- మనోరంజన్ మహంతి**

*వ్యాసకర్త ఢిల్లీ విశ్వవిద్యాలయ రాజనీతి శాస్త్ర*
*విశ్రాంత అధ్యాపకులు, మానవహక్కుల ఉద్యమకారుడు*
*ఆంధ్రజ్యోతి, 10 అక్టోబరు, 2009*

# మరపురాని బాటసారి

**బాలగోపాల్** మరణించారంటే నమ్మకం కలగడం లేదు. నేను కాదు ఆయనతో కలసి పనిచేసిన వారెవరూ నమ్మడం కష్టం. ఆయన హఠాస్మరణం ప్రజాస్వామిక ప్రియులను ఒక్కసారిగా అనాథలను చేసింది. తనతోటి ఉద్యమకారులపై ఆయన చెరగని ముద్ర వేశారు. మానవ హక్కుల నేతగా జాతీయ స్థాయికి ఎదిగిన ఈ ఉద్యమకారుడు వ్యక్తిగత జీవితంలో ఎంతో వినమ్రుడు. కార్మికులతో మాట్లాడినా, పాత్రికేయులతో వివరాలు అడిగి తెలుసుకున్నా, తోటి మానవ హక్కుల కార్యకర్తలతో కలిసి పనిచేసినా ఆయన ఎంతో సన్నిహితంగా ఉండేవారు. ఉద్యమకారులకు ఆయన రాకతో కొండంత అండ లభించేది. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణలోని జర్నలిస్టులతో, కార్మికులతో, నిర్వాసితులతో, ఎన్‌కౌంటర్ మృతుల కుటుంబాలతో ఆయన అనుబంధం మరిచి పోలేనిది.

ఉద్యమం తప్ప మరో వ్యాపకంఆయనకు లేదు. ఈ విరామమెరుగని ఉద్యమ ప్రయాణమే ఆయనకు ఎంతో మంది సహ ప్రయాణికులను తోడుంచింది. ఉత్తర తెలంగాణలో నిర్వాసితుల వెంట ఆయన ఉండి ఉద్యమించి, ప్రజలలో చైతన్యం రగిలించారు. మంచిర్యాల ర్యాలీ వాగు వద్ద పాలమూరుకు చెందిన కూలీలు 12 మంది మరణించినప్పుడు అక్కడకూ బాలగోపాల్ వచ్చి చేరి వారికి న్యాయం చేయాలని పోరాడిన రోజులు ఈ ప్రాంతవాసులెవరూ మరచిపోలేరు. బొగ్గు బావుల ప్రమాదాల విషయమై వేదికలపై ప్రకటనలు చేసే నాయకులకు భిన్నంగా ఆయన నిజ నిర్ధారణ సాగేది. విచారణ కోసం ఆయన స్వయంగా బావులలో దిగి నిజనిర్ధారణ జరిపి

నివేదికలు ప్రభుత్వానికి అందజేసిన సంఘటనలను ఏ కార్మికుడైనా మరచిపోగలడా! బొగ్గు గని కార్మికుల సమస్యలపై ప్రమాదాలు జరిగినప్పుడు, మరణాలు సంభవించినప్పుడు ఆయన స్పందించిన తీరు, ఆయన అండదండలు ఎన్నడు మరచిపోలేనివి. తెలంగాణలో ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా బాలగోపాల్ కోసం ఎదురు చూసే రోజులను ఎన్నని లెక్కపెట్టగలం! ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంతో మమేకమైన ఆయన హఠాన్మరణం ఇక్కడి గని కార్మికులు జీర్ణించుకోలేకపోతున్నారు. బాలగోపాల్ లాంటి ఉద్యమకారుడు పుట్టడమే అరుదు. ఇకాయన లాంటి వారు మళ్ళీ వస్తారా అంటూ గద్గద స్వరంతో ఆవేదన చెందుతున్నారు.

వాస్తవాలను నిర్భయంగా ప్రజలకు అందించాలనే తపన పడిన పాత్రికేయులతో బాలగోపాల్ అనుబంధం మరింత ఆత్మీయమైనది. మిత్రుడిగా, తత్వవేత్తగా, మార్గదర్శకుడిగా నిలిచిన బాలగోపాల్‌ను ఏ జిల్లా కేంద్రంలోని, మండలంలోని పాత్రికేయుడు మరచిపోలేడు. మంచిర్యాల, గోదావరిఖని, ఆ చుట్టుపక్కల ప్రాంతాల పాత్రికేయులకు బాలగోపాల్‌తో అనుబంధం ఇటీవల మరింత దృఢతరమైంది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలతో ఆయనకు పాతిక సంవత్సరాల అనుబంధం ఉంది. నక్సలైట్ ఉద్యమం తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు నక్సల్స్‌కు ఆశ్రయమిస్తున్నారనే ఆరోపణ ఎవరిపై పడుతుందో తెలియని రోజులు. ఎక్కడో మందు పాతర పేలితే, అందుకు బాధ్యులు వీరేనంటూ కంటబడిన ఏ అమాయకుడిని పట్టుకున్నా అడిగే దిక్కులేని రోజులవి. ఎన్‌కౌంటర్ అనబడే మరణశిక్ష ఎప్పుడు ఎవరికి పడుతుందో తెలియని కాలమది. ఆ పరిస్థితులతో ఉత్తర తెలంగాణలో బాలగోపాల్ తిరగని ప్రాంతం లేదు. ఆయన దృఢ దీక్ష పాత్రికేయులకు స్ఫూర్తిని ఇచ్చేది.

బాలగోపాల్‌తో వ్యక్తిగతంగా నా సాన్నిహిత్యం మరచిపోలేనిది. ఆదిలాబాద్ జిల్లాలో 1980 దశకంలో జరిగిన పలు పోలీసు ఎన్‌కౌంటర్ల సందర్భంగా ఆయన వెంట నిజనిర్ధారణ కోసం జిల్లా నుంచి ఒక్కోసారి ఏ నాయకుడు కనిపించే వారు కాదు. కేవలం జర్నలిస్టులే ఆయన వెంట ఉండువారు. రెండు, మూడు రోజులు జిల్లాలో గడిపిన సందర్భాలలో ఆయన మా ఇంట్లో కూడా ఉండేవారు. స్నానం చేసిన తరువాత

ఆయన మళ్లీ ముఖం ఎప్పుడు కడిగేవారో కూడా కనిపించేది కాదు. ఆయన ఇస్త్రీ బట్టలు వేసుకున్న దాఖలులు ఎన్నడూ కనిపించలేదు. తలకు దువ్వెన పెట్టి దూసింది కనిపించదు... ఒక్కోసారి హైదరాబాద్‌లో రాత్రి బస్సు ఎక్కి తెల్లవారు జామున దిగగానే ఫోన్ చేసేవారు. వస్తే వెంట రండీ, లేకుంటే నీ మోటారు సైకిల్ ఇచ్చేయ్ అనేవారు. ఇలా చాలా సందర్భాలలో నా మోటారు సైకిల్ ఆయనకు ఇచ్చేసి నా పని నేను చూసుకుంటే ఆయన పని ఆయన చూసుకొని వెళ్లిపోయేవారు. ఒక్కోసారి స్థానిక సమస్యలపై కాసేపుకూర్చొని ముచ్చటించేవారు. జిల్లాకు వచ్చినప్పుడు కలిసే టైం లేనపుడు ఫోన్ చేసి సమయం లేదు, కలవడం కుదరడం లేదు మిత్రమా..! అని ఫోన్ చేసేవారు... అంతటి నిగర్వి బాలగోపాల్.

గత సంవత్సరం ఓపెన్‌కాస్ట్‌కు వ్యతిరేకంగా ఇందారం వద్ద అఖిల పక్ష కమిటి ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేసినప్పుడు ఆయన వేదిక కింద నేలపై కూర్చొని మానవ హక్కులకు సంబంధించిన కొన్ని పుస్తకాలను అమ్మడం ఆశ్చర్యం వేసింది. ఓసారి కాగజ్‌నగర్‌కు బస్సులో వెళ్ళి అక్కడ నుంచి ఎన్‌కౌంటర్ సంఘటన స్థలానికి సైకిళ్లపై వెళ్ళాల్సిన పరిస్థితి వచ్చింది. మాకు ఒకే సైకిల్ దొరికింది. నన్ను కూర్చోబెట్టుకుని సైకిల్ తొక్కుతానని కొద్ది సేపు సైకిల్ తొక్కి ఇక నాతో కాదు, నీ బరువు నేను మోయలేను, నువ్వే తొక్కు అంటూ మళ్లీ నాకే సైకిల్ ఇచ్చేసి నాతో పాటు వచ్చారాయన. పలు చోట్ల పదే పదే ఆపి టీ తాగేవారు. ఈ సందర్భంలో కూడా ఏదో ఒక విషయం చర్చించారు. మూడు దశాబ్దాల అనుబంధాన్ని మరచిపోలేని ఆ ఉద్యమకారుడికి అశ్రునివాళి.

**- ఎండి. మునీర్**

*ఆంధ్రజ్యోతి, అక్టోబరు 10, 2009*

# అధ్యాపకులకు ఆదర్శప్రాయుడు

**బాలగోపాల్** జీవితం కేవలం సామాజిక శాస్త్రవేత్తలకే ఆదర్శంకాదు, విద్యార్థులకు, యువకులకు కూడా ఆయన ఆదర్శం. కావలిలో చదువుకున్న బాలగోపాల్ ఒక పరిశోధక విద్యార్థిగా ఆర్ఇసికి వచ్చారు. ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేసారు. కొంత మంది విద్యార్థులు పుస్తకాల వరకే పరిమితంగా ఉంటారు. వారి సహచర్యం కూడా క్లాస్‌మేట్‌ల వరకే పరిమితంగా ఉంటుంది. మరి కొంతమంది కాలేజీ విద్యార్థులందరితో కలిసిపోతారు. అందరినీ ప్రభావితం చేస్తారు. మరికొందరైతే ఇతరుల జీవితాల్లోకి చొచ్చుకుపోతారు. కొందరు విద్యార్థులు కాలేజీల రూపురేఖలే మార్చివేస్తారు. ఇంకా కొద్ది మందైతే ఆ పరిసరాల ప్రజల జీవితాలతో కూడా చొచ్చుకొని పోతారు. ఇంకా కొంతమంది, ఆ ప్రాంత మట్టిని తన ఒంటినిండా రాసుకుంటారు. ఆ మట్టిలోని చైతన్యాన్ని ఆస్వాదిస్తారు. ఆ మట్టి చేసే పోరాటాల వెంట అడుగులు వేసుకుంటూ వెళతారు. కొందరు ఆ నేల విముక్తి కోసం తమ జీవితాలనే అంకితం చేస్తారు. ఇలాంటి అరుదైన జీవితాల కోవకు చెందిన మహామనిషి బాలగోపాల్.

విశ్వవిద్యాలయాన్ని కేవలం ఎలైటిస్టిక్ కల్చర్‌కు నిలయమైన కాలంలో వాటిని ప్రజాజీవితంతో మమేకం చేయించి పని చేశాడు. బోర్డు మీద చాక్‌పీస్‌తో గణితం చెప్పే పంతులు, రాత్రింబవళ్లు లెక్కలు చేసి సమీకరణాలు ఎలా చేసుకుంటాడో సమాజాన్ని పలకగా మార్చుకొని ప్రజల జీవితాలను లెక్కలుగా చేసుకున్నాడు.

లెక్కలంటే అంకెలు కావని సామాజిక శాస్త్రాన్ని అధ్యయనం చేసే కొత్త పద్ధతియని ప్రపంచానికి చూపించటమే గాక తను ఆచరించాడు. అంకెలు కేవలం సమీకరణాల సాధనమే కాదు. సామాజిక సమస్యలను విశ్లేషించుకోవటానికి, దానికి కారణాలు కనుక్కోవటమే నిజమైన గణితమన్నాడు. వాటిని విశ్లేషించి ఒక తత్త్వశాస్త్రవేత్తగా ఊరుకోకుండా, ప్రజల బతుకులను, హక్కుల సాధనను ఎంచుకొని కార్యోన్ముఖుడయ్యాడు. భుజం మీద సంచి వేసుకొని ఒక్కొక్క వూరు తిరిగి ఆ ప్రజల జీవితంతో మమేకమయ్యాడు. జనం తినే కారముద్దలే తిన్నాడు. గిరిజనుల జొన్నరొట్టిలే తిన్నాడు. వారి కష్టాలకు పరిష్కార మార్గం చూపించటమే కాదు తానొక కార్యకర్తగా మారాడు. పుస్తకాల వరకే పరిమితమైతే ఆయన మేధావిత్వానికి జేజేలు కొడతారు. కానీ ప్రజల కోసం కార్యోన్ముఖుడైతే మాత్రం ఆ మేధావిని పాలకులు, ఆధిపత్యవాదులు సహించరు. శత్రువుగానే పరిగణిస్తారు. అందుకే ఆయనను పోలీసులు అనేకసార్లు కిడ్నాప్ చేసారు. అరెస్టులు చేశారు. ఎన్నో హింసలకు గురిచేశారు. చావుకు దరిదాపులోకి వెళ్ళాడు. కానీ ఆ ప్రతి దెబ్బ అతని పట్టుదలకు పదును పెట్టింది. ఆ పట్టుదల అతనిలో పెరుగుతున్నా కొద్ది ఎదుగుతూ వచ్చాడు. కేవలం ఇలాంటి అన్యాయాలు తెలంగాణాలోనే కాదు ఆసేతు భారతదేశంలో ఎక్కడ జరిగినా కానీ అక్కడకు వెళ్లి అదే పని చేశాడు. అతను ఎదుగుతున్నా కొద్ది ప్రపంచంలోని పీడిత ప్రజానీకమంతా ఆయనకు ఒకే రకంగా కనపడింది. ఇరాక్ ప్రజలైనా, కాశ్మీర్, తెలంగాణ ప్రజలైనా ఆయనకు ఒకటే. వీరంతా పీడిత ప్రజానీకమే అనుకున్నాడు. దేశ సరిహద్దుల సమస్యలకు రాజకీయ నాయకుల కీచులాటలే కారణమన్నాడు. అతను పెరుగుతున్నా కొద్ది మానవతామూర్తిగా ఉద్భవించాడు. మనిషికి జీవించే హక్కుందని, అది ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండదన్నాడు. అది పుట్టుకతోనే వచ్చిన హక్కు అని ఎలిగెత్తి చాటాడు. టెక్నాలజీ పెరుగుతున్నా కొద్దీ మానవ జీవితానికే ప్రమాదం వస్తున్న కాలంలో మానవహక్కుల ఉద్యమానికి కొత్త భాష్యం చెప్పాడు. అభివృద్ధియనే పేరుమీద మనిషి జీవించే హక్కును హరించటం అవరోధం అని కంకణదారుడయ్యాడు. వచ్చే కాలాల్లో మానవ హక్కులు కేవలం ప్రభుత్వాలతోనే కాదు పెట్టుబడీదారి సమాజంలో ఇమిడి ఉన్న లక్షణమని, దానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరముందని చెబుతూ తుది శ్వాస విడిచాడు. మానవ హక్కుల ఉద్యమానికి కొత్త కోణాన్ని ఇచ్చాడు. దానికి సమిధ అయ్యాడు. ఆ ఉద్యమం ఇప్పుడు రగులుకుంది. సమాజం మహాయోధుడ్ని పోగొట్టుకుంది. కానీ ఎంతో

మంది పోరాట యోధుల్ని ఆ ఉద్యమం  తయారు చేస్తుంది. ఒక ఉద్యమానికి నాంది పలికాడు. ఒక విద్యార్థిగా కాకతీయ కొచ్చాడు. ఒక ఉద్యమ నేతగా అరుణతారగా ఆకాశానికెక్కాడు.

ఒకనాడు ఈ తెలంగాణ పోరుగడ్డ ప్రపంచానికే కొత్త సందేశమిచ్చిన క్షేత్రం. సాంకేతిక యుగంలో ఒక కొత్త ఉద్యమానికి బాలగోపాల్ హక్కుల ఉద్యమ విత్తనాలు ఈ నేలపై చల్లాడు. ఆ మొలకలను పెంచి పోషించవలసిన బాధ్యత మనముందు పెట్టాడు. ఇది మన ముందున్న సవాల్.

విశ్వవిద్యాలయాలను నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలలో పెట్టవద్దని వాదన చేసే పెద్దలు అనేకమంది ఉన్నారు.  ఉన్నత విద్యాలయాలు కూడా తమ పెరళ్ళలోనే ఉండాలని, తమ తుపాకుల పహారాలోనే విద్యాలయాలు పెట్టాలంటున్నవారు లేకపోలేదు. వారి కోటల్లోనే, వారి కను చూపులోనే అన్ని బడులు, కళాశాలలు పని చేయాలంటారు. ఒక ఆర్ఇసిని వరంగల్‌లో పెట్టి తప్పు చేశామని ఇప్పటికీ కొందరంటున్నారు. దేశంలో 18 ఆర్ఇసిలున్నాయి. 9 ఐఐటిలున్నాయి. 530 విశ్వవిద్యాలయున్నాయి. మహా విద్యాలయాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఏ విద్యాలయానికి లేని చరిత్ర ఈ వరంగల్ ఆర్ఇసికి ఎలా వచ్చింది? విశ్వవిద్యాలయం అంటే బిల్డింగ్‌లు, గోడలు, పరికరాలే కాదు. అది ఏ క్షేత్రంలో ఉంది? ఆ విద్యాసంస్థల, విద్యార్థుల అంకిత స్వభావమేమిటి? అన్నది ముఖ్యం.

పరిశోధకులు ఏ ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు సిద్ధమవుతున్నారు. అదే ఆ విద్యాలయం ఇచ్చే  జ్ఞానానికి గీటురాయి అవుతుంది. విద్యాలయాలు పెట్టేటప్పుడు పేద ప్రజానీకం మధ్య పెట్టండి. పీడిత ప్రజానీకం మధ్య పెట్టండి. బొగ్గుగనుల మధ్య, గిరిజన ఆదివాసి ప్రాంతాల మధ్య, పీడితుల మధ్య పెట్టండి. అపుడు విద్యార్థి పుస్తకాలతో సహా ప్రజల జీవితాలను కూడా చదువుతాడు. దాని నుంచి వచ్చే విద్యార్థులే బాలగోపాల్‌లు అవుతారు. ఈ అనుభవం ప్రపంచ చరిత్రను చూసిన వాళ్ళందరికీ కనిపిస్తుంది. రస్సెల్ జీవితాన్ని చదవండి, పాల్‌పెత్రి జీవితం చూడండి. హర్వర్డ్‌లో ఉన్న చామ్‌స్కీ జీవితాలను చూడండి. మన గడ్డలో పుట్టిన బాలగోపాల్‌ను చూడండి. ఇదే అధ్యాపక వర్గానికి ఆయన త జీవితాన్ని ఆచరణలో చూపి ఇస్తున్న సందేశం.

**– చుక్కా రామయ్య**

*ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు*

*11 అక్టోబరు, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# అరుదైన మనిషి

**డా॥ కె. బాలగోపాల్** హఠాన్మరణం తర్వాత నాకు ఏదో దిగులుగా, వెలితిగా అనిపిస్తోంది. బాలగోపాల్‌తో సాన్నిహిత్యం వల్ల నా మనస్సుకు అలా అనిపిస్తున్నదని కాదు. వాస్తవానికి బాలగోపాల్‌తో నాకు పరిచయమే లేదు. ఆయన జీవించి ఉన్నప్పుడు నేను ఎప్పుడూ ఆయనను కలవలేదు. మరణ వార్త తెలిసి నివాళులు అర్పించడానికి వెళ్లినప్పుడు మాత్రమే ఆయనను చూడగలిగాను. అయితే భౌతికకాయాన్ని మాత్రమే! పరిచయమే లేని బాలగోపాల్ పట్ల నాకు ఒక రకమైన ఆరాధనా భావం ఉండేది. అందుకు ఆయన ఎంచుకున్న మార్గం, గడిపిన జీవితం కారణం. చాలామంది మేధావులు బయట చెప్పే మాటలకు వారి వ్యక్తిగత జీవితాలకు పొంతన ఉండదు. ప్రజల్లోకి వచ్చినప్పుడు ఆదర్శాలు వల్లె వేసేవారు వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే విలాసంగా గడిపిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. బాలగోపాల్ ఇందుకు పూర్తి భిన్నం. ఆయన తాను నమ్మిన సిద్ధాంతాన్ని నిక్కచ్చిగా ఆచరించి చూపించారు. ఎవరికీ పట్టని అభాగ్యుల కోసం తన జీవితాన్ని ధారపోశారు. ధన ప్రభావం మానవ సంబంధాలను అతలాకుతలం చేస్తున్న ఈ రోజుల్లో ప్రలోభాలకు, ఐహిక సుఖాలకు అతీతంగా ఒక నిర్వికారిగా, ఒక రుషిగా జీవితాన్ని గడిపిన మహోన్నత వ్యక్తి బాలగోపాల్! ఆయన సిద్ధాంతాలను ప్రతి ఒక్కరూ సమర్థించాలని చెప్పను గానీ, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుంటే సమాజాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్యలు పరిష్కారం అవుతాయి.

విధి నిర్వహణలో ఉన్నప్పుడు జర్నలిస్టులు వ్యక్తిగత భావోద్వేగాలకు గురి కాకూడదని నేను తరచుగా సహచర జర్నలిస్టులకు చెబుతూ ఉంటాను. కానీ, గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో "ఆంధ్రజ్యోతి" సెంట్రల్ డెస్క్‌లో కూర్చుని, మరుసటి రోజు ప్రచురించవలసిన వార్తల ప్రాధాన్యతల గురించి ఎడిటర్ కె. శ్రీనివాస్, అసిస్టెంట్ ఎడిటర్ అల్లం నారాయణ, నేనూ చర్చిస్తున్నప్పుడు బాలగోపాల్ మరణ వార్త తెలిసింది. అంతే; మాకు మాటలు కరువయ్యాయి. మేం ముగ్గురం కూడా భావోద్వేగానికి గురయ్యాం. వాస్తవానికి బాలగోపాల్ గురించి నేను రాయాలనుకోవడం సాహసమే! కానీ ఆయన మరణ వార్త విన్న తర్వాత నాలో ఉత్పన్నమైన పలు ప్రశ్నలు నన్ను ఈ సాహసానికి పురిగొల్పాయి.

మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి మాధవ్‌ను ఒంగోలుకు సమీపంలోని నల్లమల అడవుల్లో ఎన్‌కౌంటర్ పేరిట కాల్చి చంపినప్పుడు "ఇలా అందరూ వెళ్లిపోతే నోరు లేని వాళ్లకు దిక్కేమిటి? నీవు పూనుకుని ఏదో ఒకటి రాయి" అని అల్లం నారాయణకు సూచించాను. ఆ మరుసటి రోజు తాను రాసిన వార్తాకథనం ప్రచురితం అయిన తర్వాత నారాయణ నన్ను కలిసి, తన జీవితంలో వృత్తిపరంగా ఇంత ఆనందాన్ని ఎప్పుడూ పొందలేదని చెమర్చిన కళ్లతో అన్నాడు. ఏమి జరిగిందని ప్రశ్నిస్తే, 'ఉదయం నుంచీ నన్ను అభినందించని వాళ్లు లేరు' అని నారాయణ అనడం, అదే జర్నలిజంలో ఉన్న సంతృప్తి అని మేమిరువురం అనుకోవడం జరిగింది. ఇప్పుడు మళ్లీ అవే ప్రశ్నలు, అవే భావాలు నన్ను చుట్టుముట్టాయి. తాడిత, పీడిత ప్రజానీకంతో పాటు, నాగరిక (?) సమాజానికి దూరంగా కొండల్లో, కోనల్లో జీవిస్తున్న ఆదివాసీల కోసం అలుపెరుగని పోరాటం చేసిన బాలగోపాల్ కూడా వెళ్ళిపోతే ఇక ఎవరు మిగిలారు? జీవిత చరమాంకంలో సిద్ధాంతాలను, విశ్వాసాలను అమ్ముకోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్న ఈ రోజుల్లో ఒక మునిగా జీవితాన్ని గడిపిన బాలగోపాల్‌లు ఎక్కడ దొరుకుతారు? రాజ్యాన్ని గానీ, అన్యాయాలను–అక్రమాలను గానీ, ప్రైవేటు హింస (మావోయిస్టులు తదితర వామపక్ష తీవ్రవాద సంస్థల హింస)ను గానీ ప్రశ్నించే గుండె ధైర్యం ఎందరికి ఉంటుంది? మానవ హక్కులను ఇంత నికార్సుగా ప్రేమించే ఉద్యమకారుడు మళ్లీ పుడతారా? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకదు! మానవ హక్కుల కోసం పోరాటం చేసిన లేదా చేస్తున్న వారికి గానీ, వామపక్ష తీవ్రవాదులకు

సానుభూతిపరులుగా ఉంటున్న మేధావులకు గానీ బాలగోపాల్‌కు ఉన్నంత విశ్వసనీయత లేదని కచ్చితంగా చెప్పవచ్చు. ఇందుకు బాలగోపాల్ ఎంచుకున్న సిద్ధాంతమే కాదు, జీవన విధానం కూడా కారణం. బాలగోపాల్‌ది అత్యంత నిరాడంబర జీవనశైలి. తల కూడా సరిగ్గా దువ్వుకోరు. ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ, "మీరన్నా పట్టించుకోవచ్చు కదా?" అని ఆయన జీవన సహచరి వసంతలక్ష్మి వద్ద ఒకసారి ప్రస్తావిస్తే, "తల జోలికి మాత్రం ఆయన రానివ్వరు" అని ఆమె బదులిచ్చారు. ఆయన భౌతిక కాయాన్ని చూసిన తర్వాత బాలగోపాల్‌కు మానవ హక్కుల పట్ల తప్పితే తన విషయంలో గానీ, తన శరీరంపట్ల గానీ, దుస్తుల పట్ల గానీ ఆసక్తి లేదనీ, ఉండదని స్పష్టం అయింది.

మీడియా పబ్లిసిటీ కోసం సామాన్యుడు మొదలుకొని మేధావి వరకు ప్రతి ఒక్కరూ పరితపిస్తున్న ఈ కాలంలో బాలగోపాల్, సమాచార సాధనాల కోలాహలానికి, హడావుడికి బహు దూరంగా ఉన్నారు. అందువల్లనేమో....ఆయన గురించి సామాన్య జనానికి తెలిసింది చాలా తక్కువ! అంతెందుకు! మానవ హక్కుల ఉద్యమ కారుడిగా, న్యాయవాదిగా సుపరిచితుడైన బాలగోపాల్ గణితంలో అపార ప్రతిభావంతుడనీ, చిన్న వయసులోనే పిహెచ్.డి. చేశారన్న చాలా మందికి తెలియదు. అంశమేదైనా సరే; దానిపై పూర్తి అవగాహనకు ఆయన తొలి ప్రాధాన్యమిచ్చేవారు. పరోక్ష సమాచారంపై ఆధారపడకుండా, సొంతంగా దాని లోతుపాతులను తెలుసుకునేందుకు నేరుగా రంగంలోకి దిగేవారు. బాధితులను, సంబంధింతులను స్వయంగా కలుసుకునేవారు. వివరాలు సేకరించేవారు. సమగ్రంగా అధ్యయనం చేసేవారు. ఆ అంశాన్ని వెలుగులోకి తీసుకురావాలని అనుకున్నప్పుడు మీడియాను ఆశ్రయించే వారు. ఆయన రచన కూడా ముక్కు సూటిగా, ప్రస్ఫుటంగా కొనసాగేది. ఒక అంశాన్ని ఎక్కువ మంది చూసే కోణంలో కాకుండా, భిన్నమైన దృక్కోణంలో చూడడం, దానికి సహేతుకమైన వాదనను నిర్మించడం, అత్యధికులతో 'నిజమే కదా' అని ఒప్పించగలగడం బాలగోపాల్‌కు మాత్రమే సాధ్యమైన విశిష్టశైలి. మీడియా ద్వారాకంటే కూడా ఇతరత్రా మార్గాల్లో సమస్యను ఎదుర్కొనడాన్నే ఆయన ఎక్కువగా ఇష్టపడినట్టు కనిపిస్తుంది. రాజ్యం (ప్రభుత్వం) అక్రమాలను ఎదుర్కొనడానికి, రాజ్యాంగాన్నే ఆశ్రయించి, కోర్టుల్లో గెలువగలిగిన అరుదైన న్యాయ కోవిదుడు బాలగోపాల్! తాను

సమర్థించే మార్గంలోని మంచి చెడులను బేరీజు వేసుకునే ఆత్మ విమర్శకుడే కాదు; విభేదించినపుడు చెడును చెడు అని ధైర్యంగా చెప్పి, అంగీకరించకపోతే బయటకు వచ్చి, ప్రత్యామ్నాయ ఉద్యమాన్ని నిర్మించగలిగిన వన్‌మ్యాన్ ఆర్మీ ఆయన! ఎక్కువ మంది ఒక ప్రవాహ సదృశమైన పంథాలో కొట్టుకుపోతున్నపుడు, తానొక్కడు మాత్రం ఎదురీది, ఎదురు నిలిచి, ఏమిటిది? ఎందుకిలా? అని ప్రశ్నించగలిగారు. అందుకే పౌరహక్కుల ఉద్యమకారుల్లో బాలగోపాల్ సమున్నతంగా, విభిన్నంగా నిలవగలిగారు. మానవ హక్కుల కోసం జీవితాంతం నిలిచి పోరాడిన నిజమైన మనిషి బాలగోపాల్!

పదహారు వందల కిలోమీటర్ల పాదయాత్ర చేసి వై.ఎస్. రాజశేఖరరెడ్డి మహా నాయకుడు అయ్యారు. ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి అయ్యారు. హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయిన తర్వాత దివంగత ముఖ్యమంత్రిని దేవుడని కొందరు కీర్తిస్తున్నారు. అదే ప్రాతిపదిక అయితే, బాలగోపాల్ తన ఉద్యమ ప్రస్థానం ప్రారంభమైన తర్వాత లక్షల కిలోమీటర్లు పర్యటించారు. మీడియా కలాలు, (కెమెరాల) కళ్లు చేరలేని ప్రాంతాలకు కూడా ఆయన వెళ్లారు. ఎందరో అభాగ్యులకు 'నేనున్నాను' అని ఓదార్పును ఇచ్చారు. అంటే బాలగోపాల్‌ను దేవ దేవుడని కీర్తించవలసి ఉంటుంది. రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఎంతమందికి నష్టం, కష్టం జరిగిందో నాకు తెలియదు గానీ, బాలగోపాల్ మృతి వల్ల లక్షలాది పీడిత ప్రజల పెద్ద దిక్కును కోల్పోయారు. తమ తరఫున అన్యాయాలను ప్రతిఘటించే, ప్రశ్నించే వారి కోసం వారి కళ్లు వెదుకుతూనే ఉంటాయి. అధికారం పొందడమే లక్ష్యంగా ఏర్పాటైన రాజకీయ పార్టీల నాయకులు చనిపోతే భోరున విలపిస్తూ, ఎక్కడపడితే అక్కడ విగ్రహాలు ఏర్పాటు చేసే మన సమాజం, బాలగోపాల్ వంటి మహా వ్యక్తి చనిపోతే అంతలా ఎందుకు స్పందించడం లేదు? విలువలను పణంగా పెట్టి భోగలాలసతకు అలవాటు పడుతున్న వారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. బాలగోపాల్ వంటి అసాధారణ వ్యక్తులను గుర్తించి గౌరవించకపోతే భవిష్యత్తులో మనకు అన్యాయం జరిగినప్పుడు అండగా నిలబడే వాళ్లే మిగలరు.

బాలగోపాల్ భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులు అర్పించి, అర్ధరాత్రి తర్వాత ఇంటికి వెళ్ళిన నాకు, అప్పటి వరకు మా ఇంట్లో వాళ్లు కూడా టి.వి. చూస్తూ, బాలగోపాల్ గురించి తెలుసుకోవడానికి ఆసక్తి చూపడం కొంత ఊరటనిచ్చింది.

ప్రభుత్వాలు చేసే దుర్నీతిని ఎదిరించినంత మాత్రాన పాలక వర్గాలు బాలగోపాల్‌ను శత్రువుగా చూడనవసరం లేదు. రాజకీయ పార్టీల నాయకులు నిత్యం పరస్పరం దూషించుకుంటూ, మధ్యలో ఎవరైనా చనిపోతే అందరూ ఒక్కటై మరణించిన వారిని ఆకాశానికెత్తగా లేనిది, బాలగోపాల్ వంటి నిబద్ధత గల వ్యక్తిని గుర్తించి గౌరవించడానికి ఎందుకు వెనుకాడాలి? ఆ పార్టీ సిద్ధాంతం వేరు, మా పార్టీ సిద్ధాంతం వేరు అని చెప్పుకునే నాయకులు వేరు. మా పార్టీ సిద్ధాంతం వేరు అని చెప్పుకునే నాయకులు బాలగోపాల్ విషయంలో కూడా ఆయన సిద్ధాంతంతో విభేదించినా ఆయన గొప్పతనాన్ని గుర్తించవచ్చు కదా!

బాలగోపాల్ భౌతికకాయం ఉన్న ఆస్పత్రికి చేరిన తర్వాత అక్కడి పరిస్థితి నన్ను మరింత కలచి వేసింది. ఈ వార్త తెలిసిన పలువురు జర్నలిస్టు ప్రముఖులు, హక్కుల ఉద్యమకారులు ఆస్పత్రికి చేరుకున్నారే గానీ ఒక్క రాజకీయ నాయకుడు కూడా కనిపించలేదు. అంతేకాదు, ఆస్పత్రి వద్ద హడావుడి చూసి అక్కడకు చేరుకున్న ఇద్దరు కానిస్టేబుళ్లు ఏమి జరిగిందని ప్రశ్నించగా, బాలగోపాల్ చనిపోయారు అని చెప్పాను. ఆయన ఎవరు? అని వాళ్ళ నుంచి వచ్చి ప్రశ్నతో నాకు మతిపోయినంత పని అయింది. బాలగోపాల్ భౌతికకాయాన్ని చూసి కూడా కానిస్టేబుళ్లు ఆయనను గుర్తించలేదు. విషయం తెలిసిన తర్వాత కూడా కనీసం సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఆస్పత్రి వద్దకు బందోబస్తు కోసమైనా రాకపోవడం విషాదం! ఇటువంటి వైఖరి ప్రదర్శించడం ద్వారా అటు పాలకులు గానీ, ఇటు అధికార యంత్రాంగం గానీ ఏమి సందేశాన్ని ఇస్తున్నాయి? నమ్మిన విలువల కోసం జీవితాంతం కట్టుబడిన వ్యక్తిని, పరుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహా మనిషిని గౌరవించకపోతే అలాంటి మహానుభావులు భవిష్యత్తులో దొరుకుతారా? ఇది మనందరం ఆత్మ పరిశీలన చేసుకోవలిసన అంశం. బాలగోపాల్‌పై నాకు తెలిసి కేసలు కూడా లేవు. ఆయన ఎన్నడూ హింసకు పాల్పడలేదు. అన్ని రకాల హింసలను వ్యతిరేకించిన ధీరోదాత్తుడు. అధికారంలో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణల ఊబిలో కూరుకుపోయిన పలువురు నేతలకు మరణించిన తర్వాత ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తారు. గానీ, బాలగోపాల్ వంటి మహోన్నత వ్యక్తిత్వం కలిగిన వారిని పట్టించుకోకపోవడంలోని ఔచిత్యం ఏమిటి? అందరం ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఈ విషయంలో మీడియా

కూడా మినహాయింపు కాదు. నాయకులు చనిపోయినప్పుడు రోజుల తరబడి విషాద గీతాలు వినిపించి, దృశ్యాలు చూపించే ఎలక్ట్రానిక్ మీడియాలకు తెల్లవారే సరికే బాలగోపాల్ మరణవార్త అప్రధానం అయిపోయింది. మనమందరం బాలగోపాల్‌లు కావాలని కాదు. కాలేం కూడా! కానీ, అలాంటి మహానుభావులకు మరణానంతరమైనా ఇవ్వాల్సిన గౌరవం ఇస్తే భవిష్యత్తులో మరో బాలగోపాల్ పుట్టుకు రావచ్చు. ఒక వేళ మనలో ఆ పరిణతి రాకపోతే పరిస్థితులు వికటించినప్పుడు ప్రకృతే కల్పించుకుని బాలగోపాల్ వంటి వారిని పుట్టిస్తుంది. ప్రలోభాలకు, వ్యక్తిగత ప్రయోజనాలకు కక్కుర్తి పడుతూ ఇప్పటివరకు మన కోసం ప్రశ్నిస్తూ అలుపెరుగని పోరాటం చేస్తూ వచ్చిన బాలగోపాల్‌ను కూడా ఇప్పుడు కోల్పోయాం. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకున్నా, తీసుకోకపోయినా బాలగోపాల్ వంటి వారిని ప్రోత్సహించవలసిన బాధ్యత సమాజంపై ఉంది. ప్రశ్నించే ఒక గొంతు శాశ్వతంగా మూగబోయింది కనుక, ప్రశ్నించే మరో గొంతు వినిపించే వరకు బాలగోపాల్ స్మృతులతో కాలం గడుపుదాం!

**– వేమూరి రాధాకృష్ణ**

*10 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# ఆయన సత్యాన్వేషి

**బాలగోపాల్** మాటకారి కాదు. చమత్కారి అంతకన్నా కాదు, నాకతనితో గాఢమైన మైత్రి లేదు. అసలతడు స్నేహపాత్రుడు కూడా కాదు. ఆయన రాసిన ప్రతిమాటనూ శిరసున దాల్చే భక్తి గాని భావాలపరంగా ఆయనతో సంపూర్ణమయిన ఏకీభావంగాని లేవు. అయినా అతడు పోయాడని తెలిసిన క్షణం నుంచీ మనసంతా దిగులుగా ఉంది. అతని లేని లోటు పూడ్చలేనిదనేది మరింత స్పష్టంగా అర్థమవుతోంది. ఈ మాట నేను రొటీన్‌గా చెప్పడం లేదు. అది నూటికి నూరుపాళ్లు నిజం. అందుకే దిగులు.

బాలగోపాల్ ఒక ప్రత్యేకమైన వ్యక్తి. బాలగోపాల్ లాంటి వాడు ఆంధ్రప్రదేశ్‌లో బాలగోపాల్ ఒక్కడే అనిపిస్తుంది. అతని ప్రత్యేకత అతని భావాల్లో ఉందనుకోను. అతని నడవడికలో ఉంది. అతని వ్యక్తిత్వంలో ఉంది. నిజం విషయంలో అతనికున్న నిబద్ధతలో ఆ ప్రత్యేకత ఉంది. నమ్మిన నిజానికి కట్టుబడి ఉండడం అన్నది పైకి కనిపించినంత తేలిక వ్యవహారం కాదు. పైగా బాలగోపాల్ అలా కట్టుబడి ఉండడమేగాక, ఆ సూత్రాన్ని ఆయన ఎంత సహజంగా ఎంత సాదాసీదాగా ఎంత స్పష్టంగా స్వీకరించాడో గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

జనంలో ఎక్కువ మందికి తామూ తమ కుటుంబమూ తప్ప వేరే ప్రపంచం ఉండదు. వారికి వారి ఈతి బాధలు, వారి కష్టం, వారి సుఖం, వారి సంపాదన ఇవే తెలుసు. వాటికి సంబంధించినంత వరకే సమాజంతో వారి సంబంధం మొదలవుతుంది. అక్కడే అది అంతమౌతుంది. అది సహజం. అందులో

తప్పుపట్టాల్సిందేమీ లేదు. తమ సొంత ప్రపంచాన్ని దాటి వేరే సమాజం ఉందనీ దానిని మెరుగుపర్చాల్సిన అవసరముందనీ గ్రహించినవాళ్లు ఎప్పుడూ కొందరే ఉంటారు. ఈ కొందరూ అనేక ఉద్యమాల మధ్య చీలి ఉన్నారు. ఇది కూడా సహజమే. దీనిలోనూ తప్పు పట్టాల్సిందేమీ లేదు.

ఈ కొందరిలో బాలగోపాల్ ఒకరు. వీరందరిలో కొన్ని లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయని మనం అనుకుంటాం. ఉండాలని కోరుకుంటాం. సామాన్య జనం కంటే వీళ్ల అవగాహనా శక్తి మెండుగా ఉండాలని భావిస్తాం. వీరు సమాజాన్ని మెరుగుపర్చే కర్తవ్యాన్ని స్వీకరించారు కనుక దానికి సంబంధించిన ఒత్తిళ్లనూ సాధక బాధకాలనూ తట్టుకుని నిలబడతారని ఆశిస్తాం. 'సొంత అవసరాల'పట్ల వెంపర్లాటను కొంత కుదించుకుంటారనీ, సాదాగా బతుకుతూ ఉన్నతంగా వ్యవహరిస్తారనీ, సంకుచితత్వాన్ని వదిలేస్తారనీ ఆశిస్తాం. ఆ ఆశలు అత్యాశలు కాదు. అయినా వీటన్నిటినీ సంతృప్తిపరిచిన అతి తక్కువ మందిలో బాలగోపాల్ ఒకరు. అదే ఆయన ప్రత్యేకత.

నిజానికి సమాజ శ్రేయస్సు కోసం రంగంలో దిగినవారందరికీ బాలగోపాల్ ఒక సహజమయిన సగటు నమూనా అయి ఉండాల్సింది. కాని దురదృష్టం. అలా కానేలేదు. అందుకే ఆయన ఒక విశిష్టమైన నమూనాగా మిగిలాడు. సామాన్య జనాన్ని ఉద్ధరించడానికి పుట్టినట్లు నటిస్తున్న మనుషుల్లో అత్యధికులకు ఇవ్వాళ సహజమయిన సగటు నమూనా 'గిరీశం'. తొలి గిరీశం ఆవేల్టి సంస్కరణోద్యమంలో పుట్టాడు. అతగాడి మౌలిక తత్వం క్రెడిటూ డెబిటూ'. నయా గిరీశాలందరూ ఈ తత్వాన్ని ఆబగా అందిపుచ్చుకునారు. మీరు ఆ తర్వాత వచ్చిన ప్రజా ఉద్యమాలన్నిటిలోనూ తామరతంపరగా చేరి నాయకత్వాలకు ఎగబాకారేమో అనిపిస్తుంది. అబ్బో ఎన్ని రకలా గిరీశాలో చెప్పలేం. కమ్యూనిస్టు గిరీశాలు, విప్లవ గిరీశాలు, దళిత గిరీశాలు, బడుగు గిరీశాలు, మైనారిటీ గిరీశాలు – ఒకటేమిటి మీరు ఏ ఉద్యమంలో చూసినా అందులో మీకు కుప్పలు తెప్పలుగా గిరీశాలు కన్పిస్తారు. గిరీశాలది చాలా 'విశాల' దృక్పథం. ఎంత విశాలమంటే నేటి ప్రగతిశీల ఉద్యమాలకూ ప్రగతి నిరోధక వాదాలకూ రెంటికీ వారే ప్రతినిధులు. గిరీశానికి కుల మత ప్రాంతీయ భేదాలు లేవు. అతగాడికి లింగభేదం ఉందనుకునేరు. కళ్లు తెరచి చూడాలేగాని మీకు లెక్కలేనంత మంది ఆడ గిరిశాలు కనిపిస్తారు.

ఈ డెబిటూ క్రెడిటూ తత్వాన్ని, ఈ గిరీశతత్వాన్ని నూటికి నూరుపాళ్లూ తిరస్కరించిన అతి కొద్దిమందిలో బాలగోపాల్ ఒకరు. అదే ఆయన విశిష్టత. ఆ పని ఆయన పూర్తి స్పృహతో తెలిసే చేశాడనిపిస్తుంది. ఆయనలో డబ్బు యావ ఉన్నట్టుగా ఏనాడూ కనిపించలేదు. మామూలుగా జనం కోరుకునే సౌఖ్యాలమీద ఆయనకు పిసరంతయినా మోజు ఉన్నట్టుగా చూసినవారు లేరు. బహుశ ఈ సౌఖ్యాల కంటే మించినది ఏదో ఆయనకు తన పనిలో కనిపించి ఉంటుంది. లేదంటే బంగారం లాంటి ఉద్యోగం వదిలిపెట్టి ఈ పనిలో దిగి ఉండదు. దేవుడి సేవలో ఇహలోక సౌఖ్యాలను మించిన పారలౌకిక ఆనందాలలో తేలి తన్మయత్వాన్ని పొందే కొందరు భక్తుల్లాగా, ఆయనకు తన సామాజిక కార్యకలాపాల్లో గిరీశాలకు అంతుబట్టని ఏదో అటువంటి ఆనందాన్నో సంతృప్తినో పొందుతూ ఉండవచ్చు. నిజానికి జనం బతుకుల్ని మెరుగుబర్చడం కోసమో స్వేచ్ఛ కోసమో ప్రజాస్వామ్యం కోసమో ఇంకేదైనా ఉదాత్త ఆశయం కోసమో పని చేయడానికి రంగంలో దిగిన వారందరికీ ఈ 'ఆనందం' రుచి ఎంతో కొంత తెలిసే ఉండాలి. కాని బాలగోపాల్ ఎంత అరుదైన ఉదాహరణగా కనిపిస్తున్నాడో చూడండి. గిరీశాలు ఎంత విరివిగా కనిపిస్తున్నారో చూడండి. అది ఆయన ఔన్నత్యాన్నికి నిదర్శనమని సంతోషించాలో, మన దౌర్భాగ్యానికి చిహ్నమని విచారించాలో తెలియదు.

ఆయన తొలి అడుగుల్లో రాజ్య హింసను తీవ్రంగా ద్వేషించాడు. మానవ హక్కులను ఉల్లంఘిస్తున్న ప్రభుత్వ నిరంకుశత్వాన్ని బట్టబయలు చేశాడు. ఆ పని ఆయనతో పాటు ఎందరో చేశారు. ఎంతో ధైర్యంగా చేశారు. తర్వాత ప్రజల తరఫున ఆయుధాలు ధరించామన్నవాళ్లు ప్రభుత్వం లాగే అమానుషంగా హేతుబద్ధంగా ప్రవర్తించగా చూశాడు. చూసి గమ్మున ఉండిపోలేదు. ఆ నిజాన్ని బాహాటంగా చెప్పాడు. ప్రభుత్వాన్ని ఎంతగా నిందించాడో అంతగానూ తన పాత మిత్రులను తప్పుపట్టాడు. వారితో అంతకుముందు తనకున్న ప్రత్యేక బంధాన్ని ఒదులుకన్నాడు. ఆయన విశిష్టత అన్నది ఇందులోనే ఇది చాలా కష్టమైన పని. సాయుధులు ఈయన్ని చంపుతారని కాదు. ఆ భయం ఉంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంత నిక్కచ్చిగా నిలబడేవాడు కాదు. ఇక్కడ ఉన్న ప్రత్యేక కష్టమేమంటే, తనని అభిమానించేవాళ్లూ తనని ప్రోత్సహించినవాళ్లూ అందరూ ఆ విప్లవ సంస్థలోనే ఉన్నారు. వారికి వ్యతిరేకంగా

తనకి స్పష్టంగా కనిపించిన నిజాలను బయటపెట్టడం అందుకే మరింత కష్టం. అయినా ఆయన తన అంతరాత్మను జోకొట్టలేదు. ఆ నిజాన్ని ఆయన బయటపెట్టనే పెట్టాడు.

ఇక లక్ష్యాన్ని సమర్థించడం వేరు. ఆ లక్ష్యం పేరుతో ఏర్పడ్డ సంస్థకు వకాల్తా పలకడం వేరు. వకాల్తాదారులకు నిజానిజాలతో సంబంధం లేదు. ఒక సత్యాన్వేషికీ ఒక లాయరుకీ ఉన్న తేడా అదే. సత్యమని మనసా వాచా కర్మల్లో నమ్మిన దాన్నే వాదించినప్పుడు మాత్రమే సత్యాన్వేషీ లాయరూ ఒకటవుతారు. ఆయన జీవితంలో ఎప్పుడూ నిజాన్నిబట్టి నమ్మకాలు ఏర్పరచుకున్నాడు. ఆయన తన నమ్మకాలను బట్టి నిజాలను మార్చలేదు. ఆయన సత్యాన్వేషి.

పాత రాజకీయ సంస్థలను కాసేపు విస్మరిద్దాం. కొత్తగా ఓ స్వచ్ఛమైన రాజకీయ సంస్థను నెలకొల్పాలని కోరేవారెవరైనా బాలగోపాల్ రాజకీయ తాత్వికతతో ఏకీభవించవచ్చు. ఏకీభవించకపోవచ్చు. కాని ఆయన సత్యాన్వేషణా స్ఫూర్తినీ, ఆయన నిజాయితీని. తను నమ్మిన దానికి కట్టుబడి ఉండే ఆయన నిబద్ధతనూ స్వీకరించాల్సిన అవసరం ఉంది. ఈ లక్షణాలను సంస్థ మొత్తంగానూ స్వీకరించాలి. అందులోని విడి వ్యక్తులుగానూ పుణికి పుచ్చుకోవాలి. సంస్థను గిరీశాలకు సాధ్యమైనంత దూరంగా ఉంచాలి. కాదంటారా?

మానవ కళ్యాణం కోసం పని చేసిన వారి అస్థికలు, ఉత్తమ మానవుల వెచ్చటి కన్నీళ్లతో పునీతమవుతాయంటాడు మార్క్స్. బాలగోపాల్‌ని స్మరిస్తూ, వెచ్చటి కన్నీళ్ళతో....

**– ఎ. గాంధి,**

*సంపాదకుడు, పీకాక్ క్లాసిక్స్*

*10 అక్టోబర్, 2009, సాక్షి దినపత్రిక*

# మానవ హక్కుల ప్రస్థానం

**జీవించే** హక్కుల రక్షణ కోసం జీవించిన మానవ హక్కుల ఉద్యమ నేత మన బాలగోపాల్ ఆకస్మిక మరణంతో మానవ హక్కుల ఉద్యమం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది. మరణించిన వాళ్ళు ఎలాంటి వాళ్ళయినా మరణ విషాద సమయంలో వాళ్ళ మంచి చెడ్డల్ని ఎంచి చూడడం సందర్భోచితం కాదనేది ఓ లోకోక్తి. మరో మాటల్లో చెప్పాలంటే మరణించిన వాళ్ళ గురించి మంచి తప్ప చెడ్డ మాట్లాడకూడదనే ఆ లోకోక్తి సారాంశం. పౌర, ప్రజాస్వామిక, మానవీయ హక్కుల ఉద్యమ జెండానే తన జీవిత అజెండాగా ఎంచుకుని నీతి నిజాయితీలకు నిలువుటద్దంగా నిలచిన అరుదైన, అద్భుతమైన బాలగోపాల్ వ్యక్తిత్వం ఈ లోకోక్తికి అతీతం అంటే అతిశయోక్తి కాదు. అతనొక లెక్కల మాస్టరే కాదు, శత్రువులు సైతం లెక్కలోకి తీసుకోక తప్పని హక్కుల మాస్టర్. నిర్మొహమాట, నిర్భయ, నిష్పక్షపాత, పీడిత ప్రజల పక్షపాతి. బాలగోపాల్ వ్యక్తి కాదు, పీడిత ప్రజల గుండె చప్పుడుగా మారిన శక్తి, అది గ్రహించలేని పోలీసు మూకలు ఆయనను కిడ్నాప్ చేసి నిప్పుతో చలగాటమాడితే ఆంధ్ర 'దేశ' వ్యాపితంగా వెల్లువెత్తిన పౌర ప్రజాస్వామ్య ప్రతిస్పందనకు తాళలేక సురక్షితంగా విడిచిపెట్టి చేతులు కాల్చుకొన్న ఉదంతమే అందుకు నిదర్శనం.

బాలగోపాల్ కేవలం మానవ హక్కుల నేతగానే కాక ప్రముఖ మార్క్సిస్టు మేధావిగా, ఆధునిక అనంతర నిరంతర సాహిత్య విమర్శకుడిగా, సమకాలీన సామాజిక ఆర్థిక రాజకీయ పరిణామాలపై నిరంతరం వ్యాసాలు రాసే పత్రికా రచయితగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తన ప్రతిభా పాటవాలను పీడిత ప్రజల కోసం అంకితం చేసిన ప్రజా

మేధావి. మార్క్సిస్టులకు కొరుకుడు పడని ఆయన 'మానవ ప్రవృత్తి' సిద్ధాంతం, నక్సలైట్ నేతలకు మింగుడు పడని ఆయన 'చీకటి కోణాలు', రాజ్యహింసతో పాటు విచక్షణా రహిత నక్సల్స్ ప్రతి హింస కూడా జీవించే హక్కుల్ని హరిస్తున్నాయని తప్పుపట్టడం లాంటి వివాదాస్పద అంశాలు విప్లవ శక్తులనుండి ఆయనను సంస్థాగతంగా కొంత దూరం చేసినా అందరి ఆదరాభిమానాల్ని చూరగొన్న అరుదైన వ్యక్తిత్వం బాలగోపాల్‌ది.

ఇదంతా ఒక ఎత్తయితే పౌరహక్కుల పరిధిని మానవ హక్కుల దాకా, ప్రజాస్వామిక హక్కుల హద్దుల్ని సామాజిక ప్రజాస్వామ్య హక్కుల సరిహద్దుల దాకా విస్తరించడంలో బాలగోపాల్ నిర్వహించిన అద్వితీయమైన చారిత్రాత్మక పాత్ర ఒక్కటే ఒక ఎత్తు. మరో ప్రముఖ మానవ హక్కుల ఉద్యమనేత, బాలగోపాల్ సన్నిహిత సహచరుడు బుర్రా రాములు వ్యాఖ్యానించినట్టు బాలగోపాల్ చరిత్ర పాత్ర వందేళ్ళ పౌరహక్కుల ఉద్యమాన్ని తిరగరాసిన చరిత్ర. వందేళ్ళనాడు జాతీయోద్యమ కాలంలో మహాత్మా పూలే, అంబేద్కర్లు నిర్మించిన దేశీయ మానవ హక్కుల ఉద్యమ వారసత్వాన్ని ఎలాంటి హిపోక్రసీకి తావు లేకుండా చిత్తశుద్ధితో స్వీకరించడం, ఆచరణలో మానవ హక్కుల ఉద్యమాన్ని నిర్మించడమే అందుకు నిదర్శనం అన్నారు. 1981లో వరంగల్‌లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమంలో అడుగుపెట్టినప్పటి నుండి ఆయనతో నాకు వ్యక్తి గతపరిచయం ఉంది. అదే వరంగల్ జిల్లాలో విప్లవోద్యమ కార్యకర్తగా నేను పనిచేస్తున్నప్పుడు రెండు విప్లవ సంస్థల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడగా దాన్ని నివారించటానికి నియమించిన నిజనిర్ధారణ కమిటీలో ఆయన భాగస్వామిగా ఉండి నిర్వహించిన నిష్పక్షపాతపాత్ర ఆయనతో నా సాన్నిహిత్యానికి నాంది పలికింది. 1989లో నేను సంపాదకుడిగా 'ఎదురీత' మాస పత్రికను ప్రారంభించి, దళిత బహుజన సామాజిక ప్రజాస్వామ్య మానవ హక్కుల ఉద్యమ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహిస్తున్నప్పుడు జరిగిన సిద్ధాంత చర్చకు ఆయన బాసటగా నిలిచారు.

1983 నుండి 1998 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమాన్ని మానవ హక్కుల ఉద్యమంగా విస్తరించాల్సిన ఆవశ్యకతను గుర్తించి మార్పు తీసుకొస్తున్నారు. అందుకు అనుగుణంగా 1999లో మానవ హక్కులవేదిక స్థాపించి దాని వ్యవస్థాపక అధ్యక్షుడిగా

అనేక మందికి స్ఫూర్తినిచ్చి, మానవ హక్కుల ఉద్యమ నేతగా ఆవిర్భవించి, దళిత బహుజన శక్తుల గుండె చప్పుడుగా వారి ఆదరాభిమానాల్ని చూరగొన్నారు. మానవ హక్కులకు, రాజ్యాంగబద్ధమైన చట్టపరమైన పౌరహక్కులకు, సార్వజనీనమైన పౌరప్రజాస్వామ్య హక్కులకు మధ్య తేడా ఏమిటి? మానవ హక్కుల్ని నిరాకరించే కుల వివక్షకు పరాకాష్ఠ అయిన అస్పృశ్య దళితుల హక్కుల్ని మానవ హక్కులుగా పరిగణించాల్సిన ఆవశ్యకత ఏమిటి? ఆ ప్రశ్నల మీద ఆనాడు జరిగిన సిద్ధాంత చర్చ బాలగోపాల్ వైఖరిలో తెచ్చిన మార్పు ఏమిటి? అనే అంశాల్ని ఈ సందర్భంగా ప్రస్తావించడం అసందర్భం కాదు. ఊరుకు సంబంధించిన పౌర సదుపాయాలను అనుభవించడానికి ఊరి బయటి దళితులకు హక్కు లేకుండా చేస్తున్న అస్పృశ్యత వారికి మానవ హక్కుల్ని నిరాకరిస్తోంది.

దళితుల్ని తమ తోటి మనుషులుగా చూడకుండా ఊర్లోని గుడికి, బడికి, మడి (భూమి)కి దూరం చేస్తోంది. వారికి సమాన హక్కుల్ని నిషేధిస్తోంది. జంతువులకంటే హీనంగా పరిగణించి వారి పట్ల అంటరాని తనాన్ని పాటిస్తోంది. సాధారణ పౌరులకు లభించే పౌరహక్కులు సంగతి అటుంచి కనీస మానవ హక్కుల్నే అనుభవించలేని స్థితిలో ఉన్న దళితుల సమస్య ప్రాథమికంగా మానవ హక్కుల సమస్య అవుతుంది. ఈ మానవీయ సమానవీయ మానవ హక్కుల సమస్యను దళిత ఉద్యమం ముందుకు తేవడంతో బాలగోపాల్ వంటి పౌరహక్కుల ఉద్యమ నేతలు పునరాలోచనలో పడ్డారు. దళితులతో పాటు ఇతర వెనుకబడిన కులాల, తరగతుల బీసీల సామాజిక న్యాయ హక్కుల్ని, రిజర్వేషన్ హక్కుల్ని కాలరాస్తున్న మండల్ వ్యతిరేక అగ్రకుల శక్తుల నిరంకుశత్వంపై సామాజిక న్యాయపోరాటం వెల్లువెత్తినప్పుడు బీసీల సామాజిక ప్రజాస్వామ్య హక్కుల అంశం అజెండా మీదకు వచ్చింది. హిందూ మతోన్మాదం, ముస్లిం మైనారిటీల మత స్వేచ్ఛాహక్కుల్ని హరించినపుడు మైనారిటీ సెక్యులర్ ప్రజాస్వామ్యహక్కుల అంశం ముందుకొచ్చింది. మహిళల్ని వరకట్న హత్యలతో అత్యాచారాలతో గృహహింసకు, జండర్ హింసకు గురిచేసే మగ పెత్తందారీతనానికి వ్యతిరేకంగా స్త్రీవాద ఉద్యమ శక్తులు గళమెత్తడంతో మహిళా సామాజిక హక్కులు సామాజిక ప్రజాస్వామ్య హక్కులుగా గుర్తింపులోకి వచ్చాయి.

ఈ విధంగా పీడిత వర్గ ప్రజల సాధారణ పౌరహక్కులతో పాటు ఈ మానవ

హక్కుల సామాజిక ప్రజాస్వామిక హక్కులను కూడా గుర్తిస్తూ, ప్రణాళికా బద్ధం చేస్తూ బాలగోపాల్ మానవ హక్కుల వేదిక స్థాపించటం పౌర హక్కుల ఉద్యమ చరిత్రను మరో మలుపు తిప్పటం జరిగింది. ఎమర్జెన్సీ వంటి ఫాసిస్టు చర్యలు ప్రకోపించినపుడు రాజ్యాంగ పరిధి దాటి, చట్ట పరిధి దాటి సార్వజనీన ప్రజాస్వామ్య హక్కుల కోసం దేశ వ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమం వెల్లువెత్తింది. వీటన్నింటి స్ఫూర్తిని స్వీకరించిన బాలగోపాల్ ఒక్క మాటలో వందేళ్ళ పౌర, ప్రజాస్వామ్య, మానవ హక్కుల ఉద్యమాన్ని విశాల దృక్పథంతో విహంగ వీక్షణం చేయబట్టే సమగ్ర హక్కుల ఉద్యమ నిర్మాతగా చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని పొందగలిగారు.

**- ఉ.సా**

*రచయిత సత్యశోధక సామాజిక అధ్యయన కేంద్రం కన్వీనరు*

*సూర్య దినపత్రిక, అక్టోబరు 10, 2009*

# అ'సామాన్యుడు'

**బాలగోపాల్** చాలాకాలం నుంచి నాకు తెలుసు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి అవిశ్రాంతంగా కృషి చేసిన పౌరహక్కుల నాయకుడు, మేధావి, సమరశీలి ఆయన. ఆ పౌరహక్కుల పరిరక్షణ కోసం అంతకు ముందు తనతో పని చేసిన మిత్రులను కూడా ఎదిరించి నిలబడిన ధీశాలి. అతి సామాన్యుల హక్కుల పరిరక్షణలో ముందుండి పనిచేసిన కొద్ది మందిలో బాలగోపాల్ చిరస్మరణీయుడు. ఎంతో సామాన్యమైన జీవన సరళి ఆయనది. ఆ సామాన్య జీవన సరళిని ఎంచుకోవడంలో కూడా ఒక సిద్ధాంతం ఉందని నాకు అనిపిస్తుంది. అటువంటి జీనన విధానం అవలంభించకపోతే అతి సామన్యులకు అంత దగ్గరై ఉండేవారు కాదు. ఆయన జీవన సరళే సామాన్యుల్లో ఆయన పట్ల విశ్వాసాన్ని నింపింది.

ఆయన గణితంలో దిట్ట. సాహిత్యంలో అందె వేసిన చేయి, అసాధారణ మేధావి అయినా ప్రజలను కాపాడడమే తన జీవిత ధ్యేయంగా భావించారు. అందుకోసమే ఆయన న్యాయవాద వృత్తిని ఎంచుకున్నా, ఎందరో అనుభవజ్ఞులైన న్యాయవాదుల కన్నా మించిన స్థాయి పొందారు. నా సమక్షంలో ఆయన ఎన్నో కేసులు వాదించారు. ఆ విషయంలో న్యాయమూర్తులుగా మేము ఒక్క విషయం గమనించాం. కోర్టు హాలులో ఆయన ఎప్పుడూ కోర్టు నిర్మాణ సూత్రాలను ఉల్లంఘించలేదు. తాను వాదిస్తున్న కేసును న్యాయమూర్తుల ముందు స్పష్టంగా, సూటిగా ప్రస్తావించడం పైనే ఆయన దృష్టిని కేంద్రీకరించే వారు కాని సిద్ధాంతాలను వాదించడం కానీ, ఇతరేతర

సామాజికాంశాలను ప్రస్తావించడం కానీ చేసేవారు కాదు. ఒక గణిత శాస్త్ర పండితుడు తన లెక్కలను ఎంత ఖచ్చితంగా ఫార్ములా ప్రకారం చెబుతాడో అంతే ఖచ్చితంగా, పద్ధతి ప్రకారం కేసును వివరించేవారు. తద్వారా న్యాయమూర్తులకు ఆయన నచ్చేవారు. బయట రాజ్యాంగానికి, చట్టానికి వ్యతిరేకంగా ఎన్నో అభిప్రాయాలు వెల్లడించవచ్చు. కానీ కోర్టులో మాత్రం రాజ్యాంగ సూత్రాలు, చట్టాలకు అనుగుణంగా వాదించే వారు. చాలా మంది బయట చట్టాలు మాట్లాడుతారు. కోర్టులో రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడతారు. వారి గురించి నేను చెప్పబోవడం లేదు. బాలగోపాల్ ఏ రంగంలో ఉన్నా ఆ రంగంలో ఇతరులకు ఆదర్శం కావల్సిన వ్యక్తి.

ఈ విషయంలో ప్రముఖ తత్వవేత్త బెట్రండ్ రస్సెల్ స్వభావాన్ని పుణికి పుచ్చుకున్న మేధావి ఆయన. సమస్య మీద దృష్టి కేంద్రీకరించినప్పుడు ఇతర విషయాలు పట్టించుకోవడం బాలగోపాల్ స్వభావం కాదు. కోర్టు బయట కూడా బాలగోపాల్ తన కేసుకు సంబంధించి, న్యాయమూర్తుల గురించి, న్యాయవాదుల గురించి, విచారణ గురించి మాట్లాడిన దాఖలాలు లేవు.

పౌరహక్కులపై కూడా ఆయన అంతే ఏకాగ్రతతో, తదేక దీక్షతో ఇతర ప్రాపంచిక విషయాలను విస్మరించి జీవితాంతం కృషి చేశారు. బాలగోపాల్ మరణించారన్న విషయం నేను నమ్మలేక పోతున్నాను. ఆయన లేని లోటు పూరించలేనిది. మానవ హక్కుల రంగానికి అపార నష్టం జరిగింది.

**– జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి**

*వ్యాసకర్త సుప్రీం కోర్టు న్యాయవాది*

*10 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# హృదయంలో దీపం పెట్టకు

**ఇక్కడ** దీపాలు వెలిగించకూడదు.

ప్రశ్నలు విన్పించకూడదిక్కడ.

ఇక్కడ చూపుడువేలు కన్పించకూడదు.

ఈ కత్తుల తోటలో ఏం జరిగినా ఎవరూ తొంగిచూడకూడదు.

ఈ నెత్తుటి నదులు ఎక్కడివో ఆరా తీయకూడదు.

మనందరం మనుషులమని ఎవరూ ఇక్కడ గుర్తు చేయకూడదు.

ఇలా అని ఏలినవారు దండోరా వేయించరు.

రాజపత్రంలో రాయించరు.

కానీ....

న్యాయస్థానాలలోని నల్లని చీకటి సాక్షిగా, పోలీసు ఠాణాల్లోని ఖాకీ చీకటి సాక్షిగా, చట్టసభల్లోని ఖద్దరు చీకటిసాక్షిగా, జాతీయ పతాకంలోని మూడు రంగుల చీకటి సాక్షిగా ఈ న్యాయం ఇక్కడ అమలు జరుగుతోంది.

బాలగోపాలుడొక తాజా ఉదాహరణ.

ఇప్పటికే నెత్తురోడుతున్న ప్రజాస్వామ్యానికి ఇది మరో కొత్తగాయం.

ప్రాథమిక హక్కుల నుదుట ఒక బాయినెట్ గాటు.

రాజ్యాంగం ప్రసాదించిన పౌరహక్కులను కాపాడుకోవడానికి తాపత్రయ పడుతున్న వాళ్లపై పాలకులు కన్నెర్ర జేస్తున్నారు.

కుట్ర కేసుల్లో ఇరికిస్తున్నారు.

ఇది ప్రభు వర్గాలు పన్నిన సరికొత్త కుట్ర.

ఇది కుట్రదారుల సరికొత్త ఎత్తుగడ.

ప్రమాదకరమైన కొత్త పన్నుగడ.

చిల్లర దొంగలనైనా, తిరుగుబాటు దారులనైనా, ఎవరినైనా సరే చట్టప్రకారం దోషులని ప్రకటించి, చట్టప్రకారం విచారణ జరిపించి, చట్ట ప్రకారం శిక్షించవలసి ఉంది. అధికారాన్ని అమలు చేయడానికీ, పిడికిలి ప్రయోగించడానికీ చట్టమనేది ఒక పరిమితి విధిస్తోంది.

ప్రతీ అరెస్టును న్యాయస్థానానికి నివేదించాలనడం, ప్రతీ ఆరోపణను రుజువు చేసుకోవాలనడం, సాక్ష్యం కావాలనడం, ప్రతీదాన్నీ సజావుగా న్యాయస్థానంలో విచారించాలనడం మారాజులకీ, వారి బలగాలకీ నామర్దా, నామోషీ, యథేచ్ఛగా పరిపాలించుకుంటూ, శాంతి భద్రతలని అవలీలగా అదుపు చేసుకుంటూ.

"ఊరి మొత్తానికీ ఒక్కడే రౌడీ ఉండాల. వాడు గవర్నమెంటోడే కావాల"ని ప్రకటించుకుంటూ, మీసాలు హోషుగా సవరించుకుంటూ తిరగడానికి వీలు కాకపోవడం బేహద్బీ.

ప్రజాస్వామ్యం, పౌరహక్కులూ వీటివల్లనే గదా మన రాజమార్గాలలో

ఎన్ని నియమాల గులకరాళ్లు అని వారు చాలా ఆగ్రహించారు.

ఫలితంగా ఇంతవరకు విప్లవకారులకీ, విప్లవ రచయితలకీ పరిమితం.

చేసిన కుట్ర కేసులను పౌరహక్కుల సంఘం మీద కూడా ఎక్కుపెట్టారు.

పాలకులు చేపట్టిన ఈ కొత్త యుద్ధతంత్రం ఇపుడింకా ఏ దశలో సాగుతుంది?

ఏ దశలో సాగుతుందంటే

పౌరహక్కుల సంఘం మీద కాదు వాళ్ళ అలక, పౌరహక్కుల మీద.

పౌరహక్కును ప్రసాదించిన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల

అధ్యాయం మీద

ఆ అధ్యాయాన్ని ప్రసాదించిన రాజ్యాంగం మీద.

ఆ రాజ్యాంగం ప్రసాదించిన రాజ్యాంగసభ మీద.

ఆ రాజ్యాంగ సభను నిర్మించిన ప్రజాస్వామ్యం మీద.

ప్రజాస్వామ్యం మీద వారి అలక.

ప్రజాస్వామ్యం మీద వారి క్రోధం.

ఈ కోపం తీరడానికి వాళ్లేం చేయవచ్చును?

చాలా చేయవచ్చును.

చేతిలోని కత్తిని రకరకాలుగా ప్రయోగించవచ్చును.

న్యాయమనీ, సాక్ష్యమనీ, రుజువులనీ కోర్టులు పలుమార్లు చికాకు పెట్టినట్లయితే రాజభటులకు మేజిస్ట్రేట్‌గారింట బాంబులు దొరకవచ్చును.

జడ్జిగారి చాంబర్లో విద్రోహకరమైన 'కుట్ర' జరిగినట్లు నమ్మకంగా ఏలినవారికి తెలియవచ్చును. రాజద్రోహులకు రాజ్యాంగంలోని చాలా అధ్యాయాలూ, అధికరణాలూ కచ్చితంగా సహాయపడుతున్నట్లు తోచి, ప్రాథమిక హక్కులను వివరించే చాలా సెక్షన్లు 'విప్లవ సాహిత్యం' కింద కన్పించవచ్చును.

వీటన్నింటినీ వేలెత్తి చూపే వార్తాపత్రికల శీర్షికల్లో బాంబులు, 'పేలుడు పదార్థాలూ' కచ్చితంగా లభించవచ్చును.

ఆ రకంగా జరిగి....

విశాలమైన, చీకటిమయమైన ఊపిరాడక ఒకే ఒక భయంకరమైన కారాగారంలో బాలగోపాలులూ, న్యాయమూర్తులూ, రాజ్యాంగమూ, వార్తాపత్రికలూ పక్కపక్క గదుల్లో పడి మగ్గవచ్చును.

సరికొత్త యుద్ధతంత్రం ఆ దశకు చేరుకోవచ్చును.

**- కె.ఎన్.వై. పతంజలి**

02-02-1985

'పతంజలి' భాష్యం నుంచి

(1985లో బాలగోపాల్‌ను అరెస్టు చేసి సాలిటరీ కన్‌ఫైన్‌మెంట్‌లో ఉంచినప్పుడు)

# నిష్కామ కర్మయోగి-బాలగోపాల్

**బాలగోపాల** హఠాన్మరణం మనసును కలచి వేసింది. ఆ దుఃఖ వివశతలో వుండగానే ఒక మిత్రుడు ఫోన్ చేసి 'ఆంధ్ర రాష్ట్రం ఒక కర్మయోగిని, ఒక రుషిని కోల్పోయింది' అన్నాడు. తన జీవిత పర్యంతం మానవ హక్కుల కోసం, పీడితుల కోసం నిష్కామంగా పోరాడిన బాలగోపాల్‌కి కర్మయోగి అన్నపదం ఖచ్చితంగా సరిపోతుందేమో.

బెర్ట్రాండ్ రస్సెల్ దార్శనికత స్ఫూర్తిగా సామాజిక కార్యాచరణకు పూనుకున్న బాలగోపాల్ ఆయనలాగే ప్రతి సంక్షుభిత సామాజిక సందర్భంలోనూ పీడితుల పక్షమే వహించాడు. వాకపల్లి గిరిజనులు కానీ, పోలేపల్లి బాధితులు కానీ సింగరేణి ఓపెన్ కాస్ట్ బాధితులు కానీ, ఎవరయినా సరే ప్రతి బాధితుడి గుండెల్లోనూ బాలగోపాల్ చిరంజీవి.

"భారత సమాజంలో రెండు భిన్నమైన వర్గాలే కాదు. ఎవరూ పట్టించుకోకుండా, చాప కింద నీరులా పెరిగిపోతున్న మూడో వర్గమూ వుంది. ఇందులో మొదటిది ఇండియా. ఇది బాగా అభివృద్ధి చెందిన వర్గానికి ఊతపదం. రెండవది భారత్. ఇది గ్రామీణ అభివృద్ధి చెందని వర్గానికి పర్యాయపదం. మూడవది మినీ అమెరికా లేదా నయా న్యూయార్క్. యిది ప్రపంచస్థాయి మౌలిక వసతులు కలిగిన ద్వీపంలాంటిది" అంటూ భారత సమాజంలో తామరతంపరగా పెరిగిపోయిన నియోరిచ్ కల్చర్ గురించి బాల్‌గోపాల్ విశ్లేషించాడు.

బాలగోపాల్‌కి యితర మార్క్సిస్టు మేధావులకు మధ్య వున్న ప్రధానమైన తేడా అల్లా ఒకటే. యితర మార్క్సిస్టు మేధావులు సమాజాన్ని సిద్ధాంత గ్రంథాల పుటల్లోంచి

వీక్షిస్తే, బాలగోపాల్ మాత్రం ప్రజల ఆలోచనల్లోంచి మానసిక ఉద్వేగాలలోంచి సిద్ధాంత గ్రంథాల పుటలను చదివాడు. కనుకనే ఆయన ఆచరణకి, ఆచరణ పథానికి అంత నిజాయితీ, నిబద్ధత.

"నక్సలైట్ల వ్యూహాత్మక ఆలోచనలు ఎప్పుడూ రాజ్యాన్ని రాజకీయంగా ఓడించే దిశగా కాకుండా, సాయుధ పోరాట కోణంలోనే సాగుతున్నాయి. రాజకీయ ఓటములు, అసమానతలు, విధ్వంసక అభివృద్ధి వంటి విషయాలకు నక్సలైట్ల అజెండాలో చోటులేదు. ఒకటి మాత్రం వాస్తవం. ఒక వేళ ఆ దిశగా ఆలోచించినా అలాంటి నిర్ణయాలను, శక్తులను నిలువరించేది ఎలాగనే విషయంలో వారికే ఒక స్పష్టమైన అవగాహన లేదు. ఇంకా నేరుగా చెప్పాలంటే ప్రశ్నించినట్లుగా ఒక స్పెషల్ ఎకనమిక్ జోన్‌గాని, ఒక భారత్, అమెరికా అణు ఒప్పందాన్ని గానీ ప్రశ్నించలేదు" అంటూ నక్సలైట్ల ఉద్యమాన్ని విశ్లేషిస్తూ ఉద్యమం అంటే కేవలం సాయుధ పోరాటం మాత్రమే కాదు అంటూ అభిప్రాయపడ్డాడు.

సాధన రాసిన రాగో నవలకి బాలగోపాల్ ముందు మాట నుండే బాలగోపాల్ ఆలోచనల్లో అనూహ్యమైన మార్పు మొదలైంది అనుకోవచ్చు.

పౌరహక్కుల సంఘానికి అన్నీ తానై పెంచి పోషించిన బాలగోపాల్ "రాజ్యహింసతోపాటు ప్రైవేటు హింసనూ వ్యతిరేకించే క్రమంలో దానితో విభేదించి1996లో బయటికి వచ్చి మానవ హక్కుల వేదికను స్థాపించారు. అక్కడ నుండి ఆయన కార్యాచరణ మరింత విస్తృతమయింది. మార్క్సిజం నుండి ఆయన పక్కకు పోవడంపై రంగనాయకమ్మ రాసిన కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు అంటూ రాసిన పుస్తకం అప్పట్లో సంచలనానికి కారణమయింది. "ఆధిపత్య భావజాలం మానవ స్వభావంలోనే వుంది" అన్న ఆయన వ్యాఖ్య బాగా వివాదాస్పదమైంది.

బాలగోపాల్ విలక్షణ దృష్టికి మరొక దృష్టాంతాన్ని కూడా చెప్పుకోవచ్చు. కర్నాటక రాష్ట్రం ఆల్మట్టి ఎత్తు పెంచినందున కృష్ణా డెల్టా ఎడారిను మారిపోతుందంటూ తెలుగు మేధావులు, రాజకీయ నాయకులు పుంఖాను పుంఖాలుగా వ్యాసాలు రాస్తూ, ఉద్యమాలు చేస్తున్న సందర్భంలో ఆయన ఒక వ్యాసంలో ఆల్మట్టి ఎత్తు పెంపుదల వల్ల కర్నాటకలోని దుర్భిక్ష పీడిత ప్రాంతాలయిన బీజాపూర్, చదర్, గుల్బర్గా ప్రాంతాల ప్రజలు లాభపడతారు అంటూ ఆంధ్రజ్యోతిలో ఆయన రాసిన వ్యాసం కూడా వివాదాస్పదమయింది.

ప్రభాకరన్ మృతి తర్వాత శ్రీలంకలోని తమిళుల భవిష్యత్తు గురించి విశ్లేషణ చేస్తూ వచ్చిన అతి తక్కువ వ్యాసాలలో బాలగోపాల్ వ్యాసం కూడా ఒకటి.

మనిషి సహజంగా పుడతాడు. ఎంత సహజంగా పుడతామో అంతే సహజంగా జీవించాలి. అంతే సహజంగా మరణించాలన్న సూత్రాన్ని నమ్మి దాన్ని జీవితానికి అనుసంధానించి, ఆచరించి చూపిన అరుదైన వ్యక్తి బాలగోపాల్.

చరిత్ర, సంస్కృతి, సాహిత్యం పట్ల ఎంతో మక్కువ కలిగిన బాలగోపాల్ డి.డి. కోశాంబి లాంటి సామాజిక తత్త్వవేత్తలను తెలుగు పాఠకులకు సరళంగా పరిచయం చేస్తూ ఎన్నో విలువైన పుస్తకాలను రాశారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ఆయన రాసిన విషయాలు ఎంతో విలువైనవి.

బాలగోపాల్‌ను మార్క్స్ మోహపెట్టకపోతే ఆయన గణితశాస్త్రంలో మరో శ్రీనివాస రామానుజన్ అయ్యేవారని ఆయనను బాగా తెలిసిన సన్నిహిత మిత్రులంటారు. సాహిత్యంవైపు పూర్తిగా మొగ్గినట్లైతే గొప్ప సాహితీవేత్త అయ్యేవారు. కాని సామాజిక కార్యాచరణ ఆయనను రా, రమ్మని పిలిచినది.

రాయలసీమలో పుట్టి తెలంగాణ పల్లెలను ప్రేమగా కౌగిలించుకున్న బాలగోపాల్ ఈ రాష్ట్రంలో తిరగని పల్లె లేదు. నిజనిర్ధారణ కోసం చూడని ప్రదేశం లేదు.

కాలుష్యం, విద్య, వ్యాపారం, సెజ్‌లు, మానవహక్కులు ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా, ఏ విషయాన్ని తీసుకున్నా తనదైన కొత్తకోణాన్ని చూపేవారు. మన అభిప్రాయాలకు కొత్త కొత్త రూపాన్ని యిచ్చేవారు.

బాలగోపాల్ ఉపన్యాసాలని ఖమ్మంలో ఇంకా వింటున్నట్లే వుంది. బాలగోపాల్ లేరంటే నమ్మబుద్ధి కావడంలేదు. కాని వాస్తవం కల కాదుకదా!

ఈ రాష్ట్రంలో ఏ మారుమూల ఆయనకు ఎవ్వరూ ఒక విగ్రహం కూడా పెట్టకపోవచ్చు. కాని ప్రజలు, మరి ముఖ్యంగా పీడితుల గుండెల్లో ఆయన విగ్రహం ఎత్తు ఆరు కాదు అరవై అడుగులు.

తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీకి ముందు వెనుక అంతా శూన్యం అనడంలో కారణాలు నాకు తెలియదు కానీ బాలగోపాల్ కృషి చేసిన మానవ హక్కుల రంగంలో ఆయనకు ముందు అంతా శూన్యం. తరువాత ఏమో...

నిష్కామ కర్మయోగి బాలగోపాల్.

– వంశీకృష్ణ

# సాహిత్యంపై ఎంతో అనురక్తి

**బాలగోపాల్‌కు** మానవ హక్కులపై ఎంత అవగాహన ఉందో, సాహిత్యంపైనా అంత అవగాహన ఉండేది. సాహిత్యంపై రూపం-సారం అనే పుస్తకం రాశారు. తెలుగు సాహిత్యానికి ఆయన ఎంతో సేవ చేశారు. "సృజనాత్మక రచనల పేరుతో ఎందరో సృజన లేని రచనలు చేశారు. కానీ బాలగోపాల్ సృజనాత్మక రచనల్ని చదివి, వాటిని ఎలా అర్థం చేసుకోవాలనే సైద్ధాంతిక దృక్కోణాన్ని అందించారు. తెలుగు సాహిత్యానికీ ఇది ఆయన చేసిన గొప్ప సేవ" అంటారు ఆయనతో ఎంతో సన్నిహితంగా మెలిగిన సాహితీ వేత్త జయధీర్ తిరుమలరావు. సామెతలంటే బాలగోపాల్‌కు ఎంతో ఇష్టం. సామెత సమాజం నుంచి వస్తుంది. సామెతను సమాజంలోని వ్యక్తులు వాడుతుంటారు. రెంటి మధ్య అవినాభావ సంబంధం ఉందని ఆయన చెప్పేవారు. సామెతలపై ఆయన ఒక వ్యాసం రాయాలనుకున్నారు. ఇందుకోసం జయధీర్ తిరుమలరావు ఎనభైల్లోనే 200 సామెతల్ని సేకరించి ఆయనకు ఇచ్చారు. అయితే పోలీసుల దాడిలో అవి పోయాయి. "ఇటీవల రంజాన్ రోజు బాలగోపాల్‌తో చాలాసేపు గడిపే అవకాశం లభించింది. అప్పుడు మీరు సామెతలు ఇచ్చారు. నేను వ్యాసం రాయనే లేదు అని దాదాపు 20 ఏళ్ల తర్వాత బాలగోపాల్ గుర్తుచేశారు. ఇంకా చాలా టైముంది. మళ్లీ ఇస్తాను. రాద్దురుగానీ అన్నాను. ఇంతలో ఆయనే లేకుండా పోయారు" అని ఆవేదన చెందారు జయధీర్. "ఒకవేళ ఆయన

సాహిత్యం వైపు మళ్లితే గొప్ప సాహితీ వేత్త అయి ఉండేవారు" అని ఆయన అన్నారు. సాధన రాసిన రాగో నవలకు బాలగోపాలే ముందుమాట రాశారు. ఈ ముందుమాట నుంచే ఆయన విప్లవోద్యమాన్ని విమర్శనాత్మకంగా చూడడం మొదలైందంటారు. ప్రయాణాలు చేస్తూనే చదవడం, రాయడం బాలగోపాల్‌కున్న మరో అలవాటు. ఎక్కడికైనా వెళ్లినపుడు, దాని గురించి వెంటనే రాయాల్సి వస్తే, అది బస్టాండా, రైల్వే స్టేషనా అన్నది చూడకుండా రాసేసే వారు. ఆయనది సింగిల్ డ్రాఫ్ట్. రాసుకుంటూ పోవడమే.

*10 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# ఉద్యమ పరిధిని విస్తరించాడు

**రాజ్యం,** దాని స్వభావం వాటిలో ముడిపడిన మానవ ప్రవర్తన గురించి మిత్రులు బాలగోపాల్ నిశితంగా పరిశీలించి రచనలు చేసిన వ్యక్తి, ప్రజాస్వామిక హక్కులు అందరికీ సమన్యాయంగా వర్తించాలని, వాటి అమలులో నిరంతరం జరిగిన ఉల్లంఘనలను ఎత్తిచూపిన మేధావి. గత నాలుగు దశాబ్దాలుగా ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని నక్సల్ ఉద్యమ దశలను సన్నిహితంగా అధ్యయనం చేస్తూ పాల్గొంటూ వచ్చిన నేను, బాలగోపాల్ రాజకీయ–సామాజిక విశ్లేషణలను ఆసక్తిగా చదివి చర్చించే వాణ్ణి.

'తుపాకి పట్టుకున్న వాడికి పౌరహక్కులు' అనే ఒక అతివాద నినాదం, 1970 దశకంలోనే పౌరహక్కుల ఉద్యమాన్ని తప్పుదారి పట్టించి సంకుచితమైపోయిన దశలో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ' (ఓ.పి.డి.ఆర్) ఆచరణలోకి వచ్చింది. అతి సామాన్యుల హక్కుల నుంచి, విప్లవకారుల ప్రాథమిక హక్కుల కోసం పౌరహక్కులను ప్రజా ఉద్యమంగా విస్తరించాలని మొదటి నుంచి నమ్ముతూ వచ్చిన వాళ్లు ఆ తర్వాత బాలగోపాల్ 'మానవ హక్కుల వేదిక' ఆచరణలో మరిన్ని ఆశా రేఖల్ని చూశారు. నలభై సంవత్సరాల నక్సల్ ఉద్యమం హింసా మార్గాన్నే వ్యూహాలుగా ఎన్నుకున్నదని, రాజ్యం తీసుకునే అసమంజన నిర్ణయాలవైపు దృష్టి సారించలేదని, ఆ దిశలో వారి ప్రయత్నం సాగలేదని చెబుతూ బాలగోపాల్ ఇలా వ్యాఖ్యానిస్తారు. 'వారి వ్యూహాత్మక ఆలోచనలెప్పుడూ రాజ్యాన్ని రాజకీయంగా ఓడించే దిశగా కాకుండా, సాయుధ పోరాట కోణంలోనే సాగుతున్నాయి. రాజకీయ ఓటములు, అసమానతలు, విధ్వంసక అభివృద్ధి వంటి విషయాలకు వారి (నక్సల్) అజెండాలో ఎప్పుడూ చోటివ్వలేదు.

తన జీవిత కాలంలో ఒక రాజీపడని మేధావిగా, క్రియాశీలిగా, నిరాడంబరంగా తన శక్తి యుక్తులను ఆయన సార్థకం చేసుకున్నారు. ఏనాడూ సిద్ధాంతాన్ని పిడివాదంగా కాకుండా, హేతుబద్ధంగా-యథార్థ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించి రచనలు చేశారు. సాహిత్య పరమైన చర్చలలో వారితో విభేదించిన సందర్భాలున్నాయి. అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది' నవలలో వాడిన తెలంగాణ మాండలికం గురించి ఒక గోష్ఠి దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయంలో నా అధ్యక్షతన జరిగింది. ఆ గోష్ఠిలో ప్రధాన వక్తలు బాలగోపాల్, జయప్రభ, జనజీవన చిత్రణలో కథనానికి వీరోచిత భాషకు సంబంధించిన అంశాలపై ఆ రోజు ఆసక్తికరంగా చర్చ సాగింది.

వారు ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం కార్యదర్శిగా ఉన్నప్పుడు రెండు సందర్భాలలో ఆయన ఓపిడిఆర్‌కు అడగగానే వెంటవచ్చి సహాయమందించారు. కరీంనగర్ న్యాయవాది మిత్రులు పర్వతాలును డబ్బుకోసం నక్సల్స్ బెదిరించినప్పుడు, ఒక సోదర హక్కుల సంఘం పట్ల ఆయన తమ బాధ్యతను నెరవేర్చారు. యు.సి.సి.ఆర్.ఐ. (యమ్.ఎల్) కార్యకర్త విజయ్‌ను పోలీసులు రహస్యంగా నిర్బంధించి, విపరీతంగా చిత్రహింసలు పెట్టి ఆ తర్వాత మాకేమి తెలియదని బుకాయించినప్పుడు బాలగోపాల్ మాతో పాటు వచ్చి అదనపు పోలీస్ కమీషనర్‌ను (ఇతర అధికారులను) సూటిగా ప్రశ్నించిన సందర్భం మరొకటి.

వ్యక్తిగతంగా మితభాషి, ఎదురైనా పట్టించుకోని ఒక విధమైన అంతర్ముఖీన లక్షణం ఆయనది. తన అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా వ్యక్తం చేసేవాడు. 'ప్రజాతంత్ర' వార పత్రికలో ఆయన రెగ్యులర్ కాలమ్‌లో ప్రత్యేక తెలంగాణ వస్తే దళితులకు రాజ్యాధికారం అప్పగిస్తే మార్పు ఉండవచ్చుననే అంశాన్ని నేను ఫోనులో ప్రశ్నించినపుడు ఆయన స్పష్టీకరించారు.

ఆయన చివరి రచన కాబోలు 'దొడ్డి దారిన మరో విపత్తు' (ఈ నెల 7న ఆంధ్రజ్యోతిలో) చదివినప్పుడు ఈ దేశం క్రమంగా ఆర్థికంగా చితికిపోయే ప్రమాదాన్ని మనం అర్థం చేసుకుంటాము. వెంటనే తరిమెల నాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' (నలభై ఏళ్ల క్రితం చేసిన హెచ్చరిక) గుర్తుకు వస్తుంది.

**- నిఖిలేశ్వర్**

*11 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# సిద్ధాంతాలు గంతలు కాలేదు

**ఒక** మహా వ్యక్తి మరణించాడు. బాలగోపాల్ లాంటి వాళ్లు తెలుగుదేశంలోనే కాదు, భారతదేశంలో మరొకరు లేరు. మానవ స్వాతంత్ర్యం ఆయన దీక్ష అచంచల ధైర్యం ఆయన కవచం. సిద్ధాంతాలు ఆ మహానుభావుడి ఆలోచనకు పదును పెట్టాయే కాని ఆయన కళ్ళకు గంతలు కాలేదు. ఆయన తన అసమాన మేధాశక్తి తన కోసం వాడుకుని ఉంటే ఆయన ఏ రంగం ఎంచుకున్నా అందులో అంతర్జాతీయ కీర్తి వచ్చి ఉండేది. నిరాడంబర జీవితాన్ని స్వయంగా కోరుకుని ఉండక పోతే ఆయన పదవుల అందలాలు ఎక్కి సన్మానాల పల్లకీలలో ఊరేగి ఉండేవాడు. తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చెయ్యకుండా ఎక్కడ మానవ సమస్యలుంటే అక్కడికి వెళ్ళి అక్కడ బాధితుల కోసం కన్నీళ్ళు కార్చమని మనకి జాలి మాటలు చెప్పలేదు. మనుషులుగా వాళ్ళ హక్కులు రక్షించబడాలని పోరాడాడు ఆయన. ఆలోచనల్లో స్పష్టత, బుద్ధి నైశిత్యం ఆయన తెలుగులో ఒక కొత్తరకం పదునైన వచనాన్ని రాసేలా చేశాయి. ఆయన్ని మహా రచయితని చేసింది ఆయన ఆలోచనా శక్తే, అంత అసాధారణమైన మేధాశక్తి, అంత నేలబారుగా మట్టి మనుషులతో, వాళ్ళ హక్కుల కోసం నిలబడే కర్తవ్య శక్తి ఒక్క మనిషిలో ఉండడం చరిత్రలో అరుదైన సన్నివేశం.

మేధావులు నేల మీద నడువరు, నేల మీద పనిచేసే వాళ్ళు మేధావులు కారు. అనుకోడం రివాజైన ఈ సమాజంలో ఈ మహా మేధావి తనకి వేరే గుర్తింపు అక్కరలేకుండా మామూలు మనుషుల్లో కలిసిపోయి పనిచేసేడు. అంత చిన్న వయస్సులో అంత అకస్మాత్తుగా అలాటి అసమాన్యమైన సామాన్య వ్యక్తి మన మధ్య నుంచి అదృశ్యం కావడం ఒక్కసారి ఆకాశంలో రోజూ అలవాటైన సూర్యుడు లేకుండా పోయినట్టుంది పట్టపగలే చీకటైపోయినట్టుంది.

**– వెల్చేరు నారాయణరావు**

*11 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# పల్లె పల్లెన రైతన్నకు అండ

**ప్రశ్నించే** గొంతు మూగబోయింది..మానవ హక్కుల్ని ప్రజల వద్దకు చేర్చిన నేత మన మధ్య లేరు... లక్షలాది పీడితుల గుండెల్లో నిల్చిన మానవతా వాది గుండె ఆగిపోయింది.

బాలగోపాల్ సార్‌తో నాకు రెండు దశాబ్దాల పరిచయముంది. గురువారం రాత్రి 11.30 గంటలకు హైదరాబాద్‌లో హఠాన్మరణం చెందారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. రాత్రంతా నిద్ర పట్టలేదు. సార్‌ను హైదరాబాద్ నుంచి మెదక్ జిల్లాలో అనేక సదస్సులు, సెమినార్లకు తీసుకొచ్చిన గుర్తులు, వారితో ప్రయాణాలు...నా మది నిండా అవే ఆలోచనలు.

2000 సంవత్సరంలో మెదక్ జిల్లాలో మానవ హక్కుల ఉద్యమం మొదలయ్యాక బాలగోపాల్ సార్‌తో సాన్నిహిత్యం పెరిగింది.ముఖ్యంగా మెదక్ జిల్లాలో ఎక్కడైతే హక్కుల ఉల్లంఘన జరిగిందో అక్కడ బాలగోపాల్ సార్ ప్రత్యక్షమయ్యేవారు. 2003 సంవత్సరంలో కరువుతో అల్లాడుతున్న మెదక్ జిల్లాలోని అనేక గ్రామాలలో వారు స్వయంగా బాధితులను పరామర్శించారు. కరువుకు మూలంగా రైతుల ఆకలి చావులు, ఆత్మహత్యలు ఎక్కువగా జరిగిన మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక ప్రాంతాల్లో వారు మాతోపాటే సైకిల్ మోటార్‌పై వచ్చారు. ప్రతి గ్రామంలో చాయ తప్ప మరేమి తీసుకునే వారు కాదు. వారు తిండికి ప్రాధన్యం ఇచ్చేవారే కాదు. బాధితులను స్వయంగా కలిసి వారి కష్టాలను, సమస్యలను క్రోడీకరించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చేవారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు జి.ఒ. 420 ద్వారా వచ్చే నష్టపరిహారం

అందే విధంగా ప్రాతినిధ్యం చేసేవారు. చాలా మంది బాధిత రైతులు వారి ప్రాతినిధ్యం వల్ల ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుకున్నారు. సమస్యను తెలుసుకోవడం, పరిష్కారానికి మార్గాన్ని అన్వేషించడం బాధితులకు న్యాయం చేకూర్చడంలో వారు చేసిన కృషికి నిబద్ధత అసమానం.

బాలగోపాల్ సార్ 2005 సంవత్సరంలో నారాయణ్ ఖేడ్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆ ప్రాంతంలోని ఒక గ్రామంలో దళిత విద్యార్థి దేవాలయంలో పూజలు చేసినందుకు పెత్తందారులు ఆ విద్యార్థిని తీవ్రంగా కొట్టారు. అప్పుడు సార్ ఆ విద్యార్థి పక్షాన నిలబడి న్యాయం అందించారు. 2006 సంవత్సరంలో దుబ్బాక ప్రాంతంలో చేనేత కార్మికుల ఆకలి మరణాలు, ఆత్మహత్యలపై చలించి ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ మరణాలకు కారణాలను వెదకి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళారు. 2007లో మెదక్ జిల్లాలో కరెంటు షాక్‌కు గురై మరణించిన వారి కుటుంబాలను కలుసుకోవడం కోసం తొగుంట తదితర మండలాల్లో పర్యటించి బాధితుల వివరాలను, పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తెచ్చి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేశారు.

పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ధాన్యాన్ని మార్కెట్ యార్డులలో, ఐకెపి కేంద్రాల్లో కొనుగోలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల రైతులు సిద్ధిపేట ప్రాంతంలో పెద్ద ఎత్తువ ఆందోళనకు దిగారు. ఈ విషయాన్ని తెలుసుకుని బాలగోపాల్ సార్ మే 21న సిద్ధిపేటకు వస్తానని సమాచారం అందించారు. సార్ ఉదయం తొమ్మిది గంటలకే సిద్ధిపేట చేరుకున్నారు. మేము వారి గురించి బస్టాండ్, హోటళ్ళన్నీ చూస్తే ఎక్కడా కనిపించలేదు. కొంత ఆందోళనకు గురయ్యాం. చివరకు వారు ఓ ఫుట్‌పాత్ మీద కూర్చుని పేపర్ చదువుతూ కనిపించారు. అప్పుడు సార్‌ను చూసి మేము ఆశ్చర్యపోయాము. 'ఇంత ఆలస్యమా? ఉదయమే వెళితే మార్కెట్ యార్డులలో రైతులతో నేరుగా మాట్లాడవచ్చు. ఆటో మాట్లాడండి వెళదాం' అన్నారు. ట్రాలీ ఆటోలో సార్‌తో పాటు తొమ్మిది మంది కార్యకర్తలము సిద్ధిపేట, రామంచ, నారాయణరావు పేట, దుబ్బాక, మిర్దొడ్డి మార్కెట్ యార్డులు, ఐకెపి కేంద్రాలను సందర్శించాము. ప్రతి చోట వారు రైతులతో నేరుగా మాట్లాడుతూ వివరాలు డైరీలో రాసుకున్నారు. మార్కెట్ యార్డు అధికారులతో, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి, ధాన్యాన్ని ఖచ్చితంగా కొనాలనీ, గోదాముల్లోకి వెళ్ళే వరకు రైతులది బాధ్యత

కాదని ఖరాఖండిగా చెప్పారు. కొనుగోలు త్వరగా చేయక పోవడం వల్ల అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి కొనే విధంగా జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి అధికారులకు చెప్పించారు.

రాష్ట్రంలో వారు చేపట్టని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచీకరణకు వ్యతిరేకంగా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, సెజ్‌లకు, ఓపెన్‌కాస్ట్‌కు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. చాలా మంది సిద్ధాంతాలు వల్లిస్తారే తప్ప ఆచరించరు. బాలగోపాల్ సార్ ఏదైతే చెబుతుండే వారో అదే చేశారు. చేసేది చెప్పే గొప్ప నిబద్ధత గల మేధావి, నిరాడంబరుడు ఆయన. బాలగోపాల్ ఆశయాలను ముందుకు తీసుకుపోవడం మనందరి బాధ్యత.

**– జి. తిరుపతి రెడ్డి**

*వ్యాసకర్త ఎసిటిఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు*

*11 అక్టోబర్, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# అక్షరాలా తీరని లోటు

**'ఆయన లేని లోటు పూడ్చలేనిది'** అనే మాట ఎన్నోసార్లు విని విని అరిగిపోయింది గాని ఆ మాట అక్షరాలా వర్తించే, సంపూర్ణంగా నిజమయ్యే మనిషి కె. బాలగోపాల్ (1952-2009). నిజంగా తెలుగు సమాజానికీ, ప్రజాఉద్యమాలకూ, ప్రజల హక్కుల పరిరక్షణకూ, తెలుగునాట మేధోకృషికీ ఆయన మరణం తీరని లోటు. ప్రజల సమస్యలను ఆయన పట్టించుకున్నంత తీవ్రంగా పట్టించుకునే, ఆయన ఆలోచించినంత సమగ్రంగా ఆలోచించే, ఆయన పనిచేసినంత సమర్థంగా పనిచేసే మనుషులు తయారు కావడానికి ఎంతకాలం పడుతుందో చెప్పలేము. తెలుగు సమాజం మాత్రమే కాదు యావత్ దేశమే ఒక ఆత్మీయ మిత్రుడిని, హక్కులకోసం ఎలుగెత్తే గొంతును కోల్పోయింది. అటుచివర కాశ్మీర్ నుంచి మరొకచివర ఈశాన్య ప్రాంత ఉద్యమకారులనుంచి, ఛత్తీస్‌ఘర్ ఆదివాసులు, గుజరాత్ మైనారిటీలు, కంధమాల్ క్రైస్తవులు, మత్స్యకారులు, ప్రత్యేక ఆర్థిక మండలాల నిర్వాసితులు, దేశవ్యాప్తంగా అభివృద్ధి పథకాల నిర్వాసితులు, ప్రపంచీకరణ విధానాల బాధితులు, రాష్ట్రంలోని అన్ని ప్రజాఉద్యమాల కార్యకర్తలు, విప్లవోద్యమ కార్యకర్తలు, దళితులు, ఆదివాసులు, మహిళలు, మైనారిటీలు - ఆయన స్పృశించని బాధిత సమూహం లేదు. ఆయన పట్టించుకోని జీవన సమస్య లేదు.

ఇరవై ఐదు సంవత్సరాలకింద వరంగల్‌లో పనిచేస్తుండిన ఒక పోలీసు అధికారి ఇలస్ట్రేటెడ్ వీక్లీలో ఉత్తరం రాస్తూ బాలగోపాల్ గురించి 'ఎక్కడ శవం కనబడితే అక్కడ వాలే రాబందు' అని వ్యాఖ్యానించాడు. (ఇప్పుడు అదే పోలీసు అధికారి ఆయనను

ప్రశంసిస్తూ మాట్లాడుతున్నాడు). ఆమాటలో ఉన్న కసినీ, దూషణనూ పట్టించుకోనక్కరలేదు. కాని నిజంగానే బాలగోపాల్ 'బ్రతుకును ప్రచండ భేరుండ గరుత్పరిరంభంలో పట్టిన గానం' లాంటి సమగ్రవ్యక్తి. బతుకులోని సమస్త విషయాలనూ ఆయన పట్టించుకున్నారు. నిజంగానే గండభేరుండ దృష్టితో విహంగ వీక్షణ చేసి తన పరిధిలోకి రాని విషయంలేదని రుజువు చేసుకున్నారు. ప్రజాసమస్యల పరిశీలనకూ, ప్రజల హక్కుల రక్షణకూ ఎంత తీక్షణ, అత్యంత నిశిత దృష్టి అవసరమో ప్రదర్శించి చూపారు.

యాభైఏడు సంవత్సరాల జీవితంలో, తొలి ఇరవై ఐదు సంవత్సరాలు చదువుకు పోయినా, మిగిలిన ముప్పై సంవత్సరాలకు పైగా ఆయన సాధించిన విస్తృతి, సాగించిన కృషి చూస్తే ఒక మనిషి, ఇంత జీవితకాలంలోనే ఇన్ని సాధించగలరా అని ఆశ్చర్యం వేస్తుంది. నిజానికి ఆ చదువు కూడ ఆయన ఎంత అసాధారణ ప్రతిభతో సాగించారంటే, 1981లో ఆయన కాకతీయ విశ్వవిద్యాలయంలో గణిత శాస్త్రంలో లెక్చరర్ పదవికి ఇటర్వ్యూకు హాజరయినప్పుడు, ప్రొఫెసర్లకు కూడ లేని అర్హతలు ఆయనకు ఉన్నాయని ఇంటర్వ్యూ కమిటీ అభిప్రాయపడిందని చెప్పుకునేవారు. అప్పటికే ఆయన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసి, రీజినల్ ఇంజనీరింగ్ కాలేజిలో గణితశాస్త్రంలో ఎం ఎస్ సి (1974), అక్కడే స్టాటిస్టిక్స్ లో పి ఎచ్ డి (1977) చేసి, ఢిల్లీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ లో పోస్ట్ డాక్టొరల్ రిసర్చ్ చేస్తూ 1980లో వదిలేసి వచ్చారు. స్టాటిస్టిక్స్‌కు చెందిన అంతర్జాతీయ ప్రామాణిక పత్రికలలో పరిశోధనా పత్రాలు రాశారు. అమెరికన్ మాథమాటికల్ సొసైటీ పత్రికకు సమీక్షాసంపాదకుల బృందంలో ఉన్నారు. మూడు పదులు నిండకుండానే ఆయన ఇటు గణితశాస్త్రంలో అపారమైన ప్రజ్ఞ మాత్రమే కాక, క్రికెట్, సంగీతం, సినిమాలు, సాహిత్యం వంటి విభిన్నమైన, వైవిధ్యభరితమైన ఆసక్తులలో కేవలం ప్రవేశమే కాదు, ప్రావీణ్యం సంపాదించి ఉన్నారు. అప్పటికే మార్క్సిస్టు ప్రామాణిక గ్రంథాలు చదివి మార్క్సిజాన్ని ఒక శాస్త్రంగానూ, ప్రజాసమస్యల పరిష్కారమార్గం గానూ నమ్ముతున్నారు. ఆయనే 1987లో జెంటిల్‌మన్ పత్రిక ఇంటర్వ్యూలో చెప్పినట్టు, ఆర్ ఇ సి లో పి ఎచ్ డి చేస్తున్న కాలంలో అమరుడు సూరపనేని జనార్దన్ వంటి రాడికల్ విద్యార్థుల కార్యక్రమాలు, వరంగల్ ప్రజాచైతన్యం,

ఎమర్జెన్సీ నిర్బంధం చూస్తూ, అసలు వీళ్లు చెప్పే మార్క్సిజం ఏమిటో తెలుసుకోవాలని కాపిటల్ చదివేశారు.

1981 మార్చిలో కాకతీయ విశ్వవిద్యాలయ గణిత శాఖలో లెక్చరర్‌గా చేరి, అప్పటినుంచే సృజన సాహితీమిత్రులలోనూ, పౌరహక్కుల సంఘంలోనూ పనిచేయడం మొదలుపెట్టారు. 1983లో పౌరహక్కులసంఘం ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1980 నుంచీ కూడ ఆయన వరంగల్ సామాజిక జీవితంలో అతి ముఖ్యమైన వ్యక్తిగా, ఎందరికో తలలో నాలుకలా, మిత్రుడిగా, ఆత్మీయుడిగా, పెద్దదిక్కుగా ఎదిగారు. ఆ రోజుల్లో ఆయన సహాయం పొందని వరంగల్ ప్రజా ఉద్యమ కార్యకర్తలు ఒక్కరు కూడ లేరంటే అతిశయోక్తి కాదు. ప్రతి రాడికల్ విద్యార్థి యువజన కార్యకర్తకూ ఆయన తమకు రక్షణగా ఉన్నాడనే భరోసా ఉండేది. జిల్లాలో అప్పుడు విస్తరిస్తున్న రైతాంగ ఉద్యమం ఆయనను తన మిత్రుడిగా, మార్గదర్శిగా, ప్రచారకుడిగా ఆత్మీయంగా తీసుకుంది. అందుకే పాలకవర్గాలకు, పోలీసులకు ఆయన పేరే కంటగింపయింది. 1985లో పోలీసు ఇనస్పెక్టర్ యాదగిరిరెడ్డి శవయాత్ర డా. రామనాథం ఆస్పత్రి మీదుగా వెళ్లడంతో డాక్టరుగారి హత్య జరిగిందిగాని, ఆ ఊరేగింపులో 'బాలగోపాల్‌ను చంపుతాం' అని పోలీసులు నినాదాలు ఇచ్చారు. అప్పటికాయన హనుమకొండలో రాగన్నదర్వాజలోని ఒక చిన్న గదిలో ఉంటున్నారు. ఇక వరంగల్ లో ఉండలేని పరిస్థితి వచ్చాక నాలుగైదేళ్లపాటు పేరుకు హైదరాబాదులో గది ఉన్నా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి, ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా, పోలీసు అత్యాచారాలు జరిగినా అక్కడికి వెళ్లేవారు. తర్వాత హైదరాబాదులో స్థిర నివాసం ఏర్పడి, న్యాయవాదవృత్తి మొదలుపెట్టినా ప్రతి శని ఆదివారాలు ఎక్కడికో ఒకచోటికి వెళ్ళి ప్రజాసమస్యల అధ్యయనాలు, హక్కుల ఉల్లంఘనల నిర్ధారణలు, సమావేశాలు నిర్వహిస్తూ వచ్చారు. మార్క్సిస్టు దృక్పథం నుంచి దూరమయ్యానని తానే రాసినా, పౌరహక్కుల సంఘంలో చర్చ ఫలితంగా మానవహక్కుల వేదిక ఏర్పాటు చేసినా ఆయన తనకోసం తాను నిర్వచించుకున్న పనిని, సమాజమూ కాలమూ తన నుంచి ఆశించిన పనిని ఎన్నడూ వదిలిపెట్టలేదు.

బహుముఖ ప్రజ్ఞ, విస్తారమైన అధ్యయనం, నిరంతరమైన పని, అత్యంత నిరాడంబరమైన జీవనశైలి నిండిన బాలగోపాల్ ఆలోచనలనుంచీ, రచనల నుంచీ,

ఆచరణనుంచీ, పని విధానం నుంచీ నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. బహుశా తెలుగు సామాజిక కార్యకర్తలలో ఆయన మొదటిసారి ప్రారంభించిన సంప్రదాయాలూ ఉన్నాయి. తెలుగులో ప్రజాఉద్యమాలు, ఉద్యమకారులు రచనలు, ఉపన్యాసాలు చాలవరకు ఆలంకారిక శైలిలో, ఉత్తేజపరిచే లక్ష్యంతో ఉండడమే ఎక్కువ అలవాటు. కాని ప్రజాఉద్యమాల ఆలోచనలు విషయ పరిజ్ఞానంతో, వాదనాపటిమతో, విశ్లేషణా శక్తితో, ఇతరులను, ముఖ్యంగా ఆ సమస్య గురించి అవగాహనలేని వాళ్లను ఒప్పించగల నేర్పుతో ఉండాలనేది ప్రధానంగా బాలగోపాల్ ఇచ్చిన కానుకే. విశాల ప్రజాసమస్యలపట్ల అధ్యయనం లేకుండా, ఊకదంపుడు మాట్లాడగూడదని, ఆ సమస్యలను స్థూలస్థాయిలో మాత్రమే కాక, సూక్ష్మస్థాయిలో అధ్యయనం చేయాలనీ ఆయన తన ఆచరణ ద్వారా చెప్పారు. సాధారణంగా ప్రజా ఉద్యమాలు తమవాళ్లనే ఉద్దేశించి మాట్లాడుతూ, ఇదివరకే పరివర్తన పొందినవారిని పరివర్తన చెందించడానికి ప్రయత్నిస్తుండగా, ఆయన కొత్తవారినీ, తటస్థులనూ ఆకట్టుకోవడానికి ప్రయత్నించి విజయం సాధించారు.

ఇలా కొత్తవారిని ఆకర్షించడం అనేది కేవలం సంఖ్యా బలాన్ని పెంచడానికి మాత్రమే కాదు, అసలు అవగాహనలోనే ప్రజాఉద్యమం అనేది అత్యంత సూక్ష్మమైన సమస్యలను కూడ పట్టించుకుని, ఆ చిన్న చిన్న పోరాటాలను కూడ ఏకం చేసి విశాల మహాప్రవాహం కావాలని ఆయన విశ్వసించారు. అందువల్లనే ఆయన కృషి పౌరహక్కుల ఉద్యమ పరిధిని విస్తృతం చేయడం దిశగా సాగింది. కేవలం రాజ్య హింస, రాజ్యాంగ బద్ధమైన హక్కుల పరిరక్షణ మాత్రమే కాక, అన్ని ఆధిపత్య శక్తులు సాగించే హక్కుల ఉల్లంఘనలమీద మాట్లాడాలని ఆయన పరిధిని విస్తృతపరచడం మొదలుపెట్టారు. అలా పౌరహక్కుల ఉద్యమం 1980లలో అనేక కొత్త సమూహాలలోకి, సమస్యలలోకి, ప్రాంతాలలోకి విస్తరించింది. ఆ వాదనను ఆయన ప్రజాఉద్యమ నిర్మాణాలు కూడ ఆధిపత్య శక్తులు కాగలవనే వాదనలోకి, వారి ఉల్లంఘనలను కూడ ఖండించాలనే దగ్గరికి తీసుకుపోయారుగాని, ప్రజల సమస్యలపై ఉద్యమాలను మాత్రం సంపూర్ణంగా సమర్థిస్తూనే వచ్చారు.

పౌరహక్కుల ఉద్యమంతోపాటు సాహిత్య విమర్శ, చరిత్ర, తత్వశాస్త్రం, విజ్ఞానశాస్త్రాలు, సమకాలీన రాజకీయార్థిక పరిణామాలు, మొదలయిన ఎన్నో

విషయాలమీద ఆయన సాగించిన రచనలు, అద్భుతమైన సమాచార, విశ్లేషణా సంపదతో నిండిన వక్తృత్వం, పదునైన వ్యంగ్యం వంటి అపారమైన కృషి ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే మేధావి – కార్యకర్త అనేవి ఒకదానికొకటి సంబంధంలేని ద్వంద్వాలనీ, మేధావి అనిపేరు వచ్చినవారు పనిచేయరనీ, కార్యకర్తలు మేధోకృషి సాగించలేరనీ ఉన్న దురభిప్రాయాన్ని ఆయన తన జీవితాచరణతో రద్దుచేశారు.

1980లో ఆర్ ఇ సి క్వార్టర్స్‌లో మిత్రుడి ఇంట్లో ఉంటూ ట్యూషన్లు చెప్పుకుంటూ ఉండిన రోజుల నుంచీ 30 సంవత్సరాల అనుబంధంలో లెక్కలేనన్ని అనుభవాలు. ఆయన వ్యక్తిగతంగా నాకు గురువు, మిత్రుడు, మార్గదర్శి, జీవనదాత. 1988 మార్చ్‌లో నేను రోడ్డు ప్రమాదానికి గురయి చావుబతుకుల మధ్య ఉండినపుడు, పోలీసులు చేర్చిన ఆస్పత్రిలోనే ఉంటే బహుశా చచ్చిపోయి ఉండేవాడినే. అక్కడ వైద్యం సరిగాలేదని, వాళ్లతో పోట్లాడి, 'ఏమైనా చేసుకోండి' అని నన్ను భుజాన వేసుకుని మరో ఆస్పత్రికి చేర్చి నన్ను బతికించినది బాలగోపాలే. అంతకు రెండు సంవత్సరాల ముందు నాజీవితంలో ఒక ముఖ్యమైన మార్పు ఆయనతో చర్చించి తీసుకున్న నిర్ణయమే. ఆయన అభిప్రాయాలతో తీవ్రమైన విభేదం వచ్చినప్పుడు ఆయనను విమర్శిస్తూ పుస్తకమే రాసినప్పటికీ ఆయన అపారమేధోశక్తిముందు, ఆయన అకుంఠితదీక్షముందు, అవిశ్రాంతమైన ఆయన పనిముందు ఎప్పుడూ వినమ్రుడినై ఉన్నాను. అక్టోబర్ 9 సాయంకాలం పంజగుట్ట శ్మశానవాటికలో కట్టెలపరుపుమీద ఆయన చేతిని ఆఖరిసారి ముట్టుకుని ఆ వినమ్రత ప్రకటించాను.

ఆయననుంచి నేర్చుకుని, ఆచరణలో పెట్టినప్పుడే ఆయనలేని లోటు కొంతయినా తీరుతుంది.

**– ఎన్ వేణుగోపాల్**

# బాలగోపాల్ ప్రజాజీవిత ప్రారంభం - వరంగల్లు (1979-95)

**వరంగల్** బాలగోపాల్‌ను తీర్చిదిద్దిందా, బాలగోపాల్ వరంగల్‌ను కంటికి రెప్పలా చూసుకున్నాడా. ఇపుడయితే కాశ్మీర్, మణిపూర్, ఛత్తీస్‌ఘర్ మొదలు దేశమే ఆయన తమను ఆదుకోవడానికి ప్రాణాలు పణంగా పెట్టాడని ఆక్రోశిస్తున్నాయి. ఊరు అనంతపురం. పుట్టింది బళ్లారి. ఇంటర్‌మీడియెట్ ఎం.జె. మాణిక్యరావు గణితశాస్త్ర విద్యార్థిగా కావలి. డిగ్రీ ఎస్.వి. యూనివర్సిటీ, తిరుపతి. ఇవన్నీ తండ్రి ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ అధికారిగా ఏ ఊరు పోతే ఆ ఊరువాడు కావడం వల్ల.

గణితశాస్త్రంలో ఎం.ఎస్.సి., పిఎచ్.డి.లు మాత్రం వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో. ఇది ఆయన జీవితంలో యవ్వనకాలం. దేశం శిశిర వసంతాలు చవిచూసిన కాలం. అప్పటికి వరంగల్ అటు శ్రీకాకుళ ఉద్యమ ప్రభావంలోను, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ ప్రభావంలోను ఒక మహత్తరమైన విప్లవ సంప్రదాయాన్ని నెలకొల్పి ఉన్నది. 1970లో ఏర్పడిన విప్లవ రచయితల సంఘం, సంఘంగా కాకున్నా సంఘటితంగా ఏర్పడిన విద్యార్థి ఉద్యమం విస్తరిస్తున్న కాలం. బాలగోపాల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజి లైబ్రరీలో గణితశాస్త్రంతోపాటు డి.డి. కోశాంబిని చదువుతూ క్యాంపస్‌లో సూరపనేని జనార్దన్ నాయకత్వంలో నిర్మాణమవుతున్న విప్లవ విద్యార్థి ఉద్యమాన్ని దగ్గరగా చూస్తున్నాడు. జనార్దన్ నిర్మించే విద్యార్థి ఉద్యమం అంటే అది విద్యార్థులకే పరిమితమైంది కాదు. కాలేజీలో మెస్ వర్కర్లు, కాలేజీ వెనుక దర్గా దగ్గర

ఊళ్లలో వ్యవసాయ కూలీలు, కాలేజీ ముందర రిక్షావాళ్లు, నాలుగడుగులు వేస్తే కాజీపేట రైల్వే వర్కర్లు ఆ ఉద్యమంలో భాగం. బాలగోపాల్ పరిణతి చెందుతున్న యవ్వనం తన అధ్యయన, పరిశీలనలతో ఇందుకు సాక్షీభూతమయిన మానసిక భాగస్వామ్యాన్ని ఎంచుకున్నది.

ఆ తర్వాత కాలంలో ఆయన ఒకసారి అన్నాడు – కోశాంబి అధ్యయనం, జనార్ధన్ ఆచరణ నన్ను ప్రభావితం చేసినవి అని. ఆయన అటువంటి క్రియాశీలబుద్ధి జీవి అయ్యాడు. ఆ నిరాడంబరత్వమూ ఆయన జనార్ధన్ నుంచే పుణికిపుచ్చుకున్నాడు. ఆ విలువల వల్లనే ఢిల్లీకి పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ చేయడానికి వెళ్లినవాడు గైడ్‌తో సరిపడక వరంగల్‌కే తిరిగివచ్చి ఆర్.ఇ.సి. క్యాంపస్ ఎదురుగా ఉన్న స్టాఫ్ క్వార్టర్స్‌లో ఒక మిత్రుని ఇంట్లో ట్యూషన్లు చెపుతూ కొంతకాలం గడిపాడు. అప్పటికి ఎమర్జెన్సీ ఎత్తివేయడమే కాదు వరంగల్ నగర ఉద్యమం, అడవి ఉద్యమం మైదాన ప్రాంతాలకు విస్తరించి వెల్లువెత్తుతున్నది. ఇటు నగరంలో విద్యార్థులకు, బుద్ధిజీవులకు, అటు అడవిలో ఆదివాసులకు చెందిన ఉద్యమం గ్రామీణ వ్యవసాయ కూలీ, భూమి లేని నిరుపేదల ఉద్యమంగా కూడా మారింది. ఈ ఉద్యమాలకు జన్నుచిన్నాలు, మామిడాల హరిభూషణ్, దారా చుక్కయ్య వంటి దళిత కుటుంబాలలో పుట్టిన యువకుల నాయకత్వం లభించింది. వీళ్లలో జన్నుచిన్నాలు కాకతీయ మెడికల్ కాలేజీలో మెస్ వర్కర్. తలిదండ్రులు పైడిపల్లిలో వ్యవసాయ కూలీలు. అన్న పోచమ్మ మైదానం దగ్గర రిక్షా తొక్కేవాడు. ఈ జీవితాలను, ఈ ఉద్యమాలను బాలగోపాల్ దగ్గరగా చూసాడు.

1979 అక్టోబర్ దీపావళి రోజు జన్నుచిన్నాలు హత్య జరిగింది. మనం పాలకవర్గం, రాజ్యం అనే మాటలు వాడుతామే. ఆయనను చంపిన వాళ్లలో అందులో భాగస్వాములైన వాళ్లు అందరూ ఉన్నారు. ఆ తర్వాత వరంగల్ జిల్లాలో రాడికల్ ఉద్యమంపై మొట్టమొదటి వ్యాసం ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి పంపించిన బాలగోపాల్ అందులో ఈ విషయమే చెప్పాడు. నాకాయనతో పరిచయం కూడా ఇదే సందర్భం. చిన్నాలు హత్య జరిగిన రెండు మూడు రోజులకు బాలగోపాల్ కుమార్‌పెల్లిలో ఉన్న మా ఇంటికి వచ్చి పరిచయం చేసుకున్నాడు. తనకు రాడికల్స్ కరపత్రాలు కావాలని అడిగాడు. ముఖ్యంగా నర్సంపేట, నల్లబెల్లి ప్రాంతాల్లో వ్యవసాయ

కూలీలు, భూమిలేని నిరుపేదలు రాడికల్స్ నాయకత్వంలో చేస్తున్న పోరాటాలకు సంబంధించిన కరపత్రాలు కావాలన్నాడు. ఇచ్చాను. దూరంగా ఉండేవాళ్లకు, రెండు ఎర్రజెండాల మధ్యన ఘర్షణగా కనిపించేది నిజానికి కొత్తగా ఏర్పడుతున్న ధనికవర్గానికి, పై మెట్టుకు ఎగబాకుతున్న మధ్యవర్గానికి, భూమిలేని నిరుపేద దళితులకు మధ్యన ఇది వర్గపోరాటమని ఆయన విశ్లేషించాడు. ఆ వ్యాసం ఇ.పి.డబ్ల్యు. వేయలేదు కానీ ఆ తర్వాత కాలంలో ఆయనతో ఆ పత్రిక అడిగి కాలమ్ రాయించుకోవడానికి ఆ వ్యాసంలోని దృష్టి తప్పకుండా కారణమై ఉంటుంది. ఆనాటి నుంచి డాక్టర్ రామనాథం గారి హత్య వరకు ఆరేళ్లు – మళ్లీ ఆయన మాటల్లోనే చెప్తాను. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ కోసం డి.డి. కోశాంబి పరిచయం చేస్తూ ఆయన రాసిన పుస్తకాన్ని జైల్లో ఉన్న నాకు పంపుతూ – వరంగల్‌లో ఉన్నంత కాలం చరిత్ర నిర్మాణంలో పాల్గొన్నాం. ఇపుడింక చరిత్ర చదవండి – అనే అర్థం వచ్చే మాటలు రాసాడు.

చిన్నాలు పై వ్యాసం రాసిన కొద్దిరోజులకే వచ్చి విరసంలో చేరుతానన్నాడు. ఆయన 'ఫ్రాంటియర్'లో మా భూమి – శంకరాభరణం సినిమాలను పోలుస్తూ ఒక చిన్న లేఖ రాసి ఉన్నాడు. విరసంలో చేరడానికి కనీసం రెండు రచనలు చేయాలనే నియమం ఉంటుందని తెలుసేమో – ఆర్.ఎస్. సుదర్శనం – త్రిపురనేని మధుసూదన రావు మార్క్సిజం – సాహిత్యం చర్చలో భాగంగా ప్రామాణిక విమర్శ అనదగిన వ్యాసం రాసుకొని వచ్చాడు. విరసంలో చేరాడు. సృజన 'సాహితీ మిత్రులు'లో చేరాడు. 1980 నుంచి 92 దాకా సృజనను అత్యంత ప్రభావితం చేసిన ఒకరిద్దరిలో ఆయన ఒకడు. ప్రాథమిక సభ్యత్వాన్ని మించి ఏ పదవి చేపట్టకపోయినా 1992 వరకు బాలగోపాల్ ప్రసంగం లేని విరసం సాహిత్య పాఠశాల లేదు. మహాసభ లేదు.

విరసంలో చేరిన కొద్ది రోజులకే వచ్చి, ఎపిసిఎల్‌సిలో కూడా చేరుతానన్నాడు. వరంగల్ కోటలో జరిగిన ఒక సభలో మాట్లాడుతానన్నాడు. ఇంకా ఉద్యోగం లేదు. కాకతీయ యూనివర్సిటీకి అప్లై చేసి ఉన్నాడు. సభ్యత్వాలే కాకుండా వేదిక లెక్కి ఉపన్యాసాలిస్తే ఉద్యోగం రాదేమోనని మా ఆందోళన. ఆయన మనసులో పడితే ఇంక వెనక్కి తిరిగి చూడడని అప్పుడే అనిపించింది. ఇంటర్వ్యూ అయి లెక్చరర్‌గా సెలెక్ట్ అయ్యాక అప్పుడు రిజిస్ట్రార్‌గా ఉన్న జయశంకర్ చెప్తే తెలిసింది. సెలెక్షన్ కమిటీలో ఉన్న ప్రొఫెసర్ కోటేశ్వరరావు అడిగాడట – అంతర్జాతీయ గణితశాస్త్ర

జర్నల్స్‌లో ఇన్ని రచనలు అచ్చయ్యాయి కదా – రీడర్‌గా ఎందుకు అప్లై చేయలేదు – అని. అంటే జయశంకర్ గుర్తు చేసాడట – ఆయనకు అసలు గుర్తించబడిన సంస్థల్లో టీచింగ్ అనుభవానికి సంబంధించిన సర్టిఫికేట్ లేకపోవడం కారణమని. నిజానికి బాలగోపాల్ మనసులో కారణం అది కాదు – ఆయనకు కేవలం జీవిక కోసం ఉద్యోగం కావాలి అంతే. సరిగ్గా ఐదేళ్ల అనుభవం వచ్చాక కొలీగ్స్ అందరూ ఎంత బలవంతం చేసినా రీడర్ ఉద్యోగానికి అప్లై చేయకపోవడమే కాదు, 1986లో ఆ ఉద్యోగానికి రాజీనామా కూడా చేసాడు. ఆయన ఢిల్లీలో ఉండగా అంతర్జాతీయ గణిత శాస్త్ర పత్రికలకు సంపాదకుడుగా వ్యవహరించాడని,. అందులోనే కొనసాగితే గణితంలో నోబెల్ ప్రైజు వచ్చేదని తర్వాత కాలంలో ఆయన ప్రొఫెసర్లు చెప్పారు. 'బాలగోపాల్‌ది మాథమికల్ ప్రెసిషన్ రా' అనేవాడు కాళోజీ. బహుశా నిర్దిష్ట క్షేత్రస్థాయి కృషికి, నిర్ధారణలకు ఆయన గణితశాస్త్ర జ్ఞానం తోడ్పడి ఉంటుంది కాని, విశ్లేషణకు, ప్రాపంచిక దృక్పథానికి మాత్రం రస్సెల్ నుంచి కోశాంబి దాకా ఆయన చేసిన అధ్యయనమే దోహదం చేసాయి. విరసంలో, సృజన 'సాహితీ మిత్రులు'లో చేరాక ఆయన సాహిత్య విమర్శకుడు కావాలని మేం ఆశించాం. కవిసేన మానిఫెస్టో మీదనే కాదు, యండమూరి తులసి, తులసిదళం మీద, కొ.కు. యుద్ధ కాలపు కథల మీద ఆయన రాసిన సాహిత్య విమర్శ వ్యాసాలు తర్వాత కాలంలో స్నేహ ప్రచురణలు పేరుతో డా. కరుణ 'రూపం–సారం'గా ప్రచురించినపుడు త్రిపురనేని మధుసూదనరావు కన్నా తెలుగు సాహిత్య విమర్శను ఒక అడుగు ముందుకు తీసుకవెళ్లే ప్రామిస్ అందులో కనిపించింది. మధుసూదనరావుకు తత్త్వశాస్త్రం మీద ఉన్న పట్టుకు తోడుగా బాలగోపాల్‌కు చరిత్ర, రాజకీయార్థ శాస్త్రం – అన్నిటినీ మించి సమకాలీనత మీద ఉన్న పట్టు, వస్తుగత దృష్టి, భాష, శైలి ఆయన సాహిత్య విమర్శకు పుష్టినిచ్చాయి. ఆయనకు భాష, శైలి తాత రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ నుంచి అబ్బాయి. ఆ సారళ్యం, ఆ వ్యంగ్యం – రాళ్లపల్లి వ్యంగ్యం మృదువుగానూ, హాస్యంగానూ ఉంటుంది. బాలగోపాల్‌ది చురుకుగా, కనువిప్పుగా ఉంటుంది. దైనందిన జీవితంలో దగ్గరగా మసలే వాళ్లకు మాత్రం ఆయన ఆహ్లాదకరమైన హాస్యం అపురూపంగా జ్ఞాపకం చేసుకోదగింది. ఆ వ్యాఖ్యలో ఒక ప్రాపంచిక దృక్పథం ప్రస్ఫుటమవుతుంది. మిల్‌కాలనీ కేసులో 1985లో జైల్లో ఉన్నపుడు ఒక ఉదయం పత్రికలో వార్త చదివి 'ఎవరో

రవీంద్ర భారతిలో ముప్పై ఆరు గంటలు భరతనాట్యం చేస్తుంద'ట అండీ అన్నాను. 'ఎందుకట?' అన్నాడు. శ్రీకాకుళం జిల్లా అంతా చలసానితో స్కూటర్ మీద తిరుగుతున్నపుడు పెట్రోల్ అయిపోయి స్కూటర్ పడేసి మైళ్ల కొలది తిరగాల్సి వచ్చిందట. 'ముందే జాగ్రత్త పడొద్దా? ఇదేం మీ కృష్ణా జిల్లా అనుకున్నారా?' అన్నాడట. ఇటీవలి కాలంలో కన్యాశుల్కం గురించి, గురజాడ అప్పారావు గురించి, ముస్లిం మైనారిటీవాద సాహిత్యం గురించి రాసి, మాట్లాడి ఉన్నా ఆయన సాహిత్యం మీద తన ప్రేమను శిబి చక్రవర్తి తన శరీరాన్ని కోసేసుకున్నంత నిర్దాక్షిణ్యంగా దాచుకున్నాడనుకుంటాను. ఇటీవల ఆర్టిస్ట్ మోహన్ పుట్టిన రోజు విందులో కలుసుకున్నపుడు ఆయనా, నేను, విమల, మృణాళిని ఒక చోట కూర్చున్నాం. విమల తన కొత్త కవితా సంకలనం 'మృగన' తెస్తున్నానన్నది. 'ఈ మాట ప్రాకృతమా' - అని అడిగానాయనను. నన్నడుగుతారేమిటి - నేనేమైనా పండితుణ్ణా అన్నాడు. 'రాళ్లపల్లి వారి మనుమలు కదా. అందుకని' అన్నాను. అయితే అందుకోసం కాదు, చరిత్ర అధ్యయనం కోసం, మూలాల అన్వేషణ కోసం, పాళీ, ప్రాకృత భాషలు పరిచయం చేసుకోవాలనుకునే వాడాయన.

1983లో ఖమ్మంలో జరిగిన ఎపిసిఎల్‌సి సభల్లో ఆయన ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యాడు. అప్పటికే ఆయన రెండు మూడేళ్లలోనే ఆ రంగంలో ఎంత కృషి చేసి ఉండకపోతే ఆ ముళ్లకిరీటం దక్కేది. 1981లో హైదరాబాద్‌లో జరిగిన ఎపిసిఎల్‌సి సభల తర్వాత అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రదీప్ బాలగోపాల్‌ను కార్యవర్గానికి కోఆప్ట్ చేసుకుందామన్నాడు. సభలయిపోగానే బాలగోపాల్‌ను కూడా తీసుకొని జార్జి ఫెర్నాండెస్ నాయకత్వంలో కేశవరావ్ జాదవ్‌తోపాటు మేము రవీందర్‌రెడ్డి, పర్సయ్యల 'ఎన్‌కౌంటర్' నిజనిర్ధారణకు వెళ్లాం. ఇంద్రవెల్లి ఘోర దురంతం జరిగిపోయింది. ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. 1978-80 కాలంలో కూడ నలగొండలో రవూఫ్ గ్రూప్ వాళ్లనందరినీ అక్కడి ఎస్.పి. వ్యాస్ 'ఎన్‌కౌంటర్'ల పేరుతో చంపేస్తున్నాడు. ఈ రాజ్యహింసను చరిత్ర, రాజకీయార్థ శాస్త్ర నేపథ్యాల నుంచి విశ్లేషించే ఒక బుద్ధిజీవిగా ఆయన రూపొందుతాడనుకున్న వాళ్లకు ఆయన 1983లో ఎపిసిఎల్‌సి కార్యదర్శిగా పదవిని చేపట్టడం ఆశ్చర్యం కలిగించింది. సర్వ సభ్య సమావేశం జరిగి ఆయన కార్యదర్శిగా ఎన్నికయి - బహిరంగ సభ ప్రారంభం

కావడానికన్న ముందు వర్తక సంఘం హాలు ఆవరణలో 'ఎపిసిఎల్‌సి లో మీరు, కాశీపతి మీమీ రాజకీయ విశ్వాసాల ప్రతినిధులుగా ఉండడం నేననుకుంటున్న స్పిరిట్‌లో ఎపిసిఎల్‌సి ని నడపడానికి ఇబ్బంది అవుతుంది' అన్నాడు. వెంటనే అనుకున్న రెండు నిర్ధారణ బృందాల విషయంలో ఏఏ ప్రాంతాలు, ఖర్చులు అని మాట్లాడుకున్నపుడు కూడా రాజకీయ విధేయతకు ప్రాధమ్యం ఉండకూడదన్నాడు. నాకు త్వరలోనే అర్థమయిందేమిటంటే – నోరులేని వాళ్లకు స్వరబలం, పేరు లేని వాళ్లకు చిరునామా, ఆవాసం లేని వాళ్లకు కాళ్లమీద నిలబడే స్వావలంబన, అసంఘటితంగా ఉన్నవాళ్లకు సంఘటన సమకూర్చడం ప్రజాస్వామిక హక్కుల ప్రాపంచిక దృక్పథం కావాలన్నది ఆయన అవగాహన. అందరూ వై.ఎస్.ఆర్. అసహజ మరణం గురించి గుండెలు బాదుకుంటున్న వేళ ఆయన అతిసార, మలేరియా, డెంగూ వ్యాధులతో నిత్యమూ మరణిస్తున్న ఆదివాసుల గురించి మాట్లాడడం మాత్రమే కాదు, వాళ్ల దగ్గరికి వెళ్లి తనతో, తన వంటివాళ్లతో కాగలిగిన ప్రతిఘటన నిర్మిస్తున్నాడు. ఆ అసహజ మరణాలు సహజమేనన్నంతగా చర్మం మొద్దుబారిన బయటి ప్రపంచానికి – నిత్యమూ జరిగే ఈ ప్రమాదాలను సూక్ష్మదర్శినిలో చూసి ఒక అపరాధ భావాన్నయినా కలిగించగలిగాడు. ఈ సంస్కృతి ఆయన ఆర్ఇసి కాలపు అధ్యయనం, పరిశీలన ఆచరణ రూపం తీసుకుంటున్న ఎనభైలలో పరిణతి చెందడానికి ఆయనకు పెద్దదిక్కుగా డాక్టర్ రామనాథం అండ లభించింది. 1980 నుంచి 85 డాక్టర్ రామనాథం, బాలగోపాల్, జీవనకుమార్ మొదలయిన వాళ్లు వరంగల్‌లో ఎపిసిఎల్‌సి గా చేసిన పనుల వైవిధ్యాన్ని విస్తృతిని చూస్తే ఇవ్వాళ దాని అవగాహన పరిణతిని అర్థం చేసుకోవచ్చు. ఊళ్లమీద, ఇళ్ల మీద పోలీసు దాడులు, అక్రమ అరెస్టులు, చిత్రహింసలు, పోలీసు క్యాంపులు, బైండోవర్లు, గృహదహనాలు, అత్యాచారాలు, స్త్రీలపై లైంగిక హింస వంటి పోలీసు దాడులు, రాజ్య హింస గురించి మాత్రమే కాదు కూలీరేట్లు, కులవివక్ష, వ్యభిచార గృహాలకు స్త్రీలను అమ్మడం, వరకట్న హత్యలు, దేవాలయంలో బ్రాహ్మణేతర స్త్రీ, పూజారిగా కొనసాగే హక్కు, ఆసుపత్రుల పారిశుభ్రత, మార్కెట్ యార్డులో దళారీల పాత్ర, వర్షాలకు చెదరిన బతుకులు, కాకతీయ యూనివర్సిటీలో రిజర్వేషన్‌లు, విద్యాలయాల్లో విద్యార్థి సంఘాల అవసరం – వంటి ప్రజాస్వామిక జీవిత సముచిత గౌరవానికి సంబంధించిన ఏ ఒక్క అంశమూ

డాక్టర్ రామనాథం, డాక్టర్ బాలగోపాల్‌ల నాయకత్వంలో వరంగల్‌లో ఎపిసిఎల్‌సి పట్టించుకోనిది లేదు. ఆయన సృజనలో రాసిన సామాజిక వ్యాఖ్యాన రచనలు 'కల్లోల కథా చిత్రాలు' చదివితే ఒక సామాజిక వ్యాఖ్యాతగా, ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ లో వచ్చిన ఇంగ్లిష్ వ్యాసాల సంకలనం చదివితే వ్యవసాయ విప్లవ రాజకీయార్థిక విశ్లేషణకునిగా దేశంలోనే ఎన్నదగిన వానిగా కనిపించవచ్చు కానీ అవన్నీ ఆయన బయట నుంచి రాసినవి కాదు. అందులో ఆయన కాలికి బలపం కట్టుకొని, కంఠదఘ్నంగా దిగి నమ్మి, మాట్లాడి, ఆచరించి రాసినవి. ఎవరికి ఇష్టం లేని విషయాలయినా, విశ్వాసాలయినా అంతే నిష్ఠురంగా ఆయన ఆఖరి శ్వాస దాకా చెప్పాడు. అందుకే 1985 ఆరంభంలోనే ఎపిసిఎల్‌సి రాజన్న హత్య గురించి జగిత్యాలకు నిజనిర్ధారణకు వెళ్తే ఆయనపై ఎబివిపి గూండాలు దాడి చేసి కొట్టారు. మిల్ కాలనీ సిఐ ఇంటిపై రాడికల్స్ బాంబు వేసిన కేసులో పెట్టారు. ఎస్.ఐ. యాదగిరి రెడ్డి హత్య తర్వాత హత్యా ప్రయత్నాలు, కిడ్నాప్ మన అందరికి తెలిసినవే. మొన్నటిదాకా ఆయన జీవించిన కాలమంతా కాళోజీ చెప్పినట్లు బోనస్‌గానే.

1985 సెప్టెంబర్ 3న డాక్టర్ రామనాథం హత్య తర్వాత ఆయన వరంగల్‌ను వదలాల్సి వచ్చినా ఆయన వరంగల్ ప్రజాజీవితంతో సజీవ సంబంధాలు కొనసాగించాడు. అందుకే వరంగల్ ప్రజలు ఆయన అంత్యక్రియలు అక్కడే జరగాలని కోరుకున్నారు. సాధ్యం కానప్పుడు ఆఖరి చూపుకు తరలి వచ్చారు.

**- వరవరరావు**

*12 అక్టోబర్, 2009, వార్త దినపత్రిక*

# మనకాలపు పరిపూర్ణ మానవుడు

**చివరి** ప్రసంగంలో బాలగోపాల్ భయం గురించి మాట్లాడారు. సమాజంలో సర్వత్రా వ్యాపించిన భయం గురించి, ఈ భయానికి కారణమైన ఇప్పుడు నెలకొని ఉన్న వాతావరణం గురించీ మాట్లాడారు. ఈ భయం వల్ల హక్కుల కోసం ప్రశ్నించేవాళ్లు, అన్యాయాన్ని అన్యాయం అని చెప్పేవాళ్లు, సులభంగా అవకాశవాదం వేపు మళ్లుతున్న దుస్థితి గురించీ ప్రస్తావించారు. ఇప్పుడాయన లేరు. వారం రోజులుగా ఒక వెలితి ఏదో కమ్ముకున్నట్టుగా ఉంది. ఎక్కడో పూరించలేని ఒక లోటు కనపడ్తున్నది. పని రాక్షసుడిగా పేరుపడిన బాలగోపాల్ మళ్లీ సింగరేణి ఓపెన్ కాస్ట్ కార్మికుల బతుకులను బొందలగడ్డ చేస్తున్న ప్రాంతాలకు వెల్లరు. అభివృద్ధి పేరిట విస్థాపన, విధ్వంసం జరుగుతున్న ఆదివాసీల దగ్గరకూ వెళ్లరు. స్థానికుల నేటి అవసరాలు తీర్చినాకే ఇతర అవసరాలు తీర్చాలని, ప్రాణహిత పరీవాహక ప్రాంత ప్రజల వద్దకూ వెళ్లలేరు. బాలగోపాల్ లేని లోటు తీరదనేది ఒక నిజార్థంలోకి అవాహన కావడం అక్కడే చెప్పింది చేసిందు బాలగోపాల్. మేథకూ, కార్యాచరణకూ మధ్య ఇసుమంత తేడా రానివ్వలేదు. నమ్మింది చేసుకుంటూ పోవడం అంతిమార్థంలో ప్రత్యామ్నాయాలను బోధిస్తున్న మేధావులు, బుద్ధిజీవుల నుంచి ప్రజలు ఆశించే కనీస కార్యాచరణ కూడా కనపడని పాడు పరిస్థితుల్లో, ప్రసంగాలకూ, రాతలకూ మాత్రమే మేధావులు పరిమితమవుతున్న కాలంలో బాలగోపాల్ పరిపూర్ణ కార్యాచరణను ఆచరించి చూపాడు. అందుకే బాలగోపాల్ పని అట్లాగే మిగిలిపోయింది. బహుశా పేరుకు పోతుంది. సకల మానవ ప్రాకృతిక వనరులనూ పెట్టుబడికి అప్పగించి, ఈ

పెట్టుబడుల వ్యాప్తికి, వికాసానికీ, సుస్థిరతకూ, ప్రపంచ వాణిజ్య సంస్థలు, ప్రపంచ బ్యాంకు నేపథ్యంగా, విస్తరిల్లే కార్పొరేట్ల స్వేచ్ఛకూ, సాంఘిక సంక్షేమం, బాధ్యతలు ఒక ఆటంకంగా కనబడ్తున్న కాలం. పాలకతత్వం అనేది ఈ కార్పొరేట్ల పరిరక్షణకు మాత్రమే కాదు. వీటికి మొత్తం ప్రకృతి వనరులను దోచిపెట్టే ఒక సాధనంగా మారుతున్న కాలం ఇది. జంగల్‌మహల్ నుంచి, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒరిస్సా, ఉత్తరాంధ్ర బాక్సైట్ గనుల దాకా భవిష్యత్తులో జరగబోయేది ఇదే. ఇదొక జీవవ విధ్వంస ప్రణాళిక. సంస్కరణలు, వాటి ప్రచారం, చివరకు మూడోదశలో సంస్కరణల అమలు తీవ్రాతి తీవ్రంగా జరుగుతున్న కాలం ఇది. అందువల్లే లక్షలాది ఎకరాల భూములు అభివృద్ధి పేరిట కార్పొరేట్లకు ధారాదత్తం అవుతున్న దృశ్యాలు. ఎక్కడో థర్మల్ విద్యుత్ కోసం సింగరేణిలో విధ్వంసం చిచ్చురేగుతున్న కాలం ఇది. అభివృద్ధిలో పెట్టుబడుల కేంద్రీకరణ కోసం పోలేపల్లి 'సెజ్'లు పుట్టగొడుగులై మొలుస్తున్న కాలమిది. సరిగ్గా ఇప్పుడు బాలగోపాల్ వీటన్నిటినీ పట్టించుకొనే హక్కుల ఉద్యమ నేత అర్థంతరంగా అందరినీ విడిచివెళ్లడం ఒకలోటు. ముప్పదేండ్లుగా ఆయనతో ఉన్నవాళ్లకి, వడిచిన వాళ్లకీ, ఇప్పుడిప్పుడే నడుస్తున్న వాళ్లకు మాత్రమే కాదు. బెల్లంపల్లి, మందమర్రిల్లో ఉన్న భూములు కోల్పోయిన రాజపోశవ్వల దీనగాథను వినడమే కాదు. ఈ దీనగాథల మూలమేమిటో? వాటిని ఇప్పుడు అంతకు ముందుకన్నా ఎక్కువ ఎందుకు పట్టించుకోవాలో? చెప్పేవారు లేరు. అది వెలితి. బంగ్లాదేశ్‌లో ఒక విచిత్రం జరిగింది. ఒక మావోయిస్టు విప్లవకారుణ్ణి కాల్చిచంపిన పోలీసులే ఆ తర్వాత అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. బహుశా మన రాష్ట్రంలో మొట్టమొదటిసారి రోశయ్య నుంచి కేసీఆర్ దాకా ప్రధాన స్రవంతి నేతలు బాలగోపాల్ గురించి స్పందించారు.సరే, ఆయనొక ఉత్తమ మానవుడుగా, నిరాడంబరుడుగా, పని రాక్షసుడిగా, పనిచేస్తూ, ప్రజల్లో ఉంటూ బతికినందుకు మాత్రమే వాళ్లు నివాళులర్పించవచ్చు. నిజానికి ఇవ్వాల్టి విధ్వంసానికి మధ్యవర్తులుగా ఉన్న వాళ్లే విధ్వంసాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బాలగోపాల్‌కు నివాళులర్పించే అవసరమూ రావొచ్చు. బాలగోపాల్ మీద బతికున్నంత కాలం తీవ్ర వ్యతిరేకతలో ఉన్న పోలీసు అధికారులూ ఆయన వ్యక్తిత్వం ముందు తలవంచాల్సిన పరిస్థితి కూడా వచ్చి ఉండవచ్చు.

కానీ, ఇదొక్కటేనా? బాలగోపాల్ అంటే కేవలం మానవ హక్కుల ఉద్యమాన్ని విస్తృత పరిచిన వాడేనా? కాదు.నిజానికి బాలగోపాల్ అరుదైన మేధావి. ఆయన ఈ

ఖాళీలు పూరించకుండానే నిష్క్రమించడం ఇక్కడ మరొక లోటు. బలమైన రాజకీయార్థిక శక్తులకు, రాజ్యానికి జీవితమంతా వ్యతిరేకంగా నిలబడిన బాలగోపాల్ కార్యాచరణంతా మార్క్సిస్టు మూలసూత్రాల ఆధారంగా జరిగినట్టే అనిపిస్తుంది. కానీ పందొమ్మిది సంవత్సరాల క్రితమే ఆయన మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం పట్ల అసంతృప్తి ప్రకటించారు. కానీ ఈ పందొమ్మిదేళ్లూ ఆయన ఖాళీగా లేరు. కార్యాచరణలో ఉన్నారు. ఈ ప్రపంచానికి ఆయన ఆలోచించిన ప్రత్యామ్నాయాన్ని కానీ ఆయనే చెప్పుకున్నట్టు 2001 లో ఒక కొలిక్కివచ్చిన తన తాత్విక అన్వేషణను కానీ ప్రపంచానికి వెల్లడించలేదు. హరగోపాల్ రాసిన సార్వత్రిక నైతిక విలువల గురించి కూడా ఆయన సూత్రబద్ధంగా చేసిన బౌద్ధిక కృషి లేదు. నిజానికి బాలగోపాల్ ఈ పని, పని.. పని.. అనే స్థితిలో పడి ఈ కృషి కొనసాగించడానికి, ఇష్టపడలేదా? మరేదైనా కారణమా? తెలియదు కానీ.....ఇది బహుశా ఆయన జీవితకాలపు ఖాళీ కావొచ్చు. జీవితాన్వేషణలో ఆగిపోవడం గురించి, మానవ ప్రవృత్తి గురించి ఆయన లోతుగా ఆ తర్వాత ఏమీ రాయలేదు. బహుశా ఇదొక ఖాళీ. నిజానికి బాలగోపాల్ నిరాడంబరత, సంపూర్ణ మనిషిలాగా జీవించడం గురించి, నిర్భయత్వం గురించి మాట్లాడుతున్నాం కానీ, అవి ఆయనకు తెలుగునాట జరిగిన కీలకమైన సామాజిక పరిణామాల సందర్భంలో సహజంగా ఏర్పడినవే. ఈ సందర్భాల్లో ఆయన నిండా ఉద్యమంతో మమేకమై ఉన్నందున....గొప్ప ఆదర్శాలుగా ముందుకొచ్చిన అంశాలను ఆవాహన చేసుకున్నవే. అందుకే ఆయన లక్షణాలన్నీ సహజ స్వభావంగా కనపడేవి. ఉద్వేగాలతో పనులు జరగవు అన్నది బాలగోపాల్ నేనొక సందర్భంలో ఉద్వేగంగా మాట్లాడిన వేదిక మీద అన్న మాటలు. ఆయన ఉద్వేగాలకు అతీతంగా జీవించారు. అన్నెందుకు? ప్రామాణిక జీవన విధానాన్ని ఎంచుకున్న పరిపూర్ణ మానవుడు బాలగోపాల్. వసంతను నేను పలకరించిన ప్రతి సారీ...ఒక ప్రశ్న వేసే వాడిని. బీజీ ఉన్నాడా...ఉంటే రెండో ప్రశ్న.బాగున్నాడా..బీజీ లేడు...ఉండరు....మరిరాడు...ప్రజల పక్ష మేధావి ఆదివాసీల ఆరోగ్యం గురించి మాట్లాడిన బాలగోపాల్ తన ఆరోగ్యం పట్టించుకోకపోవడం బహుశా ఆయనతో పాటు ఉన్న అందరికీ జీవిత కాలం తీరని వెలితిని ఏర్పరిచింది. ఆ వెలితి పూడ్చరానిది.

**– అల్లం నారాయణ**

*అక్టోబర్ 17, 2009 ఆంధ్రజ్యోతి దినపత్రిక*

# నిగర్వి...మహా మనీషి
# హక్కుల ఉద్యమానికి మారు పేరు

**అయ్యో ఈయనా..** చనిపోయింది! ఎప్పుడూ మా మధ్యే తిరుగుతుండేవాడే! ఇంత గొప్పవాడై ఉండీ... ఎంతో సాధారణంగా...మార్కెట్ వద్ద... కనిపించేవాడే! మామూలు మనిషిగా ప్రవర్తించేవాడే! ఆ సారును... స్కూటర్‌పై వెళుతుండగా చూసేవాడిని! ఇంతటి మహామనీషి అనితెలియలేదే! మామూలు మనిషిగా దుకాణానికి వచ్చి పోతుండేవారే! అంతిమ యాత్రలో ఆయన ఫోటోలను, ఆయన భౌతిక కాయాన్నీ చూసి అనేక మంది నోట వెలువడిన మాట! అయ్యో... ఆయన గొప్పతనాన్ని గుర్తించలేక పోయామే... అనే ఆవేదన. ఆకాశమంత ఎదిగినా... ఒదిగి ఉన్న ఆయనలోని అసమాన వ్యక్తిత్వానికి ఇచ్చిన నివాళి! నివాసం ఉన్న ప్రియా కాలనీ...ఆయన నిత్యం తిరిగిన గుడిమల్కాపూర్, మెహదీపట్నం, కార్వాన్ వీధుల్లో ఆయన అంతిమ యాత్రసాగుతుండగా.. ఏ మాత్రం పరిచయం లేనిజనం కంటిలో కనీకనిపించకుండా కదలాడిన ఓ కన్నీటిబొట్టు! ఆయనతో పరిచయం లేని వారు సైతం... ఆయన మహోన్నత వ్యక్తిత్వం గురించి తెలియడంతో తండోపతండాలుగా అర్పించిన జోహార్లు! ఇక ఆయన గురించి తెలిసినవారు... ఆయన అభిమానులు... ఉద్యమ బంధువులు వేనకు వేలు!! అందరిలో కొందరిగా కాక... కొందరిలో ఒకరిగా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటూనే...అందరిలో ఒకడిగా కలిసిపోయి మెలగడం ఆయన ప్రత్యేకత! నిరాడంబరతకు నిలువుటద్దం... నిర్భాగ్యుల

పాలిట ఆపన్నహస్తం! కఠిన పదఘట్టనల కింద నలిగిపోతున్న బడుగు జీవుల కన్నీరు తుడిచేందుకు బాహువులు బావుటాలు చేసి రణన్నినాదం చేసిన స్వరం! ఎక్కడో అడవిలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన ఓ అభాగ్య మృతదేహానికి న్యాయం కోసం విచ్చుకున్న గొంతు! దానికి మరో పేరే బాలగోపాల్! రాజ్య హింసనే కాదు... ఆ మాటకొస్తే... నాగరిక సమాజంలో అన్ని రకాల హింసనూ నిక్కచ్చిగా వ్యతిరేకించిన ధీశాలి. గణితశాస్త్రంలో అసమానమేధో సంపత్తిని సొంతం చేసుకున్నా... పది కాలాల పాటు... పచ్చగా సాగిపోయేందుకు వీలైన ఉద్యోగం ఉన్నా... వాటన్నింటినీ కాదనుకుని... తోటి మానవుడి కష్టాలు తీర్చడంలోనే ఆనందాన్ని వెతుక్కున్న నిత్యకృషీవలుడు! మానవ హక్కుల ఉద్యమానికి చిరునామాగా...పర్యాయపదంగా వెలుగొందిన స్ఫూర్తి ప్రదాత!! కందాళ్ల పార్థనాథ శర్మ, నాగమణి దంపతులకు ఐదో సంతానం. 1952 జూన్ 10 బళ్లారిలో జననం. తండ్రి ఉద్యోగం రీత్యా అనేక ప్రాంతాల్లో పనిచేయడంతో వివిధ ప్రాంతాల జీవనశైలిని ఆకళింపు చేసుకున్న బాలగోపాల్ జీవితంలో వరంగల్ ఓ మలుపు. అక్కడే ఆయనకువిప్లవ విద్యార్థి ఉద్యమాలతో పరిచయం. వరంగల్ రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో మ్యాథమెటిక్స్‌లో ఎమ్మెస్సీ, పిహెచ్‌డి పూర్తి చేసిన బాలగోపాల్... ఢిల్లీలోని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ కోసం చేరారు. 1981లో కాకతీయ యూనివర్సిటీలో మ్యాథ్స్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం రావడంతో ఢిల్లీ నుంచి మళ్లీ వరంగల్‌కు మకాం మారింది. ప్రొఫెసర్‌గా పని చేస్తూనే... ఆయన పౌరహక్కుల ఉద్యమంతో మమేకమయ్యారు. విప్లవ విద్యార్థిసంఘాలతో సన్నిహితంగా మెలిగారు. ఆ సమయంలో వరంగల్ జిల్లాలో నక్సలైట్ ఉద్యమం ఉధృత స్థాయిలో ఉంది. ఉద్యమ సానుభూతిపరులు, ఉద్యమకారులు తీవ్ర అణచివేతకు గురయ్యేవారు. ఈ అన్యాయాలపై ఆయన సమరశంఖం పూరించారు. అనేక బూటకపు ఎన్‌కౌంటర్లను ఆయన వెలుగులోకి తీసుకువచ్చారు. రాజ్యహింసను నిలదీయడం పోలీసులకు గుర్రుగా మారింది. దీంతో ఆయన పైనా నక్సలైట్ అనే ముద్రను పోలీసులు వేశారు. అనేకమార్లు ఆయన పోలీసుల దాడులు ఎదుర్కొన్నారు. ఓసారిఖమ్మం జిల్లా కొత్తగూడెంలో పోలీసులు ఆయనపై దాడి చేసి... చావబాదారు. చనిపోయాడనుకొని ఓ మురికి కాల్వలో పడేసి పోయారు.

జంట బాధ్యతలతో దేనికీ న్యాయం చేయలేననుకున్న బాలగోపాల్... ఉద్యోగాన్ని త్యజించారు. ఉద్యమానికి అంకితమయ్యారు. పౌరహక్కుల ఉద్యమంలో తొలి పూర్తి కాలం కార్యకర్త ఆయనే! 1983లో పౌరహక్కులసంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై... ఆహోదాలో 1998 వరకూ కొనసాగారు. రాజ్య హింసను వ్యతిరేకించిన పౌర హక్కుల ఉద్యమంనక్సల్ హింసను సమర్థించడాన్ని నిరసించారు. ఆ సమయంలో ఆయన రాసిన 'నక్సల్బరీ ఉద్యమం-గమ్యం, గమనం', చీకటికోణం తదితర పుస్తకాలు సంచలనం రేపాయి. ఈ నేపథ్యంలోనే అభిప్రాయభేదాలతో పౌరహక్కుల సంఘాన్ని వదలిపెట్టి... మానవ హక్కుల వేదికను ప్రారంభించారు. ఒక్కడే వందమంది పెట్టున పని చేసి...అన్ని జిల్లాల్లోనూ మానవ హక్కుల ఉద్యమాలు కొన్ని పట్టణాలకు... కొందరు మేధావుల చర్చలకు మధ్యే కుదించుకుపోయిన తరుణంలో...సమస్య ఉన్న మారుమూల ప్రాంతాల ప్రజల మధ్యకు ఉద్యమాన్ని విశాలం చేశారు. దిగువ స్థాయి నుంచి ఉద్యమానికి పునాదులేశారు. హక్కుల వేదికలో నాలుగేళ్లు ప్రధాన కార్యదర్శి హోదాలో పని చేసి... ఇటీవల అక్టోబర్ 2, 3 తేదీల్లో జరిగిన రాష్ట్ర సదస్సులో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

అనేక ఉద్గ్రంథాలు ఔపోసన పట్టిన మేధావిగా పౌరహక్కుల అణచివేత మొదలుకుని... అనేక సామాజిక సమకాలీన అంశాలపై కలం ఎక్కుపెట్టారు. ఆదివాసుల సమస్య మొదలుకుని... అణుఒప్పందం దాకా... ఏ సమస్యపైనైనా సమగ్ర విశ్లేషణ చేసేవారు. సాధికారతతో మాట్లాడేవారు. ఓ విధంగా చెప్పాలంటే... మూడు దశాబ్దాల ఆయన రచనలు...ఉపన్యాసాలు... సమాజ పరిణామ చరిత్రను కొత్త కోణంలో మనకు పరిచయం చేస్తాయి. ఆంగ్లభాషపై గట్టి పట్టున్న బాలగోపాల్... అనేక సమస్యలపై లోతుపాతులు చర్చిస్తూ ఆంగ్ల భాషలో సైతం అనేక వ్యాసాలు రాశారు. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీకి అనేక రచనలు చేశారు.

విలువల గురించి చెప్పడమే కాక... వాటిని ఆచరణలో పాటించిన మహోన్నతుడు బాలగోపాల్. ఓవిధంగా చెప్పాలంటే... మానవహక్కుల ఉద్యమానికి వెలుపల ఆయనకు వేరే జీవితం లేదు. పేదప్రజలకు న్యాయం అందించడానికి, వారిహక్కులు కాపాడటానికి ఆయన తుదిశ్వాస విడిచేంత వరకూ కృషి సల్పారు. ఈ క్రమంలో అనేక అవాంతరాలు. అడ్డంకులు, బెదిరింపులు, చంపేస్తామంటూ హెచ్చరికలు! తీవ్రనిర్బంధం నడమ

1985లో వరంగల్ వదలి...హైదరాబాద్‌కు వచ్చేశారు. అక్కడ కూడా పౌర హక్కుల ఉద్యమం పూర్తి స్థాయి కార్యకర్తగా పని చేశారు. 1994లో ఎల్ఎల్‌బీ పూర్తి చేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఒక్క పైసా తీసుకోకుండా పేదలతరఫున అనేక కేసులు వాదించారు. కేవలం నిజనిర్ధారణలకే పరిమితం కాలేదు. అనేక సాధనాలు ఉపయోగించి... బాధితులకు న్యాయం అందించేందుకు ప్రయత్నించారు. అనేక రూపాలలో ఉద్యమాన్ని కొనసాగించారు. కోర్టులో కేసులు వేయడం మొదలు... అధికారులకు విజ్ఞాపన పత్రాలు ఇవ్వడం... మరోవైపు వాటి సాధనకోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయడం ఆయన శైలి. ఆయనతిరగని ఊరు లేదు. ఆయనకు తెలియని పల్లె లేదు. ఎక్కడ అన్యాయం జరిగినా... అక్కడ ప్రత్యక్షమయ్యే వారు. రాష్ట్రంలో రోడ్లు... బస్సు, రైళ్ళ సమయాలుఆయా రవాణా సంస్థల కంటే...బాలగోపాల్‌కే ఎక్కువగాతెలిసేవంటే...ఆయన రాష్ట్రంలోఎంతపర్యటించారో అర్థం అవుతుంది. రాష్ట్రంలోనే కాదు... మానవ హక్కులు ఉల్లంఘనకు గురవుతున్న కాశ్మీర్, మణిపూర్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లోనూ బాలగోపాల్ సుపరిచితులు. అక్కడి పౌరహక్కుల సంఘం నేతలతో కలిసి ఆయనా రాష్ట్రాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులపై నివేదికలు తయారు చేశారు. వాటన్నింటినీ కలిపి పుస్తకాల రూపంలో నిక్షిప్తం చేశారు. ఇటీవలి కాలంలో ఓపెన్‌కాస్ట్‌లకు వ్యతిరేకంగా, సంఘటిత ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. ప్రజా ఉద్యమాలు ఎదురుదెబ్బలుతిని బలహీనమైన తరుణంలో మానవ హక్కుల ఉద్యమం బాధ్యత పెరిగిందని ఇటీవల అనంతపురంలో జరిగిన మానవ హక్కుల వేదిక మూడవ మహాసభలో బాలగోపాల్ ఉద్ఘాటించారు. సేనానిలా ఆ ఉద్యమాన్ని తీర్చిదిద్దుతున్న తరుణంలో... భారీలోటును ఏర్పర్చి... ఆకస్మికంగా కన్నుమూశారు.

# నువ్వు లేకపోయాక...

బాలగోపాల్ దేహభారాన్ని వదలి ఏకాంత విశ్రాంతి మందిరానికి వెళ్లిపోయారు. దేహం నుంచి విముక్తి లభించడం ఒక గొప్ప వరం. గడ్డ కట్టుకుపోయినా తెలుగు ఆలోచనా ప్రపంచంలో ఆయన పడిన యాతనను అర్థం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. దేవుడున్నాడు, లేదు వంటి వైరుధ్యాలను సృజనాత్మకంగా పరిష్కరించే వారికి తెలుగు సమాజంలో దేహవైరాగ్యం వచ్చితీరుతుంది. అలాంటి విరాగులను వదిలేసి ఆయనొక్కడే చెప్పా పెట్టకుండా వెళ్లిపోవడమే బాధగా ఉంది. ఆరోగ్యం గురించి కొత్త జాగ్రత్తగా వ్యవహరించవచ్చు కదా అనేవారికి అలాంటి వారి వైరాగ్యస్థితి అర్థమయ్యేదికాదు. అంతరంగం ఉన్నంత చురుగ్గా, పదునుగా శరీరం ఉండకపోవడం అనుభవంలోకి వస్తూ ఉంటుంది. బాలగోపాల్‌లాంటివారికి ఈ రెండు జోడుగుర్రాల్లా పరుగెత్తాల్సిన అవసరం కూడా ఉంటుంది. ఆత్మవికాసం జరుగుతున్న కొద్దీ శరీరంలో చురుకుదనం కొరవడుతూ పోవడం ఆయనకు అనుభవంలోకి వచ్చి ఉంటుంది. ఈ యాతనను భరించడం కన్నా దేహాన్ని తన మానానికి తనను ఆయన వదిలేసి ఉండవచ్చు. బాలగోపాల్ ఒక చారిత్రక సందర్భంలో తన కర్తవ్యాన్ని అందరి కన్నా గొప్పగా నెరవేర్చారు. అచరణకు, వ్యక్తిగత జీవితానికి మధ్య ఆయన అభేదాన్ని పాటించారు. తాను చెబుతున్న విలువలను ఆయన జీవితంలో పాటించారు. అటువంటి అవసరమే ఇప్పుడు తెలుగు సమాజానికి ఎక్కువగా ఉందనే విషయం తెలిసీ ఆయన వెళ్లిపోవడమే బాధాకరం. ఆయన తన అనుభవాల నేపథ్యం నుంచి, కార్యాచరణనుంచి ప్రజా ఉద్యమాలను ప్రేమపూరితంగానే ప్రశ్నించారు. ఆ ప్రేమను కూడా భరించలేని

స్థితికి తెలుగు మేధాప్రపంచం చేరుకోవడమే పెద్ద విషాదం. విప్లవోద్యమ సైద్ధాంతిక విశ్వాసాలపై బహుశా బాలగోపాల్‌కు విభేదాలు ఉండకపోవచ్చు. మానవ ప్రవర్తనను సంసిద్ధం చేయాల్సిన అవసరం గురించి ఆయన చెప్పిన విషయాలను పట్టించుకోవాల్సిన అవసరం ఉందని గుర్తించని సమాజంలో తలకిందుల విలువలు గజ్జె కట్టి ఆడుతాయి. పౌర హక్కులకు ఊపిరి, ఆదర్శంగా నిలిచిన ఆయన బాహ్య ప్రపంచం బెదిరింపులకు ఏ రోజూ లొంగకపోవడం ఆయన జీవితాచరణలోని నిమగ్నతను తెలియజేస్తుంది. అయితే, ఆయన దానిలోకే ఆగిపోవడమే సమాజానికి పెద్ద కంటగింపుగా మారింది. కొత్త ఆలోచనలను, ఆవిష్కరణలను ముందు పెట్టిన సృజనశీలురను ప్రపంచం ఏనాడూ సహించలేదు. తన ఆచరణ నుంచి విప్లవోద్యమానికి కొత్త ఆలోచనలను అందించడానికి చేసిన ప్రయత్నాన్ని కూడా హర్షించలేకపోయారు. అటు పాలకవర్గాలకు, ఇటు ప్రజా ఉద్యమాలకు ఆయన కొరకరాని కొయ్యగా మారారనే చెప్పాలి. అందుకే ఆయనపై నిర్దయంగా విమర్శనాదాదులు జరిగాయి. బాలగోపాల్ జీవితంలో ఏనాడూ రాజీపడడానికి ఇష్టపడలేదు. అందుకే ఆయన అంత పదునుగా, అంత కొత్తగా ఆలోచనలను మన ముందు పెట్టగలిగారు. ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలోనే పౌర సమాజం పూర్తిగా రూపుదిద్దుకోలేదని గుర్తించారు. కాబట్టే ఆయన మానవ హక్కుల వేదికను ఏర్పాటు చేసి ఉంటారు. పౌర సమాజానికి దూరంగా ఉన్న సెక్షన్లను గుర్తించి వారి కోసం తపన పడుతూ వచ్చారు.

ఈ విషయంలో తన ఆలోచనలను పంచడమే కాకుండా వాటిని ఆచరింపజేయడానికి ఆయన కార్యరంగంలో పనిచేశారు. అందుకే ఆయన ఆదివాసీలను, ముస్లిం మైనారిటీలను, తెలంగాణవాళ్లను విడివిడిగా గుర్తిస్తూ వారికి జరుగుతున్న అన్యాయంపై గళాన్ని, కలాన్ని వాడుతూ వచ్చారు. దీన్ని ఏకోన్ముఖంగా నడుస్తున్న తమకు ఆటంకమనే అభిప్రాయంతోనే ప్రజా ఉద్యమాలు చూశాయి. విప్లవోద్యమం సాయుధ పోరాటాన్ని మాత్రమే ఎంచుకుని పాలకవర్గాల తప్పుడు విధానాలను ఎదిరించడానికి రాజకీయ ఎజెండాను స్వీకరించలేక పోయారని గుర్తించిన విషయాన్ని ఎవరైనా అర్థం చేసుకున్నారో లేదో తెలియదు. ఆయన విప్లవోద్యమ కార్యాచరణను ప్రశ్నించడానికి చాలా సమయమే తీసుకున్నారు. తనలో నలుగుతూ,

తన అంతరంగాన్ని కల్లోలపరుస్తూ వచ్చినా ఆయన ప్రశ్నలు వేయడానికి ఈ సమయం తీసుకోవడమే విప్లవోద్యమాల పట్ల ఆయనకున్న సానుకూల వైఖరిని తెలియజేస్తుంది. ఈ సానుకూల వైఖరితో వచ్చే ప్రశ్నలను స్వీకరించే స్థితిలో లేకపోవడమే ఇప్పుడు పీడిత ప్రజలకు జరుగుతున్న నష్టం. విప్లవోద్యమంపై రాసిన వ్యాసాలు, గ్రంథాలు, విప్లవోద్యమంపై రాసిన వ్యాసాలకు సంపాదకత్వం వహించిన గ్రంథాలు ఆచరణలో కాస్తంత సృజనాత్మకతకు, మానవీయ కోణానికి వీలు కల్పించాలని చెప్పడానికే. ఆచరణ ఉద్యమాలను స్తంభింపజేయకూడదనే ఉద్దేశంతోనే ఆయన విమర్శలు చేసి ఉంటారు. రాజ్య హింసతో పాటు ప్రైవేట్ హింసను కూడా ఆయన వ్యతిరేకించడానికి బహుశా కారణం ఇదే. రాజ్యహింస అత్యంత దారుణంగానూ అన్యాయంగానూ, అమానవీయంగానూ ఉంటుందనే విషయం తెలియంది కాదు. కానీ ప్రజల కోసం పనిచేసే వారు ఈ విషయంలో రాజ్యంతో పోటీ పదాలనుకోవడమే పెద్ద అవరోధమనే విషయం బాలగోపాల్ భావించి ఉండవచ్చు. అదే సమయంలో రాజ్యహింసను వ్యతిరేకించడానికి ఆయన ఏనాడూ వెనకాడలేదు. రాజ్యహింసకు గల మూలాలను, దాని దౌష్ట్యాన్ని ఆయన ఎప్పటికప్పుడు వలువలు వలిచి బయట పెడుతూనే వచ్చారు. విభేదిస్తూనే ప్రజా ఉద్యమాల పట్ల సానుకూల వైఖరి ప్రదర్శించే మేధావి వర్గాన్ని సహించక పోవడం. ఉద్యమాలకు భావాత్మకంగా కట్టుబడి ఉంటే చాలు. వ్యక్తిగత ఆచరణ అవసరం లేదనే వైఖరి ఇప్పుడు రాజ్యమేలుతున్నది. ఇటువంటి సందర్భంలో మరో బాలగోపాల్ మనకు దొరుకుతాడా? అటువంటి 'మానవుడు' మరొకరు ఉండాలని కోరుకోవడం అత్యాశే అవుతుంది. అందుకే బాలగోపాల్ మరి కొన్నాళ్లయినా తన కోసం కాకున్నా మన కోసం జీవించి ఉండాల్సింది. నువ్వు లేకపోయాక మానవ మనుగడకు అర్థం చెప్పేవారెవరు?

**– కాసుల ప్రతాప రెడ్డి**

*12 అక్టోబర్ 2009, 'ఆంధ్రప్రభ' దినపత్రిక*

# నల్లమల చెంచులపట్ల బాలగోపాల్ తపన

**సెప్టెంబర్ 2వ తేదీ** సాయంత్రం ముఖ్యమంత్రి వై.ఎస్. హెలికాప్టర్ అదృశ్యమైన వార్తలు వెలువడుతున్నాయి. నెల్లిమర్ల జూట్‌మిల్లు పారిశ్రామిక వివాదానికి చెందిన ఒక కేసు గురించి నేను, బూర్గుల ప్రదీప్ (ఇప్పుడు అఖిల భారత ప్రధాన కార్యదర్శి) ఆ సమయానికి హైదరాబాద్‌లోని డాక్టర్ కె. బాలగోపాల్ ఇంటికి వెళ్లాం. మరికొద్దిసేపటికే ఎ.ఐ.ఎఫ్.టి.యు నేత ఎస్. రామచంద్రరావు, మరొక మిత్రునితో అక్కడికి వచ్చారు. బాలగోపాల్ సాధారణంగా అవసరం ఉన్న మేరకే మాట్లాడే మితభాషి! కానీ పై నేపథ్యంవల్ల ఆ రోజు మాతో సుమారు అరగంట ఇష్టాగోష్టిగా మాట్లాడారు. అదృశ్యమైన హెలికాప్టర్ జాడలను వెతికి పెట్టమని నల్లమల ప్రాంత ఆదివాసులైన చెంచులకు మంత్రి రోశయ్య మీడియా ద్వారా విజ్ఞప్తి చేశారు. ఆ వార్తను ఆయన సహచరి వసంతలక్ష్మి మా మధ్య ప్రస్తావించారు. వెంటనే బాలగోపాల్ స్పందించి మూడు వ్యాఖ్యలు చేశారు.

నక్సల్స్ ఏరివేత పేరిట గతంలో నల్లమల అడవుల నుంచి చెంచులను తరిమివేసిన ప్రభుత్వానికి ఇప్పుడు వారే దిక్కయ్యారని ఆయన వ్యంగ్య వ్యాఖ్యచేశారు. అదృశ్యమైన హెలికాప్టర్‌ని కనిపెట్టడంలో ఆధునిక సాంకేతిక, వైజ్ఞానిక పరిజ్ఞానం కంటే ఆదివాసులే నయమని ఇప్పటికైనా మన పాలకులు గుర్తించారు కాబోలు అని మరో వ్యాఖ్య చేశారు. అడవుల నుంచి చెంచులను తరిమివేసిన తమ రాజకీయ తప్పిదాన్ని గుర్తించి తగిన గుణపాఠాన్ని ప్రభుత్వం తీసుకుంటుందేమో చూడాలని కూడా ఆయన అన్నారు. తాను నవ్వకుండా అక్కడ ఉన్న మమ్మల్ని నవ్వించిన ఈ మూడు వ్యాఖ్యలు కూడా అత్యంత భావగర్భితమైనవి.

ఆయన మాతో పై వ్యాఖ్యలు చేసిన సమయానికి వై.ఎస్. మృతి ధృవీకరణ

జరగలేదు. నల్లమల అడవుల్లో ఏదో ఒక మూలన ఒకవేళ వై.ఎస్. హెలీకాప్టర్ సురక్షితంగా దిగినా, ఎలా వెతికి క్షేమంగా బయటికి తీసుకుని రావాలన్న సమస్యను ఆ సమయాన ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. వై.ఎస్. జీవించి ఉంటారనే అంచనాతో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. పై మూడే మూడు అతి చిన్న వ్యాఖ్యలు బాలగోపాల్ సునిశిత రాజకీయ వైఖరినీ, సూక్ష్మ గ్రహణశక్తిని వెల్లడిస్తాయి. అంతేకాకుండా తాను నవ్వకుండా ఎదుటి వారిని నవ్వించే ఆయన హాస్యరసికతను కూడా అర్థం చేసుకోవచ్చు.

హెలికాప్టర్ అదృశ్య సంఘటన గురించి జరుగుతున్న ప్రచార సమయంలో రకరకాల ఊహలు, అంచనాలతో తమ మెదళ్లకు పదునుపెట్టిన మేథో పండితులు ఈ రాష్ట్రంలో వేల సంఖ్యలోనే ఉండవచ్చు. వీరిలో రాజకీయ, సామాజిక, సైనిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలోని బహుముఖ ప్రజ్ఞావంతులు ఉండడం సహజమే. కానీ వీరందరికంటే బాలగోపాల్ దృక్కోణం గుణాత్మకంగా భిన్నమైంది. ఆయన దృష్టి నల్లమల అడవుల నుంచి రాజ్యం చేత బలవంతంగా తరిమివేయబడ్డ చెంచుల మీదనే కేంద్రీకృతమైంది. రాజ్య పాలకులు పయనించే ఆధునిక వైమానిక ప్రమాదాన్ని కూడా రాజ్యం చేత ప్రమాదంలో చిక్కుకున్న ఆదివాసుల జీవిత దృక్కోణం నుంచే ఆయన పరిశీలించారు. ఈ తత్వమే బాలగోపాల్‌ను సమకాలీన సమాజంలో సమున్నతునిగా తీర్చిదిద్దింది.

గత రెండున్నర దశాబ్దాలుగా సాగుతున్న నెల్లిమర్ల, ఏలూరు జూట్ మిల్లుల కార్మికోద్యమాల మీద వివిధ సందర్భాలలో రక్తసిక్త దమనకాండలు, ప్రాణార్పణలు, రక్తతర్పణల సంఘటనలు జరిగాయి. ఆయా సందర్భాలన్నింటా బాలగోపాల్ పాత్ర ఉంది. ఈ అన్నింటా ఆయనతో నాకు ఏర్పడిన సాన్నిహిత్యం ఆయన్ని నాకొక ఆత్మబంధువును చేసింది. ఇంకా అనేక పీడత, తాడిత ప్రజా ఉద్యమ వేదికల మీద మేము సహచరులుగా పాల్గొన్నాము. ఆయనలోని ఆదర్శాలను దగ్గర నుండి చూశాను. నెల్లిమర్ల జూట్ మిల్లు కేసులో ఆయన మృతికి రెండు రోజుల ముందు వరకూ ఆయనతో ఫోన్‌లో సంప్రదిస్తూనే ఉన్నాను. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న కార్మిక వర్గ ఉద్యమాలతో ఆయనకు గల అధిక అనుబంధం కంటే, సోకాల్డ్ నాగరిక రాజ్యం చేత అణిచివేయబడ్డ గిరిజనుల పట్ల బాలగోపాల్ అనంత తపనకే ఈ సమయంలో ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారానే ఆయనకు సరైన నివాళి అర్పించినట్లవుతుంది.

**– పి. ప్రసాద్,** ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

*13 అక్టోబర్, మంగళవారం 2009 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో*

# చరిత్రలో చెరగని కృషి చేసినవాడు

**బాలగోపాల్** హఠాన్మరణం దిగ్భ్రాంతిని గొలిపింది. ఆయన పౌరహక్కుల ఉద్యమాన్ని బలంగా నడిపిన ఉద్యమకారుడు. వరంగల్లులో 1985కు ముందు ఒక అర్థ దశాబ్ది హేతువాద ఉద్యమం నడిచింది. అప్పుడు తరచు ములుగు, పసర, దేవరుప్పల, హన్మకొండల్లో మేము సభలు, క్లాసులుపెట్టి చైతన్యం చేస్తూ ఉండేవాళ్లం. వరంగల్లు జిల్లాలో నక్సల్స్ మూమెంట్ ముమ్మరంగా నడుస్తున్న రోజులవి. పీపుల్స్ వార్‌కు అనుబంధ సంస్థలైన ఆర్‌వైఎల్, ఆర్ఎస్‌యు మొదలైన సంస్థలు ఇంకా వాటి అనుబంధ సంస్థలు పనిచేస్తూ ఉండేవి. ముఖ్యంగా విరసం, పౌరహక్కుల సంఘం యాక్టివ్‌గా ఉండేవి. ఆ కాంలో బాలగోపాల్‌కి పౌరహక్కుల ఉద్యమ నేతగా గొప్ప పేరు అక్కడ ఉంది. ఆయన నిరాడంబరంగా ఉండటం ఎన్‌కౌంటర్‌లు జరిగిన దగ్గరకు వెళ్ళి 'ఫ్యాక్ట్ ఫైండింగ్' చేసి సత్యాన్ని బయటకి నిర్భయంగా చెప్పటం చేస్తూ ఉండేవారు. నక్సలైట్ మూమెంట్ శక్తివంతంగా నడుస్తుండటం వలన దాని ప్రభావం పౌరహక్కుల ఉద్యమం మీద, విరసం మీదపడి వీళ్ళ నిజనిర్ధారణలకు మంచి ప్రతిష్ఠ వచ్చింది. ఆ సందర్భంలో ధైర్యంగా పని చేసిన వారిలో బాలగోపాల్ ఒకరు. అపుడు నక్సలైట్ అనుబంధ సంస్థల్లోగాక మరియే ఇతర సంస్థలో పని చేసినవారినైనా అభ్యుదయవాదులు కాదనే పరిస్థితి ఉంది. హేతువాద ఉద్యమం అపుడు మార్క్సిజం పునాదుల మీద నడిచేది ఒక శాఖ. ఎంఎన్ రాయ్‌లైన్‌లో నడిచేది మరొక శాఖ ఉండేవి. మేము మార్క్సు గతితార్కిక భౌతిక, చారిత్రక దృక్పథంతో హేతువాద ఉద్యమం నడపాలని తీర్మానం చేశాం. అపుడు విరసంలో ఉన్న వరవరరావు, బాలగోపాల్,

కె.వి. రమణారెడ్డి, త్రిపురనేని మధుసూదనరావుల్లో త్రిపురనేనికి తాత్వికంగా మంచి పునాదీ, క్లారిటీ ఉండేవి. కె.వి. రమణారెడ్డి చారిత్రక దృక్పథం కలిగిన విమర్శకుడిగా ఉండేవాడు. వరవరరావుకి మంచి ఉపన్యాసకుడిగా పేరుంది. బాలగోపాల్‌కు విరసం కంటే, పౌరహక్కుల ఉద్యమంలోనే పేరు వచ్చింది.

1985 కారంచేడు దురాగతం జగిరినపుడు పౌరహక్కుల సంఘం నిజనిర్ధారణకు వచ్చింది. వాళ్ళు కారంచేడులో నరికిన, చంపిన భూస్వాములను కూడా ఇంటర్‌వ్యూ చేశారని మేము వ్యతిరేకించాం. వాళ్ళు ఆ డాక్యుమెంటులో కేవలం భూస్వాములు అని వాడడం, కమ్మ భూస్వాములు అని వాడకపోవడం మీద మేము చర్చపెట్టాం. దళిత పౌరహక్కుల పోరాటం అంబేద్కర్ మార్గంలోనే నడుస్తుంది. పౌరహక్కుల వారు చెప్పే వర్గ దృక్పథంతో కాదని సిద్ధాంతపరమైన చర్చలోకి దిగాం. అపుడు బాలగోపాల్ ఎపిసిఎల్‌సి ప్రధాన కార్యదర్శి. ఆయన తరఫున సుబ్రహ్మణ్యం చర్చించారు. పౌరహక్కుల ఉద్యమం సిద్ధాంతపరమైన చర్చలలో ఉన్నా దళిత ఉద్యమాన్ని సపోర్ట్ చేసింది. సెప్టెంబర్ 1వ తేదీన మేము 'ఛలో చీరాల' నిర్వహించాం. మూడు లక్షల మంది దళిత ప్రజలు సమీకరించబడ్డారు. ఆ రోజుకు ముందు రామనాథన్ హత్య వరంగల్లులో జరిగింది. దళిత ఉద్యమం స్పష్టంగా అంబేద్కర్ మార్గాన్ని తీసుకున్నా పౌరహక్కుల ఉద్యమం దళిత ఉద్యమాన్ని కొంతమేరకు సపోర్టు చేయడం వలన పీపుల్స్‌వార్‌కు దళిత ఉద్యమానికి సంబంధాన్ని అంటగట్టడానికి పోలీసులు ఒక ప్రయత్నం చేశారు. అపుడు మాది అంబేద్కర్ మార్గమేకాక, ప్రజాస్వామ్య పద్ధతిలో మా ఉద్యమాన్ని ఎలా నడపదల్చామో లోకానికి చాటాం. ఆ తరువాత బాలగోపాల్, విరసంలో కొందరు వరంగల్లులో నివసించే పరిస్థితులు లేవని హైదరాబాద్ చేరారు. కన్నాభిరాన్ వీరికి అండగా నిలబడడంలో ముఖ్యపాత్ర వహించారు. అపుడు బాలగోపాల్ తనకు ఇష్టమైన కొశాంబి రచనల సమీక్ష గ్రంథాన్ని హెచ్‌బిటీ ఆధ్వర్యంలో తెచ్చారు. ఇపిడబ్ల్యూకి పుస్తక సమీక్షలు రాశారు.

ఆయనెపుడూ మార్క్సు వాదాన్నిగాని, అంబేద్కర్‌ని, ఫూలేని గాని అధ్యయనం చేసినట్లు చెప్పుకోలేదు. లెక్కల విద్యార్థిగా డాక్టరేట్ పొందిన స్కాలర్‌గా, లెక్చరర్‌గా అందులో ప్రావీణ్యత సంపాదించాడు. ఆ క్రమంలో సాహితీ విమర్శకుడిగా శాస్త్రీయమైనవాదనలే ఆయన చేశారు. త్రిపురనేనంత తాత్విక విమర్శకుడు

కాకపోయినా, కె.వి. రమణారెడ్డి అంత సాహితీ చారిత్రక విమర్శకుడు కాకపోయినా, వరవరరావు అంత ఉపన్యాసకుడు కాకపోయినా బాలగోపాల్‌కు తనకంటూ ఒక ముద్ర రావడానికి కారణం పౌరహక్కుల సంఘానికి అనేక సందర్భాలలో ఉద్యమరూపం తేవడమే. నిరంతరం చలనంలో ఉండటం ఆయన నైజం. బాగా చదవరి. తత్వశాస్త్రంలో రస్సెల్‌ను చదివాడంటారు. రస్సెల్ ప్రతిపాదించిన ప్రధానమైన హేతువాదం మీద మరి ఈయనేమీ రాయలేదు. చరిత్రలో కోశాంబిని వివరించాడేగాని తానుగా ఒక చారిత్రక కోణాన్ని వివరించలేదు.

ఆయన మార్క్సిజం నుండి విడిపడటంలో కూడా స్పష్టతలేదు. గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని నిరాకరిస్తూ ఆయనేమీ రాయలేకపోయాడు. ఆంధ్రలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన అనేక మంది మేధావులు తమ జీవితం చివరిలో అటు మార్క్సిజంలో కానీ, ఇటు అంబేద్కరిజంలో కాని లేదా భారతీయ తాత్విక వాదం బౌద్ధంలోగానీ, నిలవలేకపోవడానికి కారణం వారు పుట్టి పెరిగిన కుటుంబాల గిరులు ఎక్కడో మేధస్సులో పేరుకుని ఉండటమే. శ్రీశ్రీని మంత్రోచ్చారణలతో దగ్ధం చేసినా, కొ.కు. బుద్ధికొలత సిద్ధాంతమైనా, చలం రమణాశ్రమానికి చేరినా, బాలగోపాల్ మార్క్సువాదాన్ని వ్యతిరేకించినా ప్రత్యామ్నాయ తాత్విక అంశాలను వీరు ప్రతిపాదించలేకపోవడానికి కారణం వీరి కుటుంబ సంస్కృతే. భారతదేశ పునాది అంశమైన కులం పునాదిని, వర్గ పునాదిని ధ్వంసం చేసే ఒక గొప్ప తాత్విక అధ్యయనాన్ని వీరు విస్మరించడమే. అనేక సందర్భాలలో మిత్రులు కూడా నిజం చెప్పకుండా దాచేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. బ్రాహ్మణ కుటుంబాల నుండి వచ్చిన కన్నాభిరాన్, బాలగోపాల్, హరగోపాల్, వరవరరావు వీరందరూ పౌరహక్కుల కోసం పోరాడి ధైర్యంగా బూటకపు ఎన్‌కౌంటర్లుగా తేల్చడంలో చేసిన కృషిని మరువలేం. వీరికున్న వెసులుబాటు ఏమంటే, అనేక సందర్భాలలో వీరి వ్యతిరేక శక్తులు కూడా వీరి జననాన్ని బట్టి వీరికి సహకరించడం జరుగుతుంది. బాలగోపాల్ కూడా పర్సనల్‌గా బిఎస్ రాములుతో మాట్లాడేటపుడు, మాకు బ్రాహ్మణ పుట్టుకనుబట్టి ప్రచారం ఇస్తూ వుంటారు. ఓన్ చేసుకుంటారు. డిజోన్ చేసుకోరు అన్నారని చెప్పారు. ఇది నిజం. ఒకరు మరణించినపుడు ఆయన్ని పొగడడం తప్ప ఈ సమాజానికి వారు ఏమందించారో బ్రాహ్మణులు చూడరు. అన్ని తరగతుల బ్రాహ్మణులు బాలగోపాల్‌ను

సొంతం చేసుకుంటే ఆయన వ్యక్తిత్వానికి ప్రమాదం.

మార్క్సిజం వర్గనిర్మూలన చెప్తుంది. దానిని బాలగోపాల్ అంగీకరించలేదు. అంబేద్కరిజం కులనిర్మూలన చెప్తుంది. దానిని బాలగోపాల్ అంగీకరించలేదు. మార్క్సుని, అంబేద్కర్‌ని సమన్వయిస్తూ కొందరు కుల వర్గ పోరాట నిర్మూలన చెప్తున్నారు. దాన్ని ఆయన అంగీకరించలేదు. ఆయన స్వయంగా ఒక ప్రత్యామ్నాయ సిద్ధాంతాన్ని కనిపెట్టి నలుగురికి బోధించలేదు. మరి ఆయన సమాజానికి ఏమందించారు. సింపుల్‌గా ఉండటం, సంక్షిప్తంగా మాట్లాడటం, నిరంతరం ప్రజలతో సంబంధాలతో ఉండటం అనే వ్యక్తిత్వాంశాలు రాబోయే తరాలకు ఉపకరిస్తాయి. పౌరహక్కుల ఉద్యమం నుండి బొజ్జా తారకం, ఓపిడిఆర్ నుండి వచ్చిన కంచె ఐలయ్య, ఉ. సాంబశివరావు వంటి వారు దళిత బహుజన ఉద్యమాలను తాత్వికంగా శక్తివంతం చేశారు. కులాధిపత్యాన్ని ఈ పౌరహక్కుల సంఘాలు వ్యతిరేకించడం లేదనే వారు బయటకు వచ్చారు. పీపుల్స్‌వార్ నుండి బయటకు వచ్చిన సత్యమూర్తి పార్టీలో విరసంలో బ్రాహ్మణ వాదాన్ని వ్యతిరేకించారు.

భారతదేశంలో కులం సమస్య ప్రధానమైందని దళిత ఉద్యమం చర్చ పెట్టింది. ఈ చర్చల్లో బ్రాహ్మణ కులాల నుండి వచ్చి విప్లవ ఉద్యమంలో ఎదిగినవారు పాల్గొనడానికి ఇష్టపడలేదు. వారు కులంపై, అస్పృశ్యతలపై పోరాడటానికి సిద్ధపడలేదు. బాలగోపాల్ కూడా ఎప్పుడూ కులాధిపత్యం మీద మాట్లాడలేదు. ముఖ్యంగా మానవహక్కుల వేదిక ఆయన నిర్మించుకున్నాక సిద్ధాంత స్పష్టత తగ్గింది. మహాత్మాపూలే, అంబేద్కర్‌లు భారతదేశంలో మానవహక్కుల పోరాటం నడిపినవారు. వీరి సిద్ధాంతాలతో సంబంధం లేకుండా ఎలా మానవహక్కుల పోరాటం విజయవంతం అవుతుంది? సామాజిక ఉద్యమాలకు సంబంధం లేకుండా, రాజ్యహింస, గృహహింస, టెర్రరిస్టు హింసకు పరిమితమైతే భారతదేశ పునాది అంశాలు మారతాయా! కమ్మ, రెడ్డి, వెలమ, రాజు అగ్రకులాలతో పీడించబడే ఎస్‌సి, ఎస్‌టి, బిసిల సామాజిక హింస సంగతి ఏమిటి? స్త్రీలపై జరిగే పితృస్వామ్య కులహింస సంగతి ఏమిటి? ఈ ప్రశ్నలన్ని ముందుకు వస్తున్నాయి. అంబేద్కర్‌ని, పూలేని చదవనివారికి ఈ పరిమితులు ఉన్నాయి.

ఒక వ్యక్తి ఒక ఉద్యమంగా, ఒక రచయితగా, ఒక ఉపన్యాసకుడిగా జీవించినపుడు

వాళ్ళని విస్తృతిని పరిమితిని సరిగా అంచనా వేయలేకపోతే చరిత్రకు తప్పుడు సంకేతాలు వెళతాయని వరవరరావు దళితుల్లో పుట్టిన జన్ను చిన్నాలు ఎన్‌కౌంటర్ అయినపుడు అన్నారు. అసలు నక్సలైట్ ఉద్యమానికి నెత్తురుపోసి, ఆ సూర్యుణి వెలిగించింది దళితులే గదా! దాని కిరణాల వలన వచ్చిన కీర్తిని వీళ్ళు పొందుతున్నారు. ఈ మధ్య హైదరాబాదులో ఎవరు చనిపోయినా, ఒక భజంత్రీల బృందం ఏర్పడి అంతటివారు, అంతటివారని పొగడడంతో అసలు చనిపోయినవాడి వ్యక్తిత్వం మరుగునపడుతోంది. ఏ సామ్రాజ్యవాదాన్ని, పెట్టుబడిదారి వ్యవస్థను విమర్శిస్తున్నారో, ఆ సామ్రాజ్యవాదులు విప్లవాన్ని, సామాజిక విప్లవాన్ని నీరుగార్చడానికి పెట్టిన ఎన్‌జిఓ సంస్థలను కూడా వీళ్ళే వాడుకుంటున్నారు. వారు నడిపే సమాచార వ్యవస్థకు వీళ్ళే ఊపిరి పోస్తున్నారు. ఈ వైరుధ్యాలపై మాట్లాడితే మూకుమ్మడిగా ఒక ముఠాలాగా దాడులు కూడా చేస్తున్నారు. అందువల్ల సత్యాలు మరుగునపడుతున్నాయి. చివరకు స్త్రీవాద, దళితవాద, గిరిజనుల, మైనారిటీ ఉద్యమాలను కూడా మేమేనడుపుతున్నాం అని ఆపాదించుకొనే దశకు వచ్చారు.

ఈ దశలో బాలగోపాల్ వంటి వారు స్పష్టంగా చేసిన పని, ఆ తరువాత కొనసాగించటంపై చర్చ జరగడంలేదు. బాలగోపాల్ పౌరహక్కుల సంఘం నుండి బయటకు వచ్చాక అది లెటర్ ప్యాడ్ ఉద్యమంగా ఎందుకు మారిపోయింది? ఆయన మార్క్సు సిద్ధాంతం నుండి వైదొలగినా వరవరరావు వంటి వాళ్లు సిద్ధాంతపరంగా ఎందుకు ఖండించడంలేదు. అంబేద్కర్ మీదగాని మహాత్మఫూలేమీదకాని వీళ్ళు ఎపుడూ ఎందుకు రాయడంలేదు. దళిత బహుజన నాయకత్వాన్ని వీరెందుకు ఎంకరేజ్ చేయడం లేదు? బాలగోపాల్‌ని తనకు తానుగా చేసిన కృషికి ప్రచారం రానివ్వండి.

ఏది ఏమైనా ఆయన అకాల మరణం ఒక పెద్ద లోటు. 57 ఏండ్లకే ఆయన జీవితం ముగుస్తుందనుకోలేదు. ఆయన చేసిన కృషి చెరిగిపోదు అనేది సత్యం.

**– కత్తి పద్మారావు**

*అక్టోబర్ 14, బుధవారం, 2009 'వార్త' దినపత్రికలో*

# ఆ 'బాలగోపాల' ఆత్మీయ హక్కు

**పౌరహక్కుల** ఉద్యమంలోనే ప్రవహించే ఉత్తేజం, కె. బాలగోపాల్ ప్రస్థానం అర్థాంతరంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆబాల గోపాలాన్ని తన మేథస్సుతోను, అనితర సాధ్యమైన మార్గంతోను చైతన్య పరచిన మహా మనిషి నిష్క్రమించడం తెలుగువారికి పూడ్చలేనిలోటు. 57 ఏళ్ల జీవితంలో రాజ్యం రూపంలో వచ్చిన మృత్యువును గుండెధైర్యంతో వేలసార్లు గెలిచినా, అదే గుండె ఆగడంతో తనువుచాలించడం యాధృచ్ఛికమేమి కాదు. ప్రజా సమస్యలు, డిమాండ్ల పట్ల కలలో కూడా నిర్లక్ష్యం చూపని ఆయన తన ఆరోగ్యం పట్ల ఎల్లవేళలా నిర్లక్ష్యంగా వ్యవహరించేవాడు. వరంగల్‌లో ఒంటరిగా గడిపిన రోజుల్లో ఉదయం చాయ్, బిస్కట్లు, సాయంత్రం మిర్చిలతో దినచర్యను ముగించిన సందర్భాలు అనేకం నాకు తెలుసు. ప్రపంచంలో ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా గాఢంగా ప్రతిస్పందించే అద్భుతమైన లక్షణం బాలగోపాల్‌ది! ఆ విలక్షణమైన తీరే ఆయనను ఆదివాసీలకు, రైతులకు, కార్మికులకు, విద్యార్థులకు ఆత్మబంధువుని చేసింది. గణిత శాస్త్రంలోని చిక్కుల్నేకాదు. చిక్కుల్లో వున్న బడుగు జీవుల సమస్యల్ని అలవోకగా పరిష్కరించిన మేధావి ఆయన.

రాజ్యహింసపై రాజీలేని పోరాటం చేయడమేకాదు, బాణమతి, చేతబడి లాంటి మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడారు. సాగునీరు, తాగునీరు, రిజర్వేషన్లు, రైతుల గిట్టుబాటు ధరలు, అధిక ధరలు, కరంటు కష్టాలు, ఇలా ఒకటేమిటి....ప్రజలకు కష్టం, నష్టం ఎక్కడవున్నా, బాలగోపాల్ అక్కడ ప్రత్యక్షమయ్యేవాడు. చాలా సందర్భాలలో రాజ్యానికి ఆయనో సవాల్! పోలీసులకు, పాలకవర్గాలకు ఆయనో కొరకరాని కొయ్య!! ప్రజలకు మార్గదర్శి!!

బాలగోపాల్‌కు ముందూ తర్వాత : ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యం పౌరుల హక్కుల్ని ఉల్లంఘించిన సందర్భాలు తక్కువేమి కాదు. నాటి తెలంగాణ పోరాటం నుండి నిన్నటి ముదిగొండ వరకు నిరాయుధులైన ప్రజలపై రాజ్యం కర్కశంగా తుపాకిగుళ్లు కురిపించింది. అది శ్రీకాకుళమైనా, ఇంద్రవెల్లైనా నేలకొరిగింది మాత్రం అతి సాధారణమైన పౌరులే. ఆంధ్రప్రదేశ్‌లో పౌరహక్కుల ఉద్యమాలు బలంగా లేనందునే నాడు అమాయకుల ఆర్తనాదాలు బలంగా వినిపించలేదు. 1981 తర్వాత పరిస్థితుల్లో మార్పు వచ్చింది. నిజనిర్ధాణలో సిద్ధహస్తులైన బాలగోపాల్ లాంటి మేధావులు హక్కుల ఉద్యమంలోకి ప్రవేశించడంతో ఆ సంస్థలు పరిపుష్టిని సంతరించుకున్నాయి. అప్పటివరకు మాలపల్లిలో ఉన్నవ చెప్పినట్టు ధనవంతులు పేదలను దోచుకుంటే దాని పేరు వ్యవహారం, పేదలు తమ హక్కును తీసుకుంటే చౌర్యం అన్నట్టుగా ఉండేది. దశాబ్దాల తరబడి ఎంతో స్తబ్ధతగా, నామమాత్రంగా ఉన్న హక్కుల ఉద్యమం, బాలగోపాల్ ప్రవేశంతో స్పష్టత, అంతకుమించిన చైతన్యంతో తొణికిసలాడింది. కేవలం మేధావులు, నగరవాసుల చుట్టూ పరిభ్రమించే పౌరహక్కుల ఉద్యమం ఆ ఊపుతోనే అడవిబాట పట్టింది. గిరిపుత్రులు సైతం రాజ్యపుత్రులు సైతం రాజ్యాన్ని ప్రశ్నించేస్థితికి ఎదిగారు. దున్నేవాడికే భూమిపై హక్కు దగ్గరనుండి రైతుల ఆత్మహత్యల వరకు, రైతులకు గిట్టుబాటు ధర నుండి ఉపాధి హామీలో అవినీతి వరకు, అడవిపై ఆదివాసీల హక్కుల నుండి పారిశ్రామిక కాలుష్యం వరకు పౌరహక్కుల ఉద్యమం ఎంతో సాధికారిత సాధించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల ఉద్యమం పేదోడికి అండగా, గొంతుగా రూపుదిద్దుకుంది. ఈ హక్కుల సంఘాన్ని వ్యక్తిగత హక్కుల నుండి సార్వజనీన స్థితికి చేర్చిన ఘనత మాత్రం బాలగోపాల్‌దే! ఆర్థిక, సామాజిక, సాంఘిక, రాజకీయ సమస్యలను పరిష్కరించే దశకు సంఘం విస్తరించింది. పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కల్గించే రాజ్యహింసనే కాదు, ప్రైవేటు హింసను, చివరకు నక్సలైట్ హింసకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన సందర్భాలున్నాయి. కంపెనీల మూసివేతలకు, ప్రత్యేక ఆర్థిక మండళ్ల నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సంఘాన్ని సర్వసన్నద్ధం చేసిన ఖ్యాతి బాలగోపాల్‌దే. జూనియర్ డాక్టర్ల సమ్మెనుండీ, వాకపల్లి గిరిజన యువతులపై పోలీసుల అఘాయిత్యం వరకు వాటి వెనుక వున్న వాస్తవాలను, ఆధారాలు లోకానికి తెలిశాయంటే బాలగోపాల్ వంటి మేధావుల కృషి

వల్లనే తప్ప మరొకటి కాదు. రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు పౌరులు స్వయంగా కాపాడుకోలేరని, అందుకు సంఘం అవసరం అనివార్యమని మూడు దశాబ్దాల బాలగోపాల్ త్యాగాలు తెలియచేస్తున్నాయి.

**నిత్య సత్యాన్వేషి :** బాలగోపాల్ జీవితంలో ఎక్కువ భాగం సత్యాన్వేషణ కోసం, సంపాదనలో అధికశాతం పుస్తకాలకే ఖర్చయిందంటే అతిశయోక్తి కాదేమో, సత్యాన్ని వెదికి పట్టడంలోను, వెల్లడించడంలోను ఆయనకు ఆంధ్రప్రదేశ్‌లో మరొకరు సాటిరారు. కాకతీయ యూనివర్సిటీలో బంగారం లాంటి అధ్యాపకవృత్తిని వదిలిపెట్టి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపల్లెను వెన్నుతట్టి నిద్రలేపిందీ సత్యాన్వేషణ కోసమే.

పౌరహక్కుల సాధనే ధ్యేయంగా, నిరంతర పోరాటమే ఒక సందేశంగా జీవించిన బాలగోపాల్ తన సత్యాన్వేషణ తనకు శత్రువుగా మారుతుందని తెలిసినా, ఏనాడు పక్కకు జరగలేదు. ఈ దారిలోనే నల్లతాచులు, పచ్చతాచులు విషం చిమ్మినా, చట్టబద్ధ గూండాలు చంపడానికి ప్రయత్నించినా, బంధించినా, జైల్లో నిర్బంధించినా ధైర్యంగా సత్యాన్నే పల్కాడు. నిరక్షరాస్యులకు సైతం ప్రాథమిక హక్కులను పరిచయం చేసినవాడు. రాజ్యాంగంలోని జీవించే హక్కును ఆకాశానికెత్తడంలో చొరవ చేసినవాడు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ కారణాలవల్ల మృతప్రాయంగా వున్న పౌరహక్కులకు ప్రాణం పోసి, పల్లెల్లో రాజ్యాంగ స్ఫూర్తిని రగిల్చిన వాడు బాలగోపాల్! ఆర్థిక, సామాజిక, భౌగోళిక, తత్వ, న్యాయ శాస్త్రాలను అవపోశనపట్టిన నిష్ణాతుడు. అధ్యయనంలో, అన్వేషించడంలో, ఆచరించడంలో, ప్రచారం చేయడంలో ఆయనకు ఆయనేసాటి. అతికొద్ది కాలంలోనే న్యాయశాస్త్రానికి కొత్త శోభతెచ్చాడు. లాకప్ డెత్‌లు, ఎన్‌కౌంటర్లు, అత్యాచారాలు, ఆత్మహత్యలు లాంటి సామాజిక, రాజకీయ రుగ్మతలను నివారించడానికి నిరోధించడానికి, న్యాయస్థానాల్లో అలుపెరగని పోరాటం చేసిన వారిలో బాలగోపాల్ అగ్రగణ్యుడు. ఈ రాష్ట్రంలో రాజకీయ పార్టీలకు, కార్మిక సంఘాలకు లేని దార్శనికత, సామాజిక స్పృహ, అవగాహన బాలగోపాల్‌లో ఇమిడి ఉండటం ఆశ్చర్యకరం. సింగరేణి, ఆర్టీసీ, రైల్వే, టెలికం, విద్యుత్‌లాంటి ప్రభుత్వరంగ సంస్థల్లో అమలుచేస్తున్న నూతన ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ పర్యవసానాలు పూసగుచ్చినట్లు విశ్లేషించడంలో ఆయన దిట్ట. కేవలం పాలకవర్గ స్వభావం వల్లనే దేశంలో, రాష్ట్రంలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదనేది ఆయన ప్రధాన ఆరోపణ. చైతన్యంతో సంఘటితంగా

ప్రజలు పోరాడితేనే ఈ పెనుగండం నుండి బయటపడతామనేది ఆయన విశ్వాసం. ఈ సత్యాన్ని ఆయన చివరి ఘడియల వరకు ప్రచారం చేశారు.

**మరవరాని మహామనీషి :** బాలగోపాల్ సంపూర్ణ మానవుడు. అతన్ని వ్యతిరేకించేవారు సైతం ఆయన వ్యక్తిత్వాన్ని వేలుపెట్టి చూపే సాహసం చేయరు. అంతెందుకు పాలకులు, పోలీసులు కూడా ఆయన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం చేయలేందంటే ఆయన నిరాడంబరత, జీవన విధానం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. ఒక చేతిసంచి, పుస్తకం, సైకిల్‌తో వేల కిలోమీటర్లు తిరిగి రాష్ట్రాన్ని అధ్యయనం చేసిన వ్యక్తి. వరంగల్‌లో ఆయన ఒంటరిగా వున్నప్పుడు కేవలం రెండు జతల బట్టలతోనే కాలం వెళ్లదీసిన సాదాసీదా మనిషి. నేటి మేధావులకుండే గర్వం గాని, లెక్కలేని తనం కాని, అహంభావం కాని ఆయనలో మచ్చుకైనా లేవు. ప్రజల కోసం అధ్యయనం చేయడం, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం మాత్రమే ఆయనకు తెలిసిన విద్య. ఇలాంటి వ్యక్తిత్వం, ఆహార్యం వున్న మనిషి మన సమకాలీనుల్లో చాలా అరుదుగా కనిపిస్తారు. ఎంత నిర్బంధం చవిచూసినా, ఎంత కష్టం, నష్టం ఎదురైనా ఆయన నమ్మిన ఆశయాలను ఎక్కడ పలచన కానివ్వలేదు. ఆయన "సై" అంటే కోటి పదవులు కాళ్లవద్దకు వచ్చి పడేవి. అయినా ప్రభుత్వ పదవులపై ఏనాడు కన్నెత్తి చూడలేదు. రావిశాస్త్రి అన్నట్టు లోకంలో దౌర్భాగ్యులందరికీ ఏడవడానకి తప్ప మరో హక్కంటూ లేని స్థితిలో పేదలకు రాజ్యాన్ని నిలదీయడం నేర్పిన సాహసి. హక్కుల గురించి బోధించిన మహోపాధ్యాయుడు, ఖరీదైన చట్టాలను సైతం పేదలకు చట్టంగా మార్చిన ప్రజాన్యాయవాది బాలగోపాల్!

**- కృష్ణతేజ**

*బుధవారం, 14 అక్టోబరు 2009, 'ఆంధ్రప్రభ' పత్రికలో*

# హక్కుల భాష బాలగోపాల్

**బాలగోపాల్** మానవ హక్కుల ఉద్యమాలలో ఎంత ఎత్తుకు ఎదిగినా అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. తాను నమ్మిన విశ్వాసాలను నిత్య జీవితంలో ఆచరించి చూపారు. హక్కుల కార్యాచరణే ఊపిరిగా జీవించారు. ఉద్యమం వెలుపల ఆయనకు మరొక జీవితం లేనేలేదు. ఆయన శక్తినంతటిని 1981 నుండి చివరి శ్వాస వరకు అనుక్షణం పేదలకు న్యాయాన్ని అందించడానికి, వారి హక్కులు కాపాడడానికి ఉపయోగించారు. హక్కుల పరిభాషను గ్రామీణ ప్రజలు ఆయన పేరుతోనే గుర్తించారు. బుద్ధిజీవులు సామాజిక రాజకీయ పరిణామాల ప్రజాస్వామిక స్వభావాన్ని అంచనా వేయడానికి ఒక హక్కుల ప్రమాణాన్ని ప్రతిపాదించిన వ్యక్తిగా అతన్ని భావిస్తారు. విలువలు పతనమౌతున్న న్యాయవాద వృత్తిలో అత్యంత నిబద్ధత కలిగిన న్యాయవాదిగా రాణించారు. ప్రజా జీవితంలో నైతిక వర్తనకు దిక్సూచిగా ఉండటమే కాక ప్రజా ప్రయోజనాలకు రాబోయే ముప్పు గురించి హెచ్చరించే కర్తవ్యాన్ని కూడా సమర్థవంతంగా నిర్వర్తించారు.

రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి మరణానంతర రాజకీయ పరిణామాలపై బుద్ధిజీవుల అవకాశవాద తీరు పట్ల బాలగోపాల్ తీవ్ర ఆవేదన చెందారు. అక్టోబర్ 2, 3 తేదీలలో జరిగిన మానవ హక్కుల వేదిక మూడవ మహాసభల సందర్భంగా కార్యకర్తలకు ఆయన చేసిన హెచ్చరిక ఈ రాష్ట్ర బుద్ధిజీవులకూ వర్తిస్తుంది. 'ఇది (మానవ హక్కుల వేదిక) మన రాష్ట్రంలోని ప్రజా ఉద్యమాల చరిత్రలో ఒక కొత్త ప్రయోగం. దీనిని నిలబెట్టలేకపోతే మన ప్రయత్నానికే కాక విలువలు మనుషుల్ని ఒక దగ్గరకు

తీసుకురాగలవన్న ప్రజాతంత్ర విశ్వాసానికి కూడా నష్టం చేసిన వారమౌతాం. నిలబెట్టడమే కాక విజయవంతంగా ముందుకు తీసుకుపోయినట్టయితే ప్రజాస్వామ్య భావనకు బలంచేకూర్చిన వాళ్లమౌతాం.' ఈ ఏడాది జూలైలో మరణించిన హక్కుల కార్యకర్త నరేంద్రనాథ్ గురించి ఆయనే చెప్పినట్టు 'ప్రజలకు సమస్యలున్నంతకాలం విశ్రమించకూడదని' నమ్మినవారు బాలగోపాల్. వారి స్ఫూర్తితో ప్రజాతంత్ర కృషికి కలిసి రమ్మని పిలుపునిస్తూ....

**– కె. మురళి,** మానవ హక్కుల కార్యకర్తల తరఫున

*బుధవారం, 14 అక్టోబర్ 2009 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో*

# జీవితమే ఒక ప్రయోగం

**గాంధీ** తన ఆత్మకథను 'సత్యాన్వేషణలో ప్రయోగాలు' అని పేర్కొన్నారు. మానవ సమాజంలో సమూహాలు సమష్టిగా ప్రయోగాలు చేస్తుంటాయి. కానీ వ్యక్తులు ప్రయోగాలు చేయడం అరుదు. ప్రకృతి శాస్త్రాల అధ్యయనానికి సామాజిక శాస్త్రాల కంటే మౌలికమైన తేడా అదే. ప్రకృతి శాస్త్రాల్లో ప్రయోగాలు ప్రయోగశాలల్లో చేస్తుంటారు. కాని మనుషుల మీద ప్రయోగాలు చేయడం సాధ్యం కాదు. కాని మనుషులు సమిష్టిగా చేసే ప్రయోగాలే ఉద్యమాలు. సాధారణంగా వ్యక్తులు సామాజిక విలువలకు, ఆచారాలకు, సాంప్రదాయాలకు, విశ్వాసాలకు అనుగుణంగా జీవిస్తుంటారు. అవి సరియైనవి కావని తెలిసినా, అంతరాత్మకు అంగీకారం కాకున్నా బలమైన బాహ్య ప్రపంచానికి లొంగిపోవడమో, రాజీపడడమో జరుగుతుంది. కాని కొందరు అరుదైన వ్యక్తులు బయటి ప్రపంచంతో రాజీపడకుండా తాము ఏది విశ్వసిస్తారో దాన్నే ఆచరిస్తుంటారు. ఇలాంటి వ్యక్తులు మానవ నాగరికత మీద పెట్టుకున్న అన్ని విలువల సారానికి వ్యక్తీకరణగా సాక్షాత్కరిస్తారు. ఈ వ్యక్తులపట్ల బలవంతులకు, రాజ్యానికి ఆగ్రహం ఉంటుంది. ఈ ప్రవర్తన వ్యవస్థ పునాదులను కదిలిస్తుందని వాళ్ల భయం. అందుకే అలాంటి వ్యక్తుల మీద దౌర్జన్యం చేస్తుంటారు. ఆ దౌర్జన్యానికి నిర్భయంగా నిలబడ్డ వ్యక్తులే సామాజిక మార్పును వేగవంతం చేస్తుంటారు. ఆ కోవకు చెందిన అద్భుత మనిషే బాలగోపాల్. ఆయన బయటి ప్రపంచం పొగిడితే పొంగలేదు. విమర్శిస్తే కృంగలేదు. తనను వేధిస్తే భయపడలేదు. తాను సత్యమని నమ్మిన దాన్ని ఆచరిస్తూ ముందుకు సాగాడు. ఈ ప్రయోగం విలువను రాబోయే తరాలే సరిగా అంచనా వేస్తాయి.

జీవితంతో ప్రయోగం చేసే వాళ్లకు కొన్ని విశిష్ట, విలక్షణమైన లక్షణాలుంటాయి. ఒకటి వాళ్లకు మరణమంటే భయం ఉండదు. ఆ సంసిద్ధత వాళ్లు చేసే సాహసాలకు మూల కారణం. ప్రాణమంటే అందరికి ప్రేమే. అయితే ప్రాణులందరూ నిండుగా అర్థవంతంగా బతకడానికి ఇప్పుడున్న వ్యవస్థలో సాధ్యపడదని, అది మారాలని కాంక్షించే తత్వవేత్తలు, సంస్కరణవాదులు, విప్లవకారులు మార్పు కొరకు పోరాడుతుంటారు. ఒక మానవీయ సమాజం కొరకు జరిగే అన్వేషణలో, సంఘర్షణలో ప్రయోగాలు అనివార్యమని జీవితంలోనే ప్రయోగం చేస్తారు. ఈ సాహస ప్రయోగాలు చేసే వ్యక్తులు సమాజం ముందుకుపోవడానికి దోహదపడతారు. ఈ క్రమంలో వాళ్ళు మరణాన్ని గురించి భయపడరు. చావు గురించి ఎప్పుడైనా ప్రస్తావన వస్తే, మనిషి ఎప్పుడైనా చనిపోతాడు. చనిపోవలసిందే కదా అని బాలగోపాల్ అనేవాడు. వ్యాస్ మీద దాడి జరిగినప్పుడు అనుకోకుండా బాలగోపాల్, నేను కణ్ణబీరన్‌ను కలవడానికి వెళ్లాం. అప్పటికే కొందరు పౌర హక్కుల నాయకులను కోల్పోయి ఉన్నాం. మరునాటి ఉదయం కణ్ణబీరన్ వారించినా వినకుండా ఏదో మీటింగ్ ఉంది వస్తానని ఒప్పుకున్నానని చెప్పి వెళ్ళిపోయాడు. రాజ్యం మనిషి ప్రాణాన్ని తీసుకోవాలని తలిస్తే మనిషిని రక్షించడం చాలా కష్టం అని అంటూ మరొక సభకు వెళ్లి చావడమా, లేక వెళ్ళకుండా చావడమా అనేదే సవాలు అని అన్నాడు. ఒకసారి విజయవాడలో ఒక సభకు వెళితే మీడియా బాలగోపాల్‌ను భిన్నకోణాలనుంచి కెమెరాలో బంధించడానికి ప్రయత్నిస్తుంటే తెలుగు మీడియాలో నిరాశావాదం చాలా పెరిగింది అంటూ, తనను రాజ్యం చంపితే తన మరణవార్త లేదా నివాళి కాలం కొరకు ఫొటోలు తీస్తున్నారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించాడు. మరొక సందర్భంలో తనకు ఏదైనా నయంకాని జబ్బు వస్తే ఆదిలాబాదులో గోదావరి నది చాలా అందంగా ఉన్న ప్రదేశం ఒకటి ఉందని అక్కడ చస్తానని అన్నాడు. బర్ట్రాండ్ రసల్ కూడా ఇలాగే మూడు నాలుగు సార్లు చావాలని నిర్ణయించుకున్నానని తన ఆత్మకథలో వ్రాసుకున్నాడు.

బాలగోపాల్ లాంటి వ్యక్తులు తాము చేసే ప్రయోగంలో శరీరాన్ని చాలా నిర్లక్ష్య భావనతో చూస్తారు. అది అందరికి చాలా తప్పు అనిపించినా అది వాళ్ల నైజం. ఆయనతో పనిచేసిన చాలామంది హక్కుల ఉద్యమ సభ్యులకు ఆయన తన శరీరాన్ని ఎంత బాధకు గురిచేశాడో తెలుసు. హింసకు వ్యతిరేకంగా పోరాడే మీరు మీ శరీరాన్ని

చాలా హింసకు గురిచేస్తున్నారు. అది ఏదో ఒక రోజు తిరుగుబాటు చేస్తుంది. అని అంటే నవ్వి ఊరుకునేవాడు. స్నానము, నిద్ర, ఆకలి, వేసుకునే బట్టలు, చెప్పులు, తలదువ్వుకొనడం ఇవేవీ ఆయనకు పట్టేవి కావు. షేవింగ్ చేసుకోవాలంటే ప్రయాణంలో షేవింగ్ సామాగ్రి దగ్గర ఉంటే మారణాయుధాలతో తిరుగుతున్నాడని ఏదో కేసులో పోలీసులు ఇరికించవచ్చు అని నవ్వేవాడు. ఒకసారి మండుటెండలో ఒక ఇసుక లారీ పోతుంటే దాంట్లో పడుకొని పోతే చాలా హాయిగా ఉంటుంది కదా అంటే చాలా ఆశ్చర్యపోయాను. మరొక సందర్భంలో గుంటూరులో ఒక సభకు ఇద్దరం వెళ్ళవలసింది. తాను ఒక రోజు ముందే గుంటూరు బయలుదేరుతూ 'మీకు స్థలాలు సరిగా గుర్తుండవు కాబట్టి నేను ఉదయం రైల్వే స్టేషన్‌కు వస్తానని స్టేషన్‌కు వచ్చాడు. రాత్రి ఎక్కడ పడుకున్నారు అని అడిగితే మన మీటింగ్ పోస్టర్లను పట్టణంలో అతికిస్తూ గడిపానని అన్నాడు. ఒక పర్యాయం ఇద్దరం కలిసి మూడు నాలుగు రోజులు వరుసగా భిన్నప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు, ఉదయం ఒక అరటిపండు, మధ్యాహ్నం ఒక అరటిపండు, రాత్రికి రెండు తింటూ గడిపాడు. భోజనం చేయమని ఎంత బలవంతం చేసినా వినలేదు. కాని నా భోజనాన్ని గురించి తగు జాగ్రత్తలు తీసుకున్నాడు. ఈ నిర్లక్ష్యమే ఆయన ప్రాణాన్ని తీసుకుంది. కడుపులో అల్సర్ ముదిరి అది చిట్లుతున్న దశలో ఆయన సహచరి వసంత బలవంతం మీద డాక్టర్ దగ్గరికి స్కూటర్ నడుపుతూ వెళ్ళాడు. తన తీవ్ర బాధను చెప్పుకోకపోవడం వల్ల డాక్టర్ కూడా జబ్బు తీవ్రతను సరిగ్గా గుర్తించలేకపోయాడు. డాక్టర్లకు ఇలాంటి వ్యక్తులు కూడా ఉంటారని తెలియదు. బాలగోపాల్‌ని ఈ ఒక్క విషయంలో మాత్రం క్షమించలేం.

బాలగోపాల్ ప్రయోగంలో పౌరహక్కులపట్ల వచ్చిన నమ్మలేని మార్పు మరొక పార్శ్వం . నేను పౌరహక్కుల ఉద్యమంలో బాధ్యతలు తీసుకున్న తర్వాత, విప్లవ ఉద్యమాలతో సంబంధం పెట్టుకుంటే మంచిది అని సలహా ఇచ్చాడు. ఇవి రెండు ఉద్యమాలకు అవసరం అని భావించాడు. అదే బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమాలకు స్వతంత్ర కార్యక్షేత్రం ఉండాలని ప్రతిపాదించాడు. ఈ మార్పు 1990-91 ప్రాంతంలో ఆయనలో వచ్చిందని నేననుకుంటున్నాను. ఇది సోవియట్ యూనియన్ కూలిపోయిన క్రమంలో వచ్చి ఉండవచ్చు. నేను ఆ మాటంటే తాను అంగీకరించేవాడు కాదు.

సోవియట్ యూనియన్ ఒక మార్క్సిస్టు సిద్ధాంత వెలుగులో ప్రపంచ చరిత్రను, మానవ పరిణామ దశను మార్చిన అద్భుత సంఘటన అని అందరం అనుకున్నాం. మానవాళికి పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి విముక్తి పొంది, ఒక ప్రత్యామ్నాయ గమ్యం ఆవిష్కరించబడుతున్నదని విశ్వసించేవాళ్లకు ఈ పతనం సునామీలాగా తగిలింది. ఈ వైఫల్యానికి ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతున్న కాలంలో బాలగోపాల్ సార్వజనీన నైతిక విలువల గురించి ఆలోచించి మాట్లాడడం ప్రారంభించాడు. దాంట్లో భాగంగానే మానవ ప్రవృత్తిమీద, మార్క్సిజం మౌలిక సూత్రీకరణల మీద చర్చ ప్రారంభించాడు.

ఆయన జీవితంలో, ఆచరణలో అదొక కొత్త ప్రారంభం. అంతకాలంగా తాను విశ్వసించిన విశ్వాసాలకు పనిచేసి మళ్లీ కొత్త ప్రశ్నలతో ప్రతిపాదనలతో కార్యాచరణ ప్రారంభించాడు. అలా అని ఆయన అంతకాలంగా సమర్థించిన ఉద్యమాలను తిరస్కరించలేదు. వాటిమీద ఒక విమర్శ మాత్రమే పెట్టాడు.

నాకు తెలిసినంత వరకు ఉద్యమాల మీద విమర్శే కాని తిరస్కార భావం లేదనడానికి ఎన్నైనా ఉదాహరణలున్నాయి. ఆ మధ్య ఒక టీవీ చానల్ వాళ్ళు విప్లవ ఉద్యమాలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయి కదా అని అడిగితే అది మంచిదే కదా అని అన్నాడు. ఆయన పెట్టిన విమర్శకీ పీపుల్స్‌వార్ పార్టీ ఒక పుస్తకమే వేసింది. ఆ పుస్తకాన్ని బాలగోపాల్‌కు నేనే ఇవ్వవలసి వచ్చింది. ఆయన ఆ పుస్తకాన్ని చాలా ఆసక్తిగా చూస్తాడేమోనని ఆశించిన నాకు ఆయన దానిని తెరవకుండా పక్కకు పెట్టి నేను వ్యాసం రాసింది. వాదించడానికి కాదు వాళ్ల ఆచరణ మెరుగుపడడం కొరకు అన్నప్పుడు నేను చాలా ఆశ్చర్యపోయాను. మరొక సందర్భంలో మీ వ్యాసాన్ని రాజ్యం దురపయోగం చేస్తున్నది అన్నప్పుడు 'ఆ వ్యాసం మరెవరైనా వ్రాస్తే బావుండేది' అన్నాడు. విప్లవ ఉద్యమాలకు ఒక సమగ్రమైన మానవీయ నైతిక చట్టం ఉండాలన్న అంశాన్ని ఆయన చాలా బలంగా విశ్వసించాడు.

తన ప్రాపంచిక దృక్పథంలో నైతిక విలువల కోణం చేరిన తర్వాత ఏ సమస్యను చూసినా ఆ కోణం నుండే చూశాడు. ఉద్యమాలు కూడా ఆ కోణం నుండి చూడాలని ఆశించాడు. ఆ విలువలను తాను తన నిత్య జీవితంలో పాటిస్తూ వాటి సాధ్యాసాధ్యాలను పరీక్షిస్తూ వచ్చాడు. ఉద్యమాలు న్యాయభావనను వదలకూడదని అంటూ పౌరహక్కుల లేదా మానవ హక్కుల ఉద్యమం ఆ నైతిక పునాది మీద

నిర్మాణం కావాలని ప్రతిపాదించాడు. అప్పుడే పౌరహక్కుల ఉద్యమం సామాజిక సంఘర్షణకు, అన్నిరకాల ప్రజాఉద్యమాలకు ప్రయోజనకరంగా ఉంటుందని అప్పుడే మానవ విలువలు ఉన్నతీకరించబడతాయిని, పౌరహక్కుల కార్యకర్తలకు మరింత స్పష్టమైన కార్యాచరణ సాధ్యమవుతుందని అనేవాడు.

అయితే ఈ మానవీయ ప్రయోగం విలువ సాధ్యాసాధ్యాలను బేరీజు వేయడం ఇప్పటికిప్పుడే సాధ్యం కాదు. ఢిల్లీలో జరిగిన ఒక సంఘటనతో దీనిని ముగిస్తాను. ఢిల్లీలో పియుడిఆర్ నిర్వహించిన సభలో బాలగోపాల్ ఉపన్యసించిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో బోధిస్తున్న సుదీప్తో (ఇతను అంతర్జాతీయ ప్రఖ్యాతి కలిగిన రాజనీతి శాస్త్ర ఆచార్యులు) ప్రొ. రణధీర్‌సింగ్‌తో 'ఈ మనిషి మాట్లాడడం చూస్తే పర్వాలేదు అనిపిస్తుంది (this man talks some sense) అన్నాడు. దీంతో కోపోద్రిక్తుడైన రణధీర్‌సింగ్ సుదీప్తో నీవు నేను దేహం ముగించిన నాడే మన అస్తిత్వం కూడా ముగుస్తుంది. బాలగోపాల్ భవిష్యత్తు తరాలను ప్రభావితం చేసి జనం జ్ఞాపకాలలో వాళ్ల ఆచరణలో మిగిలిపోతాడు' అని అన్నాడు. రణధీర్‌సింగ్ స్వయాన నాకీ విషయం చెప్పాడు. బహుశా బాలగోపాల్ గురించి, ఆయన మానవీయ ప్రయోగం గురించి ఇంతకంటే మించిన అంచనా ఏం ఉంటుంది?

**– ప్రొ. జి. హరగోపాల్**

*(వ్యాసకర్త ప్రముఖ సామాజిక వేత్త)*

*బుధవారం, 14 అక్టోబర్ 2009 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో*

# చివరి మనీషి!

**గాంధీ** గురించి ఐన్‌స్టీన్ అన్న మాటలు బాలగోపాల్‌కు కూడా వర్తిస్తాయి. ఇటువంటి మనిషి ఈ భూమ్మీద రక్తమాంసాలతో నడిచాడంటే నమ్మడం కష్టం. అతిశయోక్తి అనిపించినా ఇది నిజం. జీవితాన్ని నమూనా చేసి వెళ్ళిపోయినవారు. అందులోనూ ఊహించుకోవడానికే భయమేసేంతటి ప్రమాణాలు నెలకొల్పి ప్రజా రాజకీయాల్లో ఉన్నామనుకునే వారిని కూడా ఇరుకున పడేసి వెళ్ళారు. మేధస్సులో ఆయనతో సాటిరాగల వారు అరుదు. ఆచరణలో చెప్పనక్కర్లేదు. విడివిడిగానే ఆయన లోటును పూడ్చగలిగిన వారు కనుచూపు మేరలో కనిపించటం లేదు. ఇక రెండూ కలగలిసి అసాధ్యం, మేధాశ్రమ, శారీరక శ్రమ అని చాలా మాట్లాడుతుంటాం. ఆ రేఖలను జీవితంతోనే పూర్తిగా చెరిపేసినవారు. ప్రతివారం ఆయన సగటున వేయి కిలోమీటర్లు పర్యటిస్తారు. దాదాపు అంతా బస్సుల్లోనే, ప్రభుత్వ బస్సుల్లోనే. హిమాచల్‌ప్రదేశ్ లాంటి ఒకట్రెండు మినహాయిస్తే దేశంలోని ఏ రాష్ట్రంలోని ప్రాంతమైనా మన పక్కనే ఉన్న ఊరి గురించి చెప్పినంత సులభంగా రూట్లు, బస్సుల వేళల గురించి చెప్పగలడంటే ఆయన ఏ రీతిలో పర్యటించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

ఏ వేదిక మీదనైనా దానికి సంబంధించిన అంశం మీదే నిర్దిష్టంగా మామూలు మాటల్లో అందరికీ అర్థమయ్యేలా మాట్లాడడం ఆయనలో ఉన్న ప్రత్యేకత, బహుశా తిరుగులేని స్పష్టతవల్లో తడుచుకోవాల్సిన అవసరం కానీ ఉపన్యాసాన్ని ముందే రూపొందించుకోవలసిన అవసరం కానీ లేకపోవడం వల్లో ఆయన మాటల ప్రవాహ

వేగం ఎక్కువ. అది జలపాతపు హోరు సెజ్‌లో భూమి పోతున్న రైతాంగంతో ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రపంచ బ్యాంక్ కుట్ర, రాజ్య స్వభావం వంటి పెద్దపెద్ద మాటల్ని కుమ్మరించరు. ఎందుకు పోతుందో, ఎవరికి పోతుందో స్పష్టంగా వివరిస్తారు. మానవహక్కుల కరపత్రాలు, బుక్‌లెట్లు దీనికి మంచి ఉదాహరణ. తెలుగు సీమ మీద కరపత్ర సాహిత్యానికి బాలగోపాల్ కూర్పు అది. గతంలో బస్టాండులో నిలబడి వివిధ సంస్థల వారు కరపత్రాలు పంచుతున్నప్పుడు.. వరిబీజం...కరపత్రాలలాగే - ఒక సెకన్ అలా చూసి విసిరిపారేసే వారు ఎక్కువ మంది. ఎత్తుకోవడం ఎత్తుకోవడమే పీకల్లోతు కూరుకుపోయిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ అని భయపెడితే ఏదో వింత భాష అనుకుని అలా పడేయడం సహజం. సానుభూతి పరుల విషయం వేరే. వాళ్ల కోసం కాదు కదా కరపత్రాలు, ఉపన్యాసాలు!

ఇంకోవైపు ఆయన సిద్ధాంతంలో ఖాళీలను వెతుకుతూ వాటిని సవ్యంగా పూరించడం గురించి ఆలోచించేవారు. ఈ నేలకు ఈ మట్టికి ఈ నెత్తుటికి సరిపడదగినదేదో కనుగొనాలనే అన్వేషణ ఉండింది. దీనికి సంబంధించి నిరంతరం శ్రమిస్తున్న-నోట్స్ రాసుకుంటున్న దాఖలాలు ఉన్నాయి. ఈ పని పూర్తి చేయకుండానే వెళ్ళి పోయారు. తొంభయవ దశకం మొదట్లో అయిలయ్య లాంటి వారు కులాన్ని కొనదాక తీసుకెళ్ళి మాట్లాడుతున్నప్పుడు నాబోటి పిల్లకాయలం ఎపిసిఎల్‌లో ఆయనపై ఒంటికాలిపై లేచేవారం. ఆయన చైనా వాల్‌లాగా అండగా నిలిచేవారు. అది ఆయన అభిప్రాయాలతో ఏకీభవించి కాదు. భిన్నత్వమనేదే లేకపోతే ఏకశిలా సదృశమై సంస్థలు మొద్దుబారిపోతాయని, ఈ భిన్నత్వాన్ని కాపాడడానికి ఆయన చివరిదాకా ప్రయత్న పూర్వకంగా కృషి చేశారు.

తక్కువ మాట్లాడతాడు అంటున్నారు గానీ తక్కువ ఎక్కువ సంగతి కాదది. పలకరింపులుండవు. మాటలుంటాయి. అది తన ఇల్లు అనుకున్న వాడు వచ్చిన వారిని అతిథిగా చూస్తారు. అస్సలు అలా దేన్నీ సొంతమనుకోని వ్యక్తి ఆయన. వచ్చిన వారిని ఎప్పుడొచ్చారు, బాగున్నారా లాంటి మొక్కుబడి పలకరింపులేమీ ఉండవు. టీ పెట్టడానికి వెడుతూ నువ్వు తాగుతావు కదా అన్నైతే అడుగుతారు. అవసరాన్ని బట్టే మాట. కొన్ని రోజులు ఆయనతో గడిపిన వారికెవరికైనా ఆయనెంత హాస్యప్రియుడో అనుభవమే.

కాశ్మీర్‌కు స్వాతంత్ర్యమంటూ వస్తే తొలి ఉన్నతమైన అవార్డు బాలగోపాల్‌కే అని

అక్కడి హక్కుల సంస్థ నేత పర్వేజ్ ఇమ్రోజ్‌లాంటి వారు అనేవారంటే, ఆయన చనిపోయిన రాత్రి మరో హక్కుల నేత కుర్రం పర్వేజ్ ఫోన్‌లో ఘొల్లుమన్నారంటే ఆయన కృషి ఎంత విస్తారమైందో ఎన్ని చోట్ల ఎందరి గుండెల్ని తడిమిందో అర్థం చేసుకోవచ్చు. ఒక ఈ రాష్ట్రంలో తన కృషి వల్ల ఎన్ని వేల ప్రాణాలను కాపాడాడో, ఎందరికి ఆయనున్నాడు కదా అనే ధైర్యమిచ్చాడో చెప్పడం కష్టం. ఏదైనా సమస్య వచ్చినప్పుడు దీని మీద ఆయన అభిప్రాయమేమిటో అనే ఆసక్తి అందరికీ ఉండేది. పార్టీలతో సంబంధం లేకుండా ప్రజాస్వామిక సంస్థల్లోని వారందరికీ ఆయన కన్సెన్స్ కీపర్‌గా ఉండేవారు. అన్ని స్రవంతుల వారికి ఒక అర్థంలో మీటింగ్ పాయింట్‌గా ఉండేవారు. మానవ హక్కులంటే నక్సలైట్ ఉద్యమానికి పరిమితమైన వ్యవహారమనే ప్రచారానికి భిన్నంగా వాటిని సమగ్రంగా నిర్వచించి ఆచరణలో చూపించి తనతో విభేదించిన సంస్థను కూడా తన దారిలోనే నడవాల్సిన పరిస్థితి కల్పించారు. వాస్తవానికి ఆయన్ను ఆ సందర్భంలో వ్యతిరేకించిన వారికి కూడా ఆయన చూపిన తోవ అవసరమైనదని గుర్తించక తప్పని స్థితి. కొన్ని సంస్థలు చేసే పనిని ఒంటి చేత్తో చేసి చూపారు.

అధ్యాపక ఉద్యోగాన్ని వదిలేసి...అని కీర్తిస్తున్నారు. వాస్తవానికి ఆయన గణితశాస్త్రంలో కృషి కొనసాగించి ఉంటే నోబెల్ గ్యారంటీ అని నిపుణులే అన్న సందర్భాలున్నాయి. ఒక్క కెరీరెమిటి? వదలుకోనిదేమిటి? రుచిని జయించాడు. అలసటను జయించాడు. నిద్రను జయించాడు. నొప్పిని కూడా జయించాడు. భయమూ భక్తీ బొత్తిగా లేవు. శరీరాన్ని కూడా పూర్తి స్థాయిలో జయించాలనుకున్నాడు. అది చెప్పిన కంప్లయింట్స్ వింటూ ఉంటే రోజూ చెపుతూనే ఉంటుంది అని ఆయన భావన. శరీరాన్ని థర్డ్ పర్సన్‌గా చూడాలని ఆయన అభిప్రాయం. పుచ్చలపల్లి సుందరయ్య ఆరోగ్యాన్ని పట్టించుకోకపోతే నీ శరీరంపై హక్కు నీకు మాత్రమే ఉండదు అని తీర్మానం చేసి మరీ పార్టీ సంరక్షించేదని ఎవరో చెప్పారు. ఆ రకమైన పని ఎవరమూ చేయలేకపోయాం. ఇప్పుడు కుములుతున్నాం.

– జి.ఎస్. రామ్మోహన్

15 అక్టోబర్ 2009, ఆంధ్రజ్యోతి

# మౌలిక ఆలోచనాపరుడు

**డాక్టర్** కె. బాలగోపాల్ ఆకస్మిక మరణం ఊహించని విషాదం. ఆయన మరణ వార్తను చాలా మంది నమ్మలేకపోతున్నారు. దిగ్భ్రాంతిలో ఉన్నారు. సన్నిహితులే కాదు, అపరిచితులు కూడా ఆ మానవీయని శాశ్వత నిష్క్రమణ పట్ల బరువెక్కిన హృదయాలతో ప్రతిస్పందించారు. బాలగోపాల్ మేధో జీవితం, నిష్కల్మష వ్యక్తిత్వం గురించి మీడియా విస్తృతంగా రాసింది. చర్చించింది. దుఃఖంలో మునిగిపోయిన ఆయన కుటుంబమూ, భారతదేశంలోనే కాక, ఇతర చోట్ల కూడా మానవహక్కుల ఉద్యమంలోని ప్రతి ఒక్కరూ తేరుకోవడానికి కొంత వ్యవధి పడుతుంది. పౌరహక్కుల పోరాటాలకు, బాలగోపాల్ మృతితో తీరని నష్టం వాటిల్లింది. వాటిని ఒక శూన్యం ఆవరించింది. మానవ హక్కుల ఉద్యమం పైనే కాక విస్తృత స్థాయిలో పలు సామాజిక ఉద్యమాలపై బాలగోపాల్ స్ఫూర్తిదాయక ప్రభావానికి ఆయన మరణంతో వెల్లువైన సంఘీభావం, ఆత్మీయ జ్ఞాపకాలే నిదర్శనం.

బాలగోపాల్ చాలా ముభావి. మాటలకు కాక చేతలకే ఆయన ఎప్పుడూ ప్రాధాన్యమిచ్చేవారు. తనను గురించి ఆయన ఎప్పుడూ మాట్లాడేవారు కాదు; ఎవరు ఎంత బతిమాలినా, రెచ్చగొట్టినా కూడా ఆయన తన సొంత విషయాలను ప్రస్తావించేవారు కాదు. ఏకాంతంగా ఆలోచించడంలోను, రాసుకోవడంలోనే అధిక సమయాన్ని గడిపేవారు. ప్రశాంతంగా అయితే దృఢంగా పౌర హక్కుల ఉద్యమాన్ని నిర్మించడంలో నిమగ్నమై ఉండేవారు. తొలుత ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, ఆ తరువాత మానవ హక్కుల వేదిక ద్వారా హక్కుల గురించి సమాజాన్ని, మరీ

ముఖ్యంగా అణగారిన ప్రజలను జాగృతం చేశారు. అసాధారణ మేధో నైశిత్యం గల బాలగోపాల్ ఎంత వినయంగా ఉండేవారో ఆయన హఠాన్మరణంతో పెల్లుబైన పలువురి జ్ఞాపకాలు వెల్లడించాయి. అయితే బాలగోపాల్ ఇంకెంత మాత్రమూ మనకు తెలిసిన ఒక వ్యక్తి పేరు కదనీ, మనకాలపు మహా పోరాటాలకు ఒక సంకేతమనే గుర్తింపు మన మనస్సులోకి ఇంకడం ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. ఆ సంకేతపు గొప్పదనాన్ని సంపూర్ణంగా తెలుసుకోవడానికి బహుశా దీర్ఘకాలమే పట్టవచ్చు.

భౌతిక జగత్తు, మానవ వ్యవహారాలకు సంబంధించిన జ్ఞానం పుట్టుక, పెరుగుదలలో వివిధ దశలను 'అవగాహనా చట్రంలో మార్పు' (ప్యారడైమ్ షిఫ్ట్) అనే భావనతో అర్థం చేసుకోవచ్చని సూచించడం కద్దు. ఈ మేధో సత్యాన్ని బట్టి మనదేశంలోని సామాజిక ఉద్యమాలు లేదా పోరాటాల్లో ప్రత్యేకించి మానవ హక్కుల ఉద్యమంలో బాలగోపాల్ ఒక మౌలిక మార్పును సాధించారని నిస్సందేహంగా చెప్పగలము. అయితే ఆ మౌలిక మార్పు అందరికీ అంగీకార యోగ్యమైనదేనా అనే అంశానికి కాక బాలగోపాల్ వ్యక్తిగత అభిప్రాయాలు ఎందుకు, ఎలా ఆ మౌలిక మార్పుకు దోహదం చేశాయన్న విషయమై విభిన్న వివరణలే ముఖ్యమైనవని చెప్పవచ్చు.

బాలగోపాల్ ప్రప్రథమంగా ఒక ఉత్తేజకర ఉపాధ్యాయుడు, బోధన భావనను సమూలంగా మార్చివేసి విస్తృత స్థాయిలో యువ విద్యార్థులు, కార్యకర్తలకు స్ఫూర్తి నిచ్చిన అధ్యాపకుడు. తీవ్రవాద ఉద్యమాలు ఎప్పుడూ సామాజిక పోరాటాల ప్రక్రియలను మౌలిక శిక్షణకు తావులుగా భావిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని తీవ్రవాద సామాజిక పోరాటాల సంప్రదాయం నిస్సందేహంగా ఆ రీతిలోనే కొనసాగుతోంది. అయితే బోధనను గురించిన బాలగోపాల్ దృక్పథం దానితో మౌలికంగా రెండు విధాలుగా విభేదిస్తుంది. ఒకటి–సామాజిక వాస్తవాన్ని అర్థం చేసుకోవడంలో తీవ్ర విభేదాలు ఇతరుల అవగాహన 'తప్పుడు అవగాహన' గా భావించడానికి దారి తీయాల్సిన అవసరం లేదు. రెండోది–విప్లవ ఆలోచన, కార్యాచరణ–సంబంధిత బోధనా ప్రదేశాలను సుస్థిరం చేయడానికి ప్రాథమిక అవసరాలు–బోధకునిలో వినయాన్ని కేవలం విశదీకరణ ద్వారా కాకుండా, సొంత వర్తనతో ఉత్తేజ పరచడం ద్వారా బోధించడాన్ని డిమాండ్ చేస్తుంది. 1981లో ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం మేనిఫెస్టో పౌరహక్కులు అంటే ఏమిటి? అనే పుస్తకాన్ని రచించిన నాటి నుంచి

తుది శ్వాస విడిచే బాలగోపాల్ ఆలోచనలోను, ఆచరణలోను ఎంతో వినయంతో వ్యవహరించేవారు. పౌర హక్కుల ఉద్యమం కోసం ఆయన అసంఖ్యాక రచనలు చేశారు. అయినా ఏనాడూ ఆయన తన రచనా కర్తృత్వం గురించి పట్టించుకోలేదు. ఆవిర్భవిస్తోన్న కొత్త సామాజిక వాస్తవాల నేపథ్యంలో కొత్త వివరణలు, అవగాహనను అన్వేషించడంలో నిరంతరమూ నిశితంగా, వినయంగా ఆ వాస్తవాలను పరిశీలించవల్సిన అవసరాన్ని కూడా ఆయన ఎప్పుడూ విస్మరించలేదు. ఆ విధంగా సామాజిక విశ్లేషణలో పలు కొత్త వర్గాలకు చోటు కల్పించాలని బాలగోపాల్ డిమాండ్ చేశారు. ఎవరి 'దృక్పథం' సరియైనదని కాక తన ప్రయత్నాల ద్వారా ఆ కీలక వర్గాల గురించి మరింతగా ఆలోచించేలా చేయడంలో ఆయన చాలా వరకు సఫలుడయ్యాడన్నదే ఇక్కడ చాలా ముఖ్యమైన విషయం. తీవ్రవాద ఉద్యమాలను మరింతగా ప్రజాస్వామ్యీకరించడంలో ఇదొక ముందడుగు అనడంలో సందేహం లేదు.

భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో స్వతంత్ర మానవ హక్కుల ఉద్యమాన్ని నిర్మించిన వ్యక్తిగా బాలగోపాల్ గుర్తుండిపోతారు. మనదేశంలో పౌర హక్కుల ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచీ అంటే 1936లో 'భారతీయ పౌరహక్కుల సంఘం' ఆవిర్భవించిన తదాది రాజకీయ ఉద్యమాలు/పార్టీలకు అనుబంధంగా కాక స్వతంత్రంగా పనిచేయాలనే విషయం ఒక సమస్యగా కొనసాగుతూ వస్తోంది.

స్వతంత్ర మానవహక్కుల ఉద్యమాన్ని నిర్మించడంలో బాలగోపాల్ చేసిన కృషి రెండు విధాలుగా విశిష్టమైనది. రాజకీయ పక్షాలు తమ సంత ప్రయోజనాలకై మానవ హక్కుల ఉద్యమానికి మద్దతునివ్వడం, అందుకు విరుద్ధంగా పౌరహక్కుల ఉద్యమ నిర్ణాయక విలువలు, సూత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం అనే అంశాలకు సంబంధించిన చారిత్రక ఆందోళనలపై చర్చను ముందుకు తీసుకువెళ్ళడమే కాక దానిని మరింత విస్తృతం చేశారు. 1980ల తొలినాళ్లలో ఎపిసిఎల్‌సి ని పటిష్టం చేయడంలో ఉద్యమ నిర్దేశక విలువలపై అనేక వివరణలు ఇచ్చారు. రాజకీయ ఉద్యమాలు/పార్టీల వ్యూహాత్మక వైఖరుల నుంచి కాక హక్కుల ఉద్యమ నిర్దేశక విలువల నుంచి సామాజిక సంఘటనలను విశ్లేషించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కులం, జెండర్‌కు సంబంధించిన అంశాలను కూడా బాలగోపాల్ తొలుత పౌరహక్కుల ఉద్యమ పరిధిలోకి

తెచ్చారు. గత శతాబ్ది తొమ్మిదో దశకం నడిమి సంవత్సరాల నుంచి ఆయన ఈ అంశాలపై విస్తృతంగా రాశారు. ఉద్యమాలు ప్రజాస్వామ్యయుతంగా ఉండడానికి అవి తమ సొంత కార్యక్రమాలు, వైఖరులపై విమర్శనాత్మక దృష్టిని కలిగి వుండాల్సిన అవసరమెంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. 'స్వతంత్ర ఉద్యమం' అంటే రాజకీయ పార్టీలు, వాటి ఉద్యమాలు, లక్ష్యాలతో ఎటువంటి ప్రమేయం లేకుండా ఉండడం కాదని, మానవ హక్కుల ఉద్యమ పరిధిలోకి మరిన్ని సామాజిక సమస్యలను తీసుకురావడమూ, వాటిపై నిరంతర విశ్లేషణల ద్వారా మానవహక్కుల దృక్పథాన్ని విస్తృతం చేయడమేనని బాలగోపాల్ భావించారు.

మానవ హక్కుల ఉద్యమానికి వికేంద్రీకృత, అట్టడుగు స్థాయిలో పనిచేసే సంస్థాగత వ్యవస్థలను నిర్మించడం స్వతంత్ర మానవ హక్కుల ఉద్యమ నిర్మాణానికి ఆయన చేసిన మరో విశిష్ట సేవ, గత మూడు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్ అంతటా కార్యకలాపాలు కొనసాగిస్తోన్న రెండు కీలక సంస్థలు ఎపిసిఎల్సి, మానవహక్కుల వేదికలలో ఆయన అగ్రశ్రేణి నేతగా ఉండడమే ఆయన నాయకత్వ దక్షతకు నిదర్శనం. అంతేకాదు మానవహక్కుల ఉద్యమం సంస్థాగతంగా పటిష్టంగా, సుస్థిరంగా ఉండాలన్న విషయమై ఆయన నిబద్ధతకు కూడా అది తిరుగులేని రుజువు.

మానవ హక్కుల ఉద్యమానికి సంబంధించిన అవగాహన చట్రంలో బాలగోపాల్ తీసుకు వచ్చిన మౌలిక మార్పు (ప్యారడైమ్ షిఫ్ట్) ఏక సమయంలో నిర్ణాయక విలువల పరమైనది. సంస్థాగతమైనది. బోధనా సంబంధమైనది. ఈ సమిష్టి లక్షణాలే మానవ హక్కుల ఉద్యమానికి ఒక మౌలిక ప్రగతిశీల స్వభావాన్ని సంతరింప చేసి, ఆ ఉద్యమ చరిత్రను ఒక కొత్త మలుపు తిప్పాయి.హక్కుల పోరాటాలు ఒక సరికొత్త పథంలో ప్రవేశించేందుకు తోడ్పడ్డాయి. ఈ మూడు దృక్కోణాలతో ప్రమేయం లేకుండా నేడు మానవహక్కుల ఉద్యమాన్ని గురించి ఆలోచించడం సాధ్యం కాదు. అంతర్ముఖీనుడైన బాలగోపాల్ మానవ హక్కుల ఉద్యమం అంతటా ఉంటూ కూడా ఎవరికీ ఉద్యమ వ్యక్తిగా కన్పించని నిరాడంబరుడు. మానవ హక్కుల ఉద్యమానికి బాలగోపాల్ సేవలను పరిగణనలోని తీసుకున్నప్పుడు నిజంగా ఆ ఉద్యమానికి ఆయన ఒక మహానాయకుడుగా కనిపిస్తాడు. ఆయన ఒక మౌన కెరటం. అహంకారంలేని, నమ్రత ఉట్టి పడే ఒక పరిణామం. ఎన్నో కొత్త సమస్యలు చుట్టుముడుతున్న సమయంలో

ఆయన చనిపోవడం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటు. ఆయన కృషిని మరింత ముందుకు తీసుకెళ్ళడమే కాక, మానవ హక్కుల ఉద్యమంలో మరో మౌలిక మార్పును సాధించేలా ముందుకు తీసుకువెళ్ళడమే బాలగోపాల్‌కు సరైన నివాళి కాగలదు. బాలగోపాల్ కృషిని ముందుకు తీసుకువెళ్లడమంటే ఆయన అభిప్రాయాలతో ఏకీభవించడం, ఆయన చెప్పిన విషయాలను విశ్వసించడం కానేకాదు. ఆయన ఏ విలువలతోనైతే జీవించారో ఆ విలువల-విమర్శనాత్మక బోధన, అసంకల్పిత వినయం, సంస్థా నిర్మాణానికి నిబద్ధత-ను ఔదలదాల్పడమనేనని మనం గుర్తించుకోవాలి.

**-సీతారామం కాకరాల**

*16 అక్టోబర్ 2009, ఆంధ్రజ్యోతి పత్రికలో*

# ఉద్యమాలకు విలువలుండాలన్నవాడు

**డాక్టర్** కె. బాలగోపాల్ 1980లో పౌరహక్కుల సంఘంలో చేరినప్పటి నుంచి 2009 అక్టోబర్ 8న మరణించే వరకు పౌరహక్కుల ఉద్యమం వెలుపల వేరొక జీవితం లేదు. ఏకాగ్రతతో తన శక్తియుక్తులన్నింటిని ఆయన పేద, అణచి వేయబడిన వర్గాల హక్కుల సాధనకే ఉపయోగించారు. అందుకే బాలగోపాల్ జీవితం అర్థం చేసుకోవాలంటే హక్కుల రంగంలో ఆయన చేసిన కృషిని తెలుసుకోవాలి.

1980లో బాలగోపాల్ పౌరహక్కుల ఉద్యమం వైపు ఆకర్షితుడు కావడానికి వరంగల్ వాతావరణమే దోహదపడింది. తిరుపతిలో డిగ్రీ పూర్తి చేసుకొని ఎంఎస్సీ చదవడానికి బాలగోపాల్ వరంగల్, రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత అక్కడనే పిహెచ్‌డి కూడా పూర్తి చేశారు. వరంగల్ వచ్చే వరకు ఆయన లెక్కల మేధావి. వరంగల్ రాజకీయ పరిస్థితులు ఆయనను హక్కుల బాలగోపాల్‌గా మార్చివేసాయి.

బాలగోపాల్ రీజనల్ ఇంజనీరింగ్ కాలేజీలో (ఆర్ఇసి) చదువుతున్న కాలానికి రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ ఏర్పడింది. ఆర్ఇసిలో సూరపనేని జనార్థన్ నాయకత్వంలో ఆ సంస్థ కార్యకలాపాలు నడుస్తున్నాయి. కేవలం విద్యార్థులనే కాక మెస్ వర్కర్లను, ఆర్ఇసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలను సూరపనేని సంఘటిత పర్చారు. ఎమర్జెన్సీ విధించిన తరువాత సూరపనేనిని పోలీసులు అరెస్ట్ చేసి గిరాయిపల్లి ఎన్‌కౌంటర్లో కాల్చి చంపారు.

రాడిక్ స్టూడెంట్స్ యూనియన్ కార్యకలాపాలను డా॥ బాలగోపాల్ నిశితంగా

పరిశీలించేవాడు. నమ్మిన రాజకీయాల కొరకు విద్యార్థులు ప్రాణాలను బలిదానం చేయడం ఆశ్చర్యాన్ని కలిగించింది. అందుకే ఆ రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. క్రమంగా ఆయనలో తాత్విక అన్వేషణ మొదలైంది. ఈ క్రమంలోనే బాలగోపాల్ సామాజిక పరిస్థితులు అర్థమయ్యాయి. వాటిని విశ్లేషించే మార్గమూ తెలిసింది.

ఈ పరిస్థితి కొనసాగుతుండగానే ఎమర్జెన్సీ ఎత్తివేశారు. ఎమర్జెన్సీ ఎత్తివేయగానే దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ కాలంలో జరిగిన దురాగతాలకు వ్యతిరేకంగా లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ నేతృత్వంలో బలమైన ప్రజాస్వామిక ఉద్యమం ఉప్పెనవలే లేచింది. భారతదేశంలో ప్రజాస్వామ్యం పదిలంగా ఉందని నమ్మినవారికి ఎమర్జెన్సీ కనువిప్పు కలిగించింది. పాలకులకు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితం కాకుండా భారతదేశం ప్రజాస్వామ్యంగా నిలబడలేదన్న అభిప్రాయం బలపడింది. ఈ స్ఫూర్తితో ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి దేశవ్యాప్తంగా హక్కుల పరిరక్షణ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి దేశవ్యాప్తంగా హక్కుల ఉద్యమాలు అంకురించాయి. ఈ ఉద్యమాల ద్వారా ప్రజాస్వామిక విలువల కొరకు పనిచేయాలన్న లక్ష్యంతో బాలగోపాల్ 1981లో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో చేరాడు. 1983తో సంస్థ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

బాల్‌గోపాల్ చేరిన నాటికి పౌర హక్కుల సంఘానికి విస్తృతమైన నిర్మాణం, నిరంతరమైన పని విధానం ఉండేవి కావు. హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ప్రజాసంఘాల సాయంతో హక్కుల కార్యకర్తలు నిజనిర్ధారణకు పోయి వాళ్ళ సాయంతోనే సభలు పెట్టి ఖండించేవారు. ఇతర సంఘాల మీద ఆధారపడి పనిచేయవలసివచ్చేది. బాలగోపాల్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తర్వాత ఈ సంప్రదాయం మారింది. స్టేజీలు ఏర్పాటు చేసుకోవడం నుంచి మొదలుకొని పోస్టర్లు అంటించడం దాకా అన్ని పనులు పౌరహక్కుల సంఘం స్వతంత్రంగా చేసుకోవడం ప్రారంభించింది.

అప్పట్లో హక్కుల సంఘాలలో పనిచేయాలంటే నిత్యం పోలీసులతో ఘర్షణపడవలసి వచ్చేది. తామూ చట్టం ప్రకారం నడుచుకోవాలన్న స్పృహ పోలీసులలో వీసమెత్తు కూడా ఉండేదికాదు. తాము చెప్పిందే చట్టం, తమ ఆజ్ఞలను అనుసరించడమే ప్రజల కర్తవ్యం అన్న ధోరణితో పోలీసులు వ్యవహరిస్తుండేవారు. కనుక అక్రమ అరెస్టులను,

ఎన్‌కౌంటర్ హత్యలను ఖండించడమంటే పోలీసుల విచ్చలవిడి అధికారాలను ప్రశ్నించడమే. ఆర్ఇసిలో కలిగిన చైతన్యం, పెంపొందిన తాత్విక దృక్పథం, ఇచ్చిన నిబద్ధత, తనకున్న మొండితనం వల్ల బాలగోపాల్ పౌరహక్కుల సంఘాన్ని నడిపించగలిగారు. ఇటు ప్రజాఉద్యమాలు, అటు పోలీసుల దాడులవల్ల అగ్ని గుండంగా మారిన వరంగల్‌లో పౌర హక్కుల కార్యకలాపాలను కొనసాగించారు. పోలీసుల దాడులను తట్టుకొని సంస్థను నిలబెట్టడమే కాక క్రమంగా పౌరహక్కుల సంస్థ కార్యరంగాన్ని కూడా విస్తృతపరిచారు.

బాలగోపాల్ ప్రధాన కార్యదర్శి అయ్యేనాటికి అన్ని రకాల అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్న సోయి పౌరహక్కుల సంఘానికి ఉంది. కానీ వివిధ కారణాల వల్ల అది ఆచరణలోనికి రాలేదు. తొలుత కేవలం నిర్బంధ వాతావరణాన్ని తట్టుకొని నిలబడాలన్న తాపత్రయంతో బాలగోపాల్ నేతృత్వంలో పౌరహక్కుల సంఘం కార్యకలాపాలను విస్తృతపరచుకుంది. మార్క్సిస్టు-లెనినిస్టు పార్టీల కార్యకర్తలపై దాడులు జరిగినప్పుడే కాక సాధారణ ప్రజల హక్కులకు విఘాతం కలిగినప్పుడు కూడా పౌరహక్కుల సంఘం కార్యక్రమాలను తీసుకున్నది. లాకప్పుహత్యలు, వాతావరణ కాలుష్యంవంటి సమస్యలపైనేకాక అనేకానేక ఇతర సమస్యలను పౌరహక్కుల కోణం నుంచి చూసి స్పందించడం వల్ల హక్కుల ఉద్యమ పరిధి విస్తరించింది.

భారతదేశంలో చాలా సంఘాలు తమ కార్యకలాపాలను పెంచుకున్నాయి. అయితే బాలగోపాల్ మాత్రమే ఈ పరిణామాలను సిద్ధాంతీకరించి పౌరహక్కుల ఉద్యమానికి కార్యరంగం పని విధానం నిర్దిష్టంగా ఉంటాయని తేల్చి చెప్పారు. ఈ విషయంలో బాలగోపాల్ చేసిన కృషి చాలా కీలకమైంది. తనకంటూ ఒక ప్రత్యేక కార్యక్షేత్రాన్ని పని మద్దతులను రూపొందించుకోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌లో హక్కుల ఉద్యమం సజీవంగా నిలబడింది.

భారతదేశంలో 1980ల దాకా హక్కుల సంఘాలు లోహియా ఏర్పరిచిన చట్రంలో పనిచేస్తూ వచ్చాయి. 1936లో తొలుతగా లోహియా పౌరహక్కుల భావనను నిర్వచించి, పౌరహక్కుల సాధనకై హక్కుల సంఘాలు నిర్వర్తించవలసిన కర్తవ్యాలకు దిశానిర్దేశనం చేసారు. ఆ తరువాత సామాజిక చలనాలకు అనుగుణంగా పౌరహక్కుల భావనను విస్తరించడానికి కావల్సిన తాత్విక పునాదిని హక్కుల ఉద్యమాలు తయారు

చేయలేకపోయాయి. సామాజిక మార్పులకు అనుగుణంగా సిద్ధాంత భూమికను ఏర్పాటు చేసుకోకపోవడం వల్లనే చాలా రాష్ట్రాలలో హక్కుల ఉద్యమాలు కాలపరీక్షకు నిలబడలేక పోయాయి. ఆ లోపం ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో లేదు. హక్కుల కార్యాచరణను నిశితంగా పరిశీలించి సిద్ధాంత పరికల్పన చేయడం ద్వారా బాలగోపాల్ హక్కుల ఉద్యమాన్ని బలేపేతం చేసి బాధితులకు న్యాయాన్ని అందించడంలో దోహదపడ్డారు.

హక్కులు సామాజికమైనవని అన్నది లోహియా సూత్రీకరణకు ఉన్న వివిధ పార్శ్వాలను బాలగోపాల్ వెలుగులోకి తెచ్చారు. నిండైన జీవితాన్ని పొందడానికి అణచివేయబడే సమూహాలు భిన్న రాజకీయ విశ్వాసాలతో అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తారు. ప్రజాస్వామిక విలువలు ఊటలు ఊరేది ఈ ఉద్యమాల చెలిమలోనే. ఉద్యమాల నుండి ఉద్భవించిన ప్రజాస్వామిక విలువలను, హక్కులను స్వీకరించాలని, వాటి రక్షణకు నిరంతరం పోరాటం చేసి వ్యవస్థీకరించాలని బాలగోపాల్ అన్నారు.

విభిన్న ఉద్యమాల సారంశమే హక్కుల ఉద్యమం. ఈ ప్రస్థానంలో హక్కుల భావనకానీ, ఉద్యమం కాని రాజకీయ చట్రాల పరిధిలో ఇరుక్కొని తన ప్రత్యేక అస్తిత్వాన్ని కోల్పోవద్దని బాలగోపాల్ వాదించాడు. ఈ విషయంలో బాలగోపాల్ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అయినా చలించని విశ్వాసంతో ముందుకు సాగాడు. తాను ఎంచుకొన్న ఈ ఉదాత్తమైన పాత్రవల్లనే అన్నిరకాల ప్రజా ఉద్యమాలతో మమేకం కాగలిగారు. బాలగోపాల్ ఈ క్రమంలో బాధితుల గోపాల్ అయ్యారు.

ప్రజాస్వామికవాదులు ప్రజాస్వామిక విలువలను ప్రవచించడమే కాదు ఆచరించాలన్నారు. ఆధిపత్యం, అణచివేత ఏ రూపంలో వ్యక్తమైనా నిబద్ధతతో, నిజాయితీతో వ్యతిరేకించాలన్నారు. ఆఖరుకు ప్రజా ఉద్యమాలు కూడా తమ కార్యాచరణలో ఆ విలువలను ప్రతిబింబించినప్పుడు ఆ విలువల ఆధారంగానే ప్రశ్నించాలన్నారు. సమాజాన్ని మానవీయంగా చేసే అపురూపమైన ప్రయత్నం వల్లనే బాలగోపాల్ మానవ తారగా తళుక్కుమన్నారు. ఆయనను స్మరించడమంటే మనలోని మానవతను మననం చేసుకోవడమే.

**ఎం. కోదండరాం**

*అక్టోబర్ 19, 2009 వార్త దినపత్రికలో*

# భారత విప్లవ శక్తులు బాల్‌గోపాల్ సంధాన కృషిని ప్రజాస్వామిక స్ఫూర్తిని గౌరవిస్తూ సాగాలి

**బాలగోపాల్** పౌర ప్రజాస్వామిక హక్కుల పోరాట కారుడిగా లోకానికి ఎక్కువగా తెలుసు. హక్కుల ఉద్యమానికి చారిత్రక అవసరాన్ని కల్పించిన విప్లవ ప్రజా ఉద్యమాలకు ఆయన అత్యంత ప్రీతిపాత్రుడు. ఆయన లేని లోటు విప్లవ ప్రజా ఉద్యమానికి సాధారణంగా పూడ్చలేనిది. అసాధారణమైన ఆచరణ కృషిలో, విశాలమైన మేధోమదనంతో ఆంధ్ర రాష్ట్రంలో ఆయన సాగించిన కృషి విలువ కట్టలేనంత గొప్పది..

చరిత్ర తత్వశాస్త్రం, సాహిత్యం, అర్ధశాస్త్రం, జెండర్ సమస్యలు, దళిత సమస్యలు, ఆదివాసీ కడగండ్లు, ఎండిన డొక్కల అరుపులు అన్నింటిలో తన విశ్లేషణతో, ఉపన్యాసాలతో తెలుగునాట ఒక చైతన్యపతాకగా 3 దశాబ్దాల కాలం పాటు వెలుగొందాడు. డాక్టర్ బాలగోపాల్ నుంచి ఆంధ్ర రాష్ట్ర విద్యార్థి ఉద్యమం, యువజనోద్యమం 1980 దశకంలో ఎంతో ఉత్తేజం పొందింది. ఈ ఉద్యమాల నుంచి ఆయన హక్కుల ఉద్యమకారుడిగా విప్లవోద్యమం ఆయన కృషిని రంగరించుకున్నది. హక్కుల ఉద్యమానికి ఆయన చిరునామా-పాలకులకు దడపుట్టించిన, ఈ హక్కుల ఉద్యమ బుడతడ్ని కాలరాయాలని రాజ్యం ఎన్నెన్నో రాక్షస దమన పద్ధతుల్ని అనుసరించినా తలెత్తి నిలిచాడు తప్ప-ఎన్నడూ, ఏ స్థితిలోనూ తలవాల్చలేదు. చావు ఆయనను చూసి భయపడింది తప్ప, చావును చూసి ఆయన భయపడలేదు.

నేను పి.డి.ఎస్.యు. రాష్ట్ర స్థాయి కార్యకర్తగా, తర్వాత కాలంలో ప్రధాన కార్యదర్శిగా వున్నప్పుడు విద్యారంగ సమస్యలు, సామాజిక సమస్యలమీద ఆయన చేసిన ప్రసంగాలు సామాజిక కార్యాచరణకు నన్ను నాతోపాటు అనేక మందిని పురికొల్పాయి ఆయన గణితంలో అగణిత మేధావిగా వున్నా విద్యార్థులతో, ప్రజలతో ఎంతగానో కలసిపోయేవారు. డైరీ చేతపట్టుకొని పరిశోధకుడిగా ఎన్‌కౌంటర్ల ప్రదేశాలు, అణచివేత ప్రదేశాలు, బాధితుల ఆర్తనాదాల స్థావరాలు, అడవులు, కొండలు, తీరప్రాంతాలు, దూరప్రాంతాలూ అంకిత భావంతో తిరిగిన తీరు ప్రజల మేధావికి అర్థం కల్పించాడు. ఆయన సింపుల్‌సిటీ, ఆదర్శనీయ, ఆచరణ, ఆయనకు ఆయన మేధో వికాసం నుంచి అలవడిన సహజ అలంకారాలు. అవి తెచ్చిపెట్టుకున్నవికావు. ఆలోచనను, పనిని తప్ప కాయాన్ని పట్టించుకోని తీరు ఆయనకు మరణాన్ని ముందే తీసుకువచ్చింది. అవే తెలుగునాట ప్రజామేధావిగా ఆయనను అందనంత ఎత్తున నిలబెట్టాయి. గ్రంథాలను వల్లెవేస్తూ, లైబ్రరీలో పుస్తకాల పుటల్లో తలమునకలవుతూ చెమటకారని కార్యాచరణతో, ప్రజా కార్యాచరణ మీద సెగల, పొగల వ్యాఖ్యానాలతో సరిపుచ్చి బుద్ధిజీవుల బౌద్ధిక కార్యాచరణ పూర్తయ్యిందనిపించే మేధోవర్గాలు పుష్కలంగా వున్న యీ రోజుల్లో ప్రజా కార్యక్షేత్రంలో తన మేరునగ మేధస్సును సమ్మేళనపరచిన బాలగోపాల్ మేధావివర్గ నిజమైన పాత్రకు ప్రత్యక్ష తార్కాణంగా నిలిచాడు.

రాజ్యం మరింత మరింతగా సాయుధమై, మిస్సింగ్ హత్యలు, కిడ్నాప్‌లు, ఎన్‌కౌంటర్లు, కాల్పులు, తదితర తీవ్ర అణచివేత చర్యల్ని ఇజ్రాయిల్, అమెరికా సామ్రాజ్యవాదం నుంచి అరువు తెచ్చుకొని సాఫిస్టికేషన్ అవుతున్న వేళల్లో రాజ్యరక్తపాత, దుర్మార్గ స్వభావాన్ని అంతే పదునుగా బాలగోపాల్ ఎత్తిచూపాడు. ఆ అణచివేతకు స్వయంగా గురయ్యాడు. హక్కుల తరఫున నిలబడి, అణచివేతపై గొంతెత్తినందుకే యాదగిరిరెడ్డి (ఎస్.ఐ) హత్యకేసులో ఇరికించారు. నాసా కింద జైల్లో పెట్టారు. 1989లో ఖమ్మం జల్లా కొత్తగూడెంలో పోలీసులు మఫ్టీ డ్రెస్‌లో వచ్చి కొట్టి మురికి కాలవలో పడేసి చనిపోయాడనుకున్నారు. కొత్తగూడెంలో అడ్వకేట్ పురుషోత్తంతో వెళ్ళి రక్షించబడి హాస్పిటల్‌లో చేర్పించారు. అయినా మఫ్టీ డ్రెస్‌లో పోలీసులు హాస్పటల్ అంతా ఆక్రమించారు. మాజీ ఎం.ఎల్.ఏ. గుమ్మడి నర్సయ్య తదితరులు వెళ్ళిన తరువాత పోలీసులు జారుకున్నారు. ఆ తరువాత ఖమ్మంలో బాలగోపాల్‌ను పి.డి.ఎస్.యు.

విద్యార్థి శ్రీమన్నారయణను కిడ్నాప్ చేసి గంతలు కట్టి తీసుకుపోయారు. పెద్దనిరసన, ఒత్తిడి వచ్చిన తరువాత వదిలేశారు. రాష్ట్ర పోలీసు దాడులు, హత్యాప్రయత్నాలు బెదిరింపులతోపాటు, వరంగల్‌లో ఆర్.ఎస్.ఎస్. బి.జె.పి. రౌడీమూక సైతం వీరిపై దాడిచేసింది. వీటన్నింటిని నిబ్బరమైన గుండె ధైర్యంతో ఎదుర్కొని నిలబడటం గొప్పతనం. అసాధారణ తత్వం.

నిత్య నిర్బంధంలోసైతం హక్కుల గొంతును మూగపోనివ్వని బాలగోపాల్ ఆంధ్రరాష్ట్రంలో విప్లవ శక్తుల మధ్య పరస్పర మౌనాన్ని చూసి చాలా ఆవేదన చెందాడు. మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, తూర్పు గోదావరి తదితర జిల్లాల్లో ప్రధానంగా మావోయిస్టుపార్టీ సి.పి.ఐ (యం.ఎల్.) న్యూడెమోక్రసీపై అలానే జనశక్తికి మధ్య తీవ్రంగా జరిగిన సాయుధ సంఘర్షణలను వ్యతిరేకించాడు. ప్రజల తరపున పోరాడాల్సిన శక్తులు ప్రజలపైనే దాడిచేసుకొనే స్థితి ప్రజా ఉద్యమాలకు నష్టమని స్పష్టంగా చెప్పాడు. ఈ సమస్య సైతం హక్కుల ఉద్యమానికి సమస్యగానే చూశాడు. దీనిని ఆవేదనతో సరిపుచ్చుకోలేదు. నడుంకట్టి సయోధ్యకు యత్నించాడు. తనతోపాటు అనేక హక్కుల సంఘాలను, మేధావులను కలుపుకొని ఆయా ప్రాంతాలకు వెళ్ళి పార్టీల నాయకత్వంతోను మాట్లాడి ఘర్షణలు నివారించాలని కోరాడు. తీవ్ర కృషితో కొంత ఫలితాన్ని సాధించాడు.

2006-2007 కాలంలో జిల్లాలో సి.పి.ఐ (యం.ఎల్) న్యూడెమోక్రసీ నాయకత్వం మీద ఆనాటి ఎం.ఎల్.ఏ. గుమ్మడి నర్సయ్యపై డెత్‌వారెంట్‌గా మావోయిస్టు పార్టీ నాయకత్వం (జిల్లా) ప్రకటనలు చేస్తే, నాతోపాటు, పార్టీ నాయకత్వం అయిన మేము బాలగోపాల్‌ను కలిస్తే, 'ఒకరి స్వేచ్ఛ, మరొకరి చావు కొస్తే ఎలా" అని వ్యాఖ్యానించాడు. మావంతు యత్నం చేస్తాం. వింటారో వినరో అని వ్యాఖ్యానించాడు. ముక్తసరిగా రెండే వ్యాఖ్యానాలు చేసినా ఆ వ్యాఖ్యానాలకు లోతైన అర్థం వుంది. విశాల ప్రజల విస్తృత ఉద్యమ ప్రయోజనాలు ఆశించే పార్టీలు హక్కుల గొంతు విననంత దూరంగా జరుగుతున్నాయనే అందులో యిమిడి ఉంది.

డాక్టర్ బాలగోపాల్ లాంటి విశాల దృష్టి కలిగిన మేధావి లేకపోవడం విప్లవోద్యమాల మధ్య సయోధ్యనెరిపే మిత్రుడు లేకపోవడమే. మనల్ని పొగడటమే పనిగా వుండే మేధావులకంటే విమర్శనాత్మకంగా సహృదయంతో వారించే అలాంటి

వారు ప్రస్తుత పరిస్థితులకు ఎంతో అవసరం. వాలున పడి కొట్టుకుపోయే మేథోతరం కంటే, నిలబడి సాలోచనగా సాగిపోయే ఆలోచనా ప్రవాహమే నేడు ఎంతో అవసరం. బాలగోపాల్ కొన్ని రాజకీయాభిప్రాయాలపట్ల విప్లవోద్యమానికి కొన్ని అభ్యంతరాలున్న మాట వాస్తవమే. అయినా అది ఆయన కృషిని మొద్దుబార్చలేదు. హితుడిగా, సన్నిహితుడుగా, సునిశిత విమర్శకుడిగా విప్లవోద్యమంతో కలిసినడిచాడు.

ఆయన స్ఫూర్తిని నిలపగలిగే కృషిని మేధావివర్గం, యువతరం చేయాలి. అలానే విప్లవోద్యమ పాయలన్నీ రాజకీయ, సిద్ధాంత సంఘర్షణలను మరింత పదునుగా కొనసాగించినా, భౌతిక నిర్మూలనా కార్యక్రమంను దూరంగా తీసివేయాలి. నిందలు, దాడులు హత్యాకాండ లాంటి వాటిని ప్రక్కకు పెట్టి చర్చ, ఆచరణ, పరస్పర గౌరవాలను విప్లవశక్తులు పుణికి పుచ్చుకోవాలి. రెండున్నర దశాబ్దాలుగా డాక్టర్ బాలగోపాల్ చేసిన కృషి విప్లవోద్యమ వెలుగులో చేసినదే. వెలుగుల ప్రస్థానమే ఆయనది. 4 దశాబ్దాల విప్లవోద్యమం యొక్క త్యాగాల విప్లవాల కృషిని అద్దంలో ప్రతిమను చూసుకుంటూ, బేరీజు వేసుకుంటూ, సరిచేసుకుంటూ ప్రజా అంకిత యాత్రలో ముందుకు సాగాలి. సామ్రాజ్యవాదం, దళారి ధనస్వామ్యం, భూస్వామ్యం, ఆధునిక రూపాలతో ప్రజలమీద, దేశవనరులమీద, ప్రజాశక్తుల మీద పెనుదాడిని సాగిస్తున్న వేళ భారతదేశంలో విప్లవ ప్రజాస్వామిక శక్తులన్నీ బాలగోపాల్‌లోని పాజిటివ్ అంశాలన్నింటికి స్వంతం చేసుకోవాలి.

**– పోటు రంగారావు**

సి.పి.ఐ. (యం.ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యులు

# ఖాళీలను పూరించడమే సాహిత్యం పని

**మార్క్సిజంపై** అసంతృప్తితో తాను మొదలు పెట్టిన తాత్విక అన్వేషణ ఒక కొలిక్కి వచ్చిందనీ, తనకు సంతృప్తినిచ్చే ప్రాపంచిక దృక్పథం ఏర్పడిందనీ బాల్‌గోపాల్ ఈ ఇంటర్వ్యూలోనే ప్రకటించారు. ఆ దృక్పథం ఏమిటో సాహిత్యాంశాల అన్వయంతో ఆయన సూచనప్రాయంగా చెప్పారు. ఎనిమిదేండ్ల కిందట జరిగిన ఈ సంభాషణ–బహుశా బాల్‌గోపాల్ ఇచ్చిన చివరి పూర్తి సాహిత్య ఇంటర్వ్యూ.....

**చరిత్ర, మనిషి, మార్క్సిజం–అన్న మీ సుప్రసిద్ధ వ్యాసం (అరుణతార, సెప్టెంబర్ 1993) 'రాగో' అన్న నవలకు సమీక్షగా రాశారు. ప్రధానంగా సాహిత్య విమర్శ వ్యాసంగా వచ్చిన ఆ రచనలో రాజకీయ అంశమే సంచలనాన్ని, వివాదాన్ని సృష్టించింది తప్ప, దానిలోని సాహిత్య చర్చనీయాంశాలను ఎవరూ పట్టించుకోలేదు. మీరు ప్రతిపాదించిన లేదా చర్చించిన సాహిత్య అంశాలు కూడా 'రాజకీయ' అంశాలంత వివాదాస్పదమైనవి. ప్రతిస్పందనలోని ఆ విశేషాన్ని మీరు ఎలా వ్యాఖ్యానిస్తారు?**

అది సమీక్షగా రాసింది కాదు. ముందుమాటగా రాసింది. రచయిత విశ్వాసాలకు పూర్తిగా భిన్నమైన రచనను ముందుమాటగా వేయడం భావ్యం కాదనిపించి, 'రాగో'కు ముందుమాటగా కాకుండా విడిగా వ్యాసంగా అచ్చు వేయదలుచుకుంటే వేయమని చెప్పాను. అందువల్ల అది 'అరుణతార'లో వ్యాసంగా అచ్చయింది. స్పందన మాటకొస్తే రచనకు తాత్వికంగా స్పందించి ఉంటే అన్ని అంశాలు చర్చకు వచ్చేవేమో. కానీ తమ రాజకీయ విశ్వాసాలపైన దాడిగా దానిని భావించి స్పందించినవారే ఎక్కువ కాబట్టి చర్చ ఆ విధంగా జరిగిందనుకోవాలేమో. అయినా ఆ వ్యాసం నా అభిప్రాయాల

సమగ్ర వ్యక్తీకరణ కాదు. అప్పటికి దాదాపు మూడేళ్లుగా నా తాత్వికవిశ్వాసంగా నేనప్పటిదాకా భావిస్తూ వచ్చిన మార్క్సిజం పట్ల నాకు అసంతృప్తిగా ఉండింది. దానికి సమాధానం చెప్పగలగడం సంగతి అటుంచి, ఆ అసంతృప్తిని స్పష్టంగా నాకు నేను వివరించుకోలేకపోవడం వల్ల రాయడమే మానేసాను (పౌరహక్కుల రిపోర్టులు తప్ప). ఆ దశలో నేను చేసిన మొదటి రచన ఆ వ్యాసం, ముందుమాట కుండే పరిమితులే కాక ఈ పరిమితి కూడా దానికి ఉంది. అందువల్ల ఆ వ్యాసంలోని అభిప్రాయాలను వివరించే పద్ధతిలో కాకుండా మీ ప్రశ్నలకు విడిగానే జవాబు చెప్పే ప్రయత్నం చేస్తాను. ఆనాడు నేను మొదలు పెట్టిన తాత్విక అన్వేషణ ఒక కొలిక్కి వచ్చిందని నాకు సంతృప్తి ఇచ్చే ప్రాపంచిక దృక్పథం నాకిప్పుడుందనీ అనుకుంటున్నాను.

**సోషలిజం, సమ సమాజం అన్న ఆదర్శాలే సంక్షోభంలో పడిన కాలంలో, ఆ ఆదర్శాల ఆధారంగా నిర్మించుకున్న అనేక సాహిత్య భావనలు, సిద్ధాంతాలు తెలుగు సాహిత్య రంగంలో చర్చకు ఎందుకు రావడంలేదు?**

ఇతర సోషలిస్టు సాహిత్య భావనలు, సిద్ధాంతాల సంగతి పోనిచ్చి కనీసం మార్క్సిస్టు సంప్రదాయంలోని సాహిత్య సిద్ధాంత భావనలు సహితం అన్నీ చర్చకు రాలేదు. మన దగ్గర 'అరసం'తో మొదలుపెట్టి 'విరసం' వాళ్లు కొనసాగించిన సాహిత్య సిద్ధాంత సంప్రదాయంలోనే ఉన్నాయి. రేమాండ్ విలియమ్స్, ఆడార్నో వంటివారు చారిత్రక భౌతికవాదం ప్రాతిపదికన వివరమైన సాహిత్య సిద్ధాంతాలు రూపొందించారు. వాటితో మన దగ్గరున్న వామపక్ష సాహిత్యకారులకు పరిచయం ఉంటే రెండు రకాలుగా ప్రయోజనం ఉండేది. ఒకటి ప్రామాణిక మార్క్సిస్టు సాహిత్య విమర్శగా మనదగ్గర చలామణిఅయ్యే విమర్శ ఆమోదించని కొన్ని సాహిత్య ప్రయోగాలకు వస్తు సంబంధమైనవీ శిల్ప సంబంధమైనవీ కూడా మార్క్సిస్టు సంప్రదాయంలోనే ఆమోదమే కాక ప్రశంస కూడా ఉందని తెలిసింది. సాహిత్యానికి, ప్రజలకు విప్లవోత్తేజం కలిగించడం అనే ఒకే ఒక కర్తవ్యానికి పరిమితమైన పాత్ర కాక, విస్తృతమైన పాత్ర కల్పించే సాహిత్య సిద్ధాంతాలు మార్క్సిస్టు సంప్రదాయంలోనే ఉన్నాయని తెలిసేది. రెండు మన దగ్గర ప్రచారంలో ఉన్నదాని కంటే సంపన్నమైన సాహిత్య సిద్ధాంతాలకు చారిత్రక భౌతికవాదంలో స్థానం ఉన్నప్పటికీ మార్క్సిజం ప్రాతిపదికన పరిపూర్ణమైన

సాహిత్య సిద్ధాంతం రూపొందించడం సాధ్యం కాదని కూడా అర్థమై ఉండేది. ఈ సిద్ధాంతాలు మన దగ్గర చర్చకు రాకపోవడంలో ఆశ్చర్యమేమీలేదు. జీవిత మూలాలకు సంబంధించిన సత్యాన్వేషణ ఇంకా బాకీ ఉందని మన దగ్గర మార్క్సిస్టులు అనుకోవడంలేదు. అది ప్రాథమికంగా ముగిసిందనీ దానిని ఆచరించడం, అన్వయించడం, మెరుగులు దిద్దడం మాత్రమే మిగిలివుందనీ అనుకుంటున్నారు. కనీసం 20వ శతాబ్దపు చివరి దశకం లోనయినా ఈ అభిప్రాయం మారవలసి ఉండింది. మారి ఉంటే సోషలిజానికి సంబంధించిన అన్ని ఆలోచనలనూ తిరిగి అధ్యయనం చేయడం జరిగి ఉండేది. అది తత్వశాస్త్రంలో జరగలేదు. రాజకీయాలలో జరగలేదు. సాహిత్యంలోనూ జరగలేదు.

**రచయిత లేదా కవి తన రచనలో ఎటువైపు నిలబడ్డాడు అన్న కొలమానం గొప్ప సాహిత్యాన్ని గ్యారంటీ చేయలేదని మీరు అన్నారు. మరి ఆ కొలమానానికి ఎటువంటి ప్రయోజనమూ సార్థకతా లేదా?**

ఎటువైపు నిలబడ్డారనేది గొప్ప సాహిత్యాన్ని గ్యారంటీ చేయలేదని నేను చెప్పనవసరం లేదు. అది అందరికీ తెలిసిన సత్యమే. మరి పక్షపాతానికి ఏ ప్రయోజనమూ లేదా అంటే, పూర్తిగా అన్యాయాన్ని సమర్థించే దృక్పథం నుండి గొప్ప సాహిత్యం ఒకవేళ సాహిత్యంగా రాణించకున్నా సాధారణంగా ఏవగింపు కలిగించదు. అన్యాయానికి (దీనికి కూడా మినహాయింపులు లేకపోలేదు) కంకణబద్ధమైనది ఏవగింపు కలిగిస్తుంది. కాబట్టి సాహిత్యంగా రాణించదు. అన్యాయాన్ని పూర్తిగా భుజానికెత్తుకునే రచయితలు చాలా కొద్ది మందే ఉంటారు. కాబట్టి ఇది పెద్దగా జ్ఞానదాయకం కాదు. ఏ విషయంలోనయినా ఏది న్యాయం ఏది అన్యాయం అనేది ఖచ్చితంగా తెలుసుకోగలమనీ, న్యాయంవైపు ఉన్నావా లేక అన్యాయం వైపు ఉన్నావా అన్న ప్రశ్నకు అన్ని సందర్భాలలోను ఖచ్చితమైన జవాబు చెప్పగలమనీ, సాహిత్యంతో సహా అన్ని విషయాలలోనూ ఈ జవాబే ప్రధాన (నిర్ణయాత్మక) విషయమనీ నమ్మినట్లయితేనే మీరు వేసినది సాహిత్య విమర్శకు కీలకమైన ప్రశ్న. లేకపోతే అది ఒకానొక ప్రశ్న మాత్రమే.

**రచన ఎందుకోసం చేస్తారు? కళ కళకోసమా, ప్రజల కోసమా అన్న ప్రశ్నకు ఇప్పుడు అర్థముందా? సాహిత్యానికి దాని కర్తకూ ఉండే సంబంధం ఏమిటి? రచయిత**

సాహిత్యాన్ని మరేదయినా ఆశయం కోసం రాయడం సరిఅయినదేనా? సాహిత్యానికీ దాని పాఠకులకూ ఉండే సంబంధం ఏమిటి? సాహిత్యం బోధించాలా, జనాన్ని సమీకరించాలా, వినోదాన్నో ఆహ్లాదాన్నో ఇవ్వాలా? ఆయా సంబంధాలకు స్థిర నిర్వచనం ఇవ్వగలమా?

కళకూ సాహిత్యానికీ ఒక కర్తవ్యాన్ని నిర్దేశించే ముందు అవి మానవ జీవితంలో ఏ పాత్ర నిర్వహించాయో చూడడం ఉచితంగా ఉంటుంది. ఇది కామన్‌సైన్స్ విషయమేగానీ సాహిత్యం పాత్ర ఇది అది అంటూ తాఖీదులు జారీచేసే వాళ్లకిది తోచినట్టు కనిపించదు కళా సాహిత్యాలు నాగరికత అంత ప్రాచీనమైనవి. సైకిల్ తొక్కడంలాగ,క్రికెట్ ఆడడం లాగ కళా సాహిత్య సృజన మనిషి చేయగల ఒకానొక పనికాదు. అది మానవ అస్తిత్వ నైజంతో సన్నిహితంగా ముడిపడిన ప్రక్రియలు. మనిషి ఉనికిలో అంతర్భాగమైన ప్రక్రియలు. రాళ్ల నుండి పనిముట్లు తయారు చేసుకోవడం మొదలు పెట్టిననాడే రాతి గోడలపైన బొమ్మలు వేయడం, రాళ్లతో కళాత్మకమైన వస్తువులు తయారుచేయడం మనుషులు మొదలుపెట్టారు. మనిషి రాత నేర్చిననాడే సాహిత్యం కూడా పుట్టింది. గానం అంతకంటే ముందే పుట్టింది. మానవ జీవితంతో ఇంతగా పెనవేసుకున్న కళాసాహిత్యాలకు ఆ జీవితంలో ఉన్న పాత్ర ఏమిటో అర్థం చేసుకోకుండా వాటికి నియమాలూ తాఖీదులూ జారీచేయడం ఎంతవరకు సబబు?

కళ సంగతి పక్కనపెట్టి సాహిత్యం గురించి మాట్లాడుకుందాం. దేనికయినా ఒక్క వాక్యంలో నిర్వచనం ఇవ్వడంలో సమస్యలున్నాయి గానీ సాహిత్యం పాత్రను ఒక్క వాక్యంలో నిర్వచించమంటే, జీవితంలోని ఖాళీలను పూర్తిచేయడం సాహిత్యం పాత్ర అని చెప్పవచ్చు. దానికి వేరే ఏ కర్తవ్యాన్ని అప్పగించడంలోనూ అర్థంలేదు. ఆ కర్తవ్యాన్నే సమ సమాజ లక్ష్య సాధన దిశగా మలచుకునే ప్రయత్నం చేయొచ్చు. జీవితంలో ఖాళీలు ఎందుకుంటాయి? చైతన్యయుతంగా బతకాలనే 'శాపం' మనిషికి లేనట్టయితే జీవితంలో ఖాళీలు ఉండవు. ఇతర జంతువులు ఒక జంతు జాతిగా తమకు ఉండే జన్యు లక్షణాలనుసరించి బతుకుతాయి. వాటికి తెలివి లేదనీ రోబోట్‌ల వంటివనీ కాదు. ఎంత చురుకయిన మెదడున్న జంతువయినా తన పరిసరాలతో తాను ఏ విధంగా వ్యవహరించాలన్న నిర్ణయాన్ని చేసిపెడుతుంది. మనిషిలో జన్యు

నిర్ణాయకత చాలా తక్కువ. తన పరిసరాలతో అందులో భాగంగా ఇతర మనుషులతోనూ, ఏ విధంగా వ్యవహరించాలన్న నిర్ణయాన్ని నూటికి తొంభై తొమ్మిదిపాళ్లు మనిషి చైతన్యయుతంగానే తీసుకోవాలి. ఇది మనిషి అస్తిత్వ నైజంలోని ప్రధాన అంశం. ప్రతీ మనిషీ తనలో పుట్టిన 'స్వంత' చైతన్యంతోనే ఈ నిర్ణయాలు తీసుకొంటారని కాదు. ఆ చైతన్యం అప్పటికే ఒక సామాజిక ఆలోచనారీతి చేత ప్రభావితమయి ఉంటుంది. అయినప్పటికీ నిర్ణయం చైతన్యయుతమైనది.

చైతన్యయుతంగా వ్యవహరించడమంటే ఏది చేయాలో ఎంచుకోవడం. ఏ విధంగా వ్యవహరించాలన్న ఎంపిక చేసుకోవడం. మనం వ్యవహరించే వస్తువులు, విషయాల గురించి కూడా అభిప్రాయాలు ఏర్పరచుకోవడం. అందులో భాగంగా మన గురించి కూడా అభిప్రాయాలు ఏర్పరచుకోవడం. అప్పుడు సహజంగానే ప్రమాణాలు ఏర్పడతాయి. ఇది మనిషి అస్తిత్వ నైజంలోని రెండవ అంశం. ప్రామాణికతా భావన మనిషి చైతన్యానికి ఉండే స్వాభావిక లక్షణం. నైతికత (తప్పొప్పులు, మంచి చెడుల భావన) అందులో ఒక భాగం మాత్రమే. దానితోపాటు అన్నిటికీ ప్రమాణాలు ఏర్పడతాయి. సౌందర్యం, సంతోషం, సుఖం, సంతృప్తి మొదలైన అన్నిటికీ ప్రమాణాలు ఏర్పడతాయి. ప్రామాణికతా భావన వెంటనే పరిపూర్ణతా భావన కూడా ఉంటుంది. ఇది దానిని వెన్నంటి ఉంటుంది. సంపూర్ణమైన మంచి, సంపూర్ణమైన సుఖం, సంపూర్ణమైన సౌందర్యం, సంపూర్ణమైన సాహసం మొదలైనవన్నీ పరిపూర్ణతా భావనలో భాగమైనవే.

నిజ జీవితానికీ ఈ పరిపూర్ణతా భావనకూ మధ్యనున్న అంతరం జీవితంలోని ఖాళీలలో ఒకటి. అది కల్పించే దాహం సాహిత్యానికి గొప్ప దోహదకారి అయింది. అయితే పరిపూర్ణతా భావన ఒక్కటే కాదు, అన్ని రకాల ప్రామాణికతా భావనలను జీవితం వెక్కిరిస్తుంది. ఈ అంతరం మనిషిలో కలిగించే ఆందోళన, ఆవేదన, వెలితి అన్ని భాషలలోనూ సాహిత్యానికొక ముఖ్య వస్తువు.

జీవితంలో వేరే రకమైన ఖాళీలు కూడా ఉంటాయి. చైతన్యయుతంగా జీవించక తప్పని మనిషికి జ్ఞానం చాలా అవసరం. మన కళ్లముందు ఉండీ మనం చూడని, చూడజాలని విషయాలనేకం ఉంటాయి. కొన్ని భయం వల్ల చూడము. కొన్ని అభద్రత వల్ల చూడము. కొన్ని ఒక బలమైన భావజాలం ప్రభావం వల్ల మన ఎదుట ఉండీ

మనకు కనిపించవు. ఒక్కొక్కసారి మనకు అలవడిన దృక్కోణం వల్లగానీ మనం ఎంచుకున్న దృక్కోణం వల్లగానీ కొన్ని విషయాలు కళ్లముందే ఉండీ కనిపించవు. వీటిలో విడివిడి విషయాలే కావు, సామాజిక క్రమాలు కూడా ఉంటాయి. వీటిని మనకు చూపించడం సాహిత్యం చేసే పనులలో ఒకటి. చూపించే క్రమంలో ఏ భయం, లేక ఏ అభద్రతా భావన, లేక ఏ భావజాలం, లేక ఏ పాక్షిక దృక్కోణం దీనిని మనం చూడలేకుండ చేసిందో కూడా సాహిత్యం చెప్పకుండానే చెప్తుంది. 'అరె! ఇది నాకు తెలిసిన విషయమే గానీ చూడలేకపోయానే' అనుకునేటట్టు చేస్తుంది. మంచి సాహిత్యమెప్పుడూ ఆ అనుభూతి కలిగిస్తుంది. మానవ అస్తిత్వంలోని ఈ రకరకాల 'ఖాళీలు' సాహిత్యం జన్మస్థలం, దాని కార్యక్షేత్రం. అటువంటి ప్రక్రియ మనిషి అస్తిత్వ నైజం వల్లనే అవసరమయింది. సాహిత్యానికి ఉండే ఈ నైజాన్ని గుర్తించి దానితో సమసమాజ ఆదర్శానికి అనుగుణంగా వ్యవహరించడం నేర్చుకోగలిగితే–దానికి ఏమైనా ప్రమాణాలు రూపొందించుకోగలిగితే–అది ప్రజాసాహిత్య సిద్ధాంతం కాగలదు. సోషలిస్టు సాహిత్య సిద్ధాంతం కాగలదు. 'కళ ప్రజల కోసం' అనే నినాదానికి వేరే ఏ కార్యరూపం ఇచ్చే ప్రయత్నం చేసినా అది సాహిత్యానికిగానీ ప్రజలకుగానీ మేలు చేయదు.

**నిలిచిపోయే సాహిత్యానికి సమర్థవంతంగా రాయడం, సామాజిక పరిణామంలో కీలక స్థానంలో ఉన్న చారిత్రక సందర్భం నేపథ్యంగా ఉండడం అన్న లక్షణాలను మీరు ప్రతిపాదించారు. ఎటువంటి బాహ్య పరిస్థితుల మధ్య అయినా తన సమర్థత, పక్షపాతాల ఆధారంతో రచయిత గొప్ప రచనలు చేయగలడని ఇంతకాలం నమ్ముతూ వచ్చాం. చారిత్రక సందర్భానికి మీరు ఎక్కువ వెయిటేజి ఇవ్వడం వల్ల నిలిచిపోయే రచనల సాధన నుంచి రచయితలను నిరుత్సాహపరుస్తుంది కదా?**

సమర్థవంతంగా రాయడం సంగతి పక్కన పెట్టండి. అదెట్లాగూ అవసరమే. ఇక్కడ సామర్థ్యం అనేది శిల్పానికి సంబంధించినది. శిల్పం గురించి మాట్లాడితే వస్తువు మీద నుండి దృష్టి తొలగిపోతుందనే కృత్రిమమైన భయం నుండి బయటపడగలిగితే, సాహిత్యానికి 'సాహిత్య' లక్షణం ఇచ్చేది శిల్పమే తప్ప వస్తువు కాదనే విషయం స్పష్టమే. సాహిత్యానికీ జర్నలిజానికీ తేడా సాహిత్య శిల్పమే. సాహిత్యాన్ని శిల్పమే రూపొందిస్తుంది అని అడార్నో అంటాడు. అతను వర్గపోరాటం మీద అచంచల విశ్వాసం ఉన్న మార్క్సిస్టే మళ్లీ.

కీలకమైన సామాజిక పరిణామాల మాటకొస్తే, అటువంటి సందర్భాలు చరిత్రలో ఎక్కడ తలెత్తినా గొప్ప కథా వస్తువులు అందించడానికి ఒక కారణం ఉంది. అటువంటి సందర్భాలలో ఒక్కొక్కసారి మానవ ఆలోచనారీతికి స్వాభావికమైన పరిపూర్ణతాభావన ప్రామాణికతా భావన అత్యున్నత స్థాయిని అందుకుంటాయి. అతి గొప్ప ఆదర్శాలు ముందుకొస్తాయి. ఒక్కొక్కసారి మానవ ఆచరణ అతి నీచ స్థాయికి పడిపోతుంది. ఒక్కొక్కసారి రెండూ జరుగుతాయి. అన్ని సందర్భాలలోనూ ఉన్నత ప్రవర్తనకూ నీచమైన ప్రవర్తనకూ మధ్యనున్న ఎడం మరింత ఎక్కువవుతుంది. చూడగలిగి ఉండీ చూడలేకపోవడం, కళ్ల ముందుండీ కళ్లు మూసుకుపోయి కనిపించకపోవడం అటువంటి చారిత్రక సందర్భాలలో మరింత స్పష్టంగా తెలుస్తాయి. సాహిత్యం కార్యక్షేత్రమైన మానవ అస్తిత్వ నైజంలోని అన్ని రకాల సందిగ్ధాలూ తీవ్ర పరిమాణం తీసుకుంటాయి. అందుకే నిలిచిపోయే సాహిత్యం పుడుతుంది. దీనికీ, బాహ్యా పరిస్థితులు అననుకూలంగా ఉన్నప్పుడు కూడా మంచి సాహిత్యం రాయడం రాయలేకపోవడం అనే సమస్యకూ సంబంధమేమీ లేదు.

**మీ మాటలలోని అర్థాన్ని మరింత విస్తరిస్తే–ఒక స్థిర నిశ్చయం కంటే–భయం, కుతూహలం, ఆందోళన వంటి అస్థిర ఉద్వేగాల నుంచే గొప్ప సృజన వస్తుంది. ఈ ప్రతిపాదనకు అపవాదులు లేవా? ఆధునికతను మనస్ఫూర్తిగా ఆహ్వానించిన గురజాడ అప్పారావును ఎలా లెక్క వేస్తారు? విశ్వనాథ సత్యనారాయణలో ఆధునికత మీద భయందోళనలు మాత్రమే ఉన్నాయా, స్థిర నిశ్చయంతో కూడిన వ్యతిరేకత లేదా? పాశ్చాత్య సాహిత్యం నుంచే తప్ప తెలుగు సాహిత్యం నుంచి ఒక్క ఉదాహరణ కూడా ఎందుకు ఇవ్వలేదు?**

'ఆధునికతను మనస్ఫూర్తిగా ఆహ్వానించిన గురజాడ అప్పారావు' కన్యాశుల్కం హీరోగా ఆధునికతను నిజాయితీగా ఆహ్వానించిన వ్యక్తిని ఎంచుకోలేదు. విరసం వంటి సాహిత్య సిద్ధాంతకారుల మాటలు విని ఉంటే ఆ పని చేసి ఉండేవాడు. అప్పుడు కన్యాశుల్కాన్ని ఈ రోజు ఎవరూ చదివేవారు కాదు. ఆయన ఆధునికతను తన స్వంత ప్రయోజనాలకోసం వాడుకున్న యాంటి హీరోను ఎంచుకున్నాడు. సంప్రదాయానికి కూడా మంచికో చెడుకో దానిని నిజాయితీగా ఆచరించిన బ్రాహ్మణులను కాక గిరీశంను పోలిన దగుల్బాజీలనే ప్రతినిధులుగా ఎంచుకున్నాడు.

ఆధునికతకూ సంప్రదాయానికీ మధ్యనున్న వైరుధ్యం రెండు మహత్తరమైన విలువల ప్రపంచాలకు మధ్య ఘర్షణ, ఆ విషయం కన్యాశుల్కం దాచిపెట్టదు. అందులో మనల్ని ఆధునికత వైపే రమ్మంటుంది. అదే సమయంలో ఆ విలువల అట్టహాసానికీ వాటి పేరు మీద కొట్లాడుకునే మనుషుల నేలబారుతనానికీ మధ్యనున్న అంతరాన్ని చూపిస్తుంది. కొంత్త నవ్వు, కొంత ఆందోళన, నవ్యత పట్ల సానుభూతి, దానికి సాధనాలయిన మనుషులను చూసి కొంత నిస్పృహ కలిగిస్తుంది.

'నాజీవాదానికి అనుకూలంగా గొప్ప సాహిత్యం రాయడం సాధ్యం కాదనేది నిస్సందేహమే' నని ఫ్రెంచి తత్వవేత్త సార్త్ర్ అంటాడు. బ్రాహ్మణవాదాన్ని గురించి కూడా అదేమాట అనొచ్చు. కానీ ప్రశ్నను ఆ విధంగా వేసుకోవడంలోనే పొరబాటు ఉంది. ఆ విధంగా వేసుకుంటే నిస్సందేహమైన జవాబులే వస్తాయి. 'నాజీవాదాన్నీ బ్రాహ్మణవాదాన్నీ జయించడం అభ్యుదయవాదులు ఊహించినంత సులభమా అన్న సందేహం గొప్ప సాహిత్యాన్ని సృష్టించగలదా?' అన్న రూపంలో ప్రశ్న వేసుకుంటే అంతటి 'నిస్సందేహమైన' జవాబు రాదు. ఈ వాదాలను జయించడానికి ఎంచుకుంటున్న పద్ధతులు ఒక కొత్త నియంతృత్వానికి, లేక ఒక కొత్త అణచివేతకు దారి తీస్తాయేమోనన్న సందేహం గొప్ప సాహిత్యాన్ని సృష్టించగలదా అన్న రూపంలో వేసుకున్నా కూడా అంతే. విశ్వనాథ సత్యనారాయణలో ఉన్నది ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకతే తప్ప ఇటువంటి భయసందేహాలు కావు కాబట్టి ఆయన రాసినదేదీ నిలిచిపోతుందని అనుకోను. అయితే నేను ఆయన రచనలన్నీ చదవలేదు కాబట్టి కచ్చితంగా చెప్పలేను.

స్థిర నిశ్చయం-భయం అన్న వర్గీకరణ కంటే మనిషిలోని అభ్యుదయ శక్తి పట్ల ఆశాభావం, దానికి ఉండే అవరోధాలపట్ల ఆందోళన అనేది ప్రస్తుత సందర్భంలో ఉపయోగకరమైన వర్గీకరణ అనుకుంటాను. ఆ శక్తి తమలో ఉందని తెలియకుండ మనుషులు నిద్రలో ఉన్నప్పుడు దానిని వారికి చూపించి మేల్కొలపడం మంచి సాహిత్యం సాధారణంగా నిర్వహించే పాత్ర అవుతుంది. అటువంటి సాహిత్యం అన్ని భాషలలోనూ ఉంది. అయితే ఆ శక్తిని తప్ప దానికి ఉండే పరిమితులనూ అవరోధాలనూ వాటిని గుర్తించకపోతే రాగల విపత్తునూ గుర్తిస్తుంది. వ్యక్తీకరిస్తుంది. నిజానికి మానవ జీవితంలో ఈ రెండు పరిస్థితులూ ఎప్పుడూ కలిసే ఉంటాయి

కాబట్టి రెండు కర్తవ్యాలు సాహిత్యం నిర్వర్తిస్తూనే ఉంటుంది. ఎటొచ్చీ ఉద్యమాలకు అనుబంధంగా కాక 'కాంప్లిమెంటరీ'గా ఉంటుంది. అయితే సాహిత్యాన్ని కేవలం ఉద్యమాల నేపథ్యంలో చర్చించడం పొరబాటు. ఉద్యమాలు మానవ జీవితంలో ఎప్పుడూ ఒక చిన్న భాగం మాత్రమే. సాహిత్యం పాత్ర దానికి పరిమితం కాదు. అది జీవిత మంత విస్తృతమైనది.

**మానవ స్వభావంలో అభ్యుదయ కాముకులు గుర్తించడానికి భయపడే అగాధాలను అసాధారణ ప్రతిభతో ప్రగతివాదుల పట్ల కచ్చతో దాస్టయవ్‌స్కీ వెలికితీసి వర్ణించాడని మీరు రాశారు. తెలుగు సాహిత్యంలోని కమ్యూనిస్టు వ్యతిరేకుల రచనలకు అంతటి స్థాయి ఉందంటారా?**

దస్తాయవ్‌స్కీ మనిషిమీద ప్రేమతో ఆధునికతను చూసి భయపడ్డాడు. మనిషి మీద ద్వేషంతో కాదు. ఆధునికత-బూర్జువా ఆధునికత అయినా సోషలిస్టు ఆధునికత అయినా-మనిషిలోని మానసిక శక్తిని మాత్రమే చూస్తుంది. దానిని ప్రాతిపదిక చేసుకొని తన వ్యూహాలను రచించుకుంటుంది. అది బలహీనమైన మనిషిని తన రథ చక్రాల కింద తొక్కేస్తుందని భయపడిన రచయితలు 19,20 శతాబ్దాల పాశ్చాత్య సాహిత్య చరిత్రలో చాలా మంది ఉన్నారు. 20వ శతాబ్దపు చరిత్రను సమీక్షించుకుంటే ఇది అవాస్తవికమైన భయకం కాదని అర్థం అవుతుంది.

తెలుగు సాహిత్యంలోని కమ్యూనిస్టు వ్యతిరేకులు మనిషి మీద ప్రేమతో-మనిషి బలహీనతపట్ల సానుభూతితో-కమ్యూనిస్టులను చూసి భయపడ్డారా? లేక మనిషిమీద ద్వేషంతో కమ్యూనిజాన్ని ద్వేషించారా? రెండవదే నిజమేమో. అయితే నాకు తెలుగు సాహిత్యంతో ఉన్న పరిచయం తక్కువ కాబట్టి కచ్చితంగా చెప్పలేను.

**ఇంటర్వ్యూ : కె. శ్రీనివాస్**

*'ప్రజాతంత్ర' సాహిత్య ప్రత్యేక సంచిక-మార్చి 2001 నుంచి పునర్ముద్రితం*
*12 అక్టోబర్ 2009, 'జ్యోతి' దినపత్రిక*

# విమర్శకుడిగా బాలగోపాల్

*'ఒక్క పదేళ్ళ కాలంలో బాలగోపాల్ తన బుద్ధికి బాగా పదును పెట్టాడు. గణితశాస్త్ర శిక్షణ మాత్రమే పొందిన యువకుడు తత్త్వశాస్త్రం, సమాజశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, సాహిత్య వగైరా విషయాల లోతులు ముట్టగలగడమే అద్భుతం అనిపిస్తుంది. నాకు తెలిసి, క్రిస్టోఫర్ కాడ్వెల్, డి.డి. కోశాంబి ఇంతటి బహుముఖమైన ప్రజ్ఞతోటి మిరుమిట్లు గొలిపారు'.*

– కె.వి. రమణారెడ్డి

హక్కుల పోరాటాల ఉక్కుమనిషి బాలగోపాల్ (1952–2009)కు సాహిత్యం కూడా ప్రజా ఉద్యమంలో భాగమే. వారు 1981–85 మధ్యకాలంలో రాసిన వ్యాసాలు, సమీక్షలు, 'రూపం–సారం' (స్నేహ ప్రచురణ 1986) పేరుతో వెలువడ్డాయి. ముప్పైనాలుగేళ్ళ ప్రాయంలో అనేక ప్రతిపాదనలతో తలలు పండిన మార్క్సిస్టు మేధావులను కూడా తలలూపేటట్లు చేయగలిగారు. బాల్‌గోపాల్ ఒక రచనను నడిపించిన శక్తులకు, నడిపించవలసిన చోదక శక్తులకు మధ్య అంతరాన్ని గ్రహించినవాడు కావడమే ఇందుకు కారణం.

సంప్రదాయ సాహిత్యంలో తిరుగులేని పాండిత్యం ఉన్నవారిలో శేషేంద్ర ఒకరు. రామాయణం మీద, ఇతర సంప్రదాయ సాహిత్య ప్రక్రియల మీద కృషి చేసిన వారుగా వారిని గౌరవిస్తారు. ఆధునిక కవిత్వంలో విప్లవధోరణి గల కవిత్వం కూడా వారు రచించారు. ఈ కవితలు ఉద్యమంలో కృషి చేసిన వారిని కూడా ఆకర్షించాయని

తెలిసిన వారంటారు. అయితే, విప్లవం పట్ల నిబద్ధత లేదన్నది శేషేంద్ర మీద ఉన్న ప్రధానమైన విమర్శ. శేషేంద్ర ప్రకటించిన 'కవిసేన మానిఫెస్టో'ను అన్ని వర్గాల సాహిత్యాభిమానులు చదివారు. బాలగోపాల్ కూడా దాన్ని పరిశీలించి ఒక వ్యాసం రాశారు. తెలుగుదేశంలో మార్క్సిస్టు లెవరూ 'కాపిటల్' చదవలేదంటూ శేషేంద్ర చేసిన సూత్రీకరణలను ఖండించారు. భూస్వామ్యదోపిడీని ఎదిరిస్తూ, ప్రజలకు సాహిత్యం ద్వారా చేసే విప్లవ ఉపదేశాన్ని మార్క్సిజం విశ్వసిస్తుందని అంటూ, శేషేంద్ర భావించినట్లు–భరతముని, భామహుడు, విశ్వనాథవంటి ఫ్యూడల్ వ్యవస్థను సమర్థించిన వారి ధర్మోపదేశాన్ని అది విశ్వసించదంటారు బాలగోపాల్. ఈ రెండు వర్గాల సామాజిక చైతన్యం ఒకటి కాదంటారు. ఎందుకంటే, పదార్థం నుంచి చైతన్యం పుట్టిందని నమ్మే భౌతిక వాదం మార్క్సిజం కాగా, దీనికి వ్యతిరేకమైన భావవాదం శేషేంద్రది. పునాది దగ్గరే శేషేంద్ర చేసిన ఈ పొరపాటును గుర్తించటానికి నిశితదృష్టి అవసరం. యండమూరి వీరేంద్రనాథ్ 'చేతబడి, మంత్ర విద్య'ల ఆధారంగా 'తులసి దళం' నవలను రాశారన్న వారూ, 'సైన్సు ఫిక్షన్' అని భావించిన వారూ ఉన్నారు. ఈ రెండు కోణాలను శాస్త్రీయంగా పరిశీలించి బాలగోపాల్–'కుహనా వైజ్ఞానిక నవలలు' అన్న వ్యాసాన్ని రాశారు.

మంత్రాల పుట్టుకను పరిశీలించిన ఫ్రేజర్, మాలినోవ్‌స్కీ వంటి శాస్త్రజ్ఞులు ఆదిమ మానవుడి జీవితాన్ని కూలంకషంగా పరిశీలించారు. వర్షానికి ముందు ఉరుము వినిపిస్తుంది. ఆ ఉరుమే వర్షానికి మూలమని భావించిన ఆదిమ మానవుడు తనకు వర్షం అవసరమైనప్పుడల్లా ఆ ఉరుమును అనుకరిస్తూ శబ్దం చేయటం అలవరుచుకున్నాడు. అదే తొలి మంత్రం అయిందట. అట్లాగే జంతువుల రాకకు ముందు వాటి అడుగుల శబ్దం వినపడుతుంది. ఆ శబ్దమే వాటి రాకకు కారణమనుకున్న ఆదిమ మానవుడు జంతువుల అవసరం ఏర్పడినప్పుడల్లా అట్లాంటి ధ్వనులు చేశాడు. ఆ ధ్వనులు వాటిని రప్పిస్తాయని విశ్వసిస్తూ వచ్చాడు. వీటిని బట్టి 'సామీప్యత కార్యకారణ సంబంధాన్ని సూచిస్తుం'దన్న తప్పుడు సూత్రం నుంచి మంత్రం పుట్టిందని (పే. 3) శాస్త్రజ్ఞులు తేల్చి చెప్పారు. చేతబడి కూడా అలాంటిదే. పోలికలున్న చోట పరస్పరం ప్రభావితం చేసుకునే లక్షణం ఉంటుంది అనే తప్పుడు సూత్రం దీనికి ఆధారం. దీన్ని అనుసరించి ఒకరిని చంపదలచుకున్నప్పుడు అతని ప్రతిమను

తయారు చేసి దాన్ని హింసించి, ఆ హింస ఆ వ్యక్తికి కూడ తగులుతుందని నమ్మడం జరుగుతుంది. దీని వెనకవున్న సూత్రం తప్పని గుర్తించిన క్షణం చేతబడి అవాస్తమని రుజువు చేయటానికి ప్రయోగాలు అవసరం లేదంటారు బాలగోపాల్. ఈ శాస్త్రీయ కోణం నుంచి 'తులసిదళం'లోని చేతబడి–మంత్రతంత్రాల పార్శ్వాన్ని సునాయాసంగా ఖండించగలిగారు.

ఇక 'సైన్సు' పార్శ్వం సంగతి. వైజ్ఞానిక నవల రాయటానికి అపారమైన పరిజ్ఞానం అవసరం. ఐజాక్ అసిమోవ్, ఆర్థర్ క్లార్క్ వంటివారు రాసిన సైన్స్ ఫిక్షన్‌లో అడుగడుగున పాఠకులకు దర్శన మిచ్చేది వారి సైన్స్ పరిజ్ఞానం. వీరేంద్రనాథ్‌లో ఉన్న సైన్స్ పరిజ్ఞానం కేవలం డొల్లతనంతో కూడిందేనని బాలగోపాల్ నిరూపించారు. 'పరస్పర విరుద్ధమైన శక్తులు తమ దిశను మార్చుకుంటాయి' అన్నది న్యూటన్ చలన సూత్రంగా వీరేంద్రనాథ్ అంటారు. ఇందులో రెండు దోషాలున్నాయి. ఒకటి–ఇట్లాంటి చలన సూత్రమేదీ న్యూటన్ చెప్పలేదు. రెండు–ఒక వేళ పరస్పర విరుద్ధమైన శక్తులు ఒక చోట కేంద్రీకృతమైతే అవి దిశను మార్చుకోవు. వాటిలో ఏది బలీయమయితే వాటి ఫలితం ఆ దిశలో ఉంటుంది (పే. 23). అలాగే 'తులసి' నిద్రపోతుండగా 20 రోజుల పాటు హిప్నొటిక్ సజెషన్స్ పంపుతాడు. వాటిని స్వీకరించిన ఆమె మెదడు తనకు లేని రోగాలున్నట్టుగా ఊహించుకుంటుంది. ఈ కల్పనలో ఉన్న లోపాలను కూడా బాలగోపాల్ నిరూపించారు. నిద్ర పోతుండగా, అదీ దూరం నుంచి ఎవరూ ఎవర్నీ హిప్నొటైజ్ చేయటం సాధ్యం కాదు. ఆ మనిషి ఎరుక, సమ్మతి, సహకారం ఉన్నప్పుడే అది సాధ్యం (పే. 25). ఇదే సాధ్యం కానప్పుడు మనిషి మెదడులో అది వరకు లేని ఊహలు కలిగించటం–అంటే, నేల విడిచి సాము చేయటమే. ఇట్లాంటి అనేక శాస్త్రీయ సూత్రీకరణల ద్వారా వీరేంద్రనాథ్ సైన్సును 'క్షుద్రవిద్యల' స్థానానికి దిగజార్చిన తీరును ఖండించారు.

బాలగోపాల్‌కు కొడవటిగంటి కుటుంబరావు మీద అభిమానం ప్రత్యేకమైంది. 'యుద్ధ సంస్కృతికి అద్దం పట్టిన కథలు' అన్న వ్యాసం ప్రారంభంలో 'సమకాలీన సమాజంలో వస్తూన్న మార్పులను, చారిత్రాత్మకమయిన పరిణామాలను ఆ వర్తమానంలో గోచరించే భవిష్యత్తును, ఆ తరం వారికి, తరువాతి తరాల వారికి కళ్ళకు కట్టినట్టు చూపించే రచన గొప్ప రచన' అంటూ కొ.కును గొప్ప రచయితగా

గుర్తిస్తారు. 1930, 1940 దశకాల ఆర్థికమాంద్య, రెండవ ప్రపంచ యుద్ధ సంక్షోభాలను కలుపుతూ వేసిన నిచ్చెన మీదుగా పరిశీలిస్తూ-'తరుచు తారస పడే పాత్ర' ఒకటి ఉంది. ఇతడు మొదట్లో-ఆర్థిక సంక్షోభం ఫలితంగా ఇబ్బందులకు గురవుతాడు. ఇంతలో ప్రపంచ యుద్ధం వస్తుంది. పర్మిట్లు, కోటాలు, లైసెన్సులు, కాంట్రాక్టులు చేపట్టి ధనికుడవుతాడు. ఒక మోస్తరు పెట్టుబడి దారుగా స్థిరపడతాడు. యుద్ధకాలపు అవకాశాల మూలంగా-చీకటి బజారు వ్యాపారులు, బ్రోకర్లు, స్మగ్లర్లు-'లంపెన్ అధోప్రపంచపు వర్గం'గా పుట్టుకొచ్చిన తీరును కొ.కు. తన కథల్లో బలంగా చెప్పగలిగాడంటారు. 'సామాజిక వ్యాఖ్యాత కొ.కు' వ్యాసంలో అప్పటిదాకా ఏ విమర్శకుడు గుర్తించలేకపోయిన కొ.కు. వ్యక్తిత్వ లక్షణాన్ని బాలగోపాల్ వివరించి చెప్పారు. అది ఏ మార్క్సిస్టు రచయిత అయినా పునాదితో ప్రారంభించి ఉపరితలం వైపు పయనించాలి. అంటే-సమాజ భౌతిక స్వరూపంతో ప్రారంభించి వ్యక్తిని ఆ సమాజ నిర్మాణంలో ఒక నిర్దిష్ట స్థానం గల మనిషిగా మార్క్సిజం గుర్తిస్తుంది. దీన్ని తలకిందులుగా చేసేది బూర్జువా దృక్పథం. అంటే-వ్యక్తితో ప్రారంభించి అతని కొక సహజమైన మనస్తత్వం ఆపాదించి, అటువంటి వ్యక్తులు పరమాణువులుగా ఏర్పడ్డ సమూహంగా సమాజాన్ని అర్థం చేసుకుంటుంది (పే. 35). కొ.కు ఉపరితలంతో ప్రారంభించి పునాదివైపు తీసుకువెళ్ళిన వ్యాసాలను బాలగోపాల్ తన తార్కిక శక్తితో విశ్లేషించారు. కొ.కు అంతిమంగా చెప్పేది మార్క్సిజమే అయినా, ఆయన ఎన్నుకున్న విధానం బూర్జువా పత్రికలకు అనుకూలంగా ఉన్నందువల్ల వందలాదిగా వ్యాసాలు పాఠకులకు చేరగలిగాయి.

'రావి శాస్త్రి రచనల్లో రాజ్యాంగ యంత్రం' అన్న వ్యాసంలో రాజ్యాంగ యంత్రంలో 'న్యాయశాఖ, కార్యనిర్వాహక శాఖ, శాసనశాఖ' అన్న భాగాలున్నా రావిశాస్త్రి మొదటి రెండింటి మీదనే దృష్టి పెట్టటం ఒక లోపంగానే బాలగోపాల్ గుర్తిస్తారు. కాని రావిశాస్త్రి నిశితమైన దృష్టిని ప్రశంసిస్తారు. 'నేరం బూర్జువా సమాజపు సంక్షోభాలకు ఒక సేఫ్టీవాల్వు లాంటిది. అవసరమైనప్పుడు దాన్ని తెరవకపోతే ఇంజను పగిలిపోతుంది. ఎప్పుడూ తెరిచే ఉంటే ఇంజను పనిచేయదు' (పే. 47) అంటూ సూత్రీకరిస్తారు. దీంతో న్యాయ వ్యవస్థ పరిమితులను కూడా నిర్వచించి నట్లయింది. ఈ దృష్టితో రావిశాస్త్రి సారా కథలను, ఇతర కథలను విశ్లేషించారు.

బాలగోపాల్ ఏ వ్యాసం చూసినా ఏ పుస్తక సమీక్ష చదివినా రాజీలేని మార్క్సిస్టు నిబద్ధత కనిపిస్తుంది. 1968లో రా.రా. 'తెలుగుదేశం'లో మేధావులు తక్కువ. మేధావులనబడే వాళ్ళ మేధాస్థాయి-ప్రపంచ మేధావులతో పోలిస్తే-చాలా తక్కువ' అన్నారు. ఈ వ్యాఖ్యకు బాలగోపాల్ ఒక మినహాయింపు, అంతర్జాతీయ స్థాయి మేధావి, ఉద్యమకారుడూ అయిన బాలగోపాల్ ఈ సాహసోపేతమైన కృషిని పాశ్చాత్య దేశాలలో చేసి ఉంటే 'నోబెల్' లేదా దానితో సమానమైన పురస్కారానికి యోగ్యుడై ఉండేవారు. వారే ఒక వ్యాసంలో అన్నట్టు-'ప్రజా ఉద్యమంలోకి వచ్చేవాళ్ళ వ్యక్తిత్వాలు ఉద్యమంలో కరిగిపోవు. ఉద్యమం వాళ్ళ వ్యకిత్వంలో కరిగిపోతుంది' (పే. 32). అనుక్షణమూ అణువణువూ నిరుపేదల గుండెల స్పందనల్లో బతికే వాళ్ళకు మరణం కేవలం వ్యక్తిగతమైందే. సామాజికంగా వాళ్ళు చిరంజీవులు.

– అమ్మంగి వేణుగోపాల్

*12 అక్టోబర్, 2009 'సూర్య' దినపత్రిక*

మానవ హక్కుల వేదిక మీద 'బాలగోపాల తరంగం'

# 'గురజాడ'లో రాజ్యం చీకటి జాడ

**బ్రిటిష్‌వాళ్ల** కోర్టులు వాళ్ల దేశంలో ఎట్లా పని చేస్తాయోగానీ ఇక్కడ మట్టుకు వాటిని నెలకొల్పిన నాటి నుండి ఈ నాటి దాకా ఒకేరకంగా భ్రష్టుపట్టి ఉన్నాయి. ఒక్క కోర్టు సంగతే ఎందుకు, రాజ్యాంగ యంత్రమంతా అంతే. రాశిలో నానాటికీ పతనం లేకపోలేదుగానీ గుణం మట్టుకు ఆనాడూ ఈనాడూ ఒక్కటే. 'మా చట్టాలు మంచివే గానీ మీ రామప్ప పంతుళ్ల నియోగపు తెలివితేటలు వాటిని భ్రష్టు పట్టించా'యని తెల్లవాళ్లంటారేమో. కానీ, నిష్పాక్షికంగా మాట్లాడుకుంటే ఆ చట్టాలకూ ఈ కరణీకపు తెలివితేటలకూ సరిగ్గా అతికింది. దానికోసం ఇదీ, దీని కోసం అదీ అన్నట్లు సరిపోయాయి రెండూ. అగ్ని హోత్రావధాన్లుకు మెకాలే గురించి తెలీదుగానీ తెలిసి వుంటే 'అతగాడు కూడ కరణమేనష' అని వుండేవాడేమో (మ్లేచ్ఛకరణ మయితేనేం!) బూర్జువా ప్రజాతంత్ర సాంప్రదాయం నుండి పుట్టిన సంస్థలు ఫ్యూడల్ ప్రభువుల వ్యవహారరీతులకు ఇంత బాగా అతికాయంటే ఆ 'ప్రజాతంత్ర సంప్రదాయం వలసలలో తీసుకున్న రూపం అటువంటిది', భూస్వామ్య పెత్తనాన్ని ఎంత మాత్రం ఇబ్బంది పెట్టకుండా, రాజకీయ స్వేచ్ఛ కల్పించకుండా 'నిష్పాక్షికమయిన నియంతృత్వాన్ని' (ఇంపార్షియల్ డెస్పాటిజం అనేది మెకాలే ప్రయోగించిన మాట) ఈ భూస్వామ్య సమాజం మీద నెలకొల్పాలన్న బ్రిటిష్ సంకల్పం ఈ స్థితికి దారితీసింది.

న్యాయవ్యవస్థ ఈ మధ్యనే మరీ పాడయిపోయిందనీ, ఒకప్పుడు, ముఖ్యంగా తెల్లవాళ్ల పాలనలో–చాలా బాగుండిందనీ మనల్ని నమ్మించడానికి పెద్దలు ప్రయత్నం చేస్తుంటారు. నానాటికీ పాతాళానికి చేరువ అవుతున్న అథోగమనాన్ని కాదనవసరం

లేదుగానీ ఈ చెట్టుకు చీడ విత్తనం నాడే పట్టిందని గుర్తించకపోతే మాత్రం చరిత్ర గమనాన్ని మనం తప్పుగా అర్థం చేసుకున్న వాళ్లమవుతాం. 'పెద్ద పెద్ద వకీళ్లు కూడా సిగ్గుపడాలి బరిపెట్టి దొంగ సాక్ష్యాలు పాఠం చెబుతారు. కొందరు మృదువరులు తిరగేసి కొట్టమంటారు. నా వంటి చాదస్తులం. ఇంకొక కొందరం అట్టి పాపానికి ఒడిగట్టుకోం గాని, మా పార్టీల తరఫు సాక్షులు కూడ అబద్ధం చెబుతున్నారని యెరిగిన్నీ ఊరుకుంటాం....” “నిజమయిన సాక్ష్యం! ఏం సత్యకాలం! నిజమాడేవాడు సాక్ష్యానికి రాడు, సాక్ష్యానికి వచ్చేవాడు నిజమాడలేదు...” “వాదికి బోధించే నిజం వాది తరఫు వకీలుకి అక్కరలేదు. ప్రతివాదిని బాధించే నిజం ప్రతివాది వకీలుకీ అక్కరలేదు. క్రాసెగ్జామినేషన్ ఆరంభించేసరికి ఎంతటి సాక్షీ కవిత్వం ఆరంభిస్తాడు...” “వకీళ్లు అబద్ధాలాడిస్తే న్యాయం కనుక్కోవడానికి జీతం పుచ్చుకునే జడ్జి ఏంజేస్తాడండీ? అని అడిగితే, “ఉభయ పార్టీల వకీళ్లు ఆడించే అబద్దాలు చేయి పీకేటట్టు రాసుకుంటారు”. ఈ మాటలు ఇవ్వాళ కొత్తగా వృత్తిలోకి దిగి ఆదర్శాలు ఇంకా చెడని యువ న్యాయవాది అంటున్నవి కావు. 100 ఏళ్ల క్రితం సౌజన్యారావు పంతులనే సత్యసంధుడయిన వకీలు చేత గురజాడ చెప్పించినవి. ఇవ్వాళ అదనంగా ఏమనగలం? జడ్జిగారు ఇరుపార్టీల అబద్ధాలను చేయి పీకేటట్టు రాసు కోవడమేకాక 'ఆ రెండు అబద్ధాలలో దేనిని తాను సత్యంగా గుర్తించదలచుకుంటాడో నిర్ణయించుకోవడానికి చేయితడుపుకుంటాడు' కూడా అని ఈనాటి వకీళ్లు అంటారేమో. ఆనాడు మట్టుకు ఇది లేదనా?

సమాజంలో నీతికీ నడవడికకూ ప్రమాణాలను నిర్దేశించే విధాయకులుంటారు. వాళ్లపట్ల విధేయత మన ధర్మం. విధేయులం కాకపోతే మనల్ని శిక్షిస్తారు. దేవుడు, రాజ్యం ప్రధానమయిన విధాయకులు. ఇంటింటా ఊరూరా ఉన్న సెకెండు గ్రేడ్ లేక చిల్లర విధాయకులు దేవుడి పేరిటా రాజ్యం పేరిటా ధర్మం పేరిటా శాసనాల పేరిటా తమ పెత్తనాన్ని సమర్థించుకుంటారు. శాసనాల భారాన్నీ, ధర్మాన్నీ నిలబెట్టే బాధ్యతనూ మోస్తున్నామంటూ మనల్ని పరిపాలిస్తుంటారు. అయితే ధర్మానికీ, శాసనాలకూ కర్తలయిన దేవుడినీ రాజ్యాన్నీ శాసించేవారెవరూ లేనట్టే వాటి పేరుమీద మనల్ని పరిపాలించేవారికి కూడా శాసించేవారు లేరు. హవల్దారు మునసబుతో అన్నట్టు “గవర్నమెంటు, దేవుళ్లు, బ్రాహ్మలు-వారి నేరాలు వారివి, వాటితో మనకు పనిలేవు.

మన భక్తి మనకుండాల". ఈ విధాయకుల నుండి మానవ జాతికి విముక్తి లభించిన నాడే చరిత్ర చరమదశ చేరుకున్నట్టు. అప్పటిదాకా వచ్చిన అన్ని విప్లవాలూ అసంపూర్ణమయినవే. బండివాడికి నేషనల్ కాంగ్రెస్ గురించి 'రెండు ఘంటలు' లెక్చర్ ఇవ్వగా అంతా విని ఆ 'గాడిద కొడుకు మా ఊరి హెడ్ కానిస్టేబుల్‌ని కాంగ్రెస్ వారు ఎప్పుడూ బదిలీ చేస్తారని అడిగాడని ఉటంకించి 'పల్లెటూరి పీపుల్ లెక్చర్లకి అన్‌ఫిట్' అని గిరీశం నిర్ధారించాడుగానీ బండివాడి ఆకాంక్షను సరిగ్గా అర్థం చేసుకొని ఒక్క హెడ్ కానిస్టేబుల్‌కేకాక సకల పెత్తందారీ వర్గాలకూ వర్తింపజేసుకుంటే ప్రజాతంత్ర ఉద్యమం అజెండా మనకు అవగతం అవుతుంది. కొత్తగా వచ్చిన విక్టోరియా రాణి గవర్నమెంటు కనీసం పాత దేవుళ్లనూ బ్రాహ్మణ్యాన్నీ దెబ్బకొట్టి ఉంటే మిగిలిన పని ప్రజలు చేసుకొని ఉందురేమో. కానీ అది పాత దేవుళ్ల సరసన తానూ ఒక దేవతయి కూర్చుంది. యూరప్‌లో రాచరికాల్ని అంతం చేసి చర్చి అధికారానికి తోక కత్తిరించి బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని నెలకొల్పిన ప్రజాస్వామ్యం ఇక్కడ నియంతృత్వమయ భూస్వామ్య రాచరికంతో బ్రాహ్మణ్యంతో శాంతియుత సహజీవనం చేసింది.

ఇంగ్లీషులో 'లా అండ్ ఆర్డర్' అనే దానిని తెలుగులో 'శాంతిభద్రతలు' అనడం అలవర్చుకున్నాం. 'లా' సంగతి అట్లాగుంచి 'ఆర్డర్' అనేమాట కేవలం సామాజిక శాంతినీ భద్రతనూ సూచించదు. వ్యవస్థాగతమయిన భద్రతను సూచిస్తుంది. అంటే దొమ్మీలూ దొంగతనాలూ మట్టుకే కాదు, వ్యవస్థ నిర్మాణాన్ని కదిలించేది ఏదయినా అభద్రతే. వ్యవస్థ నిర్మాణాన్ని చెక్కుచెదరకుండా కాపాడడం రాజ్యం ప్రధాన కర్తవ్యం. చట్టాలూ కోర్టులూ పోలీసులూ ఉండేది అందుకోసమే. సామాజిక వ్యవస్థపైన జరిగే తిరుగుబాటును నేర చట్టం పరిధిలోకి తీసుకొచ్చి పీనల్‌కోడ్ కింద విచారించి శిక్షిస్తుంది. ఆధునిక బూర్జువా రాజ్యం, మతాచారాలకూ ధర్మశాస్త్రాలకూ మధ్యయుగాలలో వ్యవస్థాగతమయిన భద్రతను నిలబెట్టడంలో ఉండిన పాత్రను లౌకిత పేరిట తిరస్కరించిన బూర్జువా రాజ్యం ఆ పాత్రల నేర చట్టానికి అప్పగించింది. గిరీశం బుచ్చమ్మను 'లేవదీసుకుపోవడం' ఒకప్పుడు ధర్మవిరుద్ధమయి ఉండేది. ధర్మాన్ని అతిక్రమించినందుకు గిరీశం శిక్షార్హుడయి ఉండేవాడు. బ్రిటిష్ పాలనలో అ 'ధర్మం' తన శాసనాధికారాన్ని కోల్పోయింది. అయితే సామాజిక వ్యవస్థలో తన పాత్రనది కోల్పోలేదు. మొదట్లో బ్రాహ్మణ్యాన్ని కనీసం సంస్కరించడానికి పూనుకొన్న బ్రిటిష్ పాలకులు పోనుపోను ఆ సంస్కరణ బాధ్యతను వైయక్తిక చొరవకు వదిలిపెట్టి

బ్రాహ్మణ్యంతో సమైక్య సహజీవనం చేయసాగారు. గిరీశం (అతని నిజాయితీ సంగతి పక్కకు పెడితే 'బ్రాహ్మణ్యం మీద చేసిన తిరుగుబాటు డిప్టీ కలెక్టరు 'అబ్జక్షన్' కేసయింది. పీనల్‌కోడ్ కింద నేరమయింది. ఆ డిప్టీ కలెక్టరు బ్రాహ్మణ్యాన్ని ద్వేషించే వ్యక్తి అయినప్పటికీ ఫిర్యాదులో గిరీశం తండ్రి పేరు, ఊరి పేరు సక్రమంగా లేవన్న సాంకేతిక కారణం వల్ల మాత్రమే దానికి అభ్యంతరం చెప్పగలదు. అన్నీ సక్రమంగా ఉండివుంటే, సాక్ష్యాలు ఉండివుంటే అంతటి బ్రాహ్మణ ద్వేషి గిరీశానికి శిక్ష వేయవలసిందే. బ్రిటిష్ వలస రాజ్యం బ్రాహ్మణ్యంతో అంతగా రాజీపడింది. ఆ రాజీ నుండి పుట్టిన రాజ్యం ఈనాటికీ మనల్ని ఏలుతోంది. ఇంక మిల్ దొరగారూ, మెకాలే దొరగారూ నెహ్రూ దొరగారూ ఎన్ని లెక్చర్లిచ్చినా అది ప్రజాస్వామికంగా ఎట్లా ఉండగలదు?

ఈ వికృత సృష్టి పోనుపోను రాక్షస రూపం తీసుకుంది. దానిని చూసి హేళనగా నవ్వుకునే కాలం గడిచిపోయింది. గురజాడ సృష్టించిన హెడ్ కానిస్టేబుల్ జిత్తులు చూసి కనీసం నవ్వుకోగలం. కోర్టుల భ్రష్టత్వాన్ని గురించి సౌజన్యారావు పంతులు లెక్చర్ ఇస్తుంటే అమాయకపు ఫోజుపెట్టి సంభ్రమాశ్చర్యాలతో తిలకించే గిరీశం నటన చూసి కూడా నవ్వుకోగలం. అందరికీ భయపడే పోలిశెట్టితోబాటు దయ్యానికి సైతం భయపడని అసిరిగాడు, దయ్యాన్ని సీసాలో బంధించగల చతురుడు గవరయ్య, దయ్యానికే కాదు దేవుడికీ భయపడని బైరాగీ, ఇన్‌స్పెక్టరుకు భయపడి సాక్ష్యం ఇవ్వకుండా పలాయనం చిత్తగించడం హెడ్ కానిస్టేబుల్ కడుపు తరుక్కుపోతుంటేనూ చదివి నవ్వుకోగలం. కానీ ఇవ్వాళ కోర్టులనూ, పోలీసులనూ 'రాజ్యం' సకల అంగాలనూ చూసి నవ్వుకోగల రోజులు పోయాయి. బండివాడి కోరిక ఇవ్వాళ పల్లెటూరి బైతం కోరిక కాదు. దేశ ప్రజల కోరిక అయింది.

*('కన్యాశుల్కం-రాజ్యం-రాజ్యాంగయంత్రం' పేరుతో 'నూరేళ్ల కన్యాశుల్కం' ప్రత్యేక సంచికకు బాలగోపాల్ రాసిన వ్యాసంలోని కొన్ని భాగాలు)*

# రావిశాస్త్రి రచనల్లో రాజ్యాంగ యంత్రము

**మానవ హక్కుల** నేతగా ప్రసిద్ధులైన కె. బాలగోపాల్ సాహిత్య విమర్శకులుగా కూడా తెలుగు పాఠకులకు పరిచితులే. రావిశాస్త్రి కథల్లో రాజ్యాంగ యంత్రాన్ని గురించి ఆయన రాసిన ఈ వ్యాసం ప్రజలహక్కుల కోసం పోరాడే ఉద్యమకారుడిగా రాజ్యంపై బాలగోపాల్ విమర్శనాత్మక దృక్పథానికొక ఉదాహరణ. ఆ వ్యాసంలోంచి కొన్ని భాగాలు...

స్కూళ్లలోనూ కాలేజీల్లోనూ రాజకీయశాస్త్రమో పౌరశాస్త్రమో చదువుకునే దౌర్భాగ్యులకు రాజ్యాంగ యంత్రంలో మూడుభాగాలుంటాయనీ, వాటిని న్యాయశాఖ, కార్యనిర్వాహకశాఖ, శాసనశాఖ అంటారనీ నేర్పుతారు. ఆ దౌర్భాగ్యం రావిశాస్త్రికి చిన్నతనంలో కలుగలేదు కాబోలు. ఆయనకు ఆ మూడింటిలో మొదటి రెండే కనబడ్డాయి. అందులోనూ రెండవదానిలో పోలీసులూ, వూరి ప్రెసిడెంటోడు, ఎమ్మెల్యే నెంబరూ మాత్రమే కనబడ్డారు. ఆ ప్రెసిడెంటోడు గూడ తన చీకటి రూపంలోనేగాక వెల్తురు రూపంలో-అంటే కార్యనిర్వాహకుడిగా కళ్ళతో చూడడం రావిశాస్త్రికి సహజం అయితే కావచ్చుగాని, ఆ దృష్టి చాలా పాక్షికం. పాక్షికమైతే కావచ్చుగాని, రావిశాస్త్రి దృష్టి ప్రసరించినంతమేరకు చాలా నిశితమయినది. ఇసుకరేణువులను సహితం వేరుచేయగల సత్తాగలది. నేరానికి రాజ్యాంగ యంత్రానికీ మధ్యవున్న సంక్లిష్టమైన పరస్పరతను అణువణువూ కణం కణమూ వివేచించి అద్దుకోతపటాలూ నిలువుకోతపటాలూ మాత్రమే తక్కువగా వివరించగలది.

ఈ పరస్పరతే రెండురకాల అమాయకులకూ అర్థంకాదు. అమాయకులయిన అమాయకులు (వీళ్ళు మొదటిరకం), నేరాన్ని అరికట్టడం, నిరోధించడం, రాజ్యాంగ యంత్రం పని అనుకుంటారు. ఈ కోవకు చెందినవాళ్ళు బడిపంతుళ్ళు. కుర్ర ఐఏఎస్ ఆఫీసర్లు, రెండవ రకంది దుస్సాహసిక అమాయకత్వం. రాజ్యాంగ యంత్రం నేరాన్నసలు అరికట్టనే అరికట్టదని, నేరం మీద బలవడమే ప్రభుత్వ 'కార్యనిర్వాహకుల' పని అనీ అనుకుంటుంది. ఈ కోవకు చెందినవాళ్ళు సాధారణంగా కవిత్వం రాస్తారు.

అసలు సంబంధం ఇదీకాదు. అదీకాదు. బూర్జువా రాజ్యాంగ యంత్రం నేరాన్ని సంపూర్ణంగానూ అరికట్టదు (అది దానికి అవసరమూ కాదు, శ్రేయస్కరమూ కాదు) అలాగని నేరాన్ని పట్టుకుని పోషించదు. అది నేరాన్ని రెగ్యులేట్ చేస్తుంది. రావిశాస్త్రి మాటల్లో ('తలుపుగొళ్ళెం') భూమ్మీద మనిషికి ముఖ్యమయిన పనుల్లో మొదటిది. దొంగతనం చేయడం, రెండవది దొంగల్ని పట్టుకు శిక్షించడం.

భూమ్మీద ఎల్లకాలం కాకపోయినా–పెట్టుబడిదారీ సమాజంలో, మొదటిదీ రెండవదీ కాకపోయినా అతిముఖ్యమైన పనుల్లో, ఈ రెండూ లెక్కకు వస్తాయి. ఎందుకంటే పెట్టుబడిదారీ వ్యవస్థ అందరికీ పని ఇవ్వలేదు. ఇవ్వడం దానివల్లకాదు. కాకుండా ఇస్తే నిరుద్యోగ భయంపోయి కార్మికులు పట్టపగ్గాలు లేకుండా పోతారు. అయితే దేశంలో నిరుద్యోగులు మరీ ఎక్కువయిపోయినా ప్రమాదమే. నిరుద్యోగులంతగా అరాచకత్వానికి సహితం వెనుకాడకుండా తిరగబడేవాళ్ళుండరు. కాబట్టి, తాను ఉత్పత్తిదాయమకమయిన పని చూపలేని వాళ్లలో కొందరికి (కొందరికే) నేరాన్ని ఒక మార్గంగా చూపుతోంది బూర్జువా సమాజం.

సూక్ష్మీకరించి చెప్పాలంటే, నేరం బూర్జువా సమాజపు సంక్షోభాలకు ఒక సేఫ్టీవాల్వు లాంటిది. అవసరమయినప్పుడు దాన్ని తెరవకపోతే ఒత్తిడికి తట్టుకోలేక ఇంజను పగిలిపోతుంది. అలాగని సేఫ్టీ వాల్వుని ఎప్పుడూ తెరిచి వుంచితే ఇంజను అసలు పనిచేయదు. అంటే దాన్ని రెగ్యులేట్ చేయాలి. అదుపులో వుంచుకోవాలి. సరిగ్గా అదే (నేరానికి సంబంధించి) రాజ్యాంగ యంత్రం కర్తవ్యం. ఆ సేఫ్టీవాల్వుని తెరవడంలోను, బంద్ చేయడంలను 'కార్యనిర్వాహక శాఖ' అని పిలవబడే పోలీసులు పనిలో పనిగా తమ చేతులు తడుపుకుంటారు.

దీనంతటి అర్థం, రాజ్యాంగ యంత్రం నేరాలలో ఏ 20 శాతాన్నో పరిష్కరిస్తుందనీ, నేరస్తులలో ఏ 20 శాతాన్నో శిక్షిస్తుందనీ ఎంతమాత్రం కాదు. నేరం కంట్రోల్‌లో వుండడం, రాజ్యాంగ యంత్రం దాన్ని కంట్రోల్‌లో వుంచుతున్నట్లు జనానికి కనిపించడం అసలు విషయాలు అప్పుడప్పుడు కంపెనీలనూ సారాకొట్లనూ 'రెయిడ్' చేస్తూంటే చాలు (ముందుగా కబురు పంపించి చేసినాసరే) అవేళ్టికి ఎక్కడి దొంగలు అక్కడ గప్‌చుప్. అదొక మార్గం గంగరాజెడ్డు ('రత్నాలు-రాంబాబు'లో) తన శిష్యుడికి చెప్పేకథలో రెండవ మార్గం వుంది. అదేమిటంటే కేవలం చిన్నవాళ్ళనే కాకుండ అడపాదడపా పెద్దవాళ్ళను కూడ శిక్షించడం, గంగరాజెడ్డు మాటల్లో, 'పెద్దోళ్ళకి అప్పుడప్పుడు మనం అలా జుల్మానాలేస్తుంటేగాని జాతి ముందలికి నడువదు'.

మూడవ మార్గం మరీ పెద్దమనిషి తరహాది. ఇక్కడ రెయిడుల్లాంటి 'అథార్టీ' చెలాయించడంగాని, తప్పుడు కేసులకింద నేరం చేయని వాళ్ళను శిక్షించడంగాని వుండదు. అథోప్రపంచానికి కొన్ని నియమాల్ని ఏర్పరచి ఆ కట్టుదిట్టాలను ఎవరూ ఉల్లంఘించకుండా చూడడం ఈ పద్ధతి. ఒక చక్కటి ఉదాహరణ సారా కథ 'పాపి', రామదాసు, నీలయ్య ఘరానా సారావ్యాపారస్తులు, ఒకరికొకరు పోటీ దారులు. అయినా ఈ మొనోపోలీ రోజులలో పెట్టుబడిదార్లు పోటీ పడకుండా జాగీర్లు పంచుకోవడం అలవర్చుకున్నారు. కనుక దాసు, నీలయ్యలు గూడ ఒకరు వూరి తూర్పుప్రాంతాన్నీ, ఒకరు పడమటి ప్రాంతాన్నీ పంచుకున్నారట. 'ఆ రాజీషరతులకు కనబడే రక్షకశాఖవారు గూడ శాంతిభద్రతలు కాపాడుకుంటూ వస్తున్నా'రట.

అయితే ఒకనాడు తగువొచ్చింది. దాసు జాగీర్లోకి నీలయ్య ప్రవేశించగా నీలయ్యకు దాసు 'క్విట్' నోటీసు యిచ్చాడు. నీలయ్య విసుక్కున్నాడు కాదు. కొద్ది కొద్దిగా అగ్గిరాజుకోవడం చూసి ఇన్‌స్పెక్టర్ రంగంలోకి దిగి నీలయ్యను 'వాడి జాగాలో నువ్వెందుకు'? అని చీవాట్లు పెడతాడు. అటు పిమ్మట దాసు తన ప్లీడరుకు 'వంద రూపాయల కాగితం' దగ్గరుంచుకొని 'అయిదారా బాదెళ్ళైనాసరే రిచ్చాలు ఇడిపించ'మని పురమాయించి తాను మాత్రం గుట్టుచప్పుడవకుండ 'పరమేశ్వరుని లీలామహత్యం' సాయంతో నీలయ్యను చంపేస్తాడు. దాసును గాని మరిఎవరినిగాని పోలీసులు అరెస్టుచేసి వుండరని ఊహించవచ్చు.

రాజ్యాంగ యంత్రపు ప్రధాన కర్తవ్యం శ్రామికవర్గాన్ని అణచడమేగాని, అథో ప్రపంచాన్ని రెగ్యులేట్ చెయ్యడంకాదు. అందుకే ఆ అథోప్రపంచవాసులు రాజ్యాంగ యంత్రానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడంగాని, దాన్ని మార్చడంగాని, అసాధ్యం. అటువంటి కృత్రిమ పోరాటాల్ని చిత్రించకపోవడం రావిశాస్త్రిలో మెచ్చుకోదగ్గ లక్షణమేగాని, దుర్భరమైన ఈ జీవన పరిస్థితులను మార్చగల వర్గాల గురించి ఆయన రాయడం అలవర్చుకుంటే బాగుంటుంది.

(అక్టోబర్ 8న హైదరాబాద్‌లో బాలగోపాల్ మరణించారు)

*12 అక్టోబర్, 2009, 'సాక్షి' దినపత్రిక*

# MARAPURAANI LOKA SANCHAARI

## Balagopalpai Nivaali Vyasalu

మూగగొంతులకు మాటనిచ్చిన సాహసి
తన జీవితాన్నే ఆచరణగా చూపిన నిబద్ధత ఆయనది
తన లెక్కల్ని హక్కుల రెక్కలుగా
మలిచిన మహోపాధ్యాయుడు
కాలమే వేచిచూసి
ఓ మానవ హక్కుల యోధుణ్ణి కన్నది
ఈ నేలలో ప్రశ్నల కొడవళ్లనునాటాడు
తాను వెళుతూ మనకు మానవ హక్కుల కళ్ళనిచ్చాడు